اهدنا الصراط المستقيم

# శాంతిబాట

సంతోషమయ జీవనానికి మార్గదర్శి

సంపుటి 1 సంచికలు 9 & 10 ఏప్రిల్ & మే 2010 రూ. 30/-




## ఎవరు ద గ్రేట్?

## స్వర్గానికి హామీ

# జకాత్

## ప్రత్యేక వ్యాసం

## హదీస్ విజ్ఞానం (Science of Hadith) శీర్షిక ప్రారంభం


అల్లాహ్
اسْتَغْفِرُوا رَبَّكُمْ إِنَّهُ كَانَ غَفَّارًا
الْغَفُورُ
الله
الْغَفَّارُ
అల్-గఫూర్
క్షమాశీలుడు
Forgiver
అల్-గఫ్ఫార్
ఎల్లప్పుడూ క్షమించేవాడు
Perpetual Forgiver
మీ ప్రభువును క్షమాపణకై వేడుకోండి, నిశ్చయంగా
ఆయన ఎంతో క్షమాశీలుడు
(ఖుర్'ఆన్ 71:10)
చెప్పు : “ ఆయనే అల్లాహ్! ఒక్కడు. అల్లాహ్ ఎవరి అక్కరా లేనివాడు.
ఆయనకు సంతానం లేదు మరియు ఆయన ఎవరి సంతానమూ కాడు.
మరియు ఆయనతో పోల్చదగినది ఏదీ లేదు. (ఖుర్'ఆన్ 112:1-4)

రబీ ఉల్ ఆఖిర్ - జమాద అల్ ఆఖిర్ హి. 1431

# శాంతిబాట

మాసపత్రిక రూ. 30/-

సంపుటి 1 సంచిక 9&10 ఏప్రిల్&మే 2010

2-8-31, కోటబజార్, సామర్లకోట 533 440

Phone:9347046090 Email:velugubaata@gmail.com

4 **అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనానికి ప్రోత్సాహం - సూరహ్ ఫాతిహాలోని చివరి 4 ఆయత్‌లకు వివరణ ...

10 **హదీస్ విజ్ఞానం:** 'హదీస్' అంటే ఏమిటి? హదీస్ వర్గీకరణలపై పరిచయం ...

15 **ధర్మసందేశ ప్రచారం** : ప్రస్తుతం సమాజంలో అనుసరిస్తున్న కొత్త పోకడల గురించి .... ఖుర్'ఆన్ మరియు సున్నత్ వెలుగులో సందేశాన్ని అందించే విధానాల పరిచయం ...

24 **ముహమ్మద్(స) వారి జీవిత చరిత్ర** : ఇస్లామ్‌కు పూర్వం అరబ్బు సమాజం వారి రాజకీయ ఆర్థిక పరిస్థితులు ...

29 **శాంతిబాట ద్వారా అందించే హదీస్‌ల ప్రామాణికతపై వివరణ**

30 **ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం** : నెలకు 24 అరబీ పదాల చొప్పున 30 నెలలలో ఖుర్'ఆన్‌లోని 80 శాతం పదాలను నేర్పించాలని...

36 **సంవత్సరకాలంలో శాంతిబాట మాసపత్రికలో అందించిన వ్యాసాలు క్లుప్తంగా...**

39 **టెర్రరిజం** : టెర్రరిజానికి ఏ మతం పేరును అతికించకుండా, 'ఇస్లామ్'నే అతికించి ముస్లిములనే టార్గెట్‌గా ఎందుకు పెట్టుకున్నారు? కనులు మూసుకున్న మీడియా యొక్క కనులు తెరిపించే ప్రయత్నం. సెప్టెంబర్ దాడి - కాషాయ తీవ్రవాదం - పరిశోధనాత్మక వ్యాసం

44 **ముస్లిం యువత - ఆలోచించండి!** : ఎవరిని ప్రేమించాలి? ...

48 **ద గ్రేట్ ఎవరు? అలెగ్జాండర్? ఉమర్(రజి) ?**

51 **స్వర్గానికి హామీ**

53 **జకాత్** : ప్రత్యేక వ్యాసం

63 **పాఠకుల సందేహాలు**

67 **పాఠకుల అభిప్రాయాలు**

ఎడిటర్:

**ఎమ్‌డి. అతహరుల్లా**

**ఎడ్వయిజరీ బోర్డ్:**

డా॥ సలీమ్ పాషా

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు

ఎమ్‌డి. అఫ్ఘాన్ ఉమ్రీ

**సహాయకులు:**

**వెలుగుబాట**

ఎడ్యుకేషనల్ సొసైటీ

మరియు

**ట్రూవిజన్**

ఎడ్యుకేషనల్ సొసైటీ

సభ్యులు

**Printed by**
Md. Athaharullah

**Published by**
Md. Athaharullah

**Owned by**
Velugubaata Educational Society
(R.No. 569/2008), Samalkot-533440

and

**Printed at**
'*Akash Industries*',G-14, Industrial Estate, Samalkot - 533440

and

**Published at**
2-8-31, Kota Bazar,
Samalkot - 533440,

**Editor:** Md. Athaharullah
Phone : 9347046090,
Email: velugubaata@gmail.com
RNI Regd. No. APTEL/2009/29650

**Production Incharge**
T. Srinivasa Rao
(Zakir)

**సంవత్సర చందా:**

రూ. 200/-

*For online payments, Please contact Dr. N. Srinivasa Rao (Cell: 9491103017)*

M.O. చేయవలసిన చిరునామా:

**వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ**

2-8-31, కోట బజార్,

సామర్లకోట-533440

మీ పూర్తి ఎడ్రస్‌ను, ఫోన్ నెంబర్లతో సహా M.O. ఫారమ్‌పై వ్రాయండి.

లేదా

క్రింది నెంబర్‌కు మీ వివరాలను SMS చేయండి.

**Cell : 9491103017**

ఈ పత్రికలో ప్రచురించిన వ్యాసాల గురించిగాని, లేదా ఇతర వివరాలకుగాని సంప్రదించండి

డా॥ నాగిరెడ్డి శ్రీనివాసరావు, *M.Sc.,Ph.D.* **Cell : 9491103017**

బిస్మిల్లా హిర్రహ్మా నిర్రహీమ్ (అనంత కరుణామయుడు, అపార కృపాశీలుడు అయిన అల్లాహ్ పేరుతో)

# మీడియా మరియు ముస్లిములు

మీడియాకు స్వేచ్ఛ ఉందా? అని ప్రశ్నిస్తే, విన్నవారు విరగబడి నవ్వుతారు. అంతేగాకుండా 'మీరు టి.వి.లు చూడటం లేదా? న్యూస్ పేపర్లు చదవడం లేదా? అని ఎదురు ప్రశ్నలు వేసి వెర్రివాళ్ళని చూసినట్లు చూసి మనపై సానుభూతి చూపిస్తారు. మన ప్రశ్నలోని అసలు ఉద్దేశ్యం ఏమైనాగాని, వీరు చూపించే సానుభూతిలో కూడా కాసింత నిజం ఉంది.

ఒక రాజకీయ పార్టీకి సపోర్ట్‌గా 3 టివి ఛానళ్ళు ఉంటే, మరో రాజకీయ పార్టీకి 4 ఛానళ్ళున్నాయి. అవకాశాన్ని బట్టి ఎటువైపు కావాలంటే అటువైపు మరలిపోయే ఛానళ్ళు కూడా కొన్ని ఉన్నాయి. ఒక సంఘటన జరిగినప్పుడు, ఆ సంఘటనపై టివి ఛానళ్ళు వారివారి అభిమానాలకు అనుగుణంగా ఆ వార్తను విశ్లేషిస్తూ ఎడతెరిపి లేకుండా ఆ రోజంతా చూపిస్తూనే ఉంటారు.

సామాన్య ప్రజలు పొరపాటున తమ బుర్రలు ఉపయోగించి ఆ సంఘటన గురించి ఆలోచించేస్తారేమోనని వారి భయం. ప్రజలు స్వయంగా ఆలోచిస్తే వారికి మనుగడ ఉండదని వారి నమ్మకం. అందుకోసం ఎవరెడీగా పెట్టుకున్న కొందరు Xపర్ట్‌లను స్టుడియోలకి పిలిపించి వారి చేత కావలిసిన విధంగా విశ్లేషించి చెప్పిస్తారు. 'మీరు మాత్రం స్వంతంగా ఆలోచించేయకండి సుమా!' అన్నట్లు మన బుర్రలను తినేస్తారు.

ఈ రోజున అన్నీ రెడీమేడ్‌గా దొరికేస్తున్నాయి. కంప్యూటర్‌లో కూడా ఆలోచించనవసరం లేకుండా ఎన్నో యూజర్ ఫ్రెండ్లీ ప్రోగ్రామ్స్ ఉన్నాయి. మనం ఆలోచించడం మర్చిపోతున్నాం. మనం స్వంతంగా ఆలోచించడం మర్చిపోయేలా చేయగలిగిన మీడియాకు స్వేచ్ఛ లేదంటారా? వారికి నిజంగా స్వేచ్ఛ ఉంది!

సినిమాలలో వీరికి బాగా ఇష్టమైన అశ్లీలమైన సన్నివేశాలను సేకరించి, రాత్రుళ్ళు మిడ్‌నైట్ స్పెషల్ కథనాలను చూపించగలిగే స్వేచ్ఛ వారికుంది. రాష్ట్రంలో జరిగే చిన్ని చిన్ని గొడవలను పదే పదే చూపించి, రాష్ట్ర ప్రజలను రెచ్చగొట్టి రాష్ట్రమంతా విద్వేషాగ్ని సృష్టించడానికి వీరికెంతో స్వేచ్ఛ ఉంది.

**కాని నిజం చెప్పడానికి, నిజం చూపడానికి, పక్షపాతం లేకుండా విశ్లేషించి చెప్పడానికి మాత్రం వీరికి స్వేచ్ఛ లేదు. 'నిజం' విషయంలో స్వయంగా వారే తమ కాళ్ళు చేతులను బందించేసుకుని బందీలై పోయారు.**

నిజాన్ని నిర్భయంగా చెప్పడానికే 'మీడియా'కు రాజ్యాంగం స్వేచ్ఛనిస్తే, **'ఆ ఒక్కదానికి తప్ప'**, మిగిలిన అన్ని విషయాలలో స్వేచ్ఛను దుర్వినియోగం చేస్తున్నారు.

సాధారణంగా బి.పి. మరియు సుగర్ వంటి వ్యాధులు హెరిడిటరీ వలన వస్తాయని చెబుతారు. అయితే వంశపారంపర్యంగా వచ్చేవి కేవలం ఇటువంటి వ్యాధులేనా? మన తాత ముత్తాతలు బ్రిటిష్ వారి బానిసత్వంలో రెండు శతాబ్దాలకు మించి మగ్గిపోయారు కదా! అంతకాలంపాటు ఇంగ్లీష్ వాడి బానిసత్వంలో జీవించడం వలన, రక్తంలో బానిసత్వ లక్షణాలు చేరిపోయి ఉండవచ్చు.

కొన్ని గవర్నమెంట్ ఆఫీసుల్లో ఈనాటికి బ్రిటిష్‌వారు పెట్టిన రూల్స్‌నే పాటిస్తున్నారు. బ్రిటిష్‌వాడు మనల్ని వదలివెళ్ళిపోయాడు గాని, వాడిని మాత్రం మనం వదలలేక పోతున్నాము.

ఇక మన మీడియా ఐతే, పాశ్చాత్యదేశాలతో 'నీ కాలు మొక్త బాంచన్' తరహాలో వ్యవహరిస్తుంది.

ప్రముఖ జాతీయ ఇంగ్లీష్ పత్రికలు కూడా ఇదే మార్గాన్ని అవలంభిస్తున్నాయి. వీటిలో స్థానిక పత్రికలు, జాతీయ పత్రికలని తేడా ఏమీ లేదు, అన్నింటిలోనూ 'అంతర్జాతీయ వార్తలు' అంటే అమెరికా, బ్రిటన్ వార్తలే. అప్పుడప్పుడు ఆస్ట్రేలియా, కెనడా గురించి వ్రాస్తుంటారు.

ఇక వారి దృష్టిలో 'ఇస్లామ్'కి, 'ముస్లిమ్'లకి కేరాఫ్ ఎడ్రస్ ఎల్లప్పుడూ ఆఫ్ఘనిస్తాన్/పాకిస్తాన్ బోర్డర్/తాలిబన్లు మాత్రమే. వీరు కాకుండా ప్రపంచంలో 100 కోట్లకు పైగా ఉన్న ఇతర ముస్లిములు మీడియావారికి కనిపించరు. అమెరికావాడు సృష్టించిన 'అల్-ఖైదా' గురించి అనర్గళంగా చెబుతారు. ప్రపంచ ప్రజలకు ముస్లిముల వలన ముప్పు ఉందని అమెరికా వాడు చేస్తున్న ప్రకటనలు గురించీ చెబుతారు. వాటికే మీడియా విశేషమైన ప్రాచుర్యాన్ని కలిగిస్తుంది.

ప్రపంచ ప్రజలందరి దృష్టినంతా అల్-ఖైదా వైపు మళ్ళించి, వెనుక నుండి ప్రపంచ ప్రజల్ని దెబ్బతీసే అతి పెద్ద తీవ్రవాద దేశం అమెరికాయేనని మీడియాకు చాలా బాగా తెలుసు. కాని చెప్పదు. 'వికిలీక్స్' అనే వెబ్‌సైట్ గురించి ఈ మధ్యన తెగ ఊదరగొడుతున్నారు. 9/11 దాడుల గురించి తెగచెప్పేసి బుర్రబాదేసుకున్న మీడియా, ఆ 9/11 దాడి వెనుక అమెరికా హస్తం ఉందని ఆధారాలు చూపించిన వెబ్‌సైట్ల జోలికి మాత్రం పోలేదు. ఎప్పటికీ పోదు. ఆ **వెబ్‌సైట్ల గురించి మీడియా ఏనాడూ మాట్లాడదు.** ఇస్లామ్ గురించి, ముస్లిమ్‌లగురించి చెడుగా ఎవరు చెప్పినా, వారికి మాత్రమే మీడియా ప్రాధన్యత నివ్వడం విచారకరం.

మహా మహా మేధావులు మీడియాలో విశ్లేషణలు చేస్తూ ఉంటారు. అమెరికా దురుద్దేశ్యంగాని, వారి రాక్షసత్వంగాని నిజంగా ఈ మేధావుల మేధస్సుకు అందలేదా? పాకిస్తాన్‌లో తీవ్రవాదులున్నారంటూ అమెరికా ఒకసారి చెబుతుంది. మరోసారి పాకిస్తాన్ ప్రభుత్వ గూఢచారి సంస్థకు ఉగ్రవాదులకు లింక్స్ ఉన్నాయని చెబుతుంది. మరలా పాకిస్తాన్ ప్రభుత్వాన్ని సమర్ధిస్తుంది. పాకిస్తాన్ ఉగ్రవాద దేశమే అయితే, అమెరికా చెబుతున్నట్లు నిజంగా పాకిస్తాన్ ఉగ్రవాదాన్ని ప్రోత్సహిస్తుంటే, అమెరికా పాకిస్తాన్‌ను ఎందుకు మిత్రదేశంగా చెప్పుకుంటుంది? ఎందుకు కొట్లాది

డాలర్ల ఆర్థిక సహకారాన్ని అందిస్తుంది? ఈ మధ్యనే బ్రిటన్ ప్రధాని కామెరాన్ పాకిస్తాన్ దేశమే తీవ్రవాదులను ఎగుమతి చేస్తుందని ప్రకటించారు. అటువంటప్పుడు, ఈ నాటో సైనికులు, మత దురభిమానంతో పేట్రేగిపోయే ఈ పాశ్చాత్యదేశాలు అన్నీ కలిసి పాకిస్తాన్‌ని ఎందుకు కట్టడి చేయడం లేదు. కేవలం పాకిస్తాన్ మాత్రమే ఉగ్రవాదులకి కేంద్రం అయితే, ఇరాఖ్‌పై యుద్ధం చేయడానికి వెళ్ళినట్లు పాకిస్తాన్‌పై ఎందుకు చేయడం లేదు? అమెరికా అందించిన క్లస్టర్ బాంబులతో ఇజ్రాయెల్ పాలస్తీనాపై పడుతుంటే, ఆ దేశాన్ని ఎందుకు నిలువరించలేక పోతున్నారు? ఇరాన్ అణువిషయంపై పోరాడిన అమెరికాగాని, ఇతరదేశాలుగాని క్లస్టర్ బాంబుల నిషేధంపై ఎందుకు నోరు మూసుకున్నాయి?

**పాకిస్తాన్‌ను బ్లాక్‌మెయిల్ చేస్తూ, ఆ దేశంలో ఉగ్రవాద కార్యకలాపాలు అమెరికాయే నిర్వహిస్తున్నట్లు సందేహం రావడం లేదా?**

ఆశియాలో సంక్షోభం సృష్టించడానికి, పాకిస్తాన్ మరియు ఆఫ్ఘనిస్తాన్‌లను బలిపశువులుగా చేసుకుని, తెరవెనుక నుండి విధ్వంసం సృష్టించేది అమెరికా కాదా? ఈ విషయంలో అమెరికాకు రెండు లాభాలున్నాయి. 1. ఆశియాలో అభివృద్ధి చెందుతున్న భారతదేశం వంటి దేశాలలో శాంతి భద్రతలకు విఘాతం కలిగించడం 2. ముస్లిమ్‌లపై, ఇస్లామ్‌పై విద్వేషాన్ని సృష్టించడం. అమెరికావాడి మత దురభిమానం గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

మీడియాలో 'బురఖా'పై ఇంకా ఎన్ని సంవత్సరాలు డిబేట్ చేస్తారు? మన ధక్షిణాదిలో ప్రింట్ అయ్యే ఓ ప్రముఖ జాతీయ ఇంగ్లీష్ పత్రికలో ప్రతీ 3 లేక 4 నెలల కొకసారి ఇదే అంశంపై వ్యాసాలు ప్రచురిస్తారు. ఆ వ్యాసం చాలా బావుంది అంటూ, ఆ పేపర్‌కి వ్రాసే వారి లెటర్స్ చూస్తూ ఉంటే, ప్రజలలో ఎలాంటి మత విద్వేషాన్ని మీడియా నూరిపోస్తుందో అర్థమౌతుంది. ప్రపంచంలోని ఎన్నో సంస్కృతులు ఎంతో ఘోరంగా మారిపోయినా సరే, 1400 సంవత్సరాల నుండి 'బురఖా' అలాగే ఉంది.

చాలీ చాలని బట్టలు వేసుకోవడానికి మరియు కేవలం లోదుస్తులు వేసుకుని తిరగడానికి ఆయా దేశాలలో స్వేచ్ఛ ఉన్నప్పుడు, ఒంటిని పూర్తిగా కప్పుకోవడానికి ఇష్టపడే స్త్రీకి స్వేచ్ఛ లేదా? సెక్యులర్ దేశాలని చెప్పుకుంటూ, స్త్రీకి స్వాతంత్ర్యం కల్పిస్తున్నామని చెప్పే దేశాలు, ముస్లిమ్ స్త్రీ ఇష్టపడి ధరించే బురఖాని నిషేధిస్తామని చెబితే మన మీడియా ఖండించాలి గాని, మనదేశంలో కూడా 'బురఖా'ని నిషేధించాలనే విధంగా వ్యాసాలను వ్రాయడం విచారకరమైన విషయం.

ఇటువంటి పేపర్లకు లేఖలను వ్రాసేవారిలో ముస్లిమ్‌ల పేర్లు ఎక్కువగానే కనిపిస్తున్నాయి. వారిలో ఎక్కువమంది ఖండించడానికి బదులు వ్యాసానికి మద్దతిస్తూ వ్రాస్తారు. మొదట్లో అవి డమ్మీ పేర్లు అనుకున్నాము. కాని ఇప్పుడు అవి కూడా నిజమే కావచ్చని అనిపిస్తుంది. ఎందుకంటే, 'ఇస్లామ్'ని విమర్శించే వారి వ్రాతలను మేము ఖండిస్తూ, ప్రామాణిక ఆధారాలను చూపించి 'శాంతిబాట' ద్వారా ప్రజలను మేము ఎడ్యుకేట్ చేస్తూ ఉంటే, మన రాష్ట్రంలోని కొందరు ముస్లిములు 'శాంతిబాట'ను 'ముళ్ళబాట'గా వర్ణిస్తున్నారంటే, నేటి సమాజంలో ఎటువంటి వ్యక్తులు ముస్లిములుగా చెలామణి అవుతున్నారో అర్థం అవుతుంది.

రాష్ట్రంలో ఎన్నో జమియత్‌లున్నాయి. వాటికి నాయకులూ ఉన్నారు. ప్రజల డబ్బుతో అట్టహాసంగా కార్యక్రమాలను నిర్వహించగలిగే సామర్థ్యమున్న వీరికి **'మీడియా సెల్'** మాత్రం లేదు. మీడియాలో ఇస్లామ్‌కి వ్యతిరేకంగా వచ్చే విషయాలను ఖండించే ప్రయత్నం ఎంత మాత్రం చేయరు. విందులు చేసుకోవడానికి ఉన్న ఉత్సాహం ఇటువంటి వాటిపై లేదు.

ప్రపంచ ప్రజలను దోచుకునే రాబందు దేశాలు, ఇస్లామ్‌కి వ్యతిరేకంగా పనిచేసే మీడియాకు ఆర్థికంగా లాభం చేకూరుస్తున్నాయి. కోట్లాది రూపాయలు వారు ఖర్చుపెడుతున్నారు.

మీడియాలో వస్తున్న విషపూరిత వ్రాతలను ఆపడానికి ముస్లిములు ఏం చేయాలి?

ఇటువంటి పరిస్థితిని అవకాశంగా తీసుకుని స్వార్థంతో కొందరు ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసి లక్షలాది రూపాయల ప్రజాధనాన్ని దుర్వినియోగం చేస్తున్నారు. ప్రజాధనాన్ని దుర్వినియోగం చేయడంలో ఒకొక్కరిది ఒకొక్క శైలి. ఒకాయన అయితే ప్రతీ సంవత్సరం ఆయన నిర్వహించే ప్రోగ్రామ్‌కి కోట్లు ఖర్చుపెడుతున్నారు. **వీటివలన సమస్య పరిష్కరించబడిందా?** లేదు. మరింత పెద్దదవుతూ ఉంది.

దేశమంతా ఓ 100 కోట్ల రూపాయలు ఖర్చుచేసి, దావా ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసి, ఇస్లామ్ గురించి చెప్పేసాము అని ఇటువంటివారు అనుకోవచ్చేమో! కాని ఆ మరుసటి రోజే టివిలలో, పేపర్లలో ఏదో ఒక తీవ్రవాద దాడి గురించి విశేషంగా ప్రచారం జరిగి, ఇస్లామ్‌పై బురద చల్లితే, ప్రజలు అదే నమ్ముతారు. కాబట్టి అంతకు ముందర ఖర్చుపెట్టిన ఆ 100 కోట్ల రూపాయలు బూడిదలో పోసినట్లే.

ఈ సమస్యకు పరిష్కారం ఒక్కటే! ప్రోగ్రామ్స్ పేరుతో వృథా చేస్తున్న ప్రజాధనంతో ముహమ్మద్(స)వారు బోధించినట్లు ముస్లిములలోని పేదవారికి ఆర్థిక సహాయం చేసి, వారి పిల్లలు చదువుకునేలా, ఇస్లామ్ చూపిన సభ్యతా సంస్కారాలను వారిలో కలుగజేసే విధంగా వారికి నైతిక శిక్షణ ఇప్పించాలి. అందుకొరకు ప్రాథమిక స్థాయిలో 'ఇల్మ్'ను బాలలందరితో పాటు, ప్రతీ ముస్లిమ్ నేర్చుకునేలా చర్యలు తీసుకోవాలి.

ముస్లిమ్‌ల నడవడిక ఇస్లామ్ ప్రకారంగా ఉంటే, మీడియాలో ఎంత బురద చల్లినా సరే, ప్రజలు నమ్మరు. వ్రేళ్ళపై లెక్కపెట్టగలిగే కొందరు స్వార్థపరుల కోసం, ప్రజాధనాన్ని వృథా చేయకుండా, 'ఇల్మ్'కి ప్రాధాన్యత ఇవ్వాలని ఈ పవిత్ర రమదాన్ మాసంలో మనమంతా ఓ నిర్ణయానికొస్తే, రాబోయే సంవత్సరాలలో మన రాష్ట్రప్రజలు ఓ ఉత్తమ సమాజాన్ని చూస్తారు.

**ఉత్తమ నడవడిక ద్వారా మీడియా దుష్ప్రచారానికి చెక్ పెడదాం!** ఇన్శా అల్లాహ్!

**- శాంతిబాట టీమ్**



# అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం

بِسۡمِ اللّٰهِ الرَّحۡمٰنِ الرَّحِيۡمِ

అనంత కరుణామయుడు, అపార కరుణాప్రదాత అయిన అల్లాహ్ పేరుతో

**9**

## ఖుర్'ఆన్ తఫ్సీర్

(గత సంచిక తరువాయి)

اِيَّاكَ نَعۡبُدُ وَ اِيَّاكَ نَسۡتَعِيۡنُ ❺

ఇయ్యాక న'అబుదు వ ఇయ్యాక నస్'తయీన్

**మేము నిన్నే ఆరాధిస్తున్నాము మరియు నీ సహాయాన్నే అర్థిస్తున్నాము.**
(దివ్య ఖుర్'ఆన్ సందేశం)

**మేము ఆరాధించేది నిన్నే, సహాయం కొరకు అర్థించేదీ నిన్నే.**
(ఖుర్'ఆన్ అవగాహనం)

**It is You we worship and You we ask for help**
*(Sahee International)*

**You alone we worship, and to You alone we pray for help.** *(Maariful Qur'an)*

| | | |
|---|---|---|
| నిన్నే | (ఇయ్యాక) | اِيَّاكَ |
| **మేము ఆరాధించేది** | (న'అబుదు) | نَعۡبُدُ (ع ب د) |
| **మరియు** | (వ) | وَ |
| **మేము సహాయాన్ని అర్థించేది** | (నస్'తఈన్) | نَسۡتَعِيۡنُ |
| **సహాయాన్ని అడగడం** | (ఇస్'తఆన) | اِسۡتِعَانَ (ع و ن) |

ఈ ఆయత్ (వాక్యం)లోని 'ఇబాదహ్ عِبَادَةٌ (ఆరాధన)' అనే పదం ఇతర అర్థాలను కూడా సూచిస్తుంది. ఒకరిపై నుండే అత్యధిక గౌరవం మరియు ప్రేమ వలన కలిగే మిక్కిలి వినయం, లోబడి ఉండడాన్ని 'ఆరాధన' సూచిస్తుంది. అటువంటి ఆ ఆరాధనను స్వీకరించే అర్హత కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. **ఇయ్యాకన 'అబుదు** అనే పదబంధం తెలియజేసేది ఏమిటంటే కేవలం ఆ ఒక్కడు (అల్లాహ్) మాత్రమే మన అవసరాలు తీరుస్తారని.

అంతే సహజంగానూ మరియు సహేతుకంగానూ ఏ సహాయం కొరకైనా సరే కేవలం ఆయనవైపే మనమంతా మరలాలి. కాబట్టే 'ఇయ్యాక నస్తయీన్' (సహాయాన్ని అర్థించేది నిన్నే!) అని చెబుతున్నాము. ఇక్కడ సహాయం అంటే, అది ఎటువంటి సహాయం? ఫలానా సహాయమని ప్రత్యేకంగా చెప్పలేదు. కాబట్టి ఆ సహాయం ఏదైనా గాని, అది ఇహలోక సంబంధమైనది కావచ్చు లేక పరలోక సంబంధమైనది కావచ్చు లేదా రెండింటికి సంబంధించినదైనా కావచ్చు.

'ఆరాధన' అంటే చాలామందిలో ఓ అపోహ ఉంది. అది కేవలం మనకొరకు నిర్ణయించబడిన 5 సలాత్‌లు (నమాజ్‌లు) లేదా రమదాన్ నెలలో ఉండే ఉపవాసం మాత్రమేనని భావించడం జరుగుతుంది. ఇమామ్ అల్-గజాలీ తన 'అరబైన్' పుస్తకంలో ఈ 'ఆరాధన'లోని 10 ముఖ్యమైన అంశాలను తెలియజేశారు.

1. సలాత్ (నమాజ్)
2. జకాత్ (విధి దానం)
3. సౌమ్ (రోజా/ఉపవాసం)
4. హజ్ (మక్కా యాత్ర)
5. దివ్య ఖుర్'ఆన్‌ను చదవడం (పఠించడం)
6. సాధ్యమైన అన్ని పరిస్థితులలోనూ 'అల్లాహ్' యొక్క స్మరణ
7. 'ఇస్లామ్' శాసన ఆదేశాల (షరియత్) ప్రకారంగా 'జీవనోపాధి' ఉండాలి.
8. తన సహచరుల లేదా పొరుగువారి విషయంలో విధిగా చేయబడిన హక్కులను నెరవేర్చడం
9. మంచిగా జీవించేలా ప్రజలను ఒప్పించాలి మరియు నిందలకు/తిట్లకు కారణమయ్యే పనులనుండి మరియు నిషేధించబడిన పనుల నుండి వారిని నివారించాలి.
10. ముహమ్మద్(స)వారి బోధనలను మరియు ఆచరణలను (సున్నత్) అనుసరించాలి.

ప్రతీ సలాత్ (నమాజ్)లో ప్రతీ రకాత్‌లోనూ అందరూ తప్పనిసరిగా ఈ 'ఫాతిహ' సూరహ్‌ను పఠిస్తారు. మరి ఈ ఆయత్‌ను పఠించేటప్పుడు, అంటే **'మేము ఆరాధించేది నిన్నే'**, అని 'అల్లాహ్'కు మనం విన్నవించు

కుంటున్నాము కదా! మరి సర్వజ్ఞాని అయిన అల్లాహ్‌తో ఈ విధంగా మనం చెప్పేటప్పుడు, మనం విన్నవించుకున్న ప్రకారంగా మన 'ఆరాధన' సరిగ్గా ఉందా అని ప్రతీ ఒక్కరూ ఓసారి ఆలోచించుకోవాలి.

ఆరాధనకు సంబంధించి ఓ 10 అంశాలను ఇమామ్ గజాలీ గారు చాలా చక్కగా తెలిపారు.

కాని నేడు కేవలం సలాత్ (నమాజ్)ను మాత్రమే 'ఆరాధన'గా భావిస్తున్నారు. ఈ సలాత్(నమాజ్)ను చేసే విధానంలోని కొన్ని స్వల్పమైన తేడాలను పట్టుకుని, ముస్లిమ్ సమాజం వివిధ జమియత్‌లుగా ఏర్పడి, ఎల్లప్పుడూ ఈ విషయంలోనే వాగ్వివాదాలతో కాలక్షేపం చేయకుండా, అసలు ఆరాధన అంటే ఏమిటో అందరూ తెలుసుకొని తదనుగుణంగా వ్యవహరిస్తే ఎంత బాగుండును! అన్ని జమియత్‌లు కూడా ఒకే త్రాటిపైకి వచ్చి ఐక్యతగా ఉండాలనేది మా శాంతిబాట టీమ్ యొక్క ముఖ్యమైన ఆకాంక్ష.

**'అల్‌హమ్‌దులిల్లాహ్!'** అని ఓ ప్రక్క చెబుతూనే ఉంటారుగాని, మరో ప్రక్క కొందరు వ్యక్తులను పొగడటం చేస్తున్నారు. 'అల్-హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్' (సకల పొగడ్తలు మరియు కృతజ్ఞతలు అల్లాహ్ కొరకే!) అని చెబుతున్న ముస్లిమ్‌లను, ఇతర వ్యక్తులను పొగిడించడం ద్వారా ప్రజలను వ్యక్తి ఆరాధనవైపు షైతాన్ తప్పుదోవ పట్టిస్తున్నాడు. ఒకవేళ ఫలానావ్యక్తి నిజంగా గొప్పపని చేస్తే, "ఆ ఫలానా వ్యక్తి చేత ఫలానా గొప్ప పనిచేయించిన ఆ 'అల్లాహ్' గొప్పవాడు" అని చెబితే, ఆ పొగడ్త అల్లాహ్‌కే చెందుతుంది. క్రింది హదీస్ ప్రకారం ఒక వ్యక్తిని పొగడటం అంటే, అతని మెడ కోసినట్లే!

"హమ్మామ్ ఉల్లేఖనం : "ఒక వ్యక్తి వచ్చి ఉస్మాన్‌ను ముఖ స్తుతి చేశాడు (పొగిడాడు), మిఖ్‌దాద్ బిన్ అస్వద్ కొంత మన్ను తీసుకుని అతని ముఖంపై విసిరి చెప్పాడు : 'అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "ఇతరులను పొగిడేవారిని మీరు కలిస్తే, వారి ముఖంపై మన్ను విసరండి" **(అబూదావూద్, సహీహ్, 4804, పుస్తకం 40, అధ్యాయం 8, సంపుటి 5)**

---

అబ్దుర్రహ్మాన్ బిన్ అబీ బకర్ తన తండ్రినుండి ఉల్లేఖించారు : "ప్రవక్త(స)వారి సమక్షంలో ఒక వ్యక్తి మరో వ్యక్తిని పొగిడాడు. ఆయన(స) అతనితో చెప్పారు : "నీవు నీ సహచరుని మెడ కోశావు" మూడుసార్లు (చెప్పారు). తరువాత ఆయన(స) చెప్పారు : "మీలో ఒకరు మీ సహచరున్ని పొగడవలసి వస్తే, అతనిని (ఇలా) చెప్పనీయండి. 'నేను అనుకుంటున్నాను అతను ఇలా అని - అతను ఏదైతే చెప్పాలనుకుంటున్నాడో అది (చెప్పాలి) - కాని నేను సర్వోన్నతుడైన అల్లాహ్ ముందు అతనిని పరిశుద్ధుడని నేను చెప్పలేను" **(అబూదావూద్, సహీహ్, 4805, పుస్తకం 40, అధ్యాయం 8, సంపుటి 5)**

ఒక వ్యక్తి గొప్ప పనిచేస్తే, దానికి కారణం కేవలం అల్లాహ్ యొక్క అనుగ్రహమే! ఒకవేళ ఒక వ్యక్తి తప్పు చేస్తే, అది షైతాన్ ప్రభావం. కాబట్టి అల్లాహ్ అనుగ్రహంతోనే సాధ్యమయ్యే గొప్పపనిని పొగడటానికి అర్హులు 'అల్లాహ్'యే కదా!

అల్లాహ్ యొక్క సందేశహరులందరూ, అల్లాహ్ అనుగ్రహంతో ఎన్నో అద్భుతాలను చూపించి, ఆ ఏకైక ఆరాధ్యుడైన 'అల్లాహ్'నే కీర్తించ మన్నారుగాని ఆ గొప్పతనాన్ని తమకు అన్వయించుకోలేదు. ఈ మధ్య కాలంలో ఎక్కువమంది నోటి వెంట వెలువడే మాటలు: "ఫలానా వ్యక్తి 100 మందిని మార్చేసాడు లేదా 1000 మందిని మార్చేసాడు'. ఇలా మార్చివేసే శక్తిని మరియు మార్గదర్శకత్వం చూపే శక్తిని అల్లాహ్ తన ప్రవక్తలకు కూడా ఇవ్వలేదు.

హృదయాలను మార్చగల శక్తి కేవలం అల్లాహ్‌కు మాత్రమే ఉంది. **'మీ పని కేవలం సందేశాన్ని అందజేయడం వరకే'** అని అల్లాహ్ తన ప్రవక్తలనే ఆదేశించారు.

కాబట్టి ఫలానా వ్యక్తి గొప్పవాడని, ఫలానా వ్యక్తి ప్రజలను మార్చేసాడని చెబితే, అల్లాహ్‌కు ఉండే సామర్థ్యాలను, ఆ వ్యక్తికి ఆపాదిస్తున్నట్లే కదా! ఆ విధంగా వారు స్వయంగా 'షిర్క్'కు పాల్పడుతున్నారని తెలుసుకోలేక పోతున్నారు.

ఈ విధంగా ప్రత్యేకంగా ఈ జమియత్, ఆ జమియత్ అని చెప్పనవసరం లేదు. ప్రత్యక్షంగానో లేక పరోక్షంగానో షిర్క్‌కు చాలామంది పాల్పడుతూనే ఉన్నారు. స్వయంగా తాము చేస్తున్న 'షిర్క్' గురించి తెలుసుకోకుండానే, ఎదుటి వారికి మాత్రం 'షిర్క్ చేయవద్దని' బోధించడం జరుగుతుంది.

'అల్లాహ్' అంటే ఏమిటో తెలియకపోతే 'ఆరాధన' ఎలా చేయగలుగుతారు?

మరి **'ఆరాధన'** అంటే ఏమిటో తెలియకుండానే, **"మేము ఆరాధించేది నిన్నే"** అని నమాజ్‌లో ఎలా అనగలుగుతున్నారు?

అల్లాహ్ గురించి తెలియాలంటే **'ఖుర్ఆన్'** చదవాలి. ఈ గ్రంథం కేవలం ఓ ప్రత్యేక వర్గం వారి కొరకు మాత్రమే రాలేదు, సర్వమానవాళి కొరకు వచ్చింది. కాబట్టి పైన తెలిపిన ఆరాధనలోని 5వ అంశమైన **'ఖుర్ఆన్ పఠించడాన్ని'** ప్రతిరోజూ అలవాటు చేసుకోమని కోరుతున్నాము.

**"మేము సహాయాన్ని కోరేది నిన్నే!" (ఇయ్యాక నస్‌తయీన్)**

పై మాటలను మనం అర్థం చేసుకుని నమాజ్‌లో పఠించినా, లేక వాటిని అర్థం చేసుకోకుండా పఠించినా సరే, వాస్తవంగా సహాయమనేది కేవలం అల్లాహ్ నుండి మాత్రమే అందుతుంది.

ఈ మధ్యనే ఓ సోదరుడు మా గ్రంథాలయానికి వచ్చి ఓ వ్యక్తి గురించి చెప్పాడు. ఫలానా ఊరిలో ఫలానా దాయీగారు 'దీన్'ను ఇంప్రూవ్ చేసాడని చెప్పినప్పుడు, "అల్లాహ్ దీన్(ధర్మాన్ని) ఏనాడో పరిపూర్ణం చేసేసారు" (సూరహ్ మా'ఇదా లోని 3వ ఆయత్ చూడండి). "కాబట్టి దీన్‌ను ఇంప్రూవ్ చేయవలసిన అవసరంలేదు" అని మేము ఆ సోదరుని మాటలను సరిచేయడం జరిగింది.

అయితే ఇక్కడ సమస్య ఏమిటంటే, ఈ సోదరుడు ఆ 'దాయీ'గారిని నమాజ్‌కు పిలుస్తుంటే ఆ దాయీగారు మస్జిద్‌కు రావటం లేదట. 'కష్టపడి ఎంతోమందికి దీన్ గురించి తెలిపిన వ్యక్తివి కదా, ఎందుకు

రావడం లేదని'అడిగితే, ''అల్లాహ్ నాకేమిచ్చాడు?'' అని ఆ సదరు దాయీగారు ఎదురు ప్రశ్నించారట.

అంటే ఆ 'దాయీ'గారికి ధర్మంపై కనీస అవగాహన లేదని స్పష్టంగా తెలుస్తుంది. అతనికి ఆరాధన అంటే కేవలం నమాజ్ మాత్రమే. అల్లాహ్ చేసే 'సహాయం' అంటే అటువంటి వారి దృష్టిలో ఐశ్వర్యం కాబోలు. ఎంత ధనవంతుడు కాగలిగితే, అంతగా అల్లాహ్ సహాయం చేసినట్లు భావిస్తారు.

అల్లాహ్ అందిస్తున్న సహాయాన్ని ఇటువంటి వారెంతోమంది గుర్తించ లేకపోతున్నారు. అల్లాహ్ అంటే ఏమిటో తెలుసుకుని ఆయనపై పరిపూర్ణ విశ్వాసం గలిగిన ప్రతీ ముస్లిమ్, అల్లాహ్ చేస్తున్న సహాయాన్ని చాలా స్పష్టంగా తెలుసుకోగలుగుతాడు.

అల్లాహ్ మనకు ఇంకా ఏమివ్వాలి? అల్లాహ్ మనల్ని ఓ క్షణం పాటు పట్టించుకోకపోతే, మన ఉనికి ఉంటుందా?

కాళ్ళు లేని ఓ వ్యక్తి దగ్గరికి వెళ్ళి నీకేమి కావాలో కోరుకో అంటే అతను ఏ సహాయాన్ని కోరతాడు?

అతను నడవగలిగే విధంగా అల్లాహ్ అతనికి సహాయం చేస్తే, అంతకంటే ఏమీ అవసరం లేదని చెబుతాడు. మరి పైన తెలిపిన 'దాయీ'గారికి రెండు కాళ్ళున్నాయి కదా! నడవగలుగు తున్నారు. మరి ఆ దాయీ గారు ఓసారి కాళ్ళులేని వ్యక్తితో పోల్చుకుంటే, ఇతనికి అల్లాహ్ ఎంత సహాయం చేశారో, ఎటువంటి బహుమతినిచ్చారో తెలుస్తుంది. ఇటువంటి 'దాయీ'లే కాదు. ఎంతోమంది 'అల్లాహ్' అంటే ఏమిటో తెలియని స్థితిలో ఉన్నారు.

ఏ సహాయం కొరకైనా మనం అర్థించవలసింది కేవలం అల్లాహ్‌నే! తరువాత వచ్చే ఆయత్‌లో అల్లాహ్‌నుండి అతి గొప్ప సహాయాన్నే మనం అర్థిస్తున్నాము.

اِهْدِنَا الصِّرَاطَ الْمُسْتَقِيمَ ❻

ఇహ్‌దినస్ సిరాతల్ ముస్‌తఖీమ్

**మాకు ఋజుమార్గంవైపునకు మార్గదర్శకత్వం చేయి.**
(దివ్య ఖుర్'ఆన్ సందేశం)

**Guide us to the straight path**
*(Sahee International)*

**Guide us in the straight path**
*(Maariful Qur'an)*

| | | |
|---|---|---|
| **మార్గదర్శకత్వం వహించు** | (ఇహ్‌ది) | اِهْدِ (ه د ي) |
| **మాకు, మా, మా యొక్క** (బహువచనం) | (నా) | نَا |
| **మార్గం, దిశ** | (సిరాత) | صِرَاطَ |
| **తిన్ననైన, ధర్మమైన, ఖచ్చితమైన, నిజాయితీతో కూడిన, ఋజుప్రవర్తనగల** | (ముస్‌తఖీమ్) | مُسْتَقِيمَ |

ఆ ఋజుమార్గం ఏమిటో తరువాయి ఆయత్‌లో వివరించబడింది.

صِرَاطَ الَّذِينَ أَنْعَمْتَ عَلَيْهِمْ غَيْرِ الْمَغْضُوبِ عَلَيْهِمْ
وَلَا الضَّالِّينَ ❼

**సిరాతల్లజీన అన్‌అమ్‌త అలయ్‌హిమ్ గైరిల్ మగ్‌దూబి అలయ్‌హిమ్ వలద్ దాల్లీన్**

**నీవు అనుగ్రహించిన వారి మార్గం మాత్రమే (చూపు); నీ ఆగ్రహానికి గురి అయిన వారి (మార్గం కాదు) లేక మార్గభ్రష్టులైన వారి (మార్గం) కాదు!**
(దివ్య ఖుర్'ఆన్ సందేశం)

**The path of those upon whom You have bestowed favor, not of those who have evoked [Your] anger or of those who are astray** *(Sahee International)*

**Guide us in the straight path, the path of those on whom You have bestowed Your grace, not of those who have incurred Your wrath, nor of those who have gone astray** *(Maariful Qur'an)*

| | | |
|---|---|---|
| **ఎవరైతే** (బహువచనం) | (అల్లజీన) | اَلَّذِينَ |
| **నీవు అనుగ్రహించావు** | (అన్'అమ్‌త) | أَنْعَمْتَ (ن ع م) |
| **వారి మీద** | (అలయ్‌హిమ్) | عَلَيْهِمْ |
| **తప్పు, కాక** | (గైర్) | غَيْرِ |
| **నీ ఆగ్రహానికి గురిఅయ్యారో** | (మగ్‌దూబ్) | مَغْضُوبٌ (غ ض ب) |
| **లేదు, కాదు, వద్దు** | (లా) | لَا |
| **మార్గభ్రష్టులు(దారి తప్పిన వారు), మంచిమార్గం నుండి దూరంగా పోయినవారు** | (దాల్లీన్) | ضَآلِّينَ (ض ل ل) |

పై విధంగా మనం అభ్యర్థించినట్లు, అల్లాహ్ మనకు సన్మార్గాన్ని చూపితే, మనం సాఫల్యం పొందినట్లే! ప్రతీ సలాత్(నమాజ్)లో పై విధంగా మనం అభ్యర్థిస్తూనే ఉంటాము. ఈ అభ్యర్థన చేయడానికి ముందు అంటే అప్పటికే సన్మార్గాన్ని పొందినవారు మరియు ప్రజలకు సన్మార్గాన్ని బోధించే ముహమ్మద్(స)వారు కూడా ప్రతీ రకాత్‌లో పై విధంగా అభ్యర్థించారు.

ఇక్కడ 'హిదాయహ్' (మార్గదర్శకత్వం) అనేది ఏ వ్యక్తినైనా తను చేరుకోవలసిన గమ్యానికి చేరుకునేలా చేస్తుంది.

సూరహ్ ఫాతిహాలో ఇంతవరకూ చెప్పుకున్నవాటిలో ముఖ్యమైనవి: అల్లాహ్‌ను పొగడటం, ఆరాధన మరియు సహాయం కొరకు చేసే అభ్యర్థన ఆయనకే చెందాలని, ఆయన మార్గదర్శకత్వం కొరకు చేసే అభ్యర్థనలు ఉన్నాయి కదా!

**మరి సృష్టిలో ఇవన్నీ కేవలం మనుషులకే పరిమితమా? కేవలం మనుష్యులేనా అల్లాహ్‌ను ఆరాధిస్తారు?**

**కేవలం మానవులేనా అల్లాహ్‌ను కీర్తిస్తారు?**

సూరహ్ అల్-ఇస్రాలోని క్రింది ఆయత్‌ను గమనించండి

**"సప్తాకాశాలు, భూమి మరియు వాటిలో ఉన్న సమస్తమూ ఆయన పవిత్రతను కొనియాడుతూ ఉంటాయి. మరియు ఆయన పవిత్రతను కొనియాడనిది, ఆయన స్తోత్రం చేయనటువంటిది ఏదీ లేదు, కాని మీరు వాటి స్తుతిని అర్థం చేసుకోలేరు. నిశ్చయంగా, ఆయన అత్యంత సహనశీలుడు, క్షమాశీలుడు"** (ఖుర్‌ఆన్ 17:44)

**"ఏమీ? నీకు తెలియదా? నిశ్చయంగా భూమ్యాకాశాలలో ఉన్న సర్వమూ మరియు రెక్కలు విప్పి ఎగిరే పక్షులు సైతం అల్లాహ్ పవిత్రతను కొనియాడుతూ ఉంటాయని? వాస్తవానికి ప్రతిదానికి తన సలాత్ మరియు స్తోత్రం చేసే పద్ధతి తెలుసు. మరియు అవి చేసేదంతా అల్లాహ్‌కు బాగా తెలుసు"** (అన్ నూర్(24) : 41)

అంటే చెట్లు, చేమలు, రాళ్ళు, రప్పలు, మానవులు, జిన్నులు అల్లాహ్ యొక్క పవిత్రతను కొనియాడుతూనే ఉంటాయి.

'అల్లాహ్' యొక్క గొప్పదనాన్ని కొనియాడాలంటే ముందుగా అల్లాహ్ అంటే ఏమిటో తెలిసుండాలి. దానికొరకు జ్ఞానం కావాలి. అర్థం చేసుకోగలగాలి మరియు స్పృహ కూడా ఉండాలి.

అంటే సృష్టిలో మనకే కాకుండా మనకు తెలియని ఎన్నింటికో స్పృహ ఉందని తెలుస్తుంది. వాటికి కూడా గైడెన్స్ (మార్గదర్శకత్వం) కావాలి.

**"... ప్రతిదానికి దాని రూపాన్నిచ్చి, తరువాత దానికి మార్గదర్శకత్వం చేసేవాడే మా ప్రభువు."** (ఖుర్‌ఆన్ 20:50)

మరో వాక్యాన్ని గమనించండి :

**"మహోన్నతుడైన నీ ప్రభువు నామాన్ని స్తుతించు! ఆయనే (ప్రతిదానిని) సృష్టించాడు మరియు తగిన ప్రమాణంలో రూపొందించాడు. మరియు ఆయనే దాని ప్రకృతి లక్షణాలను నిర్ణయించాడు మరియు మార్గం చూపాడు!"** (ఖుర్‌ఆన్ 87:1-3)

అంటే ప్రతిదానికీ కొన్ని లక్షణాలు మరియు కొన్ని విధులున్నాయి. అల్లాహ్ చూపిన మార్గదర్శకత్వం ప్రకారమే అవి పనిచేస్తుంటాయి. ఉదాహరణకు, మన చెవులనే తీసుకొండి. అవి వినగలవుగాని, చూడలేవు. అదే విధంగా మన కళ్ళు చూడగలవుగాని వినలేవు.

ఈ గైడెన్స్‌కి సంబంధించి మరికొన్ని ఖుర్‌ఆన్ వాక్యాలు :

**"మరియు మార్గదర్శకత్వం పొందిన వారికి ఆయన (అల్లాహ్) ఇంకా ఎక్కువగా సన్మార్గం చూపుతాడు మరియు వారి దైవభీతిని వృద్ధి చేస్తాడు"** (ఖుర్‌ఆన్ 47:17)

**"మరియు ఎవరైతే మా కొరకు హృదయపూర్వకంగా పాటుపడతారో, వారికి మేము మా మార్గాల వైపునకు మార్గదర్శకత్వం చేస్తాము. మరియు నిశ్చయంగా, అల్లాహ్ సజ్జనులకు తోడుగా ఉంటాడు."** (ఖుర్‌ఆన్ 29:69)

**"ఏ ఆపదా కూడా, అల్లాహ్ అనుమతి లేనిదే సంభవించదు. మరియు ఎవడైతే అల్లాహ్‌ను విశ్వసిస్తాడో, అల్లాహ్ అతని హృదయానికి మార్గదర్శకత్వం చేస్తాడు. మరియు అల్లాహ్‌కు ప్రతి విషయం గురించి బాగా తెలుసు. మీరు అల్లాహ్‌కు విధేయులై ఉండండి మరియు సందేశహరుణ్ణి (ముహమ్మద్-స స) అనుసరించండి. ఒకవేళ మీరు మరలిపోతే, (తెలుసుకోండి!) వాస్తవానికి మా సందేశహరుని బాధ్యత కేవలం స్పష్టంగా మీకు (మా సందేశాన్ని) అందజేయడం మాత్రమే!"** (ఖుర్‌ఆన్ 64:11)

**"(ఓ ప్రవక్తా!) నిశ్చయంగా నీవు, నీకు ఇష్టమైన వారికి మార్గదర్శకత్వం చేయలేవు. కాని అల్లాహ్ తాను కోరిన వారికి మార్గదర్శకత్వం చేస్తాడు. మరియు ఆయనకు మార్గదర్శకత్వం పొందే వారెవరో బాగా తెలుసు."** (ఖుర్‌ఆన్ 28:56)

పై వాక్యాల నుండి తెలిసేదేమిటంటే, మార్గాన్ని పొందినవారికి, ఇంకా ఎక్కువ గైడెన్స్ ఇస్తానని చెప్పడం ద్వారా అప్పటికే ఉన్న మార్గదర్శకపు స్థాయి కంటే ఉన్నతమైన మరో స్థాయిని ప్రసాదిస్తానని ఆయన స్పష్టం చేస్తున్నారు. తద్వారా దైవభీతి కూడా పెరుగుతుంది.

చరిత్రలో సాధారణ ముస్లిములున్నారు, మోమిన్ (విశ్వాసు)లున్నారు, ప్రవక్త లున్నారు. సాధారణ ముస్లిమ్ కంటే ఎక్కువ దైవభీతి మోమిన్‌లో కనిపిస్తుంది. మోమిన్ కంటే ఎక్కువ దైవభీతి ప్రవక్తలకు(అస) ఉంటుంది. ప్రవక్తలకు అల్లాహ్ అగోచర (కనిపించని) విషయాల నెన్నింటినో చూపించారు. ప్రవక్తలకు అల్లాహ్ ఇచ్చే గైడెన్స్ యొక్క స్థాయి చాలా ఎక్కువగా ఉంటుంది.

ఉమ్ముల్ మోమినీన్ హ్జ్రత్ ఆయిషా(రజి) ఇలా చెబుతున్నారు : "మేము (అంటే ముహమ్మద్(స)వారి ఇంటివారం) నెలరోజుల వరకు పొయ్యి రాజేసేవారం కాదు. అది (మా ఆహారం) ఖర్జూరాలు మరియు నీరు మాత్రమే" (సహీహ్ ముస్లిమ్, నెం. 7449, పుస్తకం 53, అధ్యా. 1, సంపుటి 7). మరో ఉల్లేఖనం ద్వారా, ఎప్పుడయినా ఎవరయినా మాంసం పంపినప్పుడు తప్ప. (సహీహ్ ముస్లిమ్, నెం. 7450, సంపుటి 7).

ఉర్వా (రజి) ఇలా ఉల్లేఖిస్తున్నారు : "హ్జ్రత్ ఆయిషా(రజి) నాతో, ఓ నా సోదరి కుమారుడా! అల్లాహ్ సాక్షి! మేము నెలపొడుపును, తరువాయి నెలపొడుపును, తరువాయి నెలపొడుపును, రెండు నెలలలో మూడు నెలపొడుపులను చూసేవారము. అల్లాహ్ సందేశహరుని(స) యొక్క ఇండ్లలో అగ్ని రాజేయబడేది కాదు (అంటే వంట కోసం పొయ్యి వెలిగించబడేది కాదు). నేను అన్నాను : "ఓ చిన్నమ్మా! మీరు ఎలా జీవించేవారు?" ఆమె చెప్పారు: "రెండు నల్లనివి - ఖర్జూరం మరియు నీరు. అల్లాహ్ యొక్క సందేశహరుల(స)కి పొరుగున కొందరు అన్సారులు ఉండేవారు. వారికి పాడిపశువులుండేవి. వారు తమ పాలనుండి కొంత రసూలుల్లాహ్(స)వారి వద్దకు పంపించేవారు. ఆయన(స) దానిని మాకు త్రాగడానికి ఇచ్చేవారు. (సహీహ్ ముస్లిమ్, నెం. 7452, 53వ పుస్తకం (అజ్-జుహ్ద్), సంపుటి 7)

పైన తెలిపినటువంటి ఎన్నో కష్టపరిస్థితులను ఎదుర్కొన్నా సరే, అల్లాహ్‌పై నున్న వారి విశ్వాసం చెక్కు చెదరలేదు. వారికి అందిన మార్గదర్శకత్వపు స్థాయి మనకంటే చాలా ఎక్కువ. కాబట్టి మనం ఈ సూరహ్ ఫాతిహా ద్వారా ఇంకా ఉత్తమ గైడెన్స్ కొరకు అల్లాహ్‌ను అర్థిస్తూనే ఉండాలి. మనలో చివరి శ్వాస వరకూ అభ్యర్థిస్తూనే ఉండాలి.

ఓ అల్లాహ్! మాలో దైవభీతిని పెంచి, మీ మార్గదర్శకత్వంలోని మంచి స్థాయిని మేమంతా పొందగలిగేలా చేయండి (ఆమీన్)

ఈ సూరహ్ అల్-ఫాతిహాలో చెప్పబడిన **'ఋజుమార్గం'** అంటే ఏమిటి?

**ఎటువంటి మలుపులు, వక్రమార్గాలు లేని మార్గం!**

**సన్మార్గం!**

ఆఖరి ఆయత్‌లో రెండు మార్గాల గురించి చెప్పడం జరిగింది.

1. అల్లాహ్ అనుగ్రహానికి పాత్రులైన వారి మార్గం (సన్మార్గం) :

**"మరియు ఎవరు అల్లాహ్‌కు మరియు ప్రవక్తకు విధేయులై ఉంటారో, అలాంటివారు అల్లాహ్ అనుగ్రహం పొందిన ప్రవక్తలతోనూ, సత్యవంతుల తోనూ, (అల్లాహ్) ధర్మం కొరకు ప్రాణాలు అర్పించిన అమరవీరుల (షహీదుల)తోనూ, సద్వర్తనులతోనూ చేరి ఉంటారు. మరియు అలాంటివారి సాంగత్యం ఎంతో మేలైనది"** (ఖుర్'ఆన్ 4:69)

2. అల్లాహ్ ఆగ్రహానికి గురియైనవారి మార్గం మరియు మార్గభ్రష్టులైన వారి మార్గం (ఈ మార్గం వద్దని కోరుతున్నాము). అల్లాహ్ కోపానికి గురియైనవారు యూదులు. యూదులపై ఆగ్రహానికి గల కారణాలు ఖుర్'ఆన్‌లో చాలా చోట్ల మనకు కనిపిస్తాయి. (సూరహ్ మా'ఇదాలో 60వ ఆయత్ చూడండి). యూదులకు సత్యం తెలుసు. వారి దగ్గర జ్ఞానముంది. కాని వారు దానిని ఆచరించరు. ఇక మార్గభ్రష్టులైన వారి మార్గం ఎవరిదంటే - ఈసా(అ)వారిని దేవుని కుమారునిగా బావించేవారిది. వారి గురించి కూడా చాలా చోట్ల ఖుర్'ఆన్‌లో చెప్పబడింది.

ఉదాహరణకు వారినుద్దేశించి **సూరహ్ మా'ఇదాలో** 7వ ఆయత్‌లో ఇలా చెప్పబడింది : **"... ఇంతకు పూర్వం మార్గభ్రష్టులైనవారి కోరికలను అనుసరించకండి. వారు ఇతరులను అనేకమందిని కూడా మార్గభ్రష్టులుగా చేశారు మరియు వారు కూడా ఋజుమార్గం నుండి తప్పిపోయారు".**

(1) అల్లాహ్‌ను కాకుండా వేరొకరిని ఆరాధించినా, (2) అల్లాహ్‌తో పాటుగా మరొకరిని ఆరాధించినా (3) అల్లాహ్‌కు ఉండే శక్తి సామర్థ్యాలను ఎవరో ఓ మానవునికి లేదా సృష్టికి ఆపాదించినా (4) అల్లాహ్ యొక్క ఆదేశాలకు వ్యతిరేకంగా ఉండిన వేరొకరి ఆదేశాలకు లోబడినా అది **"షిర్క్"** అవుతుంది.

ఈ షిర్క్‌కు అనేక రూపాలున్నప్పటికిని, ఇక్కడ వాటన్నింటి గురించి చర్చించడం లేదు. కాని అతి ముఖ్యమైన ఓ 'షిర్క్' గురించి ముస్లిమ్ సోదరులు తప్పనిసరిగా తెలుసుకోవాలి. ఎందుకంటే దానిని షిర్క్‌గా వారు భావించడం లేదు గనుక.

క్రింది ఖుర్'ఆన్ ఆయత్‌లో ఓ రకమైన షిర్క్ గురించి చెప్పబడింది:

**"వారు (యూదులు, క్రైస్తవులు) అల్లాహ్‌ను వదిలి తమ మతాచారులను మరియు సన్యాశులను మరియు మర్యమ్ కుమారుడైన మసీహ్‌ను తమ ప్రభువులుగా చేసుకున్నారు. వాస్తవానికి వారు ఒకే ఒక్క దైవాన్ని మాత్రమే ఆరాధించాలని ఆజ్ఞాపించబడ్డారు. ఆయన (అల్లాహ్) తప్ప మరొక ఆరాధ్యదైవం లేడు. వారు సాటికల్పించే వాటికి ఆయన అతీతుడు"** (ఖుర్'ఆన్ 9:31)

పై ఆయత్ విషయంలో అదీ బిన్ హాతిమ్(రజి) ఓ వ్యాఖ్య చేశారు. ఈయన మొదట్లో క్రైస్తవుడిగా ఉండేవారు. ప్రవక్త(స)వారి బోధన విన్నాక ఈయన ఇస్లాం స్వీకరించారు. ఈయన ఉల్లేఖనం తిర్మిదీలో ఉంది. తఫ్సీర్ ఇబ్నె కసీర్‌లో ఈ హదీస్ ప్రస్తావించబడింది.

అదీ(రజి) అన్నారు : ''వారిని వారు ఆరాధించరు'' (అంటే మత విద్వాంసులను, సన్యాశులను యూదులు మరియు క్రైస్తవులు ఆరాధించరని). ప్రవక్త(స) చెప్పారు, ''అవును, వారు చేశారు (ఆరాధించారు). వారు (యూద రబ్బీలు మరియు క్రైస్తవ సన్యాశులు) వారి (క్రైస్తవులు మరియు యూదుల) కొరకు ధర్మ సమ్మతమైన వాటిని నిషేధించారు. మరియు నిషేధించబడిన వాటిని ధర్మ సమ్మతం చేశారు. ఈ విధంగా వారిని ఆరాధిస్తున్నారు''.

దేనినైనా ధర్మసమ్మతం చేయడంగాని, నిషేధించడంగాని నిర్ణయించ వలసినది అల్లాహ్ మాత్రమే! ఆ పనిని వేరొకరు ఆదేశిస్తే, ఆ ఆదేశాలను ఎవరైనా స్వీకరిస్తే వారు షిర్క్ చేసినవారు అవుతారు.

క్రింది ఉల్లేఖనం ప్రకారం **ముహమ్మద్(స)వారు నిషేధించిన దానిని నిషేధంగానూ, ధర్మసమ్మతం చేసిన దానిని ధర్మసమ్మతమైనదిగానూ ముస్లిములు స్వీకరించాలి.**

**"..... ప్రవక్త మీకు ఇచ్చిన దానిని తీసుకోండి మరియు అతను మీకు నిషేధించిన దానికి దూరంగా ఉండండి ....."**
(ఖుర్'ఆన్ 59:7)

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) చెప్పారు, 'మీకు నేను ఏదైతే ఆదేశించానో అది చేయండి. మరియు ఏదైతే నేను నిషేధించానో, దాని నుండి నిగ్రహించుకోండి **(ఇబ్నెమాజా, సహీహ్, 1, పుస్తకం 1, అధ్యాయం 1, సంపుటి 1)**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) చెప్పారు, 'ఎవరైతే నాకు విధేయత చూపుతారో, అల్లాహ్‌కు విధేయత చూపారు, మరియు ఎవరైతే నాకు అవిధేయత చూపుతారో, అల్లాహ్‌కు అవిధేయత చూపారు. **(ఇబ్నెమాజా, సహీహ్ హదీస్, 3, పుస్తకం 1, అధ్యాయం 1, సంపుటి 1)**

ప్రవక్త(స)వారు నిషేధించిన కొన్ని విషయాలను ''శాంతిబాట'' **డిశంబర్-జనవరి** సంచికలో ''**ధర్మ సందేశ ప్రచారం**'' శీర్షికలో తెలియజేశాము.

ప్రవక్త(స)చే నిషేధించబడిన వాటిని, నేడు కొందరు 'దాయి'లుగా

పిలువబడే వారు ధర్మ సమ్మతం (హలాల్)గా చేసేశారు. ఆ దాయీలు చెప్పినదానిని ఎంతో మంది ముస్లిములు స్వీకరిస్తున్నారు. అటువంటప్పుడు వీరు చేసేది కూడా షిర్క్ అవుతుంది.

యూద రబ్బీలు, క్రైస్తవ సన్యాశులు మాదిరిగా, ఇప్పటి ముస్లిములు కూడా షిర్క్ చేస్తున్నారా? ఈ విషయంపై ప్రవక్త(స)వారు ముందుగానే ముస్లిమ్ సమాజాన్ని హెచ్చరించారు.

క్రింది హదీస్ చదవండి :

**"హజ్రత్ అబూ సయీద్ ఖుద్రీ(రజి) ఉల్లేఖనం: ప్రవక్త(స) చెప్పారు "మీ పూర్వీకుల జీవన విధానాలను జానకు-జాన మరియు మూరకు-మూర** (inch by inch) **విధంగా, ఒకవేళ వారు ఉడుం కన్నంలోకి దూరితే, వారిని మీరు అనుసరించేంతగా అనుసరిస్తారు." "ఓ అల్లాహ్ యొక్క సందేశహరుడా (స)! యూదులు మరియు క్రైస్తవులా?" అని మేము అన్నాము. ఆయన(స) "ఇంకెవరు?" అన్నారు. (సహీహ్ బుఖారీ,** నెం. **7320**, సంపుటి 9)

యూదులు మరియు క్రైస్తవుల విధానాన్ని రాబోయే కాలంలో ఎంత క్లోజ్‌గా ముస్లిములు అనుసరిస్తారో పై హదీస్ ద్వారా తెలుస్తుంది. ప్రస్తుతం కొందరు ముస్లిములు ఆ విధానాన్నే అమలు చేస్తున్నారు.

## "గైరిల్ మగ్‌దూబి అలయ్‌హిమ్ వలద్ దాల్లీన్"

అల్లాహ్ ఆగ్రహానికి గురియైన యూదుల మార్గాన్ని మరియు మార్గభ్రష్టులైన వారి మార్గాన్ని చూపవద్దని కోరుకుంటున్నప్పటికీ, కొందరు స్వార్థపరుల వలన పూర్వ గ్రంథప్రజల మాదిరిగా నేటి ముస్లిమ్ సమాజం వక్ర మార్గంలో పడిపోతుంది. కాబట్టి ఈ షిర్క్ నుండి ప్రతీ ముస్లిమ్ దూరం కావాలి. తనకు అర్థమయ్యే భాషలో ఖుర్'ఆన్ మరియు హదీస్(సున్నత్)లను చదివి, మనకు **ధర్మసమ్మతమైనవి ఏమిటో నిషేధించబడినవి ఏమిటో** స్వయంగా తెలుసుకుని సన్మార్గంలో ఉండడానికి, అల్లాహ్ అనుగ్రహం పొందడానికి కృషి చేయాలి. అల్లాహ్ యొక్క ఆగ్రహం నుండి మనం దూరం కావాలి.

ఖుర్'ఆన్ తఫ్సీర్ మరియు హదీస్ గ్రంథాలు ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో హైదరాబాద్‌లో లభ్యమౌతున్నాయి. కాబట్టి ప్రతి ఒక్క ముస్లిమ్, వీటి ద్వారా ప్రాథమిక జ్ఞానాన్ని తప్పనిసరిగా పొందాలని, ఆ విధంగా అల్లాహ్ మనందరినీ గైడ్ చేయాలని కోరుకుంటున్నాము.

ఖుర్'ఆన్‌లోగాని, హదీస్‌లలోగాని అర్థంకాని విషయాలను మీకు అందుబాటులో ఉన్న ఆలిమ్‌గారిని గాని, మీ మస్జిద్ ఇమామ్‌గారిని గాని అడిగి తెలుసుకోండి.

నేర్చుకోవడానికి గురువు ఉండాలి. అందులో ఎటువంటి సందేహం లేదు. కాని గురువుపైనే పూర్తిగా ఆధారపడిపోయి, అతనిని ఆరాధించే స్థాయికి పోకూడదు. ఉదాహరణకు ఓ విద్యార్థికి అతని గురువుగారు రెండు రెళ్ళు పది అని నేర్పారు. ఎక్కాల పుస్తకంలో రెండు రెళ్ళు నాలుగు అని స్పష్టంగా ఉంటుంది. కాని గురువుగారి మీద ఉండే పిచ్చి ప్రేమతో ఎక్కాల పుస్తకంలో ఉన్నదే తప్పు, తన గురువు చెప్పిందే రైట్ అని, మరో చోట సదరు విద్యార్థి పరీక్ష వ్రాస్తే, తప్పనిసరిగా ఫెయిల్ అవుతాడు. అప్పుడు గురువును నిందించినా ఉపయోగం లేదు.

కాబట్టి ఖుర్'ఆన్, హదీస్ గ్రంథాలను మీరు స్వయంగా చదువుతూ ఉండండి. కేవలం ఎవరో చెప్పారని గుడ్డిగా ఆచరిస్తే, తీర్పు దినాన 'అల్లాహ్' ముందు దోషిగా నిలబడవలసి వస్తుంది.

**కొంతమంది ఇలా చెబుతున్నారు :**

1. **నాకు ఉర్దూ రాదండి, ఇంగ్లీష్ కూడా రాదు. తఫ్సీర్ గ్రంథాలు కేవలం ఈ భాషలలోనే ఉంటే ఎలా? తెలుగులో ప్రామాణిక గ్రంథాలను ఎందుకు అనువాదం చేయడం లేదు?**

కాబట్టి అతను చదవలేక పోవడానికి కారణం, తెలుగులో వీటి అనువాదాలు లేకపోవడమట.

మరి ఇటువంటి వ్యక్తులు తీర్పుదినాన అల్లాహ్‌నుండి తప్పించుకో గలమని అనుకుంటున్నారా?

ఇటువంటి వారికి ఇంగ్లీష్‌లో టెలిగ్రామ్ వస్తే ఏమి చేస్తారు? భాష రాదు కాబట్టి దానిని మడిచి జేబులో పెట్టుకుని సరిపెట్టుకుంటారా?

2. **"ఆలిమ్ చేత చదివించుకుని వినండి. చదవడానికి అతని సహాయం తీసుకోండి" అని చెబితే ...**

'మా ఊరిలో ఆలిమ్ లేడు, ఇల్మ్ కలిగి ఉన్న సరియైన ఇమామ్ కూడా లేడు' అంటున్నారు.

**మరి ఆ ఊరిలో డాక్టర్‌గారు లేకపోతే ఏం చేస్తారు? ఆరోగ్యం బావుండకపోతే ఎక్కడికి వెళ్ళకుండా డాక్టర్లను నిందిస్తూ కూర్చుంటారా?**

వెంటనే ఏ నగరానికో, పట్టణానికో వెళ్ళి, స్పెషలిస్ట్ దగ్గర వైద్యం చేయించుకుంటారు.

ప్రాణమంటే అంత తీపి!

మరి ఆ ప్రాణాన్ని పోసింది అల్లాహ్‌యే కదా! ఆయన మన క్షేమం కోసం ఏమి చెప్పారో తెలుసుకోవడానికి, కొద్ది దూరం ప్రయాణం చేయలేమా? కొద్ది సమయాన్ని వెచ్చించలేమా?

ఇమామ్ బుఖారీ(ర)వారి వలే కేవలం ఒక్క హదీస్ కోసం వందల కిలోమీటర్లు ప్రయాణం చేయవలసిన అవసరం ఈనాడు మనకు లేదు కదా! ఖుర్'ఆన్ అనువాదాలు, తఫ్సీర్ గ్రంథాలు, వేల సంఖ్యలో ఉన్న హదీస్‌లు ఈనాడు అందుబాటులోనే ఉన్నాయి.

## దయచేసి ఖుర్'ఆన్ చదవండి. హదీస్‌లను చదవండి.

వాటిని అధ్యయనం చేయండి. అర్థం చేసుకున్నవాటిని ఆచరణలో పెట్టండి.

*(తఫ్సీర్‌లోని మరికొంత భాగం ఇన్షా అల్లాహ్ వచ్చే సంచికలో...)*

Science of Hadith

# హదీస్ విజ్ఞానం

1

'శాంతిబాట' పాఠకులకు 'హదీస్' అంటే ఏమిటో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఎన్నో ప్రామాణిక హదీస్‌లను అల్లాహ్ దయవలన ఈ పత్రిక ద్వారా అందించ గలిగాము. అయితే 'హదీస్'ల ప్రామాణికత విషయంలో చాలామంది సోదరులలో స్పష్టత లేదని తెలిసింది. కాబట్టి 'హదీస్ విజ్ఞానం'పై ఈ శీర్షికను అల్లాహ్ పేరుతో ప్రారంభించాము. ఈ శీర్షిక ద్వారా ప్రమాణాల విషయంలో ఇస్లామ్‌లో ఎంతటి ఉన్నత స్థాయిలో శ్రద్ధ తీసుకోబడిందో తెలియజేయదలిచాము. సత్యధర్మమైన 'ఇస్లామ్'లో '**అబద్ధాలకు, మోసాలకు**' చోటు లేదు.

**"నిశ్చయంగా, మేమే ఈ ఖుర్'ఆన్‌ను అవతరింపజేసిన వారం మరియు నిశ్చయంగా మేమే దీనిని కాపాడేవారం"** (ఖుర్'ఆన్ 15:9)

పై ఆయత్‌లో వాగ్దానం చేసినట్లు, ఖుర్'ఆన్ గ్రంథాన్ని మార్పులకు లోనుకాకుండా అల్లాహుతాలా కాపాడుతూనే ఉన్నారు.

ఇక్కడ రక్షింపబడుచున్నది 'ఖుర్ఆన్ యొక్క అరబీ మూలాన్ని' అని పాఠకులు గమనించాలి. అంతేగాని వేర్వేరు భాషలలో జరిగిన అనువాదాలలోని మార్పులను కాదు. అనువాదాలు కేవలం అరబీ తెలియనివారు అర్థం చేసుకోవడానికి మాత్రమే! ఇవి భాషానువాదాలు మాత్రమే. అరబీ భాషనుండి ఖుర్'ఆన్ గ్రంథాన్ని ఖచ్చితమైన అర్థంతో మరొక భాషలోకి అనువాదం చేయడం సాధ్యం కాదు. కాబట్టి ఏ మాత్రం మీకు సాధ్యమైనా, అరబీ భాషను నేర్చుకోవడానికి ప్రయత్నించండి.

ఇటువంటి ఓ సూరహ్‌ను రచించి తీసుకుని రమ్మని చేసిన ఛాలెంజ్ కూడా కేవలం అరబీ భాషకి మాత్రమే వర్తిస్తుంది. ఖుర్'ఆన్ గ్రంథం అరబీ భాషలో అవతరించబడింది మరియు ఆ భాషలోనే అది రక్షింపబడుతూ ఉంది.

అనువాదాలలో లోపాలుంటే, ఆ లోపం అనువాదకుడిది మాత్రమే! దానికి మరియు ఖుర్'ఆన్ ఒరిజినల్‌కి ఎటువంటి సంబంధమూ లేదు.

ఖుర్'ఆన్ గ్రంథం మార్పులకి గురికాలేదు, కాని హదీస్‌ల సంగతేమిటి? అని ప్రశ్నించే సోదరులకు సమాధానమే ఈ శీర్షిక. మునాఫిక్ (కపట విశ్వాసు)లు ముహమ్మద్(స)వారి కాలం నుండీ ఉన్నారు. వీరి పని కేవలం ఇస్లామ్‌పై బురదజల్లడం మరియు ముస్లిమ్‌లలో ఇస్లామ్‌పై అనుమానాలు కలుగజేయడం.

"మనకు ఖుర్'ఆన్ గ్రంథం చాలు కదా! హదీస్‌లు ఎందుకు?" అని కొందరు అంటారు. ఖుర్'ఆన్ గ్రంథం వహీ ద్వారా ముహమ్మద్(స) వారికి అందింది.

వహీలో రెండు రకాలున్నాయి. 1. వహీ మత్‌లూ 2. వహీ గైర్ మత్‌లూ

**1. వహీ మత్‌లూ** అనగా 'దివ్య ఖుర్'ఆన్'. మత్‌లూ అంటే పఠించబడేది. ఈ పఠనం (తిలావత్)లో ప్రతీ అక్షరానికి కూడా పుణ్యం (సవాబ్) ఉంటుంది. ఇది సలాత్ (నమాజ్)లో చదువబడుతుంది.

**2. వహీ గైర్ మత్‌లూ** అనగా 'హదీస్'లు (అహాదీస్). ఈ హదీస్‌లు 'ఖుర్'ఆన్' పఠించినట్లు, పఠించడానికి కాకుండా, అవి మన ఆచరణ ఎలా ఉండాలో తెలియజేస్తాయి. అంటే వీటిని సలాత్(నమాజ్)లో చదవరు. హదీస్ ప్రకారం ఆచరిస్తేనే పుణ్యం లభిస్తుంది.

హదీస్‌ల యొక్క ఆవశ్యకత గురించి ఇదివరకే చాలాసార్లు 'శాంతిబాట'లో వివరించడం జరిగింది.

ఖుర్'ఆన్ గ్రంథంలో నమాజ్ గురించి ఆదేశించబడింది. అయితే ఆ నమాజ్ విధానం ఎలా ఉండాలో ఖుర్'ఆన్‌లో ఉండదు. ప్రవక్త(స)వారు ఆ నమాజ్‌ను ఎలా చేయాలో చేసి చూపించారు.

ప్రవక్త(స)వారు ఖుర్'ఆన్ ఆదేశాలను ఆచరణాత్మకంగా చేసి చూపించినవే 'హదీస్'లు. కాబట్టి హదీస్‌ల సహకారం లేకుండా ఖుర్'ఆన్‌లో తెలుపబడిన సలాత్(నమాజ్) గురించి మనకు పరిపూర్ణంగా అర్థం కాదు.

'హదీస్'లు అంటే ఏమిటో అర్థంకానివారు మరియు స్టేజీపై ప్రసంగాలిచ్చే కొందరు వక్తలు, ఇవి కల్తీ అయిపోయాయని చెప్పడమే కాకుండా, పుస్తకాలు కూడా వ్రాసేశారు. ఈ ధర్మమే ఓ స్వచ్ఛమైన ధర్మం. ఇక్కడ కల్తీకి అవకాశం లేదు.

'హదీస్'లు కల్తీ కాలేదు. ప్రామాణిక హదీస్‌లు కంటికి రెప్పలా కాపాడబడ్డాయి. ఇన్షా అల్లాహ్ ఖుర్'ఆన్ గ్రంథంతోపాటు కాపాడబడుతూ ఉంటాయి.

**"వారితో అను: "అల్లాహ్‌కు విధేయులై ఉండండి మరియు సందేశహరుణ్ణి అనుసరించండి. కాని ఒకవేళ మీరు మరలిపోతే, అతని (ప్రవక్త)పై విధించబడిన దాని బాధ్యత అతనిది మరియు మీపై విధించబడిన దాని బాధ్యత మీది. మీరు అతనిని (ప్రవక్తను) అనుసరిస్తే మార్గదర్శకత్వం పొందుతారు. మరియు సందేశహరుని బాధ్యత కేవలం స్పష్టంగా సందేశాన్ని అందజేయటం మాత్రమే"** (ఖుర్'ఆన్ 24:54)

కాబట్టి మనం ముహమ్మద్(స)వారికి విధేయత చూపించి, ఆయన బోధించినటువంటి మరియు ఆచరించినటువంటి విధానం ప్రకారమే జీవిద్దాం!

అబ్దుర్రహ్మాన్ బిన్ అమ్ర్ అస్-సులామి, అల్-ఇర్బాద్ బిన్ సారియహ్

నుండి మరియు ఈయన ముహమ్మద్(స)వారి నుండి విన్నది చెప్పగా ఇలా ఉల్లేఖించబడింది : ''అల్లాహ్ యొక్క సందేశహరులు(స), మా (హృదయాలను) కదిలించే ప్రసంగం చేశారు. అది మా కళ్ళ వెంట నీరు పారేలా మరియు మా హృదయాలను కరిగేలా చేసింది. వేము అన్నాము: ''ఓ రసూలుల్లాహ్(స)! ఇది వీడ్కోలు ప్రసంగంలా ఉంది! మాకు ఏమి ఆదేశిస్తున్నారు?'' ఆయన(స) చెప్పారు : నేను మిమ్మల్ని కాంతివంతమైన (మార్గంపై) వదులుతున్నాను, దాని రాత్రి దాని పగలు వలే ఉంటుంది. నేను వెళ్ళిన తరువాత దాని నుండి ఎవరూ ప్రక్కకు పోరు **నాశనమయినవాడు తప్ప**. మీలో ఎవరైతే ఎక్కువకాలం జీవించి ఉంటారో వారు గొప్ప విబేధాలను చూస్తారు. నేను మీకు నొక్కి చెబుతున్నాను, **నా సున్నత్ గురించి మీకు తెలిసిన దానిని మరియు సన్మార్గం పొందిన ఖలీఫాల మార్గాన్ని గట్టిగా పట్టుకోండి. మరియు మీ దంతాలతో** (అంటే పట్టుదలగా) **దానిని అంటిపెట్టుకుని ఉండండి.** మరియు మీరు తప్పనిసరిగా విధేయత చూపాలి, (మీ నాయకుడు) అబిస్సీనియా బానిస అయినప్పటికీ. నిజమైన విశ్వాసి ముక్కుతాడు వున్న ఒంటెవంటి వాడు అది ఎక్కడకయితే నడిపించ బడతుందో (అక్కడకు) అది వినయంగా అనుసరిస్తుంది. **(ఇబ్నెమాజా, సహీహ్ హదీస్ నెం. 43, పుస్తకం 1, అధ్యా. 6, సంపుటి 1)**

కాబట్టి మనం నాశనం కాకుండా ఉండాలంటే, సున్నత్‌ని అమలులో పెట్టాలి.

అల్లాహుతాలా అలనాటి అరబ్బులలో (ముస్లిమ్ ఉమ్మత్‌లో) అమోఘమైన జ్ఞాపకశక్తిని, విషయాన్ని విశ్లేషించగలిగే నైపుణ్యాన్ని కలుగజేశారు. వీరు అలసటను లెక్క చేయకుండా 'హదీస్'లను సేకరించడానికి సుదూర ప్రాంతాలకి వెళ్ళేవారు. హదీస్‌లను ఉల్లేఖించిన వారి వారి జీవితాల గురించి బాగుగా అధ్యయనం చేసి, వారిలో ఎవరైనా అబద్ధాలు చెప్పేవారు, మోసాలు చేసేవారు అని నిర్ధారణ కాబడితే, వారు ఉల్లేఖించిన హదీస్‌లను ప్రామాణికంగా స్వీకరించలేదు.

నేడు శాస్త్రీయ విజ్ఞాన పరిశోధనలో ఉపయోగించే విధానాల కంటే, ఎంతో ఉత్తమమైన విధానాన్ని 'హదీస్' ప్రామాణికత గురించి హదీస్ శాస్త్రజ్ఞులు ఉపయోగించారు. ఈ విషయం అనుభవ పూర్వకంగానే చెబుతున్నాము. మా టీమ్‌లో ఒకరికి శాస్త్రవిజ్ఞాన పరిశోధనలో ఓ 20 సంవత్సరాల అనుభవముంది. హదీస్ విజ్ఞానంలో ఉపయోగించిన విధానాలను ఏ పరిశోధకుడైనా సరిగ్గా తెలుసుకుని, తన శాస్త్రవిజ్ఞాన విషయంలో కూడా ఆ విధానాలను ఉపయోగించు కోగలిగితే తన సబ్జక్టులో చేసే పరిశోధన మరింత మెరుగ్గా చేయగలుగుతాడు.


శాస్త్ర విజ్ఞాన పరిశోధనలో తెలివితేటలకి మాత్రమే ప్రాధాన్యత ఉంటుంది. హదీస్ విజ్ఞానంలో తెలివితేటలతోపాటు అతి ముఖ్యమైన నైతికత కూడా ఉంటుంది. ఇటువంటి నైతిక విలువలతో కూడిన ఉన్నత ప్రమాణాలను ఇస్లామ్ నేర్పబట్టే, ఆ నాటి ముస్లిమ్ శాస్త్రవేత్తలు ఆధునిక సైన్స్‌కి పునాదులు వేయగలిగారు. ప్రయోగాల ద్వారా శాస్త్రవిజ్ఞానాన్ని అభివృద్ధిపథంలో నడిచేలా చేశారు.

**హదీస్(Hadith):అల్లాహ్ యొక్క సందేశహరులైన ముహమ్మద్(స) వారికి సంబంధించి ఉల్లేఖకుల (narrators) ద్వారా ఏదైతే మనకు అందిందో దానినే హదీస్ అంటారు. కొన్నిసార్లు దీనినే సున్నత్ (ఆచరణ), ఖబర్ (నివేదిక) మరియు అసర్ (సూచన, సంప్రదాయం) అంటారు.**

**'అహదీస్' అనే పదం 'హదీస్'కు బహువచన పదం.**

**హదీస్‌లోని భాగాలు (అంశాలు) :**

హదీస్ అనేది మూడు భాగాల కూర్పు.




**తరఫ్** అంటే ప్రవచనం యొక్క భాగం లేదా వాక్యం యొక్క ప్రారంభం, ప్రవక్త(స)వారి బోధనలు, ఆచరణలు లేదా గుణగణాలను తెలిపే భాగం, లేదా ఇతర ఆచరణలను ఏకీభవించడం.

ఉదాహరణకు సహీహ్ బుఖారీ హదీస్ గ్రంథంలోని మొదటి హదీస్‌ను దిగువున ఇస్తున్నాము. హదీస్‌లోని పై భాగం - **సనద్**. క్రింది భాగం - **మతన్**. అండర్‌లైన్ (గీత గీయబడిన) భాగం **తరఫ్**.

**సనద్**

حدَّثَنا الُحُمَيْدِيُّ قالَ : حدَّثَنا سُفْيانُ، عن نَحُيى بنِ سَعِيدٍ
الأَنْـصـارِيُّ قـال : أخْبـرَنِي مُحَمَّدُ بنُ ابراهِيمَ التَّيْمِيُّ أنَّهُ
سَـمِـعَ عَـلْـقَمَةَ بْنَ وَقَّاصٍ اللَّيْثِيَّ يَقُولُ : سَمِعْتُ عُمَرَ بنَ
الـخَطَّابِ رَضِيَ اللهُ عَنْهُ عَلى المِنْبَرِ قال : سَمِعْتُ رَسولَ
اللهِ ﷺ يَـقُول: ((اِنَّما الأَعمالُ بالنِّيَّاتِ، وانَّمَا لِكُلِّ امْرِئٍ

**తరఫ్**

**మతన్**

ما نَوى، فَمَنْ كانَتْ هِجْرَتُهُ الى دُنْيا يُصِيبُها أوْ الى امْرَأةٍ
يَنْكِحُها فَهِجْرَتُهُ الى مَا هاجَرَ الَيْهِ)).

పై హదీస్‌లో ముహమ్మద్(స)వారి బోధనను ఉమర్ బిన్ అల్-ఖత్తాబ్ (రజి) విన్నారు. ఆయన నుండి అల్‌ఖమహ్ బిన్ వఖ్ఖాస్ అల్-లైసి విన్నారు. ఆయన నుండి ముహమ్మద్ బిన్ ఇబ్రాహీమ్ అత్-తైమీ విన్నారు. ఆయన నుండి యహ్యా బిన్ సఈద్ అల్-అన్సారీ విన్నారు. ఆయన నుండి సుఫ్యాన్ విన్నారు. ఆయన నుండి అల్-హుమైది అబ్దుల్లాహ్ బిన్ అజ్-జుబైర్ విన్నారు. ఆయన నుండి బుఖారీ విన్నారు.

కాబట్టి పై హదీస్ యొక్క **సనద్** ఇలా ఉంది : **బుఖారీ → అల్-హుమైదీ అబ్దుల్లాహ్ బిన్ అజ్-జుబైర్ → సుఫ్యాన్ → యహ్యా బిన్ సఈద్ అల్-అన్సారీ → ముహమ్మద్ బిన్ ఇబ్రాహీమ్ అత్-తౌమీ → అల్‌ఖమహ్ బిన్ వఖ్ఖాస్ అల్-లైసి → ఉమర్ బిన్ అల్ ఖత్తాబ్ (రజి) → ముహమ్మద్ (స)**.

పై హదీస్ యొక్క **మతన్** :

''ఆచరణల యొక్క ప్రతిఫలం నియ్యత్(సంకల్పం)లపై ఆధారపడి ఉంటుంది. మరియు ప్రతీ వ్యక్తి అతని సంకల్పం ప్రకారం ప్రతిఫలం పొందుతాడు. కాబట్టి ఎవరైతే ప్రాపంచిక ప్రయోజనాల కోసం లేక స్త్రీని వివాహం చేసుకోవడానికి హిజ్రత్(మక్కా నుండి మదీనాకు వలస) వచ్చారో, అతని వలస దేనికొరకు వలస వచ్చాడో అదే అవుతుంది. (అంటే అతని వలస ఇస్లామ్ కొరకు కాదని అర్థం.)

పై హదీస్ యొక్క **తరఫ్** :

''ఆచరణల యొక్క ప్రతిఫలం నియ్యత్‌లపై ఆధారపడి ఉంటుంది''

పై ఉదాహరణను బట్టి హదీస్ యొక్క 3 భాగాలను అర్థం చేసుకున్నారని అనుకుంటున్నాము. తరఫ్ మతన్‌లోని ఒక భాగం. తరఫ్ ద్వారా హదీస్ యొక్క ముఖ్యవిషయం తెలుస్తుంది.

హదీస్ గ్రంథాల అనువాదాలలో పూర్తి ఉల్లేఖకుల (రావి) వివరాలను ఇవ్వరు. బోధనను డైరక్టుగా ఎవరైతే విన్నారో, వారి వివరాలను మాత్రమే ఇస్తారు. కాని అరబీ మూలంలో పూర్తి వివరాలు ఉంటాయి. పై హదీస్ అనువాద గ్రంథాలలో ఎలా ఇస్తారో దిగువున తెలియజేస్తున్నాం :


> **ఉమర్ బిన్ అల్-ఖత్తాబ్(రజి)వారి ఉల్లేఖనం** : నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారు చెబుతుండగా విన్నాను, ''ఆచరణల యొక్క ప్రతిఫలం నియ్యత్(సంక్పలం)లపై ఆధారపడి ఉంటుంది. మరియు ప్రతీ వ్యక్తి అతని సంకల్పం ప్రకారం ప్రతిఫలం పొందుతాడు. కాబట్టి ఎవరైతే ప్రాపంచిక ప్రయోజనాల కోసం లేక స్త్రీని వివాహం చేసుకోవడానికి హిజ్రత్(మక్కా నుండి మదీనాకు వలస) వచ్చారో, అతని వలస దేనికొరకు వలస వచ్చాడో దాని కొరకే అవుతుంది. **(సహీహ్ బుఖారీ, 1, పుస్తకం 1, అధ్యా.1, సంపుటి 1)**

**హదీస్‌యొక్క ప్రామాణికత, దాని ఉల్లేఖకుల విశ్వసనీయతపై మరియు వారి మధ్యనుండే సంబంధాలపై ఆధారపడి ఉంటుంది.**

**హదీస్‌లలో ప్రాథమిక రకాలు :**

| | | |
|---|---|---|
| **ఖౌలి** | : | ప్రవక్త(స)వారి **బోధనలు** గ్రంథస్తం చేయబడిన హదీస్. |
| **ఫే'లి** | : | ప్రవక్త(స)వారి **ఆచరణను** గ్రంథస్తం చేయబడిన హదీస్ |
| **తఖ్‌రీర్** | : | ప్రవక్త(స)వారు ప్రకటించకపోయినా, **అంగీకరించిన** ఏదైనా ఆచరణనుగాని, ప్రవర్తనను గాని కలిగి ఉన్న హదీస్ |
| **షమాఇల్** | : | ప్రవక్త(స)వారి యొక్క **భౌతిక లక్షణాలను**, ఆయన(స) **రూపురేఖలు, అలవాట్లు** లేదా ప్రవర్తనను తెలియజేసే హదీస్. |

**హదీస్ వర్గీకరణలు** (Classifications of Hadith) :




**వహీ ద్వారా వచ్చిన సందేశం కేవలం ఖుర్'ఆన్ మాత్రమేనని చాలా మంది భావిస్తారు. కాని ఆయన స్వయంగా ఏదీ మాట్లాడరు.**

ప్రవక్త(స)వారిని ఉద్దేశించి అల్లాహుతాలా చెబుతున్న క్రింది ఖుర్'ఆన్ వాక్యాలు ఆ విషయాన్నే తెలుపుతున్నాయి.

> **"మరియు అతను తన మనోవాంఛలను అనుసరించి కూడా మాట్లాడడు. ఇది (అతను పలుకుతున్నది), అతనిపై అవతరింప జేయబడిన దివ్యజ్ఞానం (వహీ) మాత్రమే."** (ఖుర్'ఆన్ 53:3-4)

**ఖుద్‌సీ :** అల్లాహ్ యొక్క మాటలను (Statements of ALLAH) కలిగి ఉన్న హదీస్‌లను హదీసె ఖుద్సీ అంటారు. ఉదా :

అబూహురైరా ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, ''**అల్లాహ్ చెప్పారు, 'ఆదమ్ యొక్క సంతానపు ఆచరణలన్నీ వారి కొరకే - సౌమ్ (ఉపవాసం) తప్ప, అది (మాత్రం) నా కొరకు. మరియు నేను దానికి ప్రతిఫలాన్ని ఇస్తాను**'. ఉపవాసం (నరకాగ్ని నుండి మరియు పాపాలు చేయడం నుండి) కవచం లేదా రక్షణ. మీలో ఒకరు ఉపవాసముంటే, అతను తన భార్యతో రతి నుండి మరియు గొడవపడటం నుండి దూరంగా ఉండాలి. మరియు ఎవరైనా అతనితో గొడవపడితే లేదా తలపడితే, అతను చెప్పాలి, ''నేను ఉపవాసం ఉన్నాను''. ఎవరి చేతులలో నా ఆత్మ ఉన్నదో ఆయన (అల్లాహ్) సాక్షి! అల్లాహ్ ముందు ఉపవాసం ఉన్న వ్యక్తి నుండి వచ్చే వాసన, కస్తూరి వాసన కంటే ఉత్తమమైనది. ఉపవాసం ఉండే వ్యక్తికి రెండు సంతోషాలున్నాయి. ఒకటి ఇఫ్తార్ సమయంలో మరియు మరొకటి అతడు తన ప్రభువును కలుసుకునే సమయంలో, అప్పుడు ఆయన అతని యొక్క ఉపవాసం వలన సంతోషిస్తారు. **(సహీహ్ బుఖారీ, 1904, పుస్తకం 30, అధ్యా.9, సంపుటి 3)**

**మర్‌ఫూ :** ఈ హదీస్‌లు ప్రవక్త(స)వారు బోధించినవి. ఉదా: **"నేను ప్రవక్త(స)వారు చెబుతుండగా విన్నాను ...."** ఈ విధంగా ఉంటాయి.

**ఉమర్ బిన్ అల్-ఖత్తాబ్(రజి)వారి ఉల్లేఖనం** : నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారు చెబుతుండగా విన్నాను, ''ఆచరణల యొక్క ప్రతిఫలం నియ్యత్(సంకల్పం)లపై ఆధారపడి ఉంటుంది. మరియు ప్రతీ వ్యక్తి అతని సంకల్పం ప్రకారం ప్రతిఫలం పొందుతాడు. కాబట్టి ఎవరైతే ప్రాపంచిక ప్రయోజనాల కోసం లేక స్త్రీని వివాహం చేసుకోవడానికి హిజ్రత్(మక్కా నుండి మదీనాకు వలస) వచ్చారో, అతని వలస దేనికొరకు వలస వచ్చాడో అదే అవుతుంది. **(సహీహ్ బుఖారీ, 1, పుస్తకం 1, అధ్యా.1, సంపుటి 1)**

**మఖూఫ్ :** ఈ హదీస్‌లు సహాబాల నుండి ఉల్లేఖించబడినవి. ఈ హదీస్‌లు ఎలా ప్రారంభించబడతాయి అంటే, ఉదా:

''మేము ఇలా ఆదేశించబడ్డాము .....''

''మేము (ఫలానా వాటి నుండి) నిరోధించబడ్డాము .....''

''మేము ఇలా చేస్తుండేవారము .....''

''మేము చెబుతూ ఉండేవారము / చేస్తూ ఉండేవారము ..... సందేశహరులు మా మధ్యలో ఉన్నప్పుడు''

**మఖ్‌తూ :** ఈ హదీస్‌లు తాబయీల నుండి ఉల్లేఖించబడినవి.

ఉదా: సహీహ్ ముస్లిమ్ గ్రంథంలో ముస్లిమ్(ర) తన గ్రంథపరిచయంలో ఇబ్నె సిరీన్(ర)గారి ఉల్లేఖనాన్ని పొందుపరిచారు.

ఇబ్నె సిరీన్ చెప్పారు : **"ఈ (హదీస్) జ్ఞానం ధర్మం, కాబట్టి జాగ్రత్త పడండి ఎవరి నుండి మీ ధర్మాన్ని తీసుకుంటున్నారో."**

హదీస్ వర్గీకరణను ఛార్ట్ రూపంలో తరువాయి పేజీలో అందించాము.

*(హదీస్ విజ్ఞానానికి సంబంధించి మరికొంత భాగం వచ్చే సంచికలో, ఇన్షా అల్లాహ్!)*

---

(38వ పేజీ తరువాయి భాగం)

**మీకు స్కూలులో ఇలా నేర్పి ఉంటారు**

Optics అంటే 'కాంతి విజ్ఞానశాస్త్రం'. 17వ శతాబ్దంలో కటకాలు (lenses), కాంతి (light) మరియు పట్టకాల(prisms) పై చేసిన అధ్యయనం ద్వారా **ఐజాక్ న్యూటన్** ఈ 'కాంతి విజ్ఞానశాస్త్రానికి' సంబంధించిన ఆధునిక సైన్స్‌కి పునాదివేశారు.

**కాని మీరు తెలుసుకోవల్సిన అసలు నిజం ఏమిటంటే ..**

Optics అభివృద్ధికై న్యూటన్ చేసిన ప్రతీది, శతాబ్దాలకు ముందరే 11వ శతాబ్దంలోనే ముస్లిం శాస్త్రవేత్త **అల్-హైతమ్** ప్రయోగాత్మకంగా నిర్ధారించారు. అసంఖ్యాక నిపుణులు '**అల్-హైతమ్**'ని 'కాంతి విజ్ఞానశాస్త్ర వ్యవస్థాపకుడు'గా పేర్కొన్నారు. **అల్-హైతమ్** యొక్క ప్రభావం న్యూటన్‌పై ఉండవచ్చని చిన్న అనుమానం లేకపోలేదు. **అల్-హైతమ్** మధ్యయుగ కాలానికి సంబంధించి ఎక్కువగా ఉదాహరించబడిన భౌతికశాస్త్రవేత్త. అత్యధిక సంఖ్యలో యూరప్ శాస్త్రవేత్తలు **అల్-హైతమ్** యొక్క పరిశోధనలను ఉపయోగించు కొనడం మరియు ఉదాహరించడం జరిగింది. ఈ సంఖ్య **న్యూటన్** మరియు **గెలీలియో**లను కలిపి ఉదాహరించిన సంఖ్య కంటే చాలా ఎక్కువ.

ఇటువంటివెన్నో విషయాలను మొదటి సంచికనుండి అందించడం జరిగింది.

**ధర్మ సందేశ ప్రచారం**

3 **దావత్ అంటే ఏమిటి?**

4 **జాగ్రత్తలు**

5-6 **అనుమతించబడినవి - నిషేధించబడినవి** : తులనాత్మక అధ్యయనం ఖుర్'ఆన్ మరియు సున్నత్‌కి వ్యతిరేకమని ఖుర్'ఆన్ మరియు హదీస్‌ల ద్వారా వివరణ.


7 **దావత్ - ముఖ్యోద్దేశ్యం**

8 **వ్యక్తి పూజ (HERO WORSHIP) దిశగా సాగుతున్న 'దావత్' కార్యక్రమాలు**

**ఖుర్'ఆన్ పై దుష్ప్రచారం మరియు హదీస్‌లపై అపోహలపై ప్రత్యేక శీర్షికలు : 5వ సంచిక నుండి**

నకిలీ ముస్లిములు ఒక మత వర్గంవారితో కలిసి ఖుర్'ఆన్ గ్రంథంపై చేస్తున్న దుష్ప్రచారం, ముహమ్మద్(స)వారి శీలంపై సాగిస్తున్న చెడు ప్రచారం గురించి వివరిస్తూ, వారి కుటిల యత్నాలను బయటపెడుతూ, అమాయక ముస్లిములు ఆ దుష్టుల వలలో పడకుండా, ఖుర్'ఆన్ మరియు హదీసుల ద్వారా వివరణలు అందిస్తూ ఉన్నాము.

**ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర :** 8వ సంచిక నుండి ప్రారంభం ...


హదీస్ వర్గీకరణలు
(Classifications of Hadith)
❶ ప్రత్యేకమైన ప్రమాణానికి సంబంధించి
ఖుద్సీ - (దివ్యసందేశం)
మర్ఫూ - (ఉన్నతమైనది)
మౌఖూఫ్ - (ఆపివేయబడినది)
మఖ్తూ - (విడదీయబడినది)
❷ ఇస్నాద్ యొక్క లింకుల ద్వారా
(ఉల్లేఖకుల మధ్య అంతరాయం ఉండడం లేదా అంతరాయం లేకపోవడం)
ముస్నద్ - (బలపరచబడింది)
ముర్సల్ - (తొందరపాటు)
ముత్తసిల్ - (అంతరాయం లేనిది)
మున్ఖతి - (తెగిపోయినది)
ము'అదల్ - (సందేహస్పదం)
ము'అల్లఖ్ - (ఇస్నద్ లేదు)
❸ ఇస్నాద్ యొక్క ప్రతీదశలోనున్న ఉల్లేఖకుల సంఖ్య ద్వారా
1. ముతవాతిర్ (పరంపర)
2. అహాద్ (ఉన్నతమైనది)
మష్'హూర్ (ప్రముఖమైనది)
అజీజ్ (అరుదు)
ఘరీబ్ (వింత, లోటు)
❹ ప్రవచన స్థితి మరియు ఇస్నాద్ ద్వారా
(జియాదతు సిఖహ్ - విశ్వసనీయమైన ఉల్లేఖకుడు అదనంగా చేర్చినది)
మున్కర్
(నిరాకరించబడినది)
ముద్రజ్
(ప్రక్షిప్త పదాలను చేర్చినది)
❺ ఉల్లేఖకుల విశ్వసనీయత మరియు జ్ఞాపకశక్తిని బట్టి
సహీహ్ - (బలమైనది)
హసన్ - (మంచిది)
ధఈఫ్ - (బలహీనమైనది)
మౌదూ - (కల్పించబడినది)

# ధర్మ సందేశ ప్రచారం - 6

'శాంతిబాట' మాసపత్రికలోని విషయాలు ధర్మసందేశ ప్రచారంలో బాగా ఉపయోగపడుతున్నాయని చెబుతూ, 'శాంతిబాట టీమ్'ని ప్రోత్సహిస్తూ 'దావత్'పై ప్రత్యేకమైన శీర్షికను కూడా అందివ్వమని కొందరు సోదరులు కోరారు. 'శాంతిబాట'లోని విషయాలు - ప్రపంచంలోని ఎంతో మంది ముస్లిం సోదరులు చేసిన కృషికి ఫలితం. వారందరికీ అల్లాహ్ శ్రేయోశుభాలను అనుగ్రహించు గాక! (ఆమీన్). నేడు సందేశ ప్రచారంలో ఎన్నో కొత్త పోకడలు వచ్చాయి. ప్రవక్త(స)వారి సాంప్రదాయానికి దూరంగా ఈ కార్యక్రమాలు పోతుండటం చూసి, ఆవేదనతో ఈ శీర్షికను ప్రారంభించాము.

## మంచిమాట (Kind Word)

ఇస్లామ్ దానాలను ప్రోత్సహిస్తుంది. ఉన్నవాడు లేనివానికి ఎప్పుడైనా దానం చేయవచ్చు. ఏ రోజు పరిస్థితి ఎలా ఉన్నా సరే, రమదాన్ నెలలో మాత్రం, దాదాపు అందరి హృదయాలు మెత్తబడతాయి. ఈ నెలలో దానాలు చేయడం ఎక్కువగా జరుగుతుంది.

"అదీ బిన్ హాతిమ్ ఉల్లేఖనం : "రసూలుల్లాహ్(స)వారు 'అగ్ని' గురించి ప్రస్తావించారు. మరియు ఆయన చాలా విచారంగా మాట్లాడి చెప్పారు : 'అగ్ని నుండి మిమ్మల్ని రక్షించుకోండి'. ఆయన(స) ఎంత విచారకర స్థితిలో పలికారంటే దానిని ఆయన చూస్తూ ఉన్నట్లే (పలికారని) మేము అనుకున్నాము. తరువాత ఆయన చెప్పారు: '**మిమ్మల్ని అగ్ని నుండి రక్షించుకోండి అది సగం ఖర్జూంతోనైనా సరే మరియు ఎవరైతే అది (కూడా) కలిగి లేరో, ఓ మంచిమాటతో**' " **(సహీహ్ ముస్లిమ్, 2349, పుస్తకం 12, అధ్యాయం 20, సంపుటి 3)**

పై హదీస్ ద్వారా తోటి మనిషికి **ఓ మంచిమాట** చెప్పడం కూడా **దానమే** అని తెలుస్తుంది.

**"అల్లాహ్ వైపునకు పిలిచి మంచి పనులు చేసి, నేను ముస్లిమ్‌ను అని ప్రకటించే వ్యక్తిమాటకంటే మంచిమాట మరెవరిది కాగలదు"** (ఖుర్ఆన్ 41:33)

అల్లాహ్ మార్గంవైపు పిలవాలి, మంచిపనులు చేయాలి, **ముస్లిమ్‌నని** ప్రకటించాలి. ఇటువంటి మాట మంచిమాట.

పై హదీస్ ద్వారా దానం చేయడానికి పరిమాణంతో సంబంధం లేదు. కలిగి ఉన్నది అతి తక్కువైనా ఫర్వాలేదు. అది ఖర్జూరపు పండులో సగమైనా ఫర్వాలేదు. అంతేకాకుండా **'మంచిమాట'** కూడా దానమే!

పై ఖుర్ఆన్ వాక్యం ప్రకారం అల్లాహ్‌కు విధేయుడై మంచిపనులు చేసే వ్యక్తి **'అల్లాహ్ మార్గంవైపు ప్రజలను పిలవడం'** (దావత్) కూడా **మంచిమాటే**. అల్లాహ్ మార్గంవైపు పిలవడం ప్రతీ ముస్లిమ్ యొక్క బాధ్యత మాత్రమే కాకుండా, పరోక్షంగా అలా పిలవడం కూడా 'దానం' అవుతుందని పై హదీస్ మరియు ఖుర్ఆన్ వాక్యం ద్వారా అర్థమౌతుంది.

అంతేకాకుండా, 'దానం' ఇచ్చేది నరకాగ్ని నుండి రక్షించుకోవడానికి అని స్పష్టమౌతుంది. దానం యొక్క ప్రతిఫలం అల్లాహ్ దగ్గర ఉంటుంది. అదే విధంగా 'అల్లాహ్ మార్గం వైపు ప్రజలను పిలిస్తే' దాని ప్రతిఫలం కూడా అల్లాహ్ దగ్గరే ఉంటుంది.

కాబట్టి 'దానం' ఇచ్చినందుకు ప్రతిఫలంగా ఇహలోకంలో మనం ఎవరి దగ్గరైనా డబ్బురూపేణ గాని, మరో రూపంలోగాని ఏమీ తీసుకోకూడదు కదా!

**'అల్లాహ్ మార్గంలోకి పిలవడం'** కూడా దానమే అయితే అది ఎవరికీ జీవనోపాధి కాకూడదు కదా! మరి దావా ప్రోగ్రామ్స్ పేరుతో, డబ్బు సంపాదించడం హలాల్ అవుతుందో లేక హరామ్ అవుతుందో 'దాయీ'లు ఆలోచించుకోవాలి. వారిచేత ఆలోచింపజేయవలసిన బాధ్యత కూడా మనపై ఉంది.

**"... నీ బాధ్యత కేవలం (మా సందేశాన్ని) అందజేయటమే! మరియు లెక్కతీసుకోవటం కేవలం మా పని"** (ఖుర్ఆన్ 13:40)

అల్లాహ్ మార్గంవైపు పిలవడం అల్లాహ్ యొక్క ఆదేశమే అయినప్పుడు, ఆ ఆదేశాన్ని పాటించడానికి డబ్బురూపేణాగాని, మరో రూపంలోగాని ఎవరి దగ్గరి నుండి ఏమైనా ఎలా తీసుకోగలం?

మనకు అల్లాహ్ సన్మార్గాన్ని చూపి మనల్ని అదృష్టవంతుల్ని చేశారు. దానికి **కృతజ్ఞత**గా మనం ప్రజలను అల్లాహ్ వైపు పిలవాలి.

అల్లాహ్ మనకు సన్మార్గం చూపారనే కృతజ్ఞతతోనే కదా 'ప్రజల్ని అల్లాహ్ మార్గం వైపు పిలుస్తున్నాం'? మరి తెలియజేసే ఆ కృతజ్ఞతను కూడా జీవనోపాధిగా చేసుకోగలమా?

### జీవనోపాధి

**ఖుర్ఆన్ చదవడం, వ్రాయడం నేర్పడం** :

ఉబాదహ్ బిన్ సామిత్ ఉల్లేఖనం : 'అహలుస్సుఫ్ఫహ్' వారికి నేను ఖుర్ఆన్ మరియు వ్రాయడం నేర్పాను. మరియు వారిలో ఒకరు నాకు విల్లు (BOW)ను ఇచ్చారు. నేను చెప్పాను : ఇది నగదు (డబ్బు)కాదు, మరియు నేను (దీనితో బాణాలను) విసరగలను అల్లాహ్ మార్గంలో. నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స)ను దీని గురించి అడిగాను మరియు ఆయన చెప్పారు : **అగ్ని కంఠాభరణాన్ని నీ మెడచుట్టూ ఉంచడం నీకు సంతోషాన్ని కలిగిస్తే, దానిని స్వీకరించు.** **(ఇబ్నెమాజా, హసన్ హదీస్ నెం. 2157, పుస్తకం 12, అధ్యా. 8, సంపుటి 3)**

"నిశ్చయంగా, అల్లాహ్ యొక్క దాసులలో **జ్ఞానం గలవారు మాత్రమే ఆయనకు భయపడతారు.** నిశ్చయంగా అల్లాహ్ సర్వశక్తిమంతుడు, క్షమాశీలుడు" (ఖుర్ఆన్ 35:28)

అంటే ఖుర్'ఆన్ చదవడం మరియు వ్రాయడం నేర్పినందుకు బహుమతి తీసుకోకూడదని పై హదీస్ ద్వారా తెలుస్తుంది.

ఒక వ్యక్తికి ఖుర్'ఆన్ చదవడాన్ని నేర్పితే, అతను దానిని పఠిస్తాడు. అది అతని ఆరాధనలో ఒక భాగమౌతుంది. ఒక వ్యక్తికి ఆరాధన ఎలా చేయాలో నేర్పి దానికి ప్రతిఫలం తీసుకోకూడదు అంటే, మరి సన్మార్గం వైపు పిలిచేది కూడా ఆ వ్యక్తి అల్లాహ్‌ని ఆరాధించడం కొరకే కదా! ఏ విధంగా చూసినా సరే, 'దాయీ' అని పిలువబడే వ్యక్తి తాను చేసే దావా కొరకు ఏ విధమైన ప్రతిఫలం తీసుకోకూడదు.

పై హదీస్ హసన్ హదీస్. ఈ హదీస్‌ను చదవగానే కొందరు ఆవేశంతో సహీహ్ బుఖారీలోని 5737వ హదీస్‌ను ఉదాహరించవచ్చు. ఆ హదీస్‌ని కూడా ఇక్కడ అందిస్తున్నాము.

**ఇబ్నె అబ్బాస్(రజి) ఉల్లేఖనం : ప్రవక్త(స)వారి సహాబాలలో కొందరు నీరున్న ప్రదేశంలో కూర్చున్న కొంతమంది ప్రజల ప్రక్కనుండి వెళ్ళారు. ఆ ప్రజలలోని ఒకరికి తేలు కుట్టింది. వారిలో నీటి దగ్గరలో ఉన్న వ్యక్తి వచ్చి ప్రవక్త(స)వారి సహచరులతో చెప్పాడు, "నీటి దగ్గరలో తేలుకుట్టిన ఓ వ్యక్తి ఉన్నాడు కాబట్టి మీలో ఎవరైనా 'రుఖ్యా' చేసేవారున్నారా?". ప్రవక్త(స)వారి అనుచరులలో ఒకరు అతని దగ్గరికి వెళ్ళి సూరహ్ అల్-ఫాతిహా పఠించారు. ఆ బాధితునికి నయమయ్యింది మరియు ఆ వ్యక్తి గొఱ్ఱెను అతని సహచరుల దగ్గరికి తీసుకువచ్చాడు. వారు దానికి ఇష్టపడక చెప్పారు, "అల్లాహ్ యొక్క పుస్తకాన్ని పఠించడానికి నీవు వేతనాన్ని తీసుకుంటావా? వారు మదీనా చేరుకున్నప్పుడు, వారు చెప్పారు, "ఓ రసూలుల్లాహ్(స)! (ఈ వ్యక్తి) అల్లాహ్ యొక్క పుస్తకాన్ని పఠించినందుకు వేతనాన్ని తీసుకున్నాడు". అప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "అల్లాహ్ యొక్క పుస్తకంతో రుఖ్యా చేసినందుకు వేతనం తీసుకోవడానికి మీకు మిక్కిలి హక్కు ఉంది".**

**(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 5737, 76వ పుస్తకం, అధ్యా. 34, సంపుటి 7)**

ఒక హదీస్‌లో బహుమతి తీసుకోకూడదని, పై హదీస్‌లో తీసుకోవచ్చని చెప్పడం జరిగింది. ఈ విషయం గురించి చర్చించే ముందు, **సంపాదన విషయంలో సందేహముంటే ఏమి చేయాలి?** అనే విషయంలో ప్రవక్త(స)వారి బోధనలను చూద్దాం!

### సంపాదన విషయంలో సందేహముంటే ...

అష్'బీ చెప్పగా ఇబ్నె ఔన్ ఉల్లేఖించారు : అన్-ను'మాన్ బిన్ బషీర్ చెప్పగా నేను విన్నాను మరియు అతని తరువాత మరెవ్వరూ చెప్పడం నేను వినలేదు. ''నేను విన్నాను. రసూలుల్లాహ్(స) చెప్పారు : **"ధర్మసమ్మతమైనది స్పష్టం మరియు ధర్మసమ్మతం కానిది (కూడా) స్పష్టం. మరియు ఈ రెండింటి మధ్య సందేహపూరిత విషయాలున్నాయి**''. మరియు కొన్నిసార్లు ఆయన చెప్పారు : ''**ఒక సందేహాస్పదమైన విషయం**''. ........... ఈ హదీస్ ఇంకా కొనసాగింది. (అబూదావూద్, సహీహ్ హదీస్ నెం. 3329, 22. వ్యాపార పుస్తకం, అధ్యా. 3, సంపుటి 4)

దీని తరువాయి ఉల్లేఖనాన్ని (నెం. 3330) జకరియ్యా ఉల్లేఖించారు : పై హదీస్‌లో చెప్పినంత వరకూ చెప్పిన తరువాత, ఆయన(స) అన్నారు : ''... మరియు ఆ రెండింటి మధ్య సందేహం కలిగించే విషయాలున్నాయి. **వాటి గురించి చాలా మంది ప్రజలకు తెలియదు. అందువలన ఎవరైతే సందేహం కలిగించే విషయాలనుండి తప్పుకుంటారో అతను అతని ధర్మాన్ని రక్షించుకుంటాడు మరియు అతని గౌరవాన్ని** (కూడా), **కాని ఎవరైతే సందేహాస్పదమైన విషయాలలో పడతారో** (వారు) **అందులో పడతారు అది** (స్పష్టంగా) **ధర్మసమ్మతం కానిది**'' (సహీహ్)

పైన తెలిపిన 3 హదీస్‌లలో మొదటి దాని ద్వారా 'ఆరాధన' నేర్పినందుకు ఏమీ తీసుకోకూడదు. రెండవ హదీస్ ప్రకారం తేలు కుట్టడం మొదలైన వాటి వలన కలిగిన నొప్పిని తగ్గించడానికి ఖుర్'ఆన్ పఠిస్తే వేతనం తీసుకోవచ్చని తెలుస్తుంది.

ఏదైనా ధార్మిక సంబంధ విషయంలో వేతనం (డబ్బు లేదా బహుమతుల రూపంలో) తీసుకోవాలా? లేదా? అనే సందేహం కలిగితే, మూడవ హదీస్ ప్రకారం, అటువంటి సందేహాస్పదమైన వాటినుండి దూరంగా ఉండటవే మంచిది. అంటే అటువంటి ఉపాధిని వదులుకుంటే మంచిది. ఏదేమైనా సరే, ''అల్లాహ్ మార్గం వైపు పిలిచినందుకు (దావా కొరకు)'' ప్రతిఫలంగా ఏమీ తీసుకోకూడదని స్పష్టం అవుతుంది. **దావా ప్రతి ముస్లిమ్‌పైనున్న ఫరజ్.**

## మేలైన ఉపాధి

అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం : ఓ అన్సార్ వ్యక్తి ప్రవక్త(స) వద్దకు వచ్చి ఆయనను (దానం) అడిగారు. ప్రవక్త(స) చెప్పారు: ''నీ ఇంటిలో ఏమైనా ఉందా?'' అతను చెప్పాడు : ''ఔను! ఒక ముతక చాప (నా దగ్గరుంది). దాని ఒక భాగాన్ని మేము కప్పుకోవడానికి మరియు ఒక భాగాన్ని మేను వాల్చడానికి ఉపయోగిస్తాము. మరియు మాకు ఒక పాత్ర ఉంది దాని నుండి మేము నీళ్ళు త్రాగుతాము''. ఆయన(స) చెప్పారు: ''వాటిని నా దగ్గరకు తీసుకురా'', అతడు వాటిని తీసుకు వచ్చాడు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వాటిని తన చేతిలో పట్టుకుని అన్నారు : **"నా నుండి ఈ రెండింటిని ఎవరు కొంటారు?"** ఒక వ్యక్తి అన్నాడు: ''నేను వాటిని ఒక దిర్హమ్‌కొరకు తీసుకుంటాను''. అప్పుడు ఆయన(స) అన్నారు: **"ఒక్క దిర్హమ్ కంటే ఎక్కువ ఎవరు ఇస్తారు?"** రెండు లేదా మూడుసార్లు (అన్నారు). ఒక వ్యక్తి అన్నాడు: ''నేను వాటిని రెండు దిర్హమ్‌ల కొరకు తీసుకుంటాను''. కనుక ఆయన(స)వాటిని అతనికి ఇచ్చేశారు, రెండు దిర్హమ్‌లు తీసుకుని వాటిని అన్సారీ కిచ్చేశారు అతనితో (ఇలా) చెబుతూ : **"ఒక (దిర్హమ్)తో ఆహారం కొని నీ కుటుంబానికి తీసుకెళ్ళు మరియు మరొక (దిర్హమ్)తో గొడ్డలి కొని దానిని నా దగ్గరకు తీసుకురా"**. అతను దానిని ఆయన(స)వారి దగ్గరకు తీసుకువచ్చాడు, మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తన స్వీయ హస్తాలతో దానికి కర్రను తగిలించి, తరువాత అతనికి చెప్పారు: ''వెళ్ళి వంటచెరకు (కట్టెలు) సేకరించి వాటిని అమ్ము. మరియు నేను పదిహేను రోజులపాటు నిన్ను చూడనివ్వకూడదు (అంటే పదిహేను రోజుల పాటు కనిపించవద్దని)''. ఆ వ్యక్తి వంటచెరకును సేకరించడానికి

మరియు అమ్మడానికి వెళ్ళాడు. మరియు తరువాత 10 దిర్హమ్‌లతో తిరిగి వచ్చాడు. దానిలోని కొంత భాగంతో అతడు ఓ వస్త్రాన్ని కొన్నాడు మరియు కొంత భాగంతో ఆహారాన్ని. అప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : ''తీర్పుదినాన నీ మొహంపై వికృతంగా నీ భిక్షాటన రావడం కంటే ఇది ఉత్తమం కాదా?''

భిక్షమెత్తుకోవడానికి అనుమతి లేదు ముగ్గురికి తప్ప : (1) బాగా పేదవాడైన వ్యక్తి లేదా (2) తీవ్రనష్టాలలో ఉన్న వ్యక్తి లేదా (3) బాధాకరమైన రక్తం కొరకు (రక్త పరిహారం కొరకు)'' **(అబూదావూద్, హసన్ హదీస్ నెం. 1641, పుస్తకం 9, అధ్యా. 26, సంపుటి 2)**

(మరో ఉల్లేఖనం ప్రకారం భిక్షాటన చేసేవాడు మొహం మీద మాంసం లేకుండానే అల్లాహ్‌ను కలుస్తాడు).

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం : ప్రవక్త(స) చెప్పారు, **''దేనికోసమైనా ఓ వ్యక్తి ఇతరులను ఎప్పుడూ అడుగుతూ ఉంటాడు పునరుత్థాన దినమున అతని ముఖంపై మాంసం లేకుండా అతను వచ్చేవరకూ''** (సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 1474, పుస్తకం 24, అధ్యా. 52, సంపుటి 2)

ఈనాడు 'దాయీ'లుగా పిలువబడే వారిలో విలాసవంతంగా బ్రతికేవారు ఎందరో ఉన్నారు. వారికి సకల సౌకర్యాలు ఉన్నాయి. వారు కూడా అడుక్కుంటున్నారు. రెండేసి మూడేసి ఇళ్ళున్నా, కార్లు మరియు స్కూటర్లున్నా సరే అడుక్కోవడం మానడం లేదు. ప్రతీ నెలా ఎంతోమంది దగ్గరనుండి వేల రూపాయలు వారికి అందుతూ ఉంటాయి. అయినాసరే అడుక్కోవడానికి మాత్రం వారు సిగ్గుపడటం లేదు. వీరికి ఇస్లామ్‌పై ఎంత అవగాహన ఉందో అర్థమౌతుంది.

## బలంగా ఆరోగ్యంగా ఉన్నవారికి దానం లేదు

ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ అల్-ఖియార్ ఇద్దరు వ్యక్తులు చెప్పగా ఉల్లేఖించారు : వారు ప్రవక్త(స) దగ్గరకు హజ్జతుల్ విదా (వీడ్కోలు హజ్జ్) సమయంలో వచ్చి ఆయన(స) దానాన్ని పంచిపెడుతుండగా దానిలో కొంత భాగం కొరకు ఆయన(స)ను అడిగారు: ''ఆయన(స) మా వంక శ్రద్ధగా చూశారు. మరియు మమ్మల్ని బలంగా ఉన్నట్లు చూశారు. ఆయన(స) అన్నారు: మీరు కోరితే, నేను మీకు ఇస్తాను, కాని ధనవంతునికి లేదా బలమైన వ్యక్తికి మరియు సంపాదించడానికి సామర్థ్యం గలవానికి ఇందులో భాగం లేదు.

**(అబూదావూద్, సహీహ్ హదీస్ నెం. 1633, పుస్తకం 9, అధ్యా. 24, సంపుటి 2)**

అబ్దుల్లా బిన్ అమ్ర్ ఉల్లేఖనం : ప్రవక్త(స) చెప్పారు : **''ధనవంతునికిగాని లేదా బలమైన, ఆరోగ్యవంతునికి దానం ఇవ్వడానికి అనుమతి లేదు''** (అబూదావూద్, హసన్ హదీస్ నెం. 1634, సంపుటి 2)

ఈనాడు చాలామంది యువకులు, బలంగానూ, ఆరోగ్యంగానూ ఉండి కూడా పనిచేయకుండా సులభ సంపాదన (Easy money)కు అలవాటు పడిపోయి 'దావా' చేస్తున్నామని చెప్పుకుంటూ ఆత్మాభిమానాన్ని చంపుకుంటున్నారు.

## ఓ ముస్లిమ్‌ని బ్రిటన్‌లో అడుగుపెట్టకుండా నిషేధించడం సమంజసమా?

పాఠకులకు డా. జాకిర్‌నాయక్ గారి గురించి ప్రత్యేకంగా పరిచయం చేయనవసరం లేదు. ఈయన బ్రిటన్‌లో అడుగు పెట్టడాన్ని నిషేధిస్తూ ఆ దేశం ఓ నిర్ణయం తీసుకుంది. వారు చెప్పే కారణం : 'జాకిర్‌నాయక్ గారు టెర్రరిజాన్ని' ప్రోత్సహిస్తున్నారని. వాస్తవానికి జాకిర్ నాయక్ టెర్రరిజాన్ని ఖండించారుగాని, ప్రోత్సహిస్తూ ప్రసంగం చేయలేదు. కాని ఓ చిన్న పొరపాటు చేసి, మీడియా వలలో పడ్డారు.

ఆయన ఓ ప్రసంగంలో 'Every Muslim must be a terrorist' అని చెప్పడం జరిగింది. అంటే 'ప్రతీ ముస్లిమ్ ఓ టెర్రరిస్ట్(తీవ్రవాది) కావాలి'. ఈ మాట అనడానికి ముందు, తీవ్రవాదం గురించి వివరించి చెబుతూ తప్పుడు పనులు చేసేవారు, నేరాలు ఘోరాలు చేసేవారు పోలీస్‌ను చూడగానే ఎలా భయపడతారో, అదే విధంగా సన్మార్గంలో బ్రతికే ముస్లిమ్‌ను చూసినప్పుడు, పాపకార్యాలు చేసేవారు భయపడాలని, ఆ విధంగా దుర్మార్గుల పాలిట ఓ ముస్లిమ్ టెర్రరిస్ట్ కావాలనేది ఆయన ప్రసంగ భావం.

అందుకోసం 'తీవ్రవాదం (టెర్రరిజమ్)'ను తనదైన శైలిలో నిర్వచించారు. భయం(టెర్రర్) కలిగించేవాడే టెర్రరిస్ట్.

జాకిర్‌నాయక్‌గారు ఈ విధంగా టెర్రరిజానికి నిర్వచనాన్ని చెప్పి **'Every Muslim must be a terrorist'** అని చెప్పగానే ప్రేక్షకులు చప్పట్లు కొట్టారు. అయితే ఆయనని మీడియా మరోలా మొట్టింది. మీడియాకు చేతులారా అటువంటి అవకాశాన్ని అందించింది ఆయనే!

ముందుగా మనం చెప్పే కొత్త నిర్వచనాలను ప్రజలు స్వీకరిస్తారా లేదా తెలుసుకోవాలి. ఒకొక్కసారి ఎవరైనా రాజకీయ నాయకుడు సదుద్దేశ్యంతో మాట్లాడినా సరే, అతని సంకల్పం తప్పుకాకపోయినా సరే, అతని మాటల్ని మరో విధంగా ప్రెజెంట్ చేసి మీడియా అతనిని ముప్పుతిప్పలు పెడుతుంది. ఇటువంటివి మన దేశంలో తరచుగా జరుగుతూనే ఉంటాయి. ఈ విషయం సామాన్య ప్రజానీకానికి కూడా బాగా తెలుసు.

అటువంటప్పుడు ప్రసంగాలు చేసేవారు మరియు ప్రసంగ వీడియోలను మార్కెట్ చేసుకునేవారు చాలా జాగ్రత్తగా ఉండాలి. 'దాయీ'లుగా పిలువబడేవారు ఎవరైనా ఆకర్షణీయంగా మాట్లాడటానికి గాని, కరతాళ ధ్వనుల కొరకు మాట్లాడటం గాని కాకుండా, **'సత్యాన్ని'** స్పష్టంగా **అర్థమయ్యే విధంగా ప్రసంగం చేయడానికే** ప్రాధాన్యత నివ్వాలి.

ఇంతవరకూ ఎవరైనా తెలిసి పొరపాటు చేసినా లేక కావాలని తప్పు చేసినా సరే, వారి పేరును 'శాంతిబాట టీమ్' ఈ పత్రికలో ప్రస్తావించ లేదు. కాని ఎవరైనా సత్కార్యం చేస్తే, ఆ వివరాలను 'శాంతిబాట'లో ప్రచురించ వలసి వచ్చినప్పుడు మాత్రం వారి పేరును చెప్పడం జరిగింది. **పేరు చెప్పకపోవడం భయపడి మాత్రం కాదు.**

**అయితే ఇక్కడ జాకిర్ నాయక్‌గారి పేరు తప్పనిసరిగా చెప్పవలసి వచ్చింది. ఆయన ప్రసంగంలో చిన్నలోపం ఉన్నప్పటికీ, ఆయన ఉద్దేశ్యం మాత్రం టెర్రరిజాన్ని ప్రోత్సహించడం కాదని చెప్పడానికే అతని పేరును ఉపయోగించాము. ఈ ప్రసంగంపై బ్రిటన్ చేసిన కామెంట్ నిజానికి కొత్తదేమీ కాదు.**

2008 సంవత్సరం ఆగష్టు నెలలో 'ది హిందూ' అనే ఇంగ్లీష్ పేపర్లో 'ప్రవీణ్ స్వామి' అనే వ్యక్తి ముస్లిమ్‌లను/ఇస్లామ్‌ను పరోక్షంగా నిందిస్తూ వ్రాసిన వ్యాసంలో డా. జాకిర్‌నాయక్‌గారిపై ఇటువంటి అభాండాన్నే అతను కూడా వేశాడు. ప్రవీణ్ స్వామి ఇస్లామ్‌కి వ్యతిరేకంగా వ్యాసాలు వ్రాయడంలో ప్రావీణ్యుడు.

అతని వ్యాసాన్ని, ఆయన జాకిర్‌నాయక్‌పై వేసిన అపనిందను ఖండిస్తూ, శాంతిబాట టీమ్‌లో ఒకరైన డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు వెంటనే 'ది హిందూ' దినపత్రికకు లెటర్ వ్రాయడం జరిగింది. డా. శ్రీనివాసరావు మాటలను యథాతథంగా కాకుండా, వాటిని కొద్దిగా ఎడిట్ చేసి 2008 ఆగష్టు, 4వ తేదీన 'ది హిందూ' లో 'లెటర్స్ టుది ఎడిటర్' కాలమ్‌లో ప్రచురించారు. ఆ లెటర్ దిగువున రీప్రొడ్యూస్ చేస్తున్నాము.

> Terrorism is against the principles of Islam. As a result of some incidents, some elements may want to take revenge. But our duty is to console them and prevent them from playing into the hands of terrorist organisations.
>
> Regarding Dr. Naik's statement, the author has quoted it out of context. Enemies of Islam he referred to in the speech refer to the enemies of peace. If he watches the video entitled "Is terrorism a Muslim monopoly?", he will realise that Dr. Naik works for promoting harmony between religious groups.
>
> **Nagireddi Srinivasa Rao,**
> *Visakhapatnam*
>
> *(http://www.hindu.com/2008/08/04/stories/2008080453361003.htm)*

అయితే comparative study చేయకూడదని మేము ప్రామాణిక హదీస్‌ల ద్వారా, ఖుర్ఆన్ ఆయత్‌ల ద్వారా డిశంబర్'09 మరియు జనవరి'10 సంచికలో వివరించినప్పుడు, మేము జాకిర్‌నాయక్‌గారికి వ్యతిరేకంగా చెబుతున్నామని, 'శాంతిబాట టీమ్'ను విమర్శించిన వారున్నారు. ఆ విధంగా విమర్శించిన నాయక్‌గారి అభిమానులలో ఎంతమంది 'ది హిందూ'లో జాకిర్ నాయిక్‌పై వేసిన అపనిందను ఖండించారు? అసలు మన రాష్ట్రం నుండి ఎవరైనా ఖండించారా?

**'ది హిందూ'** పేపర్ యొక్క వెబ్‌సైట్‌లో ఉన్న పాత న్యూస్ ఐటమ్స్ చూడండి. మీకే తెలుస్తుంది. ఈ రాష్ట్రం నుండి బలంగా ఖండించింది మేమే. అప్పటికే 'శాంతిబాట' మొదటి కాపీ సిద్ధమయింది గాని, టైటిల్ వెరిఫికేషన్ పూర్తికాకపోవడంవలన పత్రికను ప్రారంభించలేదు.

మేము ఖండించినంత మాత్రాన మేము జాకిర్ నాయక్‌గారి మద్దతుదారులము కాదు, వ్యతిరేకులమూ కాదు. **శాంతిబట టీమ్ వ్యక్తులకు వ్యతిరేకం కాదు. కేవలం ఇస్లామ్ వ్యతిరేక విధానాలను మాత్రమే 'శాంతిబాట'లో ఖండించడం జరుగుతుంది.**

ముస్లిములమైన మాకు సహజంగానే ముహమ్మద్(స)వారు ఆదర్శనీయులయ్యారు. మేము ఆ మహనీయుని విధానాలను ప్రేమించడం వలన, ఆ విధానాలకు వ్యతిరేకమైన వాటిని ప్రామాణిక వివరాలతో సహా పాఠకుల ముందు ఉంచుతున్నాము.

నిజమైన ముస్లిమ్ ఎవరైనా ఖుర్ఆన్ మరియు సున్నత్‌ద్వారా చేసే విమర్శను సహృదయంతో స్వీకరిస్తాడు. ఎందుకంటే అందులో తన తప్పు నిజంగా ఉంటే, వెంటనే అల్లాహ్‌ను ప్రార్థించి ప్రాయశ్చిత్తం చేసుకోగలుగుతాడు. సద్విమర్శ ముస్లిమ్‌కి మేలే చేస్తుంది.

సత్యధర్మాన్ని తెలియజేయడం ముస్లిములుగా మన బాధ్యత. **'సత్యం' అందరికీ ఆకర్షణీయంగా ఉండదు.** దైవభీతిగలవారికి 'సత్యధర్మం' గురించి చెబితే, వారి చెవులకు అది ఇంపుగా వినిపిస్తుంది. 'ఖుర్ఆన్'లోని ఏదైనా వాక్యాన్ని చిన్న పిల్లవాడు చదివి వినిపించినా సరే, లేక ప్రముఖ వక్త చదివి వినిపించినా, దాని అర్థంలో తేడా ఉండదు. దైవభీతిగలవారు రెండింటిని ఒకేలా స్వీకరిస్తారు.

దైవకరవాలమని బిరుదు పొందిన **ఖాలిద్ బిన్ వలీద్**(రజి) వారిని 'అమీరుల్ మోమినీన్ ఉమర్(రజి)వారు' సైన్యాధిపతి పదవి నుండి ఎందుకు తొలగించారు? ఖాలిద్ బిన్ వలీద్(రజి) ఆ పదవినుండి తప్పుకున్నారు. కాని ఆయన స్థానంలో సైన్యాధిపతి అయిన మరో వ్యక్తి ఖాలిద్ బిన్ వలీద్(రజి)కంటే ఎక్కువేమీ కాదు. ఈ విషయంలో ఉమర్(రజి)గారి వివేకాన్ని అర్థం చేసుకోవాలి. అదే విధంగా అమీరైన ఉమర్(రజి)గారిపై ఖాలిద్ బిన్ వలీద్(రజి)గారు చూపిన విధేయతను కూడా అర్థం చేసుకోవాలి.

ఖాలిద్ బిన్ వలీద్(రజి) యుద్ధంలో ఉంటే చాలు, విజయం మనదే అని ముస్లిములు భావించేవారు. **కాని వాస్తవానికి విజయం లభించేది అల్లాహ్ అనుగ్రహం వలన.** అల్లాహ్‌పై ఉండవలసిన భరోసా పరోక్షంగా వ్యక్తులపైకి మరలడాన్ని గమనించిన ఉమర్(రజి)వారు ఆ నిర్ణయాన్ని తీసుకున్నారు గాని, ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారిపై వారికి ఎటువంటి విరోధం లేదు. ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారి వలన ఎటువంటి తప్పిదం కూడా జరుగలేదు. అంతేకాకుండా ఖాలిద్ బిన్ వలీద్(రజి)వారికి అల్లాహ్‌పై అచంచలమైన భరోసా ఉంది. కేవలం అల్లాహ్ వల్లనే విజయం సాధిస్తున్నానని ఆయనే చెప్పేవారు.

**కాబట్టి వ్యక్తిగత ప్రతిష్ఠలకు ఇస్లామ్‌లో చోటు లేదు. వ్యక్తులు కేవలం కొంత నిర్ణీతకాలం వరకే జీవించి ఉంటారు. కాని ఇస్లామ్ ప్రళయం వరకూ ఉంటుంది.**

కాబట్టి దాయీలుగా పిలువబడేవారు తమ అభిమానులకి నచ్చే విధంగా ఆకర్షణీయంగా మాట్లాడేటప్పుడు చాలా జాగ్రత్తలు తీసుకోవలసి ఉంది.

పాపకార్యాలు చేసేవాడు ముస్లిమ్‌ను చూసి భయపడటం కాదు, **సన్మార్గంలో ఉండే ముస్లిమ్‌ని చూసి సిగ్గుపడాలి.** ముస్లిమ్‌ను చూసి తన తప్పుడు విధానాన్ని మార్చుకునేలా ఉండాలి. కాబట్టి,

**'Every Muslim must be a well-wisher to all mankind'.**

**ప్రతీ ముస్లిమ్ సర్వమానవాళికి శ్రేయోభిలాషిగా ఉండాలి.**

జాకిర్‌నాయక్ గారిపై బ్రిటన్ నిషేధం విధించాక, ఆయనకు మద్దతు తెలపాలని మా 'శాంతిబాట'కు కూడా మెయిల్స్ అందాయి. మెయిల్స్‌లో కొన్నింటికి మేము ఇలా సమాధానం ఇవ్వడం జరిగింది :

**"ఇది దాయీలను సపోర్ట్ చేసే సమయం కాదు, వారిని ఎడ్యుకేట్ చేయవలసిన సమయం".**

ప్రతీ ఒక్క ముస్లిమ్ ఖుర్‌ఆన్ మరియు హదీస్ గ్రంథాలను చదువుతూ, వాటి ప్రకారంగా తమ జీవితాలను మలచుకుంటే, ముస్లిమ్‌లపై అపనింద ఎవ్వరూ వేయలేరు. ఒకవేళ ఎవరైనా వేసినా, సున్నత్ ప్రకారంగా నడిచే మన నడవడికే దానికి సమాధానం చెబుతుంది.

వాస్తవానికి జాకిర్ నాయక్‌పై నిషేధం విధించడానికి వారు చెప్పినది కారణం కాకపోవచ్చు. బ్రిటిష్‌వారు తెలివితక్కువవారేమీ కాదు. ఇండియా వంటి దేశాన్ని మోసంతో కబళించి రెండు శతాబ్దాలకు పైగా భారతీయులను బానిసత్వంలో ఉంచుకున్న వారికి అన్ని రకాల నక్కజిత్తులూ తెలుసు. మా అభిప్రాయం ప్రకారం "టెర్రరిజాన్ని ప్రోత్సహించేలా ప్రసంగం చేస్తున్నారు" అనేది కేవలం ఓ సాకు మాత్రమే. వాస్తవంగా ఆయనపై నిషేధం కేవలం ఆయన చేసే comparative study మీదేనని నమ్మకంగా చెప్పవచ్చు. జాకిర్‌నాయక్‌గారు క్రైస్తవత్వాన్ని టచ్ చేయకుండా మాట్లాడితే, ఇన్షా అల్లాహ్, ఇలా జరిగి ఉండకపోవచ్చేమో! (నిజం అల్లాహ్‌కే తెలుసు)

గ్రంథప్రజలు చెప్పేది విన్నాక, తప్పు అనవద్దు మరియు ఒప్పు అనవద్దు అని చాలా స్పష్టంగా ముహమ్మద్(స)వారు చెప్పడం జరిగింది. కాని ప్రవక్త(స)వారు ఆదేశించిన ఈ విషయాన్ని **ఎందుకు నేటి ముస్లిములు తిరస్కరిస్తున్నారు?** ప్రవక్త(స)వారి ఆదేశాలను తిరస్కరించడం వల్లనే ఇటువంటి అవమానాలకు గురి అవుతున్నారని మా ప్రగాఢ విశ్వాసం.

## ఫీల్డ్ లోకి వచ్చి చూడాలా? ఫీల్డ్ అంటే అంతరిక్షమా?

ఈ మధ్యన 'దాయీ'లుగా పిలువబడేవారి నోటివెంట వినబడుతున్న ఏకైక డైలాగ్ - **మూడు గ్రంథాల అవసరం ఏమిటో ఫీల్డ్‌లోకి వస్తే తెలుస్తుంది. కంప్యూటర్ ముందు కూర్చుంటే తెలియదు.** వాస్తవానికి రోజులో మాముందు ఎక్కువసేపు ఉండేవి - ఖుర్‌ఆన్ తఫ్సీర్ గ్రంథాలు, 6 హదీస్ గ్రంథాల సంపుటలు (32 పుస్తకాలు) మాత్రమే. అల్లాహ్ దయవలన వాటియొక్క అమోఘమైన విలువను మేము తెలుసుకో గలిగాము.

ఫీల్డ్ అంటే ఏమిటో మరి? అదేమైనా అంతరిక్షమా? చెప్పేవారందరూ భూమి మీద ఉన్నవారే. ముహమ్మద్(స)వారికి ఈ ఫీల్డ్ టెక్నిక్స్ తెలియవా? కొందరు అంటున్నారు 'ప్రవక్త(స)వారికి వేదాల గురించి తెలియదు కాబట్టి ఆయన చెప్పలేదట'

మరి 'తౌరాత్', 'ఇంజీల్' గురించి కూడా మొదట్లో ఆయన(స)కు తెలియదు కదా! అల్లాహ్‌యే తెలియజేశారు. అంతేకాకుండా ఆ మహనీయునికి సప్తాకాశాలను అల్లాహ్ చూపించారు. సిద్రతుల్ ముస్తహాని దాటి జిబ్రాయీల్(అ) వెళ్ళలేని చోటుకి వెళ్ళి తనతో మాట్లాడగలిగేలా చేసిన అల్లాహుతాలా మిగతా గ్రంథాల అవసర ముంటుందని అనుకుంటే, వాటి గురించి ఆయనకు తప్పక తెలియజేసి ఉండేవారు.

ముహమ్మద్(స)వారిని సర్వమానవులకే కాదు, సర్వలోకాలకు కారుణ్యంగా చేసిన అల్లాహుతాలాకు అన్నీ తెలుసు. తన ప్రవక్తకు ఏమేమి నేర్పాలో వాటన్నింటిని అల్లాహుతాలా నేర్పించారు.

ఖుర్‌ఆన్ మరియు హదీస్‌లపై కనీస అవగాహన లేనివారు మాత్రమే మూడు గ్రంథాల గురించి మాట్లాడుతున్నారు. ఖుర్‌ఆన్ మరియు హదీస్‌లపై అవగాహన ఉంటే ఏ వ్యక్తికీ ఇబ్బంది కలుగకుండా ఇస్లామ్‌ని సులభంగా పరిచయం చేయవచ్చు. మేము ఎందరికో ఆ విధానంలోనే పరిచయం చేస్తున్నాము. అంతరిక్షంలో కాదు సుమా! ఈ భూమి పైనే!

**దాయీలుగా పిలువబడేవారికి మేము చెప్పేది ఒక్కటే -**

ఖుర్‌ఆన్ మరియు సున్నత్ ద్వారా చెప్పలేకపోతే దావా మాని వెయ్యవచ్చు. 'దావా' మానివేస్తే జీవనోపాధి ఎలా అని ఆలోచిస్తున్నారేమో!. కష్టపడి పనిచేసి సంపాదించాలి. లారీలు నడిపేవారు, ఆటోలు నడిపేవారు, కష్టపడి పనిచేయగలిగే ఎంతోమంది అవన్నీ వదిలేసి, 'దావా' అంటూ సులభ సంపాదనకు అలవాటు పడిపోయారు. కష్టపడి పనిచేస్తూ దావా చేయాలి. జకాత్ ప్రత్యేక వ్యాసంలో ఇచ్చిన హదీస్‌లను చదివారు కదా. కాబట్టి ఆలోచించండి! మేలైన ఉపాధిని పొందండి. ఆత్మాభిమానంతో బ్రతకండి.

**కాలుష్యం**

నీరు, వాతావరణం మొదలైనవి ఏవిధంగా కాలుష్యానికి గురి అయ్యాయో, అదే విధంగా నేటి 'దావత్'కూడా కాలుష్యానికి గురి అయ్యింది. నేటి ముస్లిమ్ సమాజంలో చేరిన అటువంటి కాలుష్యమే - మూడు గ్రంథాలతో అల్లాహ్ మార్గం వైపు పిలవడం.

ముస్లిమ్ సమాజపు ధార్మిక ఆరోగ్యాన్ని పాడుచేసే ఈ కాలుష్యాన్ని సమూలంగా శుద్ధి చేయవలసిన అవసరం ఎంతైనా ఉంది. ప్రవక్త(స) వారి విధానాన్ని అనుసరిస్తే, ఇటువంటి కాలుష్యం అంతరించి పోతుంది.

ఇతర గ్రంథ విషయాలను ప్రస్తావించడం ద్వారా, ఆ మత ధర్మాల వారితో సమస్యలు తీసుకువస్తున్నారు. కొందరు దాయీలు బాహాటంగానే డిబేట్స్ చేస్తున్నారు. మరి కొందరు పైకి మాత్రం డిబేట్స్ చేయము అని చెబుతూ, ఇతర ధర్మాల వారి ఇళ్ళల్లో ఈ డిబేట్స్‌ను నడుపుతున్నారు. అటువంటి చర్చలను వీడియో తీసుకుని ఇరువర్గాలవారు, వారివారికి డబ్బు అందించే సంస్థలకు చేరవేస్తున్నారు.

**ఇక్కడ ఒక ముఖ్య విషయం గమనించాలి. ఇతర గ్రంథాలతో దావా చేసేవారికి ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల గురించి సరిగ్గా తెలియదని, అన్యమత ధర్మాలవారికి ఇప్పుడు స్పష్టంగా తెలిసిపోయింది.**

**ఈ 'దాయీ'లకు ఇల్మ్ లేదని తెలిసిపోవడంతో, అదే మార్గంలో వారు కూడా ఎటాక్ చేస్తున్నారు. హదీస్‌ల గురించి కొన్ని తప్పుడు రిఫరెన్స్‌లను చూపి నేటి 'దాయీ'లకు నోట మాట రాకుండా చేస్తున్నారు.**

**ఇల్మ్**

నేటి దాయీలు మరియు కొందరు స్వార్థపరులైన ఇమామ్‌లు, ముస్లిమ్‌లకు ఇల్మ్ అందకుండా, వారిని ధార్మిక జ్ఞానాన్ని నేర్చుకోనీయ కుండా, పూర్తిగా తమపైనే ఆధారపడేలా చేసుకుంటున్నారు.

ఈ విధానం వల్లనే ముందరి జాతులు నాశనమయ్యాయి. ప్రతీ ముస్లిమ్‌కి ప్రాథమిక ధార్మిక జ్ఞానం తప్పనిసరిగా ఉండాలి. ముస్లిమ్ సోదర సోదరీమణులారా ఇప్పటికైనా మేల్కొనండి. మీకు మరియు మీ సంతానానికి ప్రాథమిక ధార్మిక జ్ఞానం లభించేలా కృషి చెయ్యండి.

***ప్రతీ మస్‌జిద్ ఓ విజ్ఞాన కేంద్రం కావాలి.***

ప్రాథమిక జ్ఞానం పొందడానికి బోధన అవసరం. ప్రాథమిక జ్ఞానాన్ని పొందిన తరువాతనే లెక్చర్లు. ఉదాహరణకు 1వ తరగతిలో చేరిన కుర్రవానికి, చేతిని పట్టుకుని టీచర్ అక్షరాలు దిద్దిస్తారు. అక్షరాలు వ్రాయడం, చదవడం వచ్చాక, పాఠాలు బోధిస్తారు. ఆ విధంగా టీచర్ల దగ్గర బోధన విన్నాక, 10వ తరగతి పూర్తి చేసుకుని, ఇంటర్‌లో జాయిన్ అవుతారు. అక్కడ లెక్చరర్లు ఉంటారు. కాబట్టి ముందు ప్రాథమిక జ్ఞానం పూర్తి చేసుకున్న తరువాతనే లెక్చర్ల అవసరం ఉంటుంది.

శుక్రవారం నాడు మస్‌జిద్‌లో ఇచ్చే ఖుత్బా మరియు పండుగ నమాజ్‌లలో ఇచ్చే ఖుత్బా (ధార్మిక ప్రసంగాలు) తప్ప, మిగతా ప్రసంగాలు గాని, ప్రసంగాల వీడియోలు చూడవలసిన అవసరం ప్రాథమిక ధార్మిక జ్ఞానాన్ని పొందేవరకూ లేదు.

ఖాళీ సమయాన్ని ఖుర్‌ఆన్ గ్రంథం (అనువాదంతో సహా) మరియు హదీస్ గ్రంథాలను, ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర మరియు సహాబాల జీవితచరిత్రను చదవడానికి ఉపయోగించుకుంటే సంతోష మయ జీవనానికి మనం ఏమి చేయాలో స్పష్టంగా అర్థమౌతుంది. ప్రతీ మస్‌జిద్‌లో ప్రాథమిక ధార్మిక విద్యను బోధించే బాధ్యతను ఇమామ్‌లు తీసుకోవాలి.

ఖుర్‌ఆన్ ఆయత్‌ల కంటే
ప్రవక్త(స)వారి బోధనల కంటే
మంచిమాటలు ఏముంటాయి?
మీ తోటివారికి ఇటువంటి ఏదైనా ఓ మంచిమాట చెప్పండి.
ఆ **మంచిమాట** చెప్పడం కూడా ఓ దానమే!
దాని కొరకు ఎవరి దగ్గర ప్రతిఫలాన్ని ఆశించకండి.
దాని ప్రతిఫలం మీకొరకు అల్లాహ్ దగ్గర ఉంటుంది.

**గత 6 నెలల నుండి ఈ శీర్షికలో అందించిన వ్యాసాల ద్వారా ధర్మ సందేశ ప్రచారం పేరుతో ఎటువంటి బిద్‌అత్‌లు ప్రవేశపెట్టబడ్డాయో తెలియజేశాము.**

**ముస్లిమ్ సమాజం ఎటువంటి కాలుష్యానికి గురి అయ్యిందో ఆధారాలతో సహా వివరాలను అందించాము.**

**ఇక వచ్చే సంచిక నుండి ఇతరులకు సున్నత్ విధానంతో 'ఇస్లామ్'ని సులభంగా పరిచయం చేయడంపై ప్రత్యేక వ్యాసాలు ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.**

**'ఇస్లామ్'వైపు ప్రజలను పిలుస్తూ మిమ్మల్ని మీరు 'ముస్లిమ్' అని పరిచయం చేసుకోండి. 'దాయీ' అని పరిచయం చేసుకుంటే అది అసంపూర్ణం అవుతుంది.**

**'ముస్లిమ్' - సలాత్ (నమాజ్) చేస్తాడు, ఉపవాసం ఉంటాడు. జకాత్ ఇస్తాడు, హజ్ చేస్తాడు, అల్లాహ్ మార్గంవైపు పిలుస్తాడు.**

**అల్లాహ్ మార్గం వైపు పిలవడం ప్రతీ ముస్లిమ్ యొక్క బాధ్యత. కూలిపని చేసుకునే వ్యక్తికి 'ఇస్లామ్' గురించి తెలిస్తే, తన తోటి పనివారికి అతను తెలియజేస్తాడు. విద్యార్థికి తెలిస్తే తోటి విద్యార్థులకు తెలియజేస్తాడు. వ్యాపారికి తెలిస్తే తన కస్టమర్లకు తెలియజేస్తాడు. కాబట్టి ముస్లిమ్ సమాజంలోని ప్రతి ఒక్కరికి ఇస్లామ్ గురించి ప్రాథమిక జ్ఞానం కావాలి.**

**శాంతిబాట ప్రయత్నం అదే. అల్లాహ్ పేరుతో మీరు కూడా మాకు మద్దతు నివ్వండి. 'శాంతిబాట'ను అందరికీ అందించండి.**




సల్లల్లాహు అలైహి వసల్లమ్ (అల్లాహ్ నుండి మీపై శుభాశీస్సులు మరియు శాంతి కలుగుగాక!)

## సకల లోకాలకు కారుణ్యం (రహమతల్లిల్ ఆలమీన్)

**2**

### చరిత్రలో అరబ్బులకు సముచిత స్థానం లేదు

అరేబియాలో ఇస్లామ్ ఆవిర్భావానికి ముందు అరబ్బుల గురించి మరియు వారి సంస్కృతి గురించి చారిత్రక అధ్యయనాల్లో చేసిన ప్రస్తావన కేవలం నామమాత్రమే! వారి రాజకీయ మరియు న్యాయ వ్యవస్థ గజిబిజి గందరగోళంగా ఉండేది. వీరి స్థితిగతులు బాగున్న కాలంలో కూడా, వీరి పరిస్థితి ఎలా ఉండేదంటే, పర్షియన్ లేదా రోమన్ సామ్రాజ్యంలోని క్రింది స్థాయి వ్యక్తుల స్థితిగతులకంటే కూడా చాలా తక్కువగా ఉండేది. ఆ కాలంలోని అభివృద్ధి చెందిన జాతులతో పోలిస్తే, అరబ్బులు బాగా వెనుకబడినవారు.

### విగ్రహారాధన

తమ తాతముత్తాతలు ఏ మతాచారాలనయితే అనుసరించారో, వాటినే గుడ్డిగా పాటిస్తూ, వాటిని కీర్తించేవారు. వారికి వారి విగ్రహాలపై చాలా విశ్వాసం ఉండేది. ప్రతీ తెగకు ప్రత్యేకంగా స్వంతంగా ఓ విగ్రహం ఉండేది. ఉదాహరణకు : హుదైల్ ఇబ్న్ ముద్రిఖహ్ 'సువా'ని పూజించేవారు. 2. కల్బ్ తెగ - 'వద్ద్'ను 3. ముదజ్ తెగ 'యాగూత్'ను 4. ఖయావాన్ తెగ య'ఊఖ్‌ను 5. హిమ్యార్ తెగ 'నస్ర్'ను 6. ఖుజా' మరియు ఖురైష్ తెగలు రెండూ 'ఇసాఫ్' మరియు 'నాఇలాహ్'లను ఆరాధించేవారు. సముద్ర ఒడ్డున 'మనాత్' దేవతా విగ్రహం ఉండేది. ఈ దేవతా విగ్రహాన్ని సాధారణంగా అన్ని అరబ్ తెగలు ఆరాధించినా, ఔస్ మరియు ఖజ్‌రజ్ తెగలవారు ప్రత్యేకంగా ఆరాధించేవారు. తఖీఫ్‌లో అల్-లాత్ అనే విగ్రహం మరియు అల్-ఉజ్జా అనేది ధాత్ ఆరిఖ్‌పైన ఉండేది. ఈ చివరి రెండు విగ్రహాలను గొప్ప విగ్రహాలుగా 'ఖురైష్'లు భావించేవారు.

ఈ ముఖ్యమైన విగ్రహాలనే కాకుండా, అరబ్బులు అసంఖ్యాకమైన చిన్న చిన్న విగ్రహాలను కూడా పూజించేవారు. ఈ చిన్న చిన్న విగ్రహాలను ప్రయాణాల్లో తమతోపాటు తీసుకెళ్ళేవారు. ఇక ఇళ్ళల్లో ఉండే విగ్రహాలు ఎలాగూ ఉంటాయి.

సహీహ్ బుఖారీ హదీస్ గ్రంథంలో అబూ రజా' అల్-ఉతారిదీ వారి ఉల్లేఖనం ఉంది. "మేము రాళ్ళను పూజించేవాళ్ళము. మరియు మొదటి దానికంటే ఉత్తమంగా ఉండే రాయి మాకు దొరికినప్పుడు, మొదటి దానిని మేము విసిరేసి, తరువాత దానిని స్వీకరించేవాళ్ళము. కాని ఏ రాయి కూడా దొరకకపోతే, కొంత భూమిని (మట్టిని) సేకరించి ఓ గొఱ్ఱెను తీసుకొచ్చి దాని పాలను ఆ మన్నుపై పిండేవారము. మరియు దాని చుట్టూ ప్రదక్షిణ చేసేవారము. రజబ్ నెల వచ్చినప్పుడు, మేము (సైనిక వ్యవహారాలను ఆపేసి), ఈ నెలను ఇనుమును తొలగించే దానిగా పిలుచుకునేవాళ్ళము. ఈటెల (బళ్ళాలు)కు మరియు బాణాలకు ఉండే ఇనుప భాగాలను తొలగించి రజబ్ నెలలో విసిరేసే వాళ్ళము.

**(సహీహ్ బుఖారీ, 4376, పుస్తకం 64, అధ్యా. 71, సంపుటి 5)**

పై హదీస్ ద్వారా మట్టినో లేక రాతినో కొలిచేవారని తెలుస్తుంది.

ఈ బహుదైవారాధన వలన అరబ్బులు 'అల్లాహ్'గురించి అర్థం చేసుకోలేకపోయారు. వారు ఏమని భావించేవారంటే ఈ విగ్రహాలు తమకు మరియు అల్లాహ్‌కు మధ్యవర్తులని. వీరికి అల్లాహ్ యొక్క ఘనత తెలియదని కాదు. వీరికి అల్లాహ్ సర్వశక్తిమంతుడని తెలుసు. కాని ఈ విగ్రహారాధన వారి హృదయాలను కప్పివేసింది. అయితే తీవ్రమైన కష్టాలెదురైతే మాత్రం వారు అల్లాహ్‌కే మొరపెట్టుకున్నారనే విషయం ముహమ్మద్(స)వారి జననానికి కొన్ని రోజుల ముందు జరిగిన సంఘటన తెలియజేస్తుంది. ఇన్షాఅల్లాహ్ ఈ విషయాన్ని రాబోయే సంచికలో అందిస్తాము.

మక్కాలో తొలిరోజుల్లో ఇబ్రాహీమ్(అ)వారి ధర్మమే (ఇస్లాం) ఆచరణలో ఉండేది. ఆ ధర్మానికి సంబంధించి కొన్ని అవశేషాలు మిగిలిఉన్నప్పటికీ, అవి కూడా చాలా వరకూ రూపాంతరం చెందాయి. 'మక్కా'కు అరబ్‌లు యాత్రలు చేసేవారు. నిజమే! కాని ఆ యాత్రల్లో ధర్మపరాయణత కనిపించదు. పరస్పరం వారి వారి ప్రాపంచిక ఘనతలను పొగుడు కోవడానికే ఆ యాత్రలను ఉపయోగించు కునేవారని తెలుస్తుంది. ఇబ్రాహీమ్(అ)వారి ధర్మంలో ఎన్నింటినో కల్పించి, చివరికి ఆ ధర్మానికి పూర్తి వ్యతిరేకమైన పద్ధతులను కల్పించారు.

అజ్ఞానం మరియు బహుదైవారాధన అంతగా వ్యాపించి ఉన్నప్పటికీ,

వారిలో కొందరు విశిష్ఠ వ్యక్తులున్నారు. వారి సంఖ్య చాలా తక్కువే అయినప్పటికీ, వారు విగ్రహాలను ఆరాధించరు. కేవలం అల్లాహ్‌నే ఆరాధిస్తారు. వారు 'హునఫా'గా పరిచయం కాబడ్డారు. ఇది హనీఫ్ పదానికి బహువచన పదం. ఏకదైవారాధన చేసేవానిని హనీఫ్ అంటారు. వీరు ఇబ్రాహీమ్(అ)వారి ధర్మాన్ని (ఇస్లామ్) అనుసరించేవారు.

**"ఇబ్రాహీమ్ యూదుడూ కాడు మరియు క్రైస్తవుడూ కాడు! కాని అతను ఏకదైవ సిద్ధాంతంపై ఉన్నవాడు (హనీఫ్), ముస్లిమ్ (అల్లాహ్‌కు విధేయుడు) మరియు అతడు ఏ మాత్రం (అల్లాహ్‌కు) సాటి కల్పించేవాడు కాడు"** (ఖుర్ఆన్ 3:67)

అటువంటి 'హనీఫ్'లలో ఒకరు జైద్ ఇబ్న్ అమ్ర్ ఇబ్న్ నుఫైల్. ఈయన విగ్రహాలను ఆరాధించేవారు కాదు. అల్లాహ్ పేరుతో జిబహ్ చేయని జంతువులను, నిషేధం కాబడిన రక్తాన్నిగాని, సహజంగా చనిపోయిన జంతువుల మాంసాన్నిగాని స్వీకరించేవారు కాదు. మరొకాయన ఖిస్స్ ఇబ్న్ సాఇదా అల్-ఇయాదీ.

కొంతమంది అరబ్బులు క్రైస్తవులగానూ, మరికొందరు యూదులగానూ మారిపోయారు. అయితే వారి సంఖ్య అరేబియా ద్వీపకల్పంలో చాలా తక్కువగా ఉండేది. ఇస్లామ్ తిరిగి ఆచరణలో కొచ్చేవరకూ అరబ్బులలో అధిక సంఖ్యాకులు విగ్రహారాధకులే!

## వివిధ తెగలు మరియు ఆనాటి రాజకీయ పరిస్థితులు

అరేబియా ద్వీపకల్పంలో రెండు రకాల ప్రజలు నివశించేవారు. 1. సంచార ఎడారివాసులు మరియు 2. పట్టణాలలో నివశించేవారు.

తెగ నియమాలు మరియు ఆచారాలు అరేబియా అంతా వ్యాపించి ఉండేవి. ఆ ప్రాంతంలోని బాగా నాగరిక రాజరికాలైన యమన్ సామ్రాజ్యం, అల్-హీరా సామ్రాజ్యం మరియు అల్-ఘసాసినహ్‌లలో కూడా ఇటువంటి ఆచారాలుండేవి.

ఇక్కడ తెగ అంటే ఓ వర్గపు ప్రజలు. వీరిలో ఒకరితో ఒకరికి రక్తసంబంధముంటుంది. వీరికి కొన్ని నియమాలు ఆచారాలు ఉంటాయి. అలాగే తెగలోనివారిపై ప్రతీ ఒక్కరికి తప్పనిసరి హక్కులు మరియు కొన్ని ప్రత్యేక హక్కులు ఉంటాయి.

ఉదాహరణకు తెగనాయకుడు తన ప్రజలపై చాలా హక్కులను కలిగి ఉంటాడు. అలాగే వారికికూడా ఆ నాయకునిపై హక్కులు ఉంటాయి. తెగ నాయకుని ఎన్నిక చాలా లక్షణాలపై ఆధారపడి ఉంటుంది. అతని స్థాయి, దయాగుణం, శీలం, ధైర్యం మొదలైన లక్షణాలను బట్టి నాయకునిగా ఎన్నుకుంటారు. తెగ నాయకునికి తెగలోని వారందరూ కట్టుబడి ఉంటారు. అతనిని గౌరవిస్తారు. అతనికి విధేయత చూపుతారు.

**ఒకవేళ తెగనాయకుడు ఒక ధర్మాన్ని స్వీకరిస్తే ఆ తెగ ప్రజలందరూ ఆ ధర్మాన్ని స్వీకరిస్తారు. ఇస్లామ్ వ్యాప్తి గురించి ముహమ్మద్(స)వారి శీలం గురించి అర్థం కావాలంటే ఈ ముఖ్య విషయం తప్పనిసరిగా తెలుసుకోవాలి.**

ఒకవేళ ఏదైనా తగువు వస్తే, తెగ నాయకుడు ఇచ్చిన తీర్పుకు తిరుగుండదు. నాయకుని ఆజ్ఞను అందరూ శిరసావహిస్తారు. అంతేకాకుండా ఈ నాయకునికి ప్రత్యేక హక్కులు కూడా ఉంటాయి. యుద్ధంలో జయించిన తరువాత లభ్యమయ్యే సొత్తులో 4వ వంతు అతనికే చెందుతుంది. యుద్ధసొత్తును పంచడానికి ముందుగానే, వాటిలో ప్రత్యేకంగా తనకు కావలిసినవి అతను ఎన్నుకోవచ్చు. యుద్ధానికి ముందుగానే ఏవైతే శతృవునుండి తీసుకున్నాడో, అవి అతనికే స్వంతం. అంతేకాకుండా యుద్ధప్రాప్తిలో ఏవైనా వస్తువులు పంచడం సాధ్యంకాక మిగిలిపోతే, అవి కూడా అతనికే చెందుతాయి.

అయితే ఈ హక్కులు సులభంగా నాయకునికి రాలేదు. అతని బాధ్యతలు కూడా ఆ హక్కుల స్థాయిలోనే ఉంటాయి.

శాంతియుత వాతావరణం నెలకొని ఉన్న కాలంలో, అతను తన తోటి తెగవారిపట్ల చాలా దయగా ఉండవలసి ఉంది. యుద్ధం విషయానికొస్తే, ముందరి వరుసలో ఉండి యుద్ధం చేయవలసి ఉంటుంది. అంతేకాకుండా తన తెగప్రజల ప్రయోజనార్థం శాంతి ఒప్పందాలు చేసుకునే బాధ్యత కూడా నాయకునిపైనే ఉంటుంది.

ఈ విధమైన నియమాలు మరియు ఆచారాలతో, **తెగలోని సగటు వ్యక్తి స్వేచ్ఛగా బ్రతుకుతాడు**. తాను మరొకనికి హాని కలుగజేయనంత వరకూ ఎవరికీ సమాధానం చెప్పవలసిన అవసరం లేదు. అందువల్లనే **అరబ్బులు స్వేచ్ఛను ప్రేమిస్తారు. అన్యాయాన్నిగాని, బానిసత్వాన్నిగాని ద్వేషిస్తారు.**

ప్రపంచంలోని ప్రఖ్యాత సామ్రాజ్యాధినేతలు ఈ భూభాగాలను ఆక్రమించుకోక పోవడానికిగల కారణాలు, అరబ్బుల వెనుకబాటుతనం మరియు వారివి ఎడారి ప్రాంతాలు కావడం వలనని, అరబ్బులు మూర్ఖులు మరియు అనాగరికలని చెబుతారు గాని, వాస్తవానికి ఇవి కేవలం తమ అసమర్థతను కప్పిపుచ్చుకునే విషయాలుగా చెప్పుకోవాలి.

**అసలు వాస్తవమేమిటంటే పైన తెలిపినట్లు అరబ్బులు ఎవరికీ లోబడరు. చంపుతారు లేదా చస్తారు. అందువలన వీరిని లొంగ దీసుకోవడం అంత సామాన్యమైన పనికాదు. అరబ్బులు కేవలం కొన్ని విషయాలలోనే మూర్ఖులు. ఆ మూర్ఖత్వం కూడా కొంతవరకూ తమ తాత ముత్తాతల కాలం నుండి అమలులోనున్న ఆచారాల వలన వచ్చి ఉంటే, మరికొన్ని మూర్ఖపు పనులు వెనుక ముఖ్యమైన (వారి దృష్టిలో బలమైన) కారణాలున్నాయి. ఆ విషయాలని నిష్పక్షపాతంగా విశ్లేషించి చూడాలి.**

వాటిని తెలుసుకోకుండా వారిపై అభాండాలు వేయడం అన్యాయమే. ఆ విషయాల గురించి ఈ శీర్షికలోనే ఆయా సందర్భాలలో సవివరంగా చర్చిద్దాము, ఇన్షాఅల్లాహ్. మొత్తంగా చూస్తే ఆ కాలంలో కూడా ప్రపంచంలోని చాలా జాతులకంటే వీరు తక్కువేమీ కాదు.

కారణాలను సరియైన విధంగా విశ్లేషించి చూడకపోతే, వాస్తవాలు కూడా వక్రీకరించబడతాయి. చరిత్రలో అలా వక్రీకరించబడిన విషయాలెన్నో ఉన్నాయి.

తెగలోని ప్రతీ సభ్యుడూ, ఇతర సభ్యుల కోసం పోరాడతాడు. తమ తెగ గౌరవం కోసం ఎటువంటి త్యాగాలనయినా చేయగలరు. తెగ గౌరవం అంటే తెగలోని ప్రతీ సభ్యుడి యొక్క గౌరవంగా భావిస్తారు. **ఆ విధంగా తెగలోని ప్రతీ ఒక్కరికి గౌరవస్థానం ఉంటుంది.** అంతేగాకుండా అతి ముఖ్యమైన మరో విషయమేమిటంటే, ప్రతీవాడు తన తోటి తెగ సభ్యులలో ఎవరైనా తప్పు చేసినా లేక ఒప్పు చేసినా సరే, అతనికి తన పూర్తి మద్దతునిస్తాడు. ఈ విధంగా తెగలోని ప్రతీవ్యక్తినీ తెగ సభ్యుడిగానే బావిస్తారుగాని, అతనిని ఓ విడి వ్యక్తిగా వేరుగా చూడరు.

ప్రతీ తెగకు దానికంటూ ఓ స్థాయి మరియు రాజకీయ వాస్తవికత ఉంటుంది. పరిస్థితిని అధారంగా చేసుకుని ఇతర తెగలతో మైత్రీ బంధాలను ఏర్పరచుకుంటారు. అరబ్బులలో యుద్ధాలు సర్వ సామాన్యం. వారి చరిత్రలో ప్రఖ్యాత యుద్ధం - ఫిజార్ యుద్ధం. పెద్ద యుద్ధాలే కాకుండా, తెగల మధ్య చిన్న చిన్న గొడవలు, తగాదాలు సర్వసామాన్యం.

ఒక తెగలోని ఒక సభ్యుడు మరో తెగలోని సభ్యుడిపై తన వ్యక్తిగత విషయంలో (అంటే ప్రతీకారం తీర్చుకోవడం వంటి విషయంలో) దాడిచేస్తాడు. లేకపోతే ఒక తెగ మరో తెగపై సంపద కోసం దాడి చేస్తుంది. కొన్ని తెగలు వాటి జీవనం కోసం, ఇతర తెగలపై పడి బలంతో వారి సంపదను లాక్కుంటాయి. అలాంటి కనికరంలేని దాడులు జరిగినప్పుడు, ఇళ్లు మరియు గ్రామాలకు గ్రామాలే ఖాళీ అయిపోతాయి, ఒకప్పుడు అక్కడ ఎవ్వరూ లేరేమో అనిపించేలా.

## అరేబియా ద్వీపకల్పంలోని ఆర్థిక పరిస్థితి

ఈ భూభాగంలోని ఎక్కువభాగం ఎడారి భూమి కావడం వలన ఇక్కడ నివశించేవారికి వ్యవసాయం చేసే అవకాశం లేదు. ఎక్కడో ఈ భూభాగపు సరిహద్దుల్లో, ముఖ్యంగా చెప్పాలంటే ధక్షిణ ప్రాంతంలోని యమన్, ఉత్తర ప్రాంతంలోని సిరియా మరియు మధ్యభూభాగంలో అక్కడక్కడ వెదజల్లినట్టుండే కొన్ని ఒయాసిస్‌లలో మాత్రమే కొంత వృక్ష సంపద ఉంది. అందువల్లనే అధిక సంఖ్యాకులైన పట్టణ మరియు ఎడారివాసులు గొఱ్ఱెలు మరియు ఒంటెలనే జీవనాధారంగా చేసుకున్నారు.

పరిశ్రమలు స్థాపించడం ఉత్పత్తులను తయారు చేసే విషయంలో అరబ్బులు మిగతా జాతులకంటే బాగా వెనుకబడ్డారు. ఆ రంగాలలో పనిచేయడానికి వారికి ఇష్టం ఉండదుగాని, విదేశీయులుచేగాని లేదా బానిసల చేత అటువంటి పనులు చేయడానికి అనుమతించేవారు. కాబాను మరలా పునర్మించడానికి ఓ ఈజిప్టు దేశీయుని సహాయాన్ని కోరారు. అతని నౌక జెద్దా సమీపంలో సముద్రంలో మునిగిపోతే, దాని నుండి బ్రతికి బయటపడి మక్కాలోనే అతను స్థిరపడిపోయాడు.

అయితే ఇటువంటి రంగాలలో అరబ్బులు వెనుకబడినప్పటికీ, వ్యాపార రంగంలో మాత్రం వీరు బాగా అభివృద్ధి చెందారు. వీరి ప్రాంతం ఆఫ్రికా మరియు తూర్పు ఆశియా మధ్యనుండటం కూడా వీరి వ్యాపారాభివృద్ధికి కలిసొచ్చింది.

అరేబియా ద్వీపకల్పంలో అందరికంటే బాగా వ్యాపారంలో రాణించిన అరబ్ తెగ 'ఖురైషీ తెగ'. వీరికి మిగతా తెగలకి మధ్య ఉండే తేడా ఏమిటంటే, ఖురైషీయులు - అరబ్బులందరూ పవిత్రంగా భావించే మక్కా పట్టణానికి చెందినవారు కావడంతో ఖురైషీయుల వర్తక బిడారులపై మార్గమధ్యంలో ఎవ్వరూ దాడి చేయడానికి ధైర్యం చేసేవారు కాదు. మిగతా తెగల యొక్క వర్తక బిడారాలు దారి మధ్యలో బందిపోటు దొంగల బారిన పడేవి.

ఇది మనకు పరోక్షంగా మరో విషయాన్ని తెలియజేస్తుంది. అరేబియాలో దొంగలకి కూడా దైవభీతి ఉంది. మనం పేపర్లలో చదువుతుంటాము - ఫలానా దేవాలయంలో దొంగలు పడి నగలు దోచుకెళ్ళారని. అరేబియాలో కాబాలో దొంగతనం చేయకపోవడమే కాకుండా, దానికి ధర్మకర్తలైన ఖురైషీ తెగవారిని కూడా దోచుకోక పోవడమంటే, ఆ దొంగలు సన్మార్గంలో లేకపోయినా సరే, దైవభీతిని కలిగి ఉండేవారని స్పష్టమౌతుంది.

ఇది నిజంగా ఖురైషీయులకు గొప్ప వరమే! ఇదే విషయాన్ని అల్లాహుతాలా ఖుర్ఆన్‌లో గుర్తు చేస్తున్నారు.

> "ఏమీ వారికి తెలియదా? నిశ్చయంగా మేము 'హరమ్(మక్కా)ను ఒక శాంతి నిలయంగా నెలకొల్పామని! మరియు వారి చుట్టు ప్రక్కల ఉన్న ప్రజలు వారి నుండి లాక్కోబడుతున్నారని? అయినా వారు అసత్యాన్ని నమ్మి, అల్లాహ్ అనుగ్రహాన్ని తిరస్కరిస్తారా? **(ఖుర్'ఆన్ 29:67)**

ఖురైషీయులు సంవత్సరంలో రెండు పెద్ద వర్తకబిడారాలు తీసుకు వెళతారు. చలికాలంలో ఒక వర్తక బిడారం యమన్ వెళితే, రెండవది వేసవికాలంలో అష్-షామ్ (సిరియా మరియు చుట్టుప్రక్కల ప్రాంతాలకు) బయలుదేరుతుంది. వారి బిడారులు క్షేమంగా చేరుకునేవి. కాని మిగిలిన తెగలవి మాత్రం దాడికి మరియు దోపిడీకి ఎక్కువ గురౌవుతూ ఉండేవి.

> (అల్లాహ్ రక్షణ మరియు ఆయన కరుణతో) ఖురైషులు (ప్రయాణాలకు) అలవాటు పడ్డారు. (అల్లాహ్ కరుణ మరియు ఆయన రక్షణతో) వారు శీతాకాలపు మరియు వేసవి కాలపు ప్రయాణాలు చేయ గలుగుతున్నారు. కావున వారు ఈ ఆలయ(కాబా) ప్రభువు (అల్లాహ్‌ను) మాత్రమే ఆరాధించాలి! వారు ఆకలితో ఉన్నప్పుడు ఆయనే వారికి ఆహారం ఇచ్చాడు మరియు ఆయనే వారిని (ప్రమాదం) నుండి కాపాడాడు. **(ఖుర్'ఆన్ 106:1-4)**

అరేబియా ద్వీపకల్పంలో లభించే అత్తరు(సెంట్), సుగంధద్రవ్యాలు, మసాలా దినుసులు, ఖర్జూరాలు, ఏనుగు దంతాలు, పూసలు, చర్మాలు, పట్టువస్త్రాలు మరియు ఆయుధాలు మొ॥న అన్నిరకాల వ్యాపార వస్తువులతో వర్తక బిడారులు బయలుదేరేవి. కొన్ని వ్యాపార వస్తువులు అరేబియా ద్వీపకల్పంలోనే ఉత్పత్తి అయినవి అయితే, మరికొన్ని

ప్రక్కదేశాల నుండి దిగుమతి చేసుకున్నవి. ఈ వ్యాపార వస్తువులను అమ్మిన తరువాత తిరుగు ప్రయాణంలో గోధుమలు, ధాన్యాలు, ఎండుద్రాక్ష, నూనెలు మరియు వస్త్రాలను తీసుకు వచ్చేవారు.

ఇక యమన్ దేశీయులైతే నేల మార్గంపైనే కాకుండా, సముద్ర మార్గం ద్వారా కూడా ఆఫ్రికా, ఇండియా, ఇండోనేషియా, సుమత్ర మొ॥న దేశాలతో వ్యాపార లావాదేవీలు కొనసాగించేవారు.

ఇస్లామ్ ఇక్కడ తిరిగి ఆవిర్భవించక ముందు వడ్డీ వ్యాపారం కూడా పెద్ద స్థాయిలో జరిగేది. బహుశా ఈ వ్యాపారం యూదులనుండి అరబ్బులకు పాకి ఉంటుంది. కొన్నింటిలో, ఈ వడ్డీ రేట్లు చాలా ఎక్కువగా అంటే 100 రు॥ల అసలుకు 100 రు॥లు వడ్డీ ఉండేది.

**అరేబియా ద్వీపకల్పంలోని ముఖ్యమైన వ్యాపార కేంద్రాలు** : ఉకాజ్, మజిన్నహ్, జుల్-మజాజ్ కొందరు చరిత్రకారుల ప్రకారం జిల్-ఖిదా నెల ప్రారంభంలో ఉకాజ్ దగ్గర సమావేశం అవుతారు. 20 రోజుల తరువాత మజిన్నాకు వెళతారు. ఆ తరువాత మిగతా ప్రాంతాలకి వెళతారు. 'అరఫాత్'కు యాత్రకు బయలుదేరుతారు. ఇస్లామ్ ఆవిర్భవించేవరకు అరఫాత్‌లో లేదా మినాలో ఎటువంటి వ్యాపారాన్ని చేసేవారు కాదు. ఆ రోజుల్లో కూడా వ్యాపారం చేసుకోవచ్చని అల్లాహ్ వారికి అనుమతి నిచ్చారు.

"(హజ్జ్ యాత్రలో) మీరు మీ ప్రభువు అనుగ్రహాలు* అన్వేషిస్తే అందులో దోషం లేదు. అరఫాత్ నుండి బయలుదేరిన తరువాత మష్'అరిల్ హరమ్(ముజ్‌దలిఫా) వద్ద (ఆగి) అల్లాహ్‌ను స్మరించండి. మరియు ఆయన మీకు బోధించిన విధంగా ఆయనను స్మరించండి, వాస్తవానికి మీరు పూర్వం మార్గ భ్రష్టులుగా ఉండేవారు" **(ఖుర్'ఆన్ 2:198)**

(***అనుగ్రహాలు** అంటే 'హజ్జ్' యాత్రలో వ్యాపారం మొదలైనవి చేయటం ధర్మ సమ్మతమే)

**అరబ్ సమాజం :**

ఎన్నో ఆదిమ సంస్కృతుల వలే, ఆచారాలు మరియు సంప్రదాయాలనేవి ఒక తరం నుండి మరో తరానికి అందాయి. ఇస్లామ్ తిరిగి ఆవిర్భవించడానికి ముందు అరబ్ సమాజపు వాస్తవాలు కొన్నింటిని ఇక్కడ చెప్పుకుందాం:

**1. వంశప్రతిష్ఠల విషయంలోగాని, వారి సమాజ స్థాయి గురించిగాని గర్వంగా చెప్పుకునే విషయంలో వారికి ఓ హద్దు అంటూ ఉండేది కాదు.** వారి స్వచ్ఛమైన రక్తాన్ని కాపాడుకునేందుకు ఇతర తెగలతో వివాహాలు చేసుకునేవారు కాదు. ఇస్లామ్ **ఇటువంటి భావనలకు ముగింపు పలికింది.** అరబ్బులకు ఇస్లామ్ స్పష్టంగా తెలిపింది ఏమిటంటే, ఉన్నత స్థితి అనేది ఒక వ్యక్తికి ఉండే ధర్మపరాయణత మరియు మంచి ఆచరణలపై ఆధారపడి ఉంటుందని, అంతేగాని వారి పుట్టుకమీద ఆధారపడి ఉండదని.

**2. వాగ్ధాటితో మాట్లాడటానికి మరియు భాషయొక్క స్వచ్ఛతకు ఎక్కువ విలువ ఇచ్చేవారు.**

తమ పూర్వీకుల ఘన చరిత్రను సుందరమైన పద్యాల రూపంలో వారి మదిలో నిక్షిప్తం చేసుకునేవారు. అరబ్ సమాజం ఎందరో కవులను, వక్తలను అందించింది అనడంలో ఆశ్చర్యపడవలసిన అవసరం లేదు. ఓ తెగ యొక్క స్థాయి పెరగడం లేక తగ్గడమనేది కూడా కేవలం పద్యంలోని ఓ వాక్యమే నిర్ణయించగలదు అంటే వారి సమాజంలో పద్యాలకు ఎటువంటి స్థానముందో అర్థమౌతుంది.

**3. స్త్రీలను వ్యాపార వస్తువులుగా పరిగణించేవారు** : చాలా తెగలలో స్త్రీలను వ్యాపార వస్తువులతో సమానంగా పరిగణించేవారు. అంతే కాకుండా, వారసత్వం సంపదగా వారిని స్వీకరించేవారు.

ఒక వేళ ఓ వ్యక్తి చనిపోతే, అతని భార్య ఆ వ్యక్తి పెద్దకొడుకుకు అప్పగించబడుతుంది. ఒకవేళ ఆ స్త్రీ గనుక ఆ అబ్బాయి స్వంత తల్లికాకుండా, సవతి తల్లి అయితే, ఆ వ్యక్తి పెద్దకొడుకుకు ఆమెను వివాహం చేసుకునే హక్కు ఉంది లేదా ఆమె మరో వివాహం చేసుకోకుండా అతను నిరోధించగలడు.

తన తండ్రి భార్యను వివాహం చేసుకోవడం ఖుర్'ఆన్ నిషేధించే వరకూ ఆ దురాచారమే కొనసాగింది.

"మీ తండ్రులు వివాహమాడిన స్త్రీలను మీరు వివాహమాడకండి. ఇంతకు పూర్వం జరిగిందేదో జరిగిపోయింది. నిశ్చయంగా, ఇది అసభ్యకరమైనది (సిగ్గుమాలినది), జుగుప్సాకరమైనది మరియు చెడు మార్గము" **(ఖుర్'ఆన్ 4:22)**

ఇటువంటి కొన్ని లైంగికపరమైన దురాచారాలు తప్ప, అరబ్బులు కనీసం రక్తసంబంధీకులైన దగ్గరి బంధువులతో కొన్ని రకాల వివాహాలను నిషేధించుకున్నారు. అవి : తన తల్లితోగాని, కూతురుతోగాని, బామ్మతో గాని, చెల్లెలుతోగాని లేదా పిన్నమ్మతోగాని లేదా మేనత్తతోగాని జరిగే వివాహాలు నిషేధించుకున్నారు.

ఇతర విధాలుగా కూడా స్త్రీలు అణిచివేతకు గురయ్యేవారు. ఉదాహరణకు ఎవరైనా వ్యక్తి మరణిస్తే అతని ఐశ్వర్యం స్త్రీలకు చెందేది కాదు, వారి సంతానికి కూడా చెందేది కాదు. ఆ ఐశ్వర్యమంతా, యుద్ధం చేయగలిగి తన తెగను కాపాడే వారికి చెందేది.

భార్యకు వారసత్వ హక్కులేదని చట్టమేమీ లేకపోయినా, తరచుగా చట్టానికంటే ఆచారమే నెగ్గేది.

ఈ విషయంలో ఇస్లామ్ ఆవిర్భవించాక, ఆస్ ఇబ్న్ తాబిత్(రజి) మరణంతో ఆ ఆచారం పూర్తిగా మారిపోయింది.

ఆస్(రజి) మరణించేటప్పటికి ఆయనకు ఇద్దరు కళ్ళులేని కుమార్తెలు, చిన్నవాడైన కుమారుడు ఉన్నారు. అతని ఇద్దరి మేనళ్ళుల్లు వచ్చి అతని మొత్తం సంపదను స్వాధీనం చేసుకున్నారు. ఆస్(రజి)వారి భార్య వారిని బ్రతిమిలాడారు, ఆస్(రజి)వారి కుమార్తెలనిద్దరినీ వివాహం చేసుకోమని సలహా ఇచ్చారు. ఆ విధంగానైనా వారి తండ్రి సంపాదించిన దానితో కొంతైనా పిల్లలు ప్రయోజనం పొందుతారని.

ముఖ్యంగా ఆడపిల్లలిద్దరికీ కళ్ళు లేకపోవడం వలన, వారిని వివాహం చేసుకోవడానికి నిరాకరించారు.

ఆస్(రజి)వారి భార్య అల్లాహ్ యొక్క సందేశహరులు(స)వారి దగ్గరకు వెళ్ళి చెప్పింది, "ఓ రసూలుల్లాహ్! ఆస్ చనిపోయారు, ఇద్దరు కుమార్తెలను, ఓ కుమారున్ని వదిలి. అతని ఇద్దరు మేనళ్ళుల్లు, సువైద్ మరియు అరఫతహ్ వచ్చి ఆయన మొత్తం సంపదను కైవసం చేసుకున్నారు. 'అతని ఇద్దరు కుమార్తెలను వివాహం చేసుకోమని వారికి చెప్పాను. కాని వారు నిరాకరించారు".

ముహమ్మద్(స)వారు ఆ ఇద్దరి మేనళ్ళుల్లను ఆదేశిస్తూ చెప్పారు, "ఆ సంపద నుండి ఏదీ కూడా కదపకండి". ఆ తరువాత క్రింది ఆయత్ అవతరించింది.

"పురుషులకు వారి తల్లిదండ్రులు మరియు దగ్గరి బంధువులు విడిచిపోయిన దానిలో భాగం ఉంది మరియు స్త్రీలకు కూడా వారి తల్లిదండ్రులు మరియు దగ్గరి బంధువులు విడిచిపోయిన దానిలో భాగం ఉంది, అది తక్కువైనా సరే లేదా ఎక్కువైనా సరే, అది (అల్లాహ్) విధిగా నియమించిన భాగం" **(ఖుర్'ఆన్ 4:7)**

మహిళలను చులకన చేయడమే కాకుండా తమ కుమార్తెలను కూడా చాలా తక్కువగా చూసేవారు. ఒక సగటు అరబ్ మనస్సులో, కుమార్తె వలన ఎటువంటి ఉపయోగం లేకపోగా చాలా పెద్ద సమస్యలు తెస్తుందని భావించేవారు. కుమార్తె యుద్ధం చేయలేదు మరియు తన వంశాన్ని గాని తెగనుగాని రక్షించుకోలేదు. పురుషులు సంపాదించినట్లు ఆమె సంపాదించలేదు.

ఒకవేళ యుద్ధంలో ఆమె శతృవులకు దొరికిపోతే, ఆమెను వశపరచు కున్నవారు ఆమెను బానిసగా చేసుకుని వారి లైంగిక సుఖం కోసం ఉపయోగించుకుంటారు. కొంతమందైతే ఆ స్త్రీలను వ్యభిచారం చేయమని బలవంత పెడతారు, నేటి సమాజంలో తార్పుడుగాళ్ళు (బ్రోకర్స్) చేసినట్లు.

బానిసగా చేసుకున్న ఆ స్త్రీతో వ్యభిచారం చేయించి, ఆవిధంగా ఆమె సంపాదించిన సొమ్మును యజమానులు తీసుకునేవారు. ఇవన్నీ దృష్టిలో పెట్టుకుని, ఏ వ్యక్తి అయినా తన భార్య ఆడబిడ్డను ప్రసవిస్తే చాలా విచారపడిపోయేవాడు, కృంగి పోయేవాడు.

ఈ వాస్తవాన్ని వర్ణిస్తూ, అల్లాహుతాలా ఖుర్'ఆన్‌లో ఇలా చెబుతున్నారు:

"మరియు వారిలో ఎవరికైనా బాలిక (పుట్టిందనే) శుభవార్త అందజేస్తే, అతని ముఖం నల్లబడిపోతుంది మరియు అతడు తన క్రోధావేశాన్ని అణచుకోవడానికి ప్రయత్నిస్తాడు. తనకు ఇవ్వబడిన శుభవార్తను (అతడు) దుర్వార్తగా భావించి, తన జాతివారి నుండి దాక్కుంటూ తిరుగుతాడు. అవమానాన్ని భరించి దానిని (బాలికను) ఉంచుకోవాలా? లేక, దానిని మట్టిలో పూడ్చివేయాలా? అని ఆలోచిస్తాడు. చూడండి! వారి నిర్ణయం ఎంత దారుణమైనదో!" **(ఖుర్'ఆన్ 16:58,59)**

చాలామంది తండ్రులు వారి అవమానాన్ని పాతిపెట్టడానికే నిర్ణయించుకునేవారు, అంటే భాషాపరంగా చెప్పాలంటే, వారి కుమార్తెలను బ్రతికుండగానే పాతిపెట్టేవారు. అల్లాహ్ చెప్పారు :

"మరియు సజీవంగా పాతిపెట్టబడిన బాలిక ప్రశ్నించబడినప్పుడు, ఏ అపరాధానికి తాను హత్యచేయబడిందని?" **(ఖుర్'ఆన్ 81:8,9)**

కొందరు తల్లిదండ్రులయితే, వారి సంతానాన్ని బ్రతికుండగానే పాతి పెట్టేవారు. ఎందుకంటే వారు పేదవారు మరియు వారిని పోషించడానికి సరిపోయినంత సంపద లేనందున భయపడేవారు. మరికొందరు పేదవారు కాకపోయినా సరే, భవిష్యత్తులో పేదవారు అయిపోతారేమోనని భయపడేవారు.

ఇస్లామ్ ఇటువంటి చెడు ఆచారాలను నిషేధించింది.

అల్లాహ్ చెబుతున్నారు :

"ఇలా అను : రండి మీ ప్రభువు మీకు నిషేధించి ఉన్న వాటిని మీకు వినిపిస్తాను. మీరు ఆయనకు ఎలాంటి సాటి (భాగస్వాములను) కల్పించకండి. మరియు తల్లిదండ్రులతో మంచిగా ప్రవర్తించండి. మరియు పేదరికానికి భయపడి మీ సంతానాన్ని చంపకండి. మేమే మీకూ మరియు వారికి కూడా జీవనోపాధిని ఇచ్చేవారము. మరియు బహిరంగంగా గానీ లేదా దొంగచాటుగా గానీ అశ్లీలమైన పనులను సమీపించకండి. అల్లాహ్ నిషేధించిన ప్రాణిని, న్యాయం కొరకు తప్ప చంపకండి. మీరు అర్థం చేసుకోవాలని, ఈ విషయాలను ఆయన మీకు ఆజ్ఞాపిస్తున్నాడు. **(ఖుర్'ఆన్ 6:151)**

మరియు అల్లాహ్ ఇలా చెబుతున్నారు :

"మరియు పేదరికానికి భయపడి మీరు మీ సంతానాన్ని చంపకండి. మేమే వారికీ మరియు మీకు కూడా జీవనోపాధిని సమకూర్చేవారము. నిశ్చయంగా, వారిని చంపటం గొప్ప నేరం" **(ఖుర్'ఆన్ 17:31)**

ఇటువంటి పద్ధతులు అసాధారణమేమీ కాకపోయినప్పటికీ, కొన్ని తెగలున్నాయి వారు శిశుహత్య చేయరు. ఖురైషీయులలో సైతం కొందరు వ్యక్తులు పిల్లలను బ్రతికి ఉండగనే పాతిపెట్టే ఆచారాలను నిరసించేవారు. జైద్ బిన్ అమర్ బిన్ నుఫైల్ అటువంటి వ్యక్తికి ఓ ఉదాహరణ. తమ కుమార్తెలను చంపాలని ఉద్దేశ్యంగల తండ్రుల దగ్గరికి వెళ్ళి వారి కుమార్తెలను పోషిస్తానని చెప్పేవారు.

కొన్ని అరబ్ తెగలు స్త్రీలను గౌరవించేవి. వివాహం విషయంలో కూడా వారిని సంప్రదించేవారు. కొన్ని విషయాలలో మహిళల స్థాయి పెరిగేది. వారు ధైర్యవంతులే కాకుండా, తమ భర్తలతో పాటు యుద్ధ రంగానికి వెళ్ళేవారు. ఒకవేళ అవసరమైతే యుద్ధంలో కూడా పాల్గొనేవారు. పల్లెవాసి అయిన మహిళ తన భర్తకు సహకరించేది. మరియు వారి పశువుల పోషణను చూసుకునేది, నూలు వడకడంలోనూ, బట్టలు కుట్టడంలోనూ సహాయపడేది.

**4. వివాహాల వింత రూపాలు :** ఇప్పుడు ఆచరణలో ఉన్న వివాహం వలే కాకుండా ఎన్నో రకాల వింత వివాహాలు జరిగేవి. ఈ వింత వివాహాలన్నీ అజ్ఞానకాలంలో జరిగేవి. కాబట్టి వీటికి ఇస్లామ్‌కి సంబంధం లేదు.

అజ్ఞానకాలంలో అరబ్బులు చేసుకునే నాలుగు రకాల వివాహాల గురించి ఆయిషా(రజి)వారు ఉల్లేఖించారు.

ఒక రకం ప్రస్తుతకాలపు వివాహంవలే ఉంటుంది. అంటే ఓ వ్యక్తి వేరొకరిని తన సంరక్షణలో ఉన్న యువతి కొరకు అడుగుతాడు (వివాహం కొరకు) లేక అతని కుమార్తె కొరకు అడుగుతాడు మరియు ఆమెకు మహర్ ఇచ్చి తరువాత ఆమెను వివాహం చేసుకుంటాడు. రెండవ రకం ఓ వ్యక్తి తన భార్యతో ఆమె ఋతుస్రావం నుండి శుభ్రపడ్డాక చెబుతాడు, "ఫలానా వ్యక్తి దగ్గరికెళ్ళి అతనితో లైంగిక సంబంధం ఏర్పరచుకో". ఆమె భర్త ఆమెనుండి దూరంగా ఉంటాడు మరియు ఆమెను ముట్టుకోడు ఎవరితో అయితే ఆమె గడిపిందో ఆ ఇతర వ్యక్తి ద్వారా గర్భవతి అయ్యేవరకూ. ఆమె గర్భవతి అని స్పష్టమైనప్పుడు, అతనికి ఇష్టమైతే భర్త ఆమెతో గడుపుతాడు. బిడ్డ ఉన్నత వంశస్థుడు కావచ్చనే కోరికతో ఆమె భర్త అలా చేస్తాడు. అటువంటి వివాహాన్ని అల్-ఇస్తిబ్జా అని పిలుస్తారు.

మరో రకం వివాహం ఏమిటంటే పదిమందికి తక్కువకాకుండా ఓ సమూహం స్త్రీలతో లైంగిక సంబంధాన్ని ఏర్పరచుకుంటారు. ఆమె గర్భవతి అయితే మరియు బిడ్డను ప్రసవిస్తే, ప్రసవం తరువాత కొంత కాలం గడిచాక, వారందరికీ ఆమె కబురు పెడుతుంది మరియు వారిలో ఎవ్వరూ కూడా రావడానికి తిరస్కరించలేరు. వారంతా ఆమె ముందు సమీకరించబడ్డాక, వారితో ఆమె చెబుతుంది, "ఏమి జరిగిందో మీకు తెలుసు, మరియు ఇప్పుడు నేను ఒక బిడ్డను కన్నాను. కాబట్టి ఈ బిడ్డ నీది, ఓ ఫలానా ఫలానా!" ఆమె ఎవరినైతే ఇష్టపడుతుందో (అతనిని) పేరుతో పిలుస్తూ. మరియు ఆమె బిడ్డ అతనిని అనుసరిస్తుంది మరియు అతడు ఆ బిడ్డను స్వీకరించడకుండా ఉండడు.

నాలుగవ రకం వివాహమేమిటంటే చాలామంది, స్త్రీ ఇంటిలో ప్రవేశిస్తారు. మరియు ఆమె తన దగ్గరకు వచ్చిన ఏ ఒక్కరినీ తిరస్కరించదు. వారు వేశ్యలు. వారి ఇంటి ద్వారాల దగ్గర జెండాలను ఉంచుతారు సూచనలుగా. మరియు ఏ వ్యక్తి అయినా వారితో (వేశ్యలతో) లైంగిక సంబంధం ఏర్పరచుకోగలుగుతాడు. వారిలో ఏ ఒక్కరైనా గర్భవతి అయితే మరియు బిడ్డను ప్రసవిస్తే, ఆమె కొరకు ఆ పురుషులందరూ సమావేశమై, వారు ఖాఫహ్(బిడ్డకు మరియు తండ్రికి మధ్య పోలికను గుర్తించడంలో ప్రావీణ్యుడు)ని పిలుస్తారు. మరియు బిడ్డను ఆ వ్యక్తిని అనుసరింపజేస్తారు. ఆ బిడ్డను ఆమె అతనితో కలిపి ఉంచి, అతని కుమారునిగా పిలుస్తుంది. ఆ పురుషుడు ఆ తంతును తిరస్కరించలేడు.

కాని ముహమ్మద్(స)వారు సత్యంతో పంపబడినప్పుడు, అజ్ఞాన కాలంలో అమలులో ఉన్న అన్ని రకాల వివాహాలను రద్దుచేశారు, ప్రజలు ఈ రోజు గుర్తించిన వివాహాన్ని తప్ప." (సహీహ్ బుఖారీ, 5127, పుస్తకం 67, అధ్యా. 37, సంపుటి 7)

ఆయిషా(రజి)వారు ప్రస్తావించని కొన్ని వివాహాల గురించి విద్వాంసులు తెలియజేశారు.

**ఇతర వివాహాలు :** ఇస్లామ్ ప్రారంభకాలంలో కూడా న్యాయసమ్మతమైన 'ముతా' అనే వివాహం అమలులో ఉండేది. అయితే తరువాత ఇది ఇస్లామ్‌లో నిషేధించబడింది. ముతా వివాహం తాత్కాలికమైనది. అది నిర్ణయించుకున్న కొద్ది కాలంలో రద్దు అయిపోతుంది. అది ఒక నెల కావచ్చు. రెండు నెలలు కావచ్చు. సంవత్సరంగాని లేదా ఇరువైపుల వారు నిర్ణయించుకున్న ఓ కాలవ్యవధి వరకూ.

మరో రకమైన వివాహంలో వ్యాపార ధోరణి ఉంటుంది. అజ్ఞాన కాలంలో (ఇస్లామ్‌కి ముందరి కాలం), ఒకడు మరొకనితో చెబుతాడు, "నా కొరకు నీ భార్యను వదిలెయ్యి మరియు నీ కొరకు నా భార్యను వదిలేస్తాను మరియు నీకు ఎక్కువ ఇస్తాను".

మరో రకపు అబద్ధపు వివాహాన్ని నికాహ్ అష్-షిగార్ అంటారు. ముందుగా చేసుకున్న ఒప్పందం ప్రకారం, ఒకరు తన కుమార్తెను వేరొకరికి ఇచ్చి వివాహం చేస్తారు, దానికి షరతు ఏమిటంటే, దానికి బదులుగా రెండవ వ్యక్తి తన కుమార్తెను ఈ వ్యక్తికి ఇచ్చి వివాహం చేయాలి. ఈ లావాదేవిలో ఆ అమ్మాయిలకి మహర్ ఇవ్వడం జరుగదు.

అజ్ఞాన కాలంలో ఓ పురుషుడు ఓ స్త్రీని వివాహం చేసుకున్న తరువాత, ఆమె బ్రతికుండగానే ఆమె యొక్క సోదరిని కూడా వివాహం చేసుకునేవాడు. కాని ఇద్దరు అక్కాచెల్లెల్లు ఒక పురుషుని వివాహ బంధంలో ఏకకాలంలో ఉండకూడదు.

ఒక పురుషుడు ఎక్కువమంది భార్యలను కలిగిఉండడాన్ని న్యాయసమ్మతంగా భావించేవారు. దీనిని తమకు అనుకూలంగా తీసుకుని, చాలామంది భార్యలను కలిగి ఉండేవారు. దానికి ఓ హద్దు అంటూ ఏమీ లేదు. ఎంతమందినైనా వివాహం చేసుకోవచ్చు.

కాని ఇస్లామ్ తిరిగి ఆవిర్భవించాక, ఇస్లామ్ స్వీకరించిన వ్యక్తి నలుగురిని తప్ప మిగిలిన వారికి విడాకులు ఇవ్వవలసి వచ్చింది. ఆ మిగిలిన 4గురి విషయంలోకూడా, వారందరినీ న్యాయసమ్మతంగా చూసుకోగలిగితేనే. వారి హక్కులను కాపాడగలగాలి. లేకపోతే ఒక భార్య ఉండటమే ఉత్తమం.

ఇస్లామ్‌కి పూర్వం, భార్యల విషయంలో భర్తలు న్యాయంగా వ్యవహరించే వారు కాదు. స్త్రీలకు హక్కులుండేవి కావు.

ఇస్లామ్ మరలా ఆవిర్భవించిన తరువాత స్త్రీలకు న్యాయం జరిగింది. వారికి ప్రత్యేకమైన హక్కులు లభించాయి. వారిని దయతో చూడమని భర్తలను ఆదేశించడం జరిగింది.

**పైన తెలిపిన వివాహాలలో ఉన్న దురాచారాలన్నీ అజ్ఞాన కాలంలో జరిగినవి. ఇస్లామ్ వాటిని రూపుమాపింది. ఆ కాలంలో అరబ్బులు చేసుకునే వివాహాలను ఇస్లామ్‌కి ఆపాదిస్తూ మన రాష్ట్రంలో కొందరు ఉన్నత విద్యావేత్తలు ఆ వివాహాలను ముస్లిముల వివాహాలుగా పాఠ్యపుస్తకాలలో వ్రాసేసారు. వారికి చరిత్ర తెలియదు. ఇస్లామ్ అంటే ముస్లిమ్ అంటే అవగాహన లేదు.**

**ఇస్లామ్‌లో వివాహ వ్యవస్థ గురించి ఖుర్‌ఆన్ గ్రంథాన్ని చదివి తెలుసుకోవాలి. అరబ్బులు అందరూ ముస్లిములు కాదు. అరబ్బులలో ఇస్లామ్ స్వీకరించినవారే ముస్లిములు. కాబట్టి ఏ అరబ్ వ్యక్తి ఏ పనిచేసినా దానిని 'ఇస్లామ్'కి, 'ముస్లిమ్'కి ఆపాదించకూడదు.**

**5. పురుషుడు ఎన్నిసార్లైనా తన భార్యకి విడాకులు ఇచ్చేవాడు మరియు ఆమెను కావాలనుకున్నప్పుడు వివాహబంధంలోకి తెచ్చుకునేవాడు.**

పురుషుడు ఒకసారి భార్యకు విడాకులిచ్చి మరలా ఆమెను తిరిగి తెచ్చుకునేవాడు. మరలా విడాకులు ఇవ్వడం, మరలా తెచ్చుకోవడం జరిగేది. దీనికి అంతు ఏమీ ఉండేది కాదు. ఇస్లామ్ ప్రారంభ కాలంలో కూడా కొందరు దానిని అమలు చేసేవారు. కాని ఖుర్'ఆన్ ద్వారా అల్లాహ్ ఇలా ఆదేశించారు :

"విడాకులు రెండు సార్లే! ఆ తరువాత (భార్యను సహృదయంతో) తమ వద్ద ఉండనివ్వాలి లేదా ఆమెను మంచితనంతో సాగనంపాలి. మరియు సాగనంపేటప్పుడు మీరు వారికి ఇచ్చిన వాటినుండి ఏమైనా తిరిగి తీసుకోవడం ధర్మ సమ్మతం కాదు. అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేము అనే భయం ఆ ఇద్దరికీ ఉంటే తప్ప! కాని అల్లాహ్ విధించిన హద్దులకు కట్టుబడి ఉండలేమనే భయం ఆ దంపతులకు ఉంటే స్త్రీ పరిహారమిచ్చి (విడాకులు / ఖులా) తీసుకుంటే అందులో వారికి ఎలాంటి దోషం లేదు. అవి అల్లాహ్ విధించిన హద్దులు. కావున వీటిని అతిక్రమించకండి. మరియు ఎవరైతే అల్లాహ్ విధించిన హద్దులను అతిక్రమిస్తారో, అలాంటి వారే దుర్మార్గులు" (ఖుర్'ఆన్ 2:229)

ఎక్కువసార్లు భార్యకు విడాకులిచ్చే విషయంలో ఇస్లామ్ ఓ హద్దును ఏర్పరచింది. ఇస్లామ్‌లో, మొదటిసారి ఓ వ్యక్తి తన భార్యకు విడాకులిస్తే అతనికి కొంత కాల వ్యవధి ఉంది. ఈ లోపున అతను తన భార్యను వెనక్కి తీసుకోవచ్చు. ఆమెను వివాహబంధంలోకి వెనక్కి తీసుకున్న తరువాత, మరలా రెండవసారి విడాకులిస్తే, అతనికి మరలా కాలవ్యవధి ఉంది, ఆమెను వివాహబంధంలోకి వెనక్కి తీసుకోవచ్చు. రెండవసారి వివాహబంధంలోకి తెచ్చుకున్నాక, మరలా అతను విడాకులిస్తే, ఇక ఆ విడాకులు ఫైనల్. ఇక ఆమెను వెనక్కి వివాహ బంధంలోకి అతను తీసుకోలేడు.

ఆమెను వెనక్కి తీసుకోవాలంటే ఒకటే మార్గం. ఆమె మరొకరిని వివాహమాడాక, ఆమె భర్త విడాకులిస్తే, ఆ తరువాత ఆమెను చేసుకునే అవకాశముంది. అందుకని వేరొకరితో అబద్ధపు పెళ్ళి చేయించేసి, అతని చేత విడాకులిప్పించడం చేయకూడదు. ఆమెను వివాహం చేసుకునే వ్యక్తి ఆమెను మనస్ఫూర్తిగా వివాహం చేసుకోవాలి. అదే విధంగా అతని ఇష్టప్రకారమే విడాకులు ఇవ్వాలి.

వివాహం అంటే నాటకం కాదు కదా! ఓ స్త్రీ పురుష జంట కష్టసుఖాలలో కలిసి జీవించడం.

ఈ విషయంపై అల్లాహ్ ఖుర్'ఆన్‌లో ఇలా చెబుతున్నారు :

"ఒకవేళ అతడు (మూడవసారి) విడాకులిస్తే, ఆ తర్వాత ఆ స్త్రీ అతనికి ధర్మ సమ్మతం కాదు, ఆమె వివాహం వేరే పురుషునితో జరిగితే తప్ప! ఒకవేళ అతడు (రెండవ భర్త) ఆమెకు విడాకులిస్తే! అప్పుడు ఉభయులూ (మొదటి భర్త, ఈ స్త్రీ) తాము అల్లాహ్ హద్దులకు లోబడి ఉండగలమని భావిస్తే, వారు పునర్వివాహం చేసుకోవడంలో దోషం లేదు. మరియు ఇవి అల్లాహ్ నియమించిన హద్దులు. వీటిని ఆయన గ్రహించేవారికి స్పష్ట పరుస్తున్నాడు." (ఖుర్'ఆన్ 2:230)

విడాకులకు సంబంధించి మరో రకమైన ఆచారాన్ని కూడా ఇస్లామ్ నిషేధించింది. 'జిహార్' అనే ఆచారాన్ని నిషేధించింది. ఓ వ్యక్తి తన భార్యతో "నీవు నా తల్లి వీపును పోలి ఉన్నావు" (అంటే అతను తన తల్లితో ఉన్నట్లు, ఆ విధంగా అతను తన భార్యతో శారీరంగా కలవకుండా దూరంగా ఉంటాడు. ఇది ఓ రకమైన ఒట్టు (ప్రమాణం) వంటిది)". జిహార్‌ను ఓ చెడ్డమాటగా మరియు అబద్ధంగా వర్ణిస్తూ, అల్లాహ్, జిహార్ పదాలు చెప్పిన వ్యక్తికి ప్రాయశ్చిత్త శాసనం ద్వారా అతని ఒట్టునుండి అతను బయటపడటానికి ఓ మార్గం చూపారు.

మీలో ఎవరైతే తమ భార్యలను జిహార్ ద్వారా దూరంగా ఉంచుతారో! అలాంటి వారి భార్యలు, వారి తల్లులు కాలేరు. వారిని కన్నవారు మాత్రమే వారి తల్లులు. మరియు నిశ్చయంగా వారు అనుచితమైన మరియు అబద్ధమైన మాట పలుకుతున్నారు. మరియు నిశ్చయంగా అల్లాహ్ మన్నించేవాడు, క్షమాశీలుడు.

మరియు ఎవరైతే తమ భార్యలను 'జిహార్' ద్వారా దూరంచేసి తరువాత మాటను వారు ఉపసంహరించు కోదలిస్తే! వారిద్దరు ఒకరినొకరు తాకకముందు, ఒక బానిసను విడుదల చేయించాలి. ఈ విధంగా మీకు ఉపదేశమివ్వ బడుతోంది. మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్ ఎరుగును.

కాని ఎవడైతే ఇలా చేయలేడో, అతడు తన భార్యను తాకక ముందు, రెండు నెలలు వరుసగా ఉపవాసముండాలి. ఇది కూడా చేయలేనివాడు, అరవైమంది నిరుపేదలకు భోజనం పెట్టాలి. ఇదంతా మీరు అల్లాహ్‌ను మరియు ఆయన ప్రవక్తను దృఢంగా విశ్వసించడానికి, మరియు ఇవి అల్లాహ్ నిర్ణయించిన హద్దులు. మరియు సత్య తిరస్కారులకు బాధాకరమైన శిక్ష పడుతుంది." (ఖుర్'ఆన్ 58:2-4)

**6. యుద్ధాలు** : అరబ్బులకు యుద్ధం చేయడానికి మరియు రక్తపాతం సృష్టించడానికి ఓ ముఖ్యమైన కారణమేమీ అవసరం లేదు. అయితే ఒకొక్కసారి చిన్న విషయాలు కూడా యుద్ధాలు జరగడానికి కారణం అవుతాయి. తాము చేస్తుండే యుద్ధాల పద్ధతులను సమర్థించుకుంటారు. అవి బుద్ధిలేనివి మరియు నీతిబాహ్యామైనవి అయినాసరే అది వారికి పెద్ద విషయమేమీ కాదు. ఇస్లామ్‌కి ముందరి కాలంలో, అరబ్బులు యుద్ధాలను ప్రేమించే వ్యక్తులు. బహుశా అది వారు పెరిగిన వాతావరణం వల్ల కావచ్చు.

వారు యుద్ధాలను ప్రేమిస్తారని చెప్పటానికి రెండు ఉదాహరణలు. తగ్‌లిబ్ మరియు బక్ర్ తెగల మధ్య చాలా కాలంపాటు ఘోరయుద్ధం జరిగింది. ఆ యుద్ధం ఎలా మొదలైంది? బక్ర్ తెగకు చెందిన జర్మీ అనే వ్యక్తికి ఓ ఆడ ఒంటె ఉండేది. అతని పొరుగున బసూస్ బిన్తె మన్‌ఖజ్ అనే మహిళ ఉండేది. ఈమె జస్సాస్ ఇబ్నె ముర్రాకి పిన్నమ్మ/అత్త అవుతుంది.

తగ్‌లిబ్ తెగకు నాయకుడు కలీబ్. ఇతను తన ఒంటెలను ఓ ప్రత్యేకమైన చోట ఉంచేవాడు. ఓ రోజు జర్మీ యొక్క ఒంటె తప్పిపోయి చివరకు కలీబ్ ఒంటెల మందలో కలిసిపోయింది. కొత్త ఒంటెను చూడగానే, కలీబ్ బాణం వేసి దానిని చంపివేశాడు. జర్మీ మరియు అతని పొరుగున ఉన్న మహిళ, బసూస్ కోపోద్రిక్తులయ్యారు.

జస్సాస్‌కి జరిగింది తెలిసాక, కలీబ్ దగ్గరికి వెళ్ళి ఈ విషయంపై అతనితో మాట్లాడాలనే ఆలోచన ఏదీ పెట్టుకోలేదు. బహుశా అతనితో చర్చిస్తే, అతను చంపిన ఆ ఆడ ఒంటెకు పరిహారంగా కొంత పైకం ఇచ్చిఉండేవాడేమో! కాని ఈ జస్సాస్ వెళ్ళి కలీబ్‌ను చంపేశాడు.

ఇది జరిగాక కూడా, కలీబ్ తెగవారు అహింసాపూర్వకంగా దీనిని పరిష్కరించుకుందామని భావించలేదు. ఏమీ ఆలోచించకుండా బకర్ తెగపై దాడి చేశారు. రెండు తెగల మధ్య దాదాపు 40 సంవత్సరాల పాటు ఘోరయుద్ధం జరిగింది.

**ఈ యుద్ధం కేవలం ఓ ఆడ ఒంటెను చంపినందుకు మొదలైంది.**

ఇక రెండవ ఉదహరణ చూద్దాం!

ఇది అబాస్ మరియు దుబ్యాన్ తెగల మధ్య జరిగిన యుద్ధం. ఈ రెండు తెగల మధ్య యుద్ధం మొదలైన ఆ రోజును 'దాహిస్ మరియు అల్ గబ్రా రోజు'గా గుర్తుండిపోయింది.

ఆ రోజున దాహిస్ మరియు గబ్రా అని రెండు తెగలకు చెందిన గుఱ్ఱాల మధ్య పందెం మొదలైంది. దాహిస్ - ఖైస్ బిన్ జహీర్ యొక్క గుఱ్ఱం మరియు హుదైఫా బిన్ బద్ర్ యొక్క గుఱ్ఱం - అల్ గబ్రా.

ఈ హుదైఫా ఓ వ్యక్తిని లోయలో నిరీక్షించమని, ఒకవేళ దాయిస్ గనుక ముందుగా వస్తే ఏదో విధంగా ఆ గుఱ్ఱాన్ని అడ్డుకోమని చెప్పడం జరిగింది.

వాస్తవానికి దాహిస్ (గుఱ్ఱం) ముందుగా లోయలో ప్రవేశించింది. హుదైఫా యొక్క నమ్మినబంటు అది పరుగెడుతుండా కొట్టాడు. అది నదిలో పడిపోయింది. అందువలన అల్ - గబ్రా పందెంలో గెలిచింది.

కాని ఇందులో జరిగిన మోసం గురించి తెలియగానే గొడవ జరిగింది. ఆ గొడవలో కొంతమది చనిపోయారు. అక్కడితో ఆగిపోలేదు. హింసాత్మాక సంఘటనలు జరుగుతూనే ఉండేవి. చివరికి ఈ గొడవలు కాస్తా ఓ సంపూర్ణ యుద్ధానికి దారితీసాయి.

**ఇదంతా కేవలం ఓ గుఱ్ఱపు పందెం వలన జరిగింది.**

**(ఇంకా ఉంది)**

## రాత్రి ప్రార్థనల యొక్క విశిష్ఠత

అబూహురైరా (రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : 'సర్వోన్నతుడైన మన ప్రభువు ప్రతీరోజూ రాత్రిలో మూడింట ఒక భాగం మిగిలి ఉండగా దిగి, "నా నుండి అడిగేవారున్నారా? నేను అతనికి ఇస్తాను. నన్నెవరు పిలుస్తారు? నేను అతనికి సమాధానమిస్తాను. ఎవరు నా క్షమాభిక్ష గురించి అడుగుతారు? అతనిని క్షమిస్తాను" ప్రాత:కాలం వరకూ'. కాబట్టి వారు రాత్రి ప్రారంభానికి బదులు, రాత్రి చివరి భాగంలో ప్రార్థనలను (తహజ్జుద్) ఎంచుకునేవారు.

حدَّثَنا أَبُو مَرْوَانَ، مُحَمَّدُ بْنُ عُثْمَانَ الْعُثْمَانِيُّ، وَ يَعْقُوبُ بْن حُمَيْدِ بْنِ كَاسِبٍ قَالاَ: حدَّثَنَا اِبْرَاهِيمُ بْنُ سَعْدٍ، عَنِ ابْنِ شِهَابٍ، عَنْ أَبِي سَلَمَةَ. وَ أَبِي عَبْدِ اللهِ الأَغَرِّ، عَنْ أَبِي هُرَيْرَةَ أَنَّ رَسُولَ اللهِ ﷺ قَالَ : ((يَنْزِلُ رَبُّنَا تبَارَكَ وَتَعَالَى، حِينَ يَبْقَى ثُلُثُ اللَّيْلِ الآخِرُ، كُلَّ لَيْلَةٍ، فَيَقُولُ : مَنْ يَسْأَلُنِي فَأُعْطِيَهُ؟ مَنْ يَدْعُونِي فَأَسْتَجِيبَ لَهُ؟ مَن يَسْتَغْفِرُنِي فَأَغْفِرَ لَهُ؟ حَتَّى يَطْلُعَ الْفَجْرُ)) فَلِذٰلِكَ كَانُوا يَسْتَحِبُّونَ صَلاَةَ آخِرِ اللَّيْلِ عَلَى أَوَّلِه.

# శాంతిబాట ద్వారా అందించే హదీస్‌ల ప్రామాణికతపై వివరణ

మాకు అందుబాటులో ఉన్న హదీస్ గ్రంథాలు : సహీహ్ బుఖారీ, సహీహ్ ముస్లిమ్, సునన్ అబూదావూద్, జామిఉ తిర్మిజీ, సునన్ అన్-నసాయీ, సునన్ ఇబ్నెమాజా.

వీటిలోని మొదటి రెండు గ్రంథాలు "**సహీహ్ హదీస్**" గ్రంథాలు. ఈ రెండు గ్రంథాలలోని హదీస్‌ల ప్రామాణికతను ఆ గ్రంథకర్తలు ఏర్పాటు చేసుకున్న కొన్ని షరతులకు సరిపోతేనే వాటిని 'సహీహ్'గా స్వీకరించడం జరిగింది.

ఉదాహరణకు సహీహ్ బుఖారీ గ్రంథకర్త 17 షరతులకు సరిపోయిన హదీస్‌లనే స్వీకరించారు. ఆ షరతుల గురించి మరియు ఇతర విషయాల గురించి హదీస్ విజ్ఞానం శీర్షికలో అందిస్తాము, ఇన్షా అల్లాహ్.

కేవలం ఈ రెండు గ్రంథాలలో ఇచ్చిన హదీస్‌లు మాత్రమే సహీహ్ అని కాదు. కాని ఈ రెండు గ్రంథాలలో ఇచ్చిన అన్ని హదీస్‌లూ సహీహ్ హదీస్‌లే. అంటే బలమైన హదీస్‌లే.

పైన తెలిపిన మిగిలిన 4 హదీస్ గ్రంథాలలో దయీఫ్ (బలహీనమైన) హదీస్‌లు, మౌదూ (కల్పితమైన) హదీస్‌లు కూడా ఉన్నాయి. ఆ వివరాలను కూడా ఆయా హదీస్ గ్రంథాలలో పొందుపరిచారు.

వీరు సేకరించిన హదీస్‌లకు కూడా **సహీహ్, హసన్** అని గ్రేడింగ్ ఇవ్వడం జరిగింది. అవి కూడా వారి వారి షరతుల ప్రకారమే గ్రేడింగ్ ఇచ్చారు. కాబట్టి ఆయా గ్రంథాలలోని హదీస్‌లను మేము అందించే టప్పుడు ఆ గ్రేడింగ్‌ను మాత్రమే మేము అనుసరించ వలసి ఉంది.

ఈ గ్రంథాలలోని 'సహీహ్' గ్రేడ్‌కు ఉన్న షరతులు వేరు, బుఖారీ గ్రంథంలోని 'సహీహ్' గ్రేడ్‌కు నిర్ణయించిన షరుతులు వేరు. 'హసన్' హదీస్‌ను 'సహీహ్' కంటే తక్కువ స్థాయిగా స్వీకరిస్తారు.

అయితే ఈ **'సహీహ్'** మరియు **'హసన్'** ప్రామాణిక స్థాయిలనేవి ఉల్లేఖకులపై ఆధారపడి ఉంటాయి గాని, ప్రవక్త(స)వారి బోధనలపై కాదు అని తెలుసుకోవాలి. కాబట్టి ఈ రెండు రకాల హదీస్‌లలోని **"ప్రవక్త(స)వారి బోధనలను గాని, ఆచరణలనుగాని నిరభ్యంతరంగా స్వీకరించవచ్చు."**

కాబట్టి మనం హదీస్ ప్రకారం ఆచరించే విషయంలో, ఆ హదీస్ సహీహ్ అయినా లేక హసన్ అయినా మనకు ఒక్కటే. దానిని మనం అమలు చేయాలి. దయీఫ్ హదీస్‌ను, మౌదూ హదీస్‌ను మాత్రమే మనం స్వీకరించం.

ఖుర్‌ఆన్‌ను నేర్పి తరువాత బహుమతిని స్వీకరించడం విషయంలో ఈ సంచికలో 15వ పేజీలో ఇబ్నెమాజా గ్రంథంలోని హసన్ (నెం. 2157) హదీస్‌ను అందించాము. అయితే ఆ హదీస్‌కు బదులుగా మొదట 'అబూదావూద్' నుండి హదీస్‌ను మేము తీసుకున్నాము. కాని ఆ హదీస్‌ను ఇమామ్ అల్బానీ గారు 'దయీఫ్' అని ప్రమాణీకరించారని తెలుసుకున్నాము. మేము ఏదైనా ఒక టాపిక్‌పై హదీస్‌లను అందించే టప్పుడు, ఆ టాపిక్‌పై ఉన్న అన్ని గ్రంథాలలోని హదీస్‌లను రిఫర్ చేయడం జరుగుతుంది.

ఆ విధంగా చేసినప్పుడు, అబూదావూద్ (నెం 3416, సంపుటి 4) హసన్ హదీస్‌ను దయీఫ్‌గా నిర్ధారించినప్పటికీ, ఇదే హదీస్‌ను 'ఇబ్నెమాజా'లో రెండు చోట్ల చూశాము. 'ఇబ్నెమాజా'లో ఉన్న ఆ రెండు హదీస్‌లలో ఉన్న విషయం దాదాపు ఒక్కటే అయినప్పటికీ అందులో ఒకటి దయీఫ్ హదీస్, మరొకటి హసన్ హదీస్.

ఉల్లేఖకులలో 'వఖీ' అనే వ్యక్తి ఉన్న హదీస్‌ను 'హసన్' గానూ, 'యహ్యా బిన్ సఈద్' ఉల్లేఖకుడు ఉన్న హదీస్‌ను 'దయీఫ్' అని ఇబ్నెమాజాలో వివరణ ఇవ్వడం జరిగింది. అంటే ఇక్కడ దయీఫ్ అనేది కేవలం సనద్‌లోనే ఉందిగాని మతన్‌లో కాదు. ఆ వివరణ యొక్కఅరబీ మూలాన్ని కూడా ఈ వ్యాసంలో అందించాము.

**ఆ హదీస్‌లను ప్రక్క పేజీలో పాఠకుల ప్రయోజనార్థం అందిస్తున్నాము.**

## ఏ హదీస్‌కయినా రిఫరెన్స్ ఇవ్వవలసి వస్తే ....

ఈ నాలుగు సునన్ గ్రంథాలలో ఏ గ్రేడ్ అయితే ఇచ్చారో ఆ గ్రేడ్‌నే మేము దాని ప్రామాణిక స్థాయిగా ఇవ్వవలసి ఉంది. **అదే సరియైన పద్ధతి.** మా బాధ్యత కేవలం ఆ హదీస్ దయీఫ్ కాకుండా, మౌదూ కాకుండా చూసుకోవాలి. అంతే!

పై నాలుగు హదీస్ గ్రంథాలలోని ఓ 'హసన్' హదీస్‌ను ఇమామ్ నాశిరుద్దీన్ అల్బానీ గారు అది 'హసన్' హదీస్ కాదని తెలిపి, దాని స్థాయిని పెంచి 'సహీహ్'గా ప్రమాణీకరించారు. (హదీస్ నెం. 12, ఇబ్నెమాజా). ఈ విధంగా 'హసన్' (good) స్థాయిలో ఉన్న కొన్ని హదీస్‌లను 'సహీహ్' స్థాయికి చెందినవిగా నిర్ధారించడం జరిగింది. ఉదాహరణకు 'సునన్ అబూదావూద్' హదీస్ గ్రంథంలోని క్రింది హదీస్‌లను ఇమామ్ నాశిరుద్దీన్ అల్బానీగారు 'సహీహ్ హదీస్‌లుగా ప్రమాణీకరించారు. అందులోని ఒక దయీఫ్ హదీస్‌ను కూడా అల్బానీగారు 'సహీహ్'గా చెప్పడం జరిగింది.

**అబూదావూద్ (కితాబుస్సున్నహ్)లో 4596(హసన్), 4597(హసన్), 4600(సహీహ్), 4601(దయీఫ్), 4603(హసన్), 4604(సహీహ్), 4605 (సహీహ్), 4606(సహీహ్), 4607(సహీహ్), 4608(సహీహ్).**

కాబట్టి పై నాలుగు సునన్ గ్రంథాలలోని 'సహీహ్'గా చెప్పబడిన హదీస్‌లను 'సహీహ్'గా చెప్పకూడదని అనడం అర్థరహితం.

బుఖారీ గ్రంథం నుండి గాని, ముస్లిమ్ గ్రంథం నుండి గాని ఏదైనా

హదీస్‌ను ఇస్తే, దాని రిఫరెన్స్‌ను 'సహీహ్ బుఖారీ'గా లేదా 'సహీహ్ ముస్లిమ్'గా చెబుతాం. అదే అబూదావూద్ గ్రంథం నుండి అయితే, అబూదావూద్ అని చెప్పి, దాని ప్రక్కన దాని గ్రేడ్ ఇస్తామేగాని 'సహీహ్ అబూదావూద్'అని మేము ఎలా ఇవ్వగలం?

ఇమామ్ అల్బానీ గారు 'అబూదావూద్' గ్రంథాన్ని 'సహీహ్ అబూదావూద్'గానూ మరియు 'దయీఫ్ అబూదావూద్'గానూ వేరు చేయడం జరిగింది. ఒకవేళ మేము ఆయా పుస్తకాల నుండి రిఫరెన్స్ ఇచ్చినప్పుడు మాత్రమే, ఆ రిఫరెన్స్‌ను అనుసరించగలము.

**మా సంకల్పం ముస్లిములంతా ప్రవక్త(స)వారి బోధన ప్రకారం జీవించి సంతోషంగా బ్రతకాలని.**

ఉర్దూ, తెలుగు, ఇంగ్లీష్ భాషలలో జరిగిన హదీస్ గ్రంథాల అనువాదాలను గమనించాము. అరబీ మూలంతో పోల్చితే ఈ అనువాద పుస్తకాలన్నింటిలోనూ కొన్ని చోట్ల అనువాద దోషాలు చాలా స్పష్టంగా ఉన్నాయి. కాబట్టి సాధ్యమైనంత వరకు అరబీ మూలంపైనే ఆధారపడుతున్నాము.

కేవలం కొద్ది కాలంలోనే ఏదో విధంగా అనువాదాన్ని అందించాలి అనే విధంగా భావించబట్టే, ఇటువంటి అనువాద దోషాలతో పుస్తకాలు విడుదలవుతున్నాయి. మేము ఒక్క హదీస్ కోసమే ఒకొక్కసారి కొన్ని రోజులు పనిచేయవలసి వచ్చిన సందర్భాలూ ఉన్నాయి.

ఒక హదీస్ గ్రంథాన్ని అరబీ మూలం నుండి మరొక భాషలోకి అనువదించడానికి ఒక అనువాదకుడికి తన జీవితకాలం కూడా సరిపోక పోవచ్చు. అయినా ఫర్వాలేదు. మిగిలినది తరువాత వచ్చేవారు పూర్తి చేస్తారు. ఈ విధంగా చేస్తే భావి తరాలకు ఓ ప్రామాణిక అనువాదాన్ని అందించిన వారమవుతాము.

అనువాదం సరిగ్గా చేయకపోతే ఒరిజినల్ 'సహీహ్' హదీస్ కూడా అనువాదంలోకి వచ్చేసరికి 'మౌదూ' హదీస్ అయిపోయే ఆస్కారం ఉంది. అది ఏ విధంగా అవుతుందో శాంతిబాట 3వ సంచికలో 7వ పేజీలో స్పష్టంగా వివరించాము.

కేవలం అనువాదాలపైనే ఆధారపడి, ఎటువంటి జ్ఞానం లేని నకిలీ ముస్లిములు ఎటువంటి దుష్ప్రచారం చేస్తున్నారో ఇప్పటికే మీకు తెలిపాము.

**'శాంతిబాట' ప్రామాణిక విషయాలనే అందిస్తుంది. ప్రామాణికత విషయంలో రాజీపడకపోవడం వల్లనే పత్రిక ఆలస్యమౌతుంది. మీ సహనానికి ధన్యవాదాలు.**

**'ఇబ్నెమాజా' హదీస్ గ్రంథం సంపుటి 3 లో 'హసన్' గా అందించిన హదీస్ (నెం. 2157)**

حَدَّثَنَا عَلِيُّ بْنُ مُحَمَّدٍ، وَ مُحَمَّدُ ابْنُ اِسْمَاعِيلَ. قَالَ : حَدَّثَنَا وَكِيعٌ : حَدَّثَنَا مُغِيرَةُ بْنُ زِيَادٍ الْمَوْصِلِيُّ، عَنْ عُبَادَةَ بْنِ نُسَيٍّ، عَنِ الْأَسْوَدِ بْنِ ثَعْلَبَةَ، عَنْ عُبَادَةَ بْنِ الصَّامِتِ قَالَ : عَلَّمْتُ نَاساً مِنْ أَهْلِ الصُّفَّةِ الْقُرْآنَ وَالْكِتَابَةَ. فَأَهْدَى اِلَيَّ رَجُلٌ مِنْهُمْ قَوْساً. فَقُلْتُ : لَيْسَتْ بِمَالٍ. وَأَرْمِي [عَنْهَا] فِي سَبِيلِ اللهِ. فَسَأَلْتُ رَسُولَ اللهِ ﷺ عَنْهَا. فَقَالَ : ((اِنْ سَرَّكَ أَنْ تُطَوَّقَ بِهَا طَوْقاً مِنْ نَارٍ فَاقْبَلْهَا)).

ఉబాదహ్ బిన్ సామిత్ ఉల్లేఖనం : 'అహలుస్సుఫ్ఫహ్' వారికి నేను **ఖుర్'ఆన్ మరియు వ్రాయడం నేర్పాను.** మరియు వారిలో ఒకరు నాకు విల్లు (BOW)ను ఇచ్చారు. నేను చెప్పాను : ఇది నగదు (డబ్బు)కాదు, మరియు నేను (దీనితో బాణాలను) విసరగలను అల్లాహ్ మార్గంలో. నేను అల్లాహ్ యొక్క సందేశహరులు(స)ను దీని గురించి అడిగాను మరియు ఆయన చెప్పారు : **అగ్ని కంఠాభరణాన్ని నీ మెడచుట్టూ ఉంచడం నీకు సంతోషాన్ని కలిగిస్తే, దానిని స్వీకరించు.**

**(ఇబ్నెమాజా, హసన్ హదీస్ నెం. 2157, పుస్తకం 12, అధ్యా. 8, సంపుటి 3)**

**'ఇబ్నెమాజా' హదీస్ గ్రంథం సంపుటి 3 లో 'దయీఫ్' గా అందించిన హదీస్ (నెం. 2158)**

حَدَّثَنَا سَهْلُ بْنُ أَبِي سَهْلٍ : حَدَّثَنَا يَحْيَى بْنُ سَعِيدٍ، عَنْ ثَورِ بْنِ يَزِيدَ : حَدَّثَنَا خَالِدُ بْنُ مَعْدَانَ : حَدَّثَنِي عَبْدُ الرَّحْمٰنِ بْنُ سَلْمٍ، عَنْ عَطِيَّةَ الْكَلاَعِيِّ، عَنْ أُبَيِّ بْنِ كَعْبٍ قَالَ : عَلَّمْتُ رَجُلاً الْقُرْآنَ. فَأَهْدَى اِلَيَّ قَوْساً فَذَكَرْتُ ذٰلِكَ لِرَسُولِ اللهِ ﷺ. فَقَالَ : ((اِنْ أَخَذْتَهَا أَخَذْتَ قَوْساً مِنْ نَارٍ)) فَرَدَدْتُهَا.

ఉబయ్యి బిన్ కాబ్ ఉల్లేఖనం : నేను ఒక వ్యక్తికి ఖుర్'ఆన్‌ను నేర్పాను మరియు అతను నాకు విల్లు నిచ్చాడు. నేను (ఈ విషయాన్ని) అల్లాహ్ యొక్క సందేశహరులు(స) దగ్గర ప్రస్తావించాను. ఆయన(స) చెప్పారు : దీనిని నీవు స్వీకరిస్తే, నీవు అగ్ని విల్లును స్వీకరిస్తావు. కాబట్టి నేను దానిని తిరిగి ఇచ్చేశాను.

**(ఇబ్నెమాజా, దయీఫ్ హదీస్ నెం. 2158, పుస్తకం 12, అధ్యా. 8, సంపుటి 3)**

**పై రెండు హదీస్‌లలో ఒకటి 'హసన్'గానూ, మరొకటి 'దయీఫ్'గానూ ప్రమాణీకరించడానికి ఆ గ్రంథంలోనే ఇచ్చిన వివరణ**

تخريج : [اسناده ضعيف] أخرجه البيهقي : ٦ . ١٢٦،١٢٥ من حديث يحي بن سعيد به، وعاله بالانقطاع . عطية عن أبي مرسل كما في جامع التحثيل و غيره، وفيه علة أخرى.

**తఖ్‌రీజ్ :** ఈ హదీస్ యొక్క సనద్ దయీఫ్. దీనిని బైహఖీ ఉల్లేఖించారు (సంపుటి 6, 165/166). ఈ హదీస్ యహ్యాబిన్ సఈద్‌తో ఉల్లేఖించబడింది. ఈ హదీస్‌లోని సనద్‌లో ఉల్లేఖకుల మధ్య ఉండే సంబంధం తెగిపోయింది.

# ఖుర్'ఆన్ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 9

## ప్రవక్తలు మరియు ... Prophets and ...

| | | | |
|---|---|---|---|
| సందేశహరులు = Messenger | بھیجاہوا | (రసూల్) | رَسُول (pl رُسُل) |
| ప్రవక్త = Prophet | نبی | (నబీ) | نَبِيّ |
| ప్రవక్తలు = Prophets | | (నబియ్యూన్, అంబియా) | نَبِيُّون، نَبِيِّين، أَنْبِيَاء |
| ఆదమ్, నూహ్, ఇబ్రాహీమ్ | | | آدَم نُوح إِبْرَاهِيم |
| లూత్, ఇస్మాఈ'ల్, ఇస్హాక్ | | | لُوط إِسْمَاعِيل إِسْحَاق |
| యాఖూబ్ (ఇస్రాఈ'ల్), యూసుఫ్ | | | يَعْقُوب (إِسْرَائِيل) يُوسُف |
| హూద్, షుఐబ్, సాలిహ్ | | | هُود شُعَيْب صَالِح |
| మూసా, ఈసా ఇబ్ను మర్యమ్ | | | مُوسَى عِيسَى ابْنُ مَرْيَم |
| షైతాన్ Satan | سرکش، شریر | | شَيْطَان (شَيَاطِين) |
| ఫిర్'ఔన్ Pharaoh | مصر کے بادشاہوں کا لقب | = (ఈజిప్టు రాజు బిరుదు) | فِرْعَوْن |
| హూద్(అ)వారి ప్రజలు = People of Hud (pbuh) | ہود علیہ السلام کی قوم | (ఆద్) | عَاد |
| సాలిహ్(అ)వారి ప్రజలు = People of Salih (pbuh) | صالح علیہ السلام کی قوم | (సమూద్) | ثَمُود |

## అల్లాహ్ యొక్క సూచనలు ... Allah's Signs ...

| | | | |
|---|---|---|---|
| సూచన = Sign | آیت، نشانی | (ఆయత్) | آيَة (pl آيَات) |
| సాక్ష్యం = Evidence, Proof | کھلی دلیل | (బయ్యినహ్) | بَيِّنَة (pl بَيِّنَات) |
| ఖుర్'ఆన్, చదవడం, ఫఠించడం = Quran; reading, recitation | | (ఖుర్'ఆన్) | قُرْآن |
| పశువులు = Cattle | مویشی، گائے بکری وغیرہ | (అన్'ఆమ్) | أَنْعَام |
| పర్వతం = Mountain | پہاڑ | (జబల్) | جَبَل (pl جِبَال) |
| సముద్రం, పెద్ద నది Sea; large river | دریا، سمندر | (బహ్ర్) | بَحْر |
| సూర్యుడు = Sun | سورج | (షమ్స్) | شَمْس |
| చంద్రుడు = Moon | چاند | (ఖమర్) | قَمَر |
| రాత్రి = Night | رات | (లైల్) | لَيْل |
| పగలు = Day | دن | (నహార్) | نَهَار |
| భూమి = Earth | زمین | (అర్ద్) | أَرْض |
| ఆకాశం = Sky | آسمان | (సమాఅ') | سَمَاء (pl سَمَاوَات) |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.**

***ఈ 9 నెలలలో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 48.9***

ఈ నెల నేర్చుకున్న పదాలు 2729 (అంటే ఈ 24 పదాలు ఖుర్'ఆన్‌లో 2729 చోట్ల చూడవచ్చు)

source: www.emuslim.com

ప్రతీ నెలా శాంతిబాటలో ఇస్తున్న 24 పదాలను 30 నెలలపాటు నేర్చుకుంటే ఖుర్'ఆన్‌లోని 64,282 పదాలను నేర్చుకోగలిగినట్లే

**కొంతమంది సోదరులు, తమకు అరబీ చదవడం రాదని, కాబట్టి అరబీ అక్షరాలను ప్రారంభం నుండి మొదలు పెడితే వారికి ఉపయోగకరంగా ఉంటుందని చెప్పారు. ఆసక్తి ఉన్నవారికి అరబీ చదవడం నేర్చుకోవడానికి 7 రోజులు చాలు. అరబీ మొదటి నుండి నేర్పడం ఈ శీర్షిక యొక్క ఉద్దేశ్యం కానప్పటికిని, సోదరుల కోరికను కొంతమేరైనా తీర్చాలనే సంకల్పంతో 2వ సంచికలో అరబీ అక్షరాలను, వాటి గుణింతాలను ఇచ్చాము.**

# ఖుర్ఆన్‌ని అర్థం చేసుకుంటూ చదువుదాం - 10

## పరలోకం — The Hereafter

| తెలుగు / English | ఉచ్చారణ | اردو | عربي | తెలుగు / English | ఉచ్చారణ | اردو | عربي |
|---|---|---|---|---|---|---|---|
| **సహచరుడు** Companion, fellow | = (సాహిబ్) | ساتھی | صَاحِب (أَصْحَاب) | **ఎల్లప్పుడూ, ఎప్పటికీ** Forever; ever | = (అబదన్) | ہمیشہ | أَبَدًا |
| **ముగింపు** End | = (ఆఖిబహ్) | انجام | عَاقِبَة | **బహుమతి** Reward | = (అజ్ర్) | مزدوری، ثواب | أَجْر (أُجُور) |
| **శిక్ష** Torment | = (అజాబ్) | سخت دُکھ | عَذَاب | **వ్యవధి** Term | = (అజల్) | | أَجَل |
| **శిక్ష (పాప ఫలితంగా)** Chastisement (as a result of sin) | = (ఇ'ఖాబ్) | عذاب، جرم کی سزا | عِقَاب | **పరలోకం** The Hereafter | = (అల్ ఆఖిరహ్) | آخرت | اَلْآخِرَة |
| **పునరుత్థానం** Resurrection | = (ఖియామహ్) | قیامت | قِيَامَة | **బాధాకరమైన** Painful | = (అలీమ్) | دردناک، اَلَم ناک | أَلِيم |
| **సమావేశం** Meeting | = (లిఖాఅ') | پیشی، ملنا، سامنے ہونا | لِقَاء | **సాఫల్యం, పుణ్యం** Reward | = (సవాబ్) | ثواب | ثَوَاب |
| **పునరుత్థానం** Fixed | = (ముసమ్మ) | مُقرر | مُسَمًّى | **నరకాగ్ని** Hellfire | = (జహీమ్) | بھڑکتی آگ | جَحِيم |
| **అగ్ని** Fire | = (నార్) | آگ | نَار | **బహుమతి** Reward | = (జజాఅ') | بدلہ | جَزَاء |
| **నది** River | = (నహర్) | نہر | نَهَر (أَنْهَار) | **స్వర్గం, తోట** Garden | = (జన్నహ్) | جنت، باغ | جَنَّة (جَنَّات) |
| **... శాపం పడుగాక** Woe unto | = (వయ్ల్) | ہلاکت | وَيْل | **నరకం** The Hell | = (జహన్నమ్) | جہنم | جَهَنَّم |
| **రోజు** Day | = (యౌమ్) | دِن | يَوْم (أَيَّام) | **లెక్కగట్టడం** Reckoning | = (హిసాబ్) | شمار، گننا | حِسَاب |
| **ఆ రోజు/ ఈ రోజు** That day/This day | = (యౌమఇజ్) | اُس دِن / اِس دِن | يَوْمَئِذٍ | **(పునరుత్థాన దినపు) గంట, ఘడియ** Hour (day of resurrection) | = (సాఅ) | گھڑی، وقت | سَاعَة |

**ఖుర్'ఆన్‌లో మొత్తం పదాల సంఖ్య = సుమారు 77,800.** *ఈ 10 నెలలలో నేర్చుకున్న ఖుర్'ఆన్ పదాల శాతం : 51.6*

ఈ నెల నేర్చుకున్న పదాలు 2048 (అంటే ఈ 24 పదాలు ఖుర్'ఆన్‌లో 2048 చోట్ల చూడవచ్చు) source: www.emuslim.com

# పత్రిక ఆలస్యానికి కారణం

ఏప్రిల్, మే సంచికలను ఆగష్టు నెలలో అందిస్తున్నందుకు కొత్తగా చేరిన పాఠకులకు ఆశ్చర్యంగా అనిపించవచ్చు. గత సంవత్సరం ఆగష్టు 23వ తేదీన శాంతిబాట మాసపత్రికను సామర్లకోట మస్జిద్‌లో రమదాన్ మొదటి రోజున ప్రారంభించాము. అప్పటికి సెప్టెంబర్ సంచిక విడుదల చేయడానికి కేవలం 8 రోజులే సమయం ఉంది. అప్పటికింకా శాంతిబాట అన్ని ప్రాంతాలలో పరిచయం కావాల్సి ఉంది. 'శాంతిబాట' పత్రిక మొదటి సంచిక ద్వారా పరిచయం కాకుండానే రెండవ సంచిక రిలీజ్ చేయడం బావుండదని ఆలస్యంగా విడుదల చేశాము. కొత్తగా ప్రారంభించడం వలన, ప్రింటింగ్ సామర్లకోటలో, పోస్ట్ చేయడం వైజాగ్ నుండి కావడంతోనూ, చాలా సమయం వృధా అయింది. అంతేకాకుండా ఫిబ్రవరి నెలలో కొన్ని టెక్నికల్ ప్రోబ్లమ్స్ వలన మరో రెండు నెలలు ఆలస్యమయింది.

ఇప్పటికి పాఠకులకు 12 సంచికలు అందవలసి ఉంది. కాని 10 సంచికలను అందించగలిగాము. 'ప్రవక్త(స)వారిపై జరుగుచున్న దుష్ప్రచారం'పై 200 పేజీల పుస్తకాన్ని ఉచితంగా అందించాము. మిగతా 2 సంచికలను కూడా త్వరలో అందిస్తాము, ఇన్షా అల్లాహ్.

ప్రారంభంలో కొరియర్ ఛార్జ్‌తో కలిసి, ఒక్కొక్క పుస్తకానికి 31 రు॥లు ఖర్చు అయ్యేది. అది ఇప్పుడు 23 రు॥లకు చేరుకుంది. పాఠకులు కట్టిన చందా కంటే, మేము ఖర్చు చేసేది ఎక్కువే అవుతుంది. అంతేకాకుండా, గవర్నమెంట్ పోస్ట్ ద్వారాగాని లేదా కొరియర్ ద్వారా పంపిన పుస్తకాలు అందకపోతే, చాలామందికి మరలా పంపించడం జరిగింది. అది కూడా ఆర్థికంగా మాకు అదనపు భారమే అయింది.

అయినా సరే, మేమెవ్వరి ముందూ ఆర్థిక సహకారం కోసం చేయి చాచలేదు. చందాదారుల సంఖ్య పెరిగి, పుస్తకం ఖరీదు 15 రు॥లు అయితే ఎటువంటి ఆర్థిక ఇబ్బంది ఉండదు కనుక, చందాదారులని చేర్పించమని మాత్రం పాఠకులను రిక్వెస్ట్ చేయడం జరిగింది. ఇప్పుడు ప్రస్తుతం ఉన్న పాఠకుల సంఖ్య కూడా అల్లాహ్ దయవలన, పాఠకుల సహకారంతోనే పెరిగింది. అల్లాహ్ వారికి శ్రేయోశుభాలను ప్రసాదించు గాక! (ఆమీన్)

ఈ సంచికలో'జకాత్' గురించి హదీస్‌లను స్టడీ చేసి వ్రాయడానికి 12 రోజులు పట్టింది. కేవలం 8 పేజీల మేటర్ తయారైంది. ప్రామాణిక విషయాలనే అందించాలని అందుకోసం పరిశోధనకు అత్యంత ప్రాధాన్యతను ఇవ్వడంతో ఆలస్యం జరిగినా, చాలామంది పాఠకులు అభ్యంతరం చెప్పకుండా, 'ఇది న్యూస్ ఐటమ్ కాదు కదా, ప్రామాణిక వ్యాసాలను ప్రచురించండి, ఆలస్యమైనా ఫర్వాలేదు' అని చెప్పడం వలన మా టెన్షన్ కొద్దిగా తగ్గింది. ఇన్షా అల్లాహ్, నవంబర్ 2010 నాటికి ఆలస్యాన్ని దాదాపు తగ్గించడానికి అల్లాహ్ పేరుతో ప్రయత్నాలు చేస్తున్నాము.

ఈ పత్రిక యొక్క 10 సంచికలు విడుదల చేసేసరికి, మా శక్తికి మించిన ఆర్థిక భారం మాపై పడింది. కేవలం అల్లాహ్ కొరకే ఈ పత్రికను నడుపుతున్నాము. కేవలం ఆయనపైనే మేము ఆధారపడ్డాము. మా రెండు ఎడ్యుకేషనల్ సొసైటీలలోని సభ్యులందరూ మధ్య తరగతివారే. ముస్లిమ్ సోదరులను ఎడ్యుకేట్ చేస్తూ ముస్లిమేతరులకు అందుబాటులో లైబ్రరీలను ఉంచుతూ, మా శక్తిమేర మేము చేసే కృషి వెనుక ఆర్థిక వనరులు ఏమీ లేవు. అల్లాహ్‌పై నున్న మా విశ్వాసమే మా ఆర్థిక వనరు. 'జీతాని'కి ఏ వ్యక్తినీ మేము ఏర్పాటు చేసుకోలేదు. 'శాంతిబాట' కోసం చేసేవారందరూ స్వచ్ఛందంగానే చేస్తున్నారు.

జకాత్ స్వీకరించడానికి మా సొసైటీలు హక్కుదారులు కావు.

ఒకవేళ ఎవరైనా మాకు ఆర్థికంగా సహాయం చేయగోరువారు, వారు వారి శక్తిమేర కొన్ని కాపీలకు చందా కడితే, మేము బుక్స్ పంపిస్తాము. వారు వాటిని ఇతరులకు పంచిపెట్టి ఇస్లామీయ విజ్ఞానాన్ని ఇతరులకు అందించవచ్చు. ఆ విధంగా చందాదారుల సంఖ్య పెరిగితే మాకు కూడా ఆర్థిక భారం తగ్గుతుంది.

ఈ సంవత్సరం (13వ సంచిక) నుండి అనివార్య కారణాల వలన ఒక్కొక్క సంచిక రేటును రు.15 నుండి రు.17 కు పెంచడం జరిగింది. సంవత్సర చందాను రు. 180 నుండి రు. 200 చేశాము. గమనించగలరు.


చందా 200 రు॥లు కట్టిన తరువాత, పత్రికలు రాకపోతే నష్టపోతామని కొందరు సోదరులు భావించిన దరిమిలా, మేము వారికి వాగ్దానం చేస్తున్నాము. ఒకవేళ పత్రిక ఆపవలసిన పరిస్థితి వస్తే (ఇన్షా అల్లాహ్ రాదు అని మా నమ్మకం), మీరు కట్టిన చందాను మీకు క్షేమంగా అందించే బాధ్యత మాది. మా సొసైటీలలో నవముస్లిముల సంఖ్య కూడా ఎక్కువే. తోటివారికి ఇస్లామీయ జ్ఞానాన్ని అందించాలనే సంకల్పంతోనే ఈ పత్రిక ప్రారంభించడం జరిగిందిగాని, ఇది ఎవరికీ జీవనోపాధి ఎంతమాత్రం కాదు.

ముస్లిములుగా అబద్ధాలను, మోసాలను అసహ్యించుకునే మేము, మరింతగా అల్లాహ్ మార్గంలో సేవచేయడానికి అల్లాహ్‌ను వేడుకుంటున్నాము.

పాఠకుల ఆదరణను ఎల్లప్పుడూ కోరుకుంటూ ...

మీ శాంతిబాట టీమ్


# ప్రామాణిక విషయాల నందించే
# తొలి తెలుగు
# పరిశోధనాత్మక ఇస్లామీయ మాసపత్రిక

























2009-2010 చందాదారులకు
ఉచితంగా అందించిన పుస్తకం



చదవండి

...దివించండి

...మును అందరికీ
...యం చేయండి

...ర చందా:
...200/-
...క సైజ్
...280 మి.మీ.
...లు : 44

క్రిందటి రమదాన్ నెల మొదటి రోజున 'శాంతిబాట' మాసపత్రిక అల్లాహ్ పేరుతో ప్రారంభించబడింది. ఈ సంవత్సర కాలంలో మా పాఠకులకు 10 సంచికలను, ప్రవక్త(స)వారిపై ఓ పుస్తకాన్ని అందించే భాగ్యాన్ని అల్లాహ్ మాకు కలుగజేశారు.

**అల్‌హమ్దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్**

ఇందులోని వ్యాసాలు కేవలం వేరే భాషలనుండి చేసిన అనువాదాలుగా కొందరు భావించవచ్చు. ఇవి కేవలం అనువాదాలు కాదు, నేటి ముస్లిమ్ సమాజ పరిస్థితిని దృష్టిలో పెట్టుకుని, ఆ పరిస్థితికి అనుగుణంగా అల్లాహ్ కరుణతో సమర్పించ బడినవి.ఖుర్'ఆన్ మరియు హదీస్ గ్రంథాలు సంతోషమయ జీవనానికి మార్గదర్శకత్వం వహిస్తాయి. ఆ సంతోషమయ జీవన విధానాన్ని సులభశైలిలో అందించే 'శాంతిబాట'ను ఆదరించిన పాఠక సోదర సోదరీమణులకు అల్లాహ్ శ్రేయోశుభాలను అనుగ్రహించుగాక!

**శీర్షికలు :** అరబీ భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం. ప్రపంచ శాంతి దూత ముహమ్మద్(స)వారి బోధనలు, ఆచరణలు. తిరిగి గూటికి. ఖుర్'ఆన్ మరియు సైన్స్. జ్ఞానం - అజ్ఞానం. హదీస్ విజ్ఞానం. ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర. బాలబాలికలకు ప్రత్యేకం. ధర్మ సందేశ ప్రచారం. నాస్తికుని ప్రశ్న. టెర్రరిజం. ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం. ముస్లిం యువత ఆలోచించండి. ఇంటర్‌నెట్‌లో ఇస్లామ్ కబుర్లు .....

మీ చందాను మనియార్డర్ (M.O.) ద్వారా పంపవలసిన చిరునామా : వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ, 2-8-31, కోట బజార్, సామర్లకోట - 533440, తూ.గో. జిల్లా. చందా పంపిన వెంటనే ఫోన్ చేసి మీ వివరాలను తెలియజేయండి. మూడు లేదా ఎక్కువ చందాలను పంపేవారు, పంపే మొత్తానికి రు.25 అదనంగా కలిపి క్రింది బ్యాంక్ ఎకౌంట్‌లో జమచేయవచ్చు. SBI Account No: 10428633092, Andhra University Campus Branch, Nagireddi Srinivasa Rao, Visakhapatnam డిపాజిట్ చేశాక క్రింది నెంబర్‌కి ఫోన్ చేసి వివరాలు తెలుపవలసిందిగా కోరుతున్నాము.

సంప్రదించండి: డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు (అబ్దుల్ కరీమ్), మొబైల్ : 9491103017

## ‘శాంతిబాట’ మాసపత్రికలో గత రమదాన్ నెల నుండి ఈ రమదాన్ వరకూ అందించిన వ్యాసాలను క్లుప్తంగా ...

**అరబి భాషలో సర్వమానవాళికి అల్లాహ్ యొక్క సందేశం:** ఖుర్'ఆన్ గ్రంథ అధ్యయనాన్ని (study) ప్రోత్సహిస్తూ, ఇబ్నె కసీర్ వంటి వ్యాఖ్యాతల తఫ్సీర్‌ను పరిచయం చేసి, ప్రతీ నెలా ఖుర్'ఆన్ వాక్యంలోని ఒక్కొక్క పదానికి అర్థాలను తెలుపుతూ, ప్రతీ ఆయత్‌ను స్పష్టంగా అర్థం చేసుకునే విధంగా వివరణలు అందిస్తూ వచ్చాము. ఈ 10వ సంచికతో సూరహ్ ఫాతిహా యొక్క తఫ్సీర్ దాదాపు పూర్తయింది.

**ప్రపంచ శాంతి దూత ముహమ్మద్ (స) వారి బోధనలు, ఆచరణలు :** సమస్త సమస్యలకు ఇస్లామ్ పరిష్కార మార్గం చూపింది. ప్రవక్త(స)వారు తన ఆచరణల ద్వారా, మనకి సందేహానికి తావులేకుండా ప్రతీ విషయాన్ని వివరించారు.

1. **విద్య :** “తండ్రి తన సంతానానికి బహూకరించే వాటన్నింటిలో శ్రేష్ఠమైన కానుక ఉత్తమమైన చదువూ, సంస్కారాలే”. “స్త్రీ చదువుకుంటే ఆ చదువు సమాజమంతా వ్యాపిస్తుందని” ప్రవక్త(స)వారు విద్యకు అత్యంత ప్రాముఖ్యతను ఇచ్చారు.

2 & 3 **వడ్డీ/అధర్మ సంపాదన :** వడ్డీని అల్లాహ్ నిషేధించడం గురించి, వడ్డీ ద్వారా నాశనమౌతున్న బ్రతుకుల గురించి వాస్తవ సంఘటనల ద్వారా, వడ్డీ తినడం 7 మహావినాశనకరమైన పాపాలలో ఒకటి. ‘వడ్డీ’ వలన కలిగే పాపం విషయంలో 73 స్థాయిలు ఉన్నాయని, అందులోని కనిష్ఠ పాపం ఏమిటంటే ‘ఒక వ్యక్తి తన కన్నతల్లిని పెళ్ళాడటం వంటిది”.

4. **చిన్ని సత్కార్యం - గొప్ప ఫలితం :** అందరికీ పెద్ద సత్కార్యాలు చేయడం సాధ్యం కాకపోవచ్చు. కాని అందరూ చేయగలిగిన అతి చిన్న సత్కార్యాలైన ‘పరుల క్షేమం కోసం ఓ ముళ్ళ కొమ్మని అందరూ నడిచే దారిలోనుండి తీసివేయడం’ వంటివి కూడా మంచి ఫలితాన్ని ఇస్తాయని, ఆ విధంగా చేసిన ఓ వ్యక్తిని అల్లాహ్ క్షమించారని, ఆ విధంగా అతిగొప్ప ప్రతిఫలమైన స్వర్గాన్ని పొందడం జరిగింది. పూర్తి వివరాలు 4వ సంచికలో.

5 & 6 **కష్టం - కరుణ :** విశ్వాసికి కలిగే కష్టం వలన కూడా అతనికి అల్లాహ్ మేలే చేస్తారు.

7 **శాంతి కోరేవారి వస్త్రధారణ మరియు అలంకరణ :** ఈ వ్యాసం చదివి కొందరు సిస్టర్స్ ‘బురఖా’/‘హిజాబ్’ ధరించడం ప్రారంభించారని తెలుసుకుని చాలా సంతోషించాము. అల్‌హమ్‌దులిల్లాహి రబ్బిల్ ఆలమీన్. మన గౌరవ మర్యాదలను కాపాడే వస్త్రధారణ గురించి వాస్తవ సంఘటనల ద్వారా ఓ 6 పేజీల సమగ్ర సమాచారం.

8 **కష్టం - సుఖాలు :** కష్టంతో పాటు సుఖాలు కూడా ఉంటాయి. ఒక కష్టం రెట్టింపు సుఖాన్ని జయించలేదు.

**తిరిగి గూటికి :** ప్రతి మనిషి పుట్టుక అల్లాహ్ ఆదేశించిన ధర్మం ప్రకారమే జరుగుతుంది. కాని ఆ బిడ్డ తన తల్లిదండ్రుల ద్వారా ఏదో ఒక ధర్మాన్ని అనుసరిస్తాడు. కాని అతడు తిరిగి ‘అల్లాహ్ యొక్క మార్గం’గురించి తెలుసుకుని, ఆ మార్గంలోకి తిరిగి రావడం జరుగుతుంది. ఆ విధంగా ఇస్లామ్ మార్గంలోకి వచ్చిన ఓ 7గురు సోదరీమణుల గురించి ఇప్పటి వరకూ అందించాము.

1 **ఆమినా అస్సిల్మి :** ఆమె జీవితకథ మా పాఠకులను కంట తడిపెట్టించడమే కాకుండా, తమ కష్టాలను సైతం మర్చిపోయేలా చేసింది. ఎన్నో సంవత్సరాలుగా బోన్ కాన్సర్‌తో బాధపడుతున్నప్పటికీ అందరినీ అల్లాహ్ మార్గం వైపు ఆహ్వానించిన ఈ సోదరి మరణవార్తను శాంతిబాటలో చదివి, ఎందరో తమ స్వంత సోదరి చనిపోయినంతగా బాధపడ్డారు. **అరబ్బుల నందరినీ క్రైస్తవులుగా మార్చాలనుకున్న సదరన్ బాప్టిస్ట్ యువతి, ఓ కంప్యూటర్ మిస్టేక్ వలన సత్యధర్మంలోకి అడుగిడి, 32 సంవత్సరాలుగా అమెరికాలోని క్రైస్తవులను ఇస్లాం వైపుకు ఆహ్వానిస్తున్న ఈమె 1975లో అసమాన సామర్థ్యమున్న బ్రాడ్‌కాస్ట్ జర్నలిస్ట్. అవార్డులను గెలుచుకుంటూ, స్వంత వ్యాపారాన్ని చూసుకునే ఈమె జీవితం ఓ విచిత్రమైన మలుపు తిరిగింది.**

**“నేను ముస్లింనని చెప్పుకోవడానికి సంతోషపడుతున్నాను. ఇస్లాం నా జీవితం. ఇస్లాం నా గుండె చప్పుడు. ఇస్లాం నా రక్తనాళాలలో ప్రవహించే రక్తం. ఇస్లాం నా బలం. ఇస్లాం నా అద్భుతమైన, అందమైన జీవితం. ఇస్లాం లేకుండా నేను లేను. అల్లాహ్ తన చూపుని నా వైపునుండి త్రిప్పితే నేను బ్రతకలేను”**

అని చెప్పిన ఈ సోదరి ఇస్లాంకోసం ఎన్నో త్యాగాలను అల్లాహ్‌పై విశ్వాసంతో సునాయాసంగా చేసి, 16 సంవత్సరాలపాటు ఎన్నో కష్టాలను ఎదుర్కొని, చివరకు తను జీవితంలో కోల్పోయిన దానికంటే ఎన్నో రెట్లు ఎక్కువైన దానిని సాధించారు.

2 **రుబా డి. ఖేవర్ :** హైస్కూలులో చదివేటప్పుడు నమాజ్ చేసుకునే ముస్లిం బాలికలను కాలితో తన్నే ఈ సోదరి జోర్డాన్‌లో పెరిగారు. ఈమె తండ్రి నాలుగు చర్చ్‌లకు పాస్టర్. ఈమె కూడా ముస్లిములని క్రైస్తవులుగా మార్చాలనే ధృడసంకల్పంతో ఉండేవారు. ఉన్నత విద్యకోసం అమెరికాలోని టెక్సాస్ వెళ్ళిన ఈమె, అక్కడ మొరాకోకు చెందిన ఓ ముస్లిం సోదరునితో జరిగిన వాదన, ఆమె జీవితాన్నే మార్చి వేసింది. ఈమె ఇస్లాం స్వీకరించారు. ఇస్లాం ధర్మాన్ని విస్తృతంగా ప్రచారం చేస్తూ, ఓ వెబ్‌సైట్‌ని కూడా ఏర్పాటు చేసుకున్నారు. “24 సంవత్సరాలుగా అవాస్తవ దైవాన్ని (మనిషిని) పూజించానా?” అని వేదన చెందారీ సోదరి.

3 **ఏంజెలా కొలిన్స్ :** అమెరికాలో ట్విన్ టవర్స్ కూలిన తరువాత, నిజాన్ని తెలుసుకుని ఇస్లాం స్వీకరించిన వారిలో ఈ సోదరి ఒకరు. ఆ సంఘటన జరిగిన 2 నెలలకు ఈమె ఇస్లాం స్వీకరించారు. అమెరికాలోని లాస్‌ఏంజెల్స్ నుండి జార్జ్ లూయిస్, **CNBC** ఛానెల్ ద్వారా ఆమె ఇంటర్వ్యూని అందించారు. ఆమె ఇస్లాం స్వీకరించిన 5 సంవత్సరాలకు ఓ ఇస్లామిక్ స్కూల్‌ను స్థాపించారు. ఆ స్కూల్‌కు ఆమె డైరెక్టర్. నీవు ముస్లిమ్ అని చెప్పుకున్నంత మాత్రాన స్వర్గంలోకి దారిస్తానని ఇస్లాం ధృవీకరించలేదు. “కేవలం తమ తండ్రులు నేర్పినదానిని అనుసరించిన వారికొరకు ఏర్పాటు చేసిన exclusive క్లబ్ కాదు స్వర్గమంటే.”

4 **ఫరీనా ఆలమ్ :** ఈ సోదరికి ఇప్పుడు 28 సంవత్సరాలు. ప్రస్తుతం బ్రిటన్‌లో 60,000 సర్క్యులేషన్ కలిగిన **Q-News** అనే మేగజైన్‌కు ఈమె ఎడిటర్. ఇది ముస్లిముల కొరకు నడుపుతున్న మేగజైన్.

5 & 6 **సోదరి మిమీమా, సోదరి పెనోమీ**

8 **యోన్ రిడ్లీ :** తాలిబన్ల చెరలో 11 రోజులు గడిపిన ప్రముఖ అంతర్జాతీయ మహిళా రిపోర్టర్

సకల లోకాలకు కారుణ్యంగా పంపబడిన ‘శాంతిదూత’ ముహమ్మద్(స) వారిపై ఈ సోదరి తన ప్రేమను ఇలా వ్యక్తం చేశారు: “**మీకు తెలుసా? 5 సంవత్సరాలకు పూర్వం నేనెప్పుడూ ప్రవక్త(స)గారి గురించి వినలేదు. కాని నేడు ఆయన పేరును, ఆయన యొక్క గౌరవాన్ని, ఆయన జ్ఞాపకాలను రక్షించడానికి నా రక్తంలోని చివరబొట్టు వరకూ ఇస్తాను**”

**ఖుర్'ఆన్ మరియు సైన్స్ :** 7వ శతాబ్దం - 12వ శతాబ్దం : ముస్లిములకు స్వర్ణయుగం. యూరోపియన్లకు అది అంధకార యుగం

1 **ఆధునిక సైన్స్ యొక్క ఇస్లామీయ మూలాలు**

**2 & 3 ఇస్లామ్‌లో విద్య - మస్‌జిద్ యొక్క పాత్ర :** 'జామి' అంటే మస్‌జిద్. 'జామిఅ' అంటే యూనివర్సిటీ. 1000 సంవత్సరాల క్రితమే స్టడీ సర్కిల్స్, హాస్టళ్ళను, ప్రపంచపు తొలి యూనివర్సిటీలను ముస్లిములు ఎలా నిర్వహించారో, ప్రపంచపు నలుమూలల నుండి ఈ స్కూళ్ళకి, యూనివర్సిటీలకు విద్య నేర్చుకోవడానికి రావడం, నేటి మోడరన్ యూనివర్సిటీ ఎడ్యుకేషన్ ఆనాడు ముస్లిములు అమలు పరిచినదేనని సమగ్రంగా వివరించడం జరిగింది.

**4 - 6 ఆల్‌జీబ్రా పితామహుడు - అల్ ఖ్వారిజ్మి :** 'అల్ జబర్ వల్ ముఖాబల' అని ఈయన వ్రాసిన పుస్తకం నుండే ఆల్‌జీబ్రా పుట్టింది. కంప్యూటర్ ప్రోగ్రామర్స్‌కి సుపరిచితమైన 'అల్‌గారిథమ్' అనే పదం ఈయన పేరునుండే వచ్చింది.

"సైన్స్‌పై ఇష్టత ... సర్వజన అంగీకారత, చదువుకున్నవారికి అల్లాహ్ చూపించే అనుగ్రహం ... అస్పష్టమైన తెలియని విషయాలను స్పష్టం చేయడంలో మరియు సమస్యలను తొలగించడంలో (చదువుకున్న) వారికి అల్లాహ్ ఇచ్చే రక్షణ మరియు సహాయ సహకారాలతో కూడిన ప్రేరణ 'అల్ జబ్ర్ మరియు అల్-ముఖాబల' అనే ఓ చిన్న వర్క్‌ను - అంకగణితం (arithmetic)లో ఏది సులభమో మరియు ప్రయోజనమో, ఆ హద్దులోపలే ఉండేటట్లుగా - రచించడానికి నన్ను ప్రోత్సహించింది." - అల్-ఖ్వారిజ్మి

ఈ విషయాలను చెప్పడానికిగల కారణం - ముస్లిములు తమ పూర్వీకుల గొప్పతనాన్ని తెలుసుకుని మురిసి పోవడానికో లేదా ఇతరుల ముందు పోజ్ కొట్టడానికో మాత్రం కాదు. 'ఇస్లాం' వల్లనే ముస్లిములు వెనుకబడ్డారని చెప్పేవారి మాటలు నిజం కాదని, 'ఇస్లాం'వలన సైన్స్ పరిశోధనలు ఊపందుకుంటాయని, ఇస్లాంని పాటిస్తే నేటి ముస్లిమ్‌లు కూడా తమ పూర్వీకుల వలె గొప్ప శాస్త్రవేత్తలు కాగలరని, ఆధారాలతో వివరిస్తూ వారిని ఎడ్యుకేట్ చేసే ఉద్దేశ్యమే మాది.- శాంతిబాట టీమ్

**7-8 ప్రపంచపు తొలి సైంటిస్ట్ - అబూ అల్-హసన్ ఇబ్నె అల్-హైతమ్ :** ఆప్టిక్స్ (optics) పితామహుడు. ఇబ్నె అల్-హైతమ్ గొప్ప ముస్లిమ్ ఫిజిసిస్ట్ మరియు ఎప్పటికీ కాంతి విజ్ఞానశాస్త్ర విద్యార్థే. ఇంగ్లాండ్‌లో కానివ్వండి లేదా సుదూర పర్షియా కానివ్వండి, అందరూ త్రాగింది అదే నీటిధార నుండి. బేకన్ నుండి కెప్లర్ వరకూ యూరోపియన్ల ఆలోచనల్లపై అతడు గొప్ప ప్రభావాన్నే వేశాడు ***- George Sarton (1927)*** [Introduction to the **History of Science**. Three Volumes, The Carnegie Institution, Washington]. **ఆనాడు ఇబ్నె అల్-హైతమ్ వంటివారు ఖుర్‌ఆన్ మరియు హదీస్‌లను బాగా అధ్యయనం చేసి, నిజమైన ముస్లిమ్‌లుగా జీవిస్తూ, ప్రపంచం అబ్బురపడే విధంగా ఎన్నో ప్రయోగాలు చేసి సైన్స్‌లోని ఎన్నో రంగాలను అభివృద్ధి చేశారు.** ఈనాడు కూడా ఖుర్‌ఆన్ చదివే వారున్నారు. హదీస్‌లను చదివేవారున్నారు. మరి నేడు **'ఇబ్నె అల్-హైతమ్', 'అల్-ఖ్వారిజ్మీ'** వంటివారు ముస్లిమ్‌లలో ఎందుకు లేరు? ఓసారి ఆలోచించండి! లోపమెక్కడుంది? ప్రతీ ముస్లిమ్ 'తను నిజంగా ముస్లిమేనా?' అని స్వయంగా ప్రశ్నించు కోవాల్సిన అవసరముంది.

***మనిషి కోతినుండి పరిణామం చెందాడనే* డార్విన్ సిద్ధాంతం - శాస్త్రీయ వాస్తవం కాదు**

పరిణామ సిద్ధాంతాన్ని ఇన్నాళ్ళు అడ్డుపెట్టుకొని దేవుడు (సృష్టికర్త) లేడని వాదించే నాస్తికులకు, ఈ సిద్ధాంతానికి నూకలు చెల్లిపోవడంతో, దారి లేకుండా పోయింది. నాస్తికులలో జ్ఞానమున్నవారికి ఈ క్రింది పలుకులు ఆలోచింప చేస్తాయని అనుకుంటున్నాము.

**"అయితే మీరు ఒంటెలను చూడరా అవి ఎలా సృష్టించబడ్డాయో? ఆకాశాన్ని చూడరా అది పైకి ఎలా ఎత్తబడిందో? కొండలను చూడరా అవి ఎలా పాతిపెట్టబడ్డాయో? భూమిని చూడరా అది ఎలా పరచబడిందో?** (దివ్య ఖుర్'ఆన్ 88:17-20)

**"ఆయన ఏ వస్తువును చేసినా చక్కగానే చేశాడు ....."** (దివ్య ఖుర్'ఆన్ 32:7)

**1 జీవకణంలో అద్భుత నిర్మాణం**

**2-4 కంటిలో అద్భుతం :** కన్నులాంటి ఖచ్చితమైన అవయవం అల్లాహ్ చేసిన సృష్టినుండి కాకుండా, మరే విధంగానూ తయారుకాలేదు. దానిలో గొప్ప టెక్నాలజీ ఉంది. ఎంతో వివేకమైన డిజైనూ ఉంది.

ఓ కారుషెడ్‌లోకి ఇనుప ముక్కలు, గాజుపెంకులు, రబ్బరు ముక్కలు విసిరేస్తే, కొంతకాలానికి అవి అన్నీ వాటికవే మార్పుచెంది, షెడ్‌లో నుండి ఓ అందమైన 'కారు' బయటికి వచ్చింది ... అని ఎవరైనా చెబితే మీరు నమ్ముతారా?

ఈ వ్యవస్థలన్నింటిని సృష్టించి, వాటిమధ్య గొప్ప సామరస్యాన్ని ఏర్పాటు చేసిన అల్లాహ్ సర్వశక్తిమంతుడు.

**5-6 రక్తం - జీవాన్నిచ్చే ద్రవం :** మానవ శరీరం పరిణామ సిద్ధాంతంచే అనుకోకుండా జరిగిన దానివలననో (లేదా) క్రమంగా అభివృద్ధి జరిగిందనే ఆధారరహిత ప్రతిపాదనల ద్వారా రక్తం యొక్క ఈ క్లాటింగ్ వ్యవస్థను దోషరహితంగా వివరించడం అసాధ్యం.

**7 అద్భుత మిశ్రమం - తల్లి పాలు**

**జ్ఞానం - అజ్ఞానం**

**1-3** జ్ఞానం ఉండి కూడా అజ్ఞానులైన వారి గురించి నిర్వచించడం జరిగింది. నాస్తికులు మరియు హేతువాదులు ఇస్లామ్‌పై వ్రాసిన తప్పుడు వ్రాతలను వాస్తవాలతో ఖండించడం జరిగింది. **నాస్తిక జ్ఞాని పేరు:** ఇ.ఎ. జబ్బార్ ఈయన వ్రాసిన వ్యాసం: **ఖురాన్ నన్ను హేతువాదిని చేసింది.** ప్రచురించిన పత్రిక పేరు : **నాస్తిక యుగం,**

**4 జీవితాన్ని సవాలు చేసే ప్రశ్నలు** పేరుతో ఓ మత ధర్మానికి చెందిన వ్యక్తి ఇస్లామ్ విషయంలో వ్రాసిన తప్పుడు వ్రాతలను ఖండించడం జరిగింది.

**5-8 మాజీ నక్సలైట్, హేతువాది 'క్రాంతికార్'** ఇస్లామ్‌పై విషం కక్కుతూ వ్రాసిన 'ప్రపంచ ముస్లిం మేధావుల దృష్టిలో ఇస్లాం అంటే ...' లోని విషయాలను ఖుర్‌ఆన్ ద్వారా ఖండించి, అతని అజ్ఞానాన్ని, మత దురభిమానాన్ని బయటపెట్టడం జరిగింది.

**నాస్తికుని ప్రశ్న**

**1 భూమి మీదికి లక్షల సంఖ్యలో ప్రవక్తలను పంపడం అవసరం అని అల్లాహ్ భావించినపుడు, మానవులందరికీ సరిపోయినంత ఆహారాన్ని ఇవ్వాలని అల్లాహ్‌కు ఎందుకు అనిపించలేదు? ఒకప్పుడు గాని, ఇప్పుడు గాని భూమిమీద ఎందుకీ ఆకలి చావులు?**

అమెరికాలో, అక్కడి ప్రజలకు సరిపోగా, మిగిలిన ఆహారంతో ఆఫ్రికాలోని ప్రతీ ఖాళీ కడుపును నింపవచ్చు.

ఫ్రాన్స్ ప్రజలు వదిలేసిన వాటితో ప్రజాస్వామ్య రిపబ్లిక్ అయిన 'కాంగో' దేశ ప్రజలను పోషించవచ్చు.

ఇక ఇటలీ విషయానికొస్తే, వీరు ఇథియోపియాలోని పోషకాహారం లేక బాధపడుతున్న వారిని పోషించవచ్చు.

చూశారా! అల్లాహ్ మొదటే తిండిని ఏర్పాటు చేశారు. తరువాత మానవులు

ఆహారాన్ని వృధా చేయకుండా మానవత్వంతో మనిషిలా బ్రతకడానికి సరియైన మార్గం చూపడానికే మార్గదర్శులుగా ప్రవక్తలను పంపారు. సృష్టికర్త కరుణామయుడు కదా!

2. **పూర్వపు రోజులలో ఎక్కువ యుద్ధాలు 'ఆహారం' కోసమే జరిగాయి. భూమి మీద కొన్ని చోట్ల ఎందుకు ఆహారం దొరకదు. ఇస్లాం ధర్మాన్ని అనుసరించే వారిలో పేదరికం ఎందుకుంది?**

3. **ఇస్లాంపై వచ్చే విమర్శలను చాలామంది ముస్లిములు చదవడానికి ఎందుకు భయపడతారు (లేదా) చదవడానికి ఎందుకు ఇష్టపడరు? మిగతా మతధర్మాల విషయంలో కూడా ఇంతే!**

4. ప్రతీ బిడ్డ పుట్టుక వెనుక మిలియన్ల కొద్దీ వీర్య కణాలు (sperm cells) **ఎందుకు వృధాగా పోతున్నాయి?**

8. **1400 సంవత్సరాలకు పూర్వం ఉండే సైన్స్, ఖుర్'ఆన్‌లోని సైన్స్‌కి భిన్నంగా ఉందా?**

**టెర్రరిజం:**

1. ప్రపంచంలో సుమారు **150** కోట్ల మంది ముస్లిములు ఉన్నారు. వీరిలో **1** శాతం కంటే చాలా తక్కువ, కనీసం **0.1** శాతం మంది కూడా తీవ్రవాదులు కారు. ఒక వర్గంలో 99.9 శాతం కంటే ఎక్కువ మంది తీవ్రవాదులు కానప్పుడు, ఆ వర్గం వారి ధర్మాన్ని తీవ్రవాదానికి ఎలా తగిలించారు? ఇంతకంటే ఘోరమేమైనా ఉందా?

2. **19వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన తీవ్రవాద దాడులు** : ఈ దాడులలో ఏ ఒక్కటీ ముస్లిమ్ చేయలేదు.

3. **20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన తీవ్రవాద దాడులు (1901 నుండి 1950 వరకు)** : ఇప్పటివరకూ అందించిన వివరాలను బట్టి, 1940 సం॥ వరకూ, ముస్లిములకూ తీవ్రవాద దాడులకు ఎటువంటి సంబంధమూ లేదు. జరిగిన దాడులన్నింటికీ ఇతరులే కారణం.

4. **20వ శతాబ్దంలో ప్రపంచవ్యాప్తంగా జరిగిన తీవ్రవాద దాడులు (1950 నుండి 1959 వరకు)** : ఖుర్'ఆన్ గ్రంథ అవతరణ మొదలైన తరువాత 1380 సం॥ల వరకూ 'ఇస్లామిక్' తీవ్రవాదం అనే పదం ఎక్కడా ఉపయోగించబడ లేదు. గత 20 సంవత్సరాలుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. 'ఇస్లాం'కి తీవ్రవాదానికి అసలు సంబంధమే లేదని వివేకం గలవరికి సులభంగా అర్థమౌతుంది.

**దాడి చేసినవాడి రక్తసంబంధీకులకే ఆ దాడితో సంబంధం లేనప్పుడు, దాడిచేసిన వాడెవడో కూడా తెలియకపోయినా ఎక్కడో దూరంగా బ్రతుకుతున్న అదే మతధర్మం వారిని అనుమానించడం, అవమానించడం న్యాయమా? ఇలా చేయడం సంస్కారమనిపించుకుంటుందా?**

5-6 **అమెరికాలో జరిగిన తీవ్రవాద దాడులు** : అల్-ఖైదా అంటే డేటాబేస్. అమెరికా సిఐఏ కు - అల్ ఖైదాకు, హెడ్లీకి ఉన్న సంబంధాలపై ఆధారాలతో రిపోర్ట్

7 **ఆలోచింపజేసేందుకే ...** ప్రపంచానికి పొంచి ఉన్న పెనుముప్పు - అమెరికా. ప్రముఖ దినపత్రికలలో ప్రచురించబడిన ఆధారాలతో రిపోర్ట్. **అమెరికా తన రక్తదాహం తీర్చుకోవడానికి ప్రపంచంలోని ఏ ప్రాంతాన్ని ఎన్నుకుంటే, అక్కడ లాడెన్ ఉన్నాడని చెప్పి, అక్కడ మారణహోమాన్ని సృష్టిస్తుంది. గత 15 సంవత్సరాలలో, సగటున ఏడాదికి ఒక లక్షమంది చొప్పున ప్రపంచ ప్రజలను చంపిన క్రూరమైన దేశం అమెరికా.**

8 **నేరస్తున్ని శిక్షించాలి :** లాడెన్ బ్రతికున్నాడా? మరణించాడా? అమెరికా చెప్పే అబద్ధాలపై ఫోకస్

**ఖుర్'ఆన్‌ను అర్థం చేసుకుంటూ చదువుదాం!**

**1-10** ఇప్పటి వరకూ 240 అరబీ పదాల అర్థాలను అందించాము. ఇవన్నీ నేర్చుకుంటే ఖుర్'ఆన్‌లో ఉన్న దాదాపు 77,800 పదాలలో 51.6 శాతం పదాలు (అంటే ఖుర్'ఆన్‌లోని సగం పదాలు) నేర్చుకున్నట్లే.

**ముస్లిమ్ యువత ఆలోచించండి :**

1 **యువకులు తులనాత్మక అధ్యయనంపై, డిబేట్లపై చూపిస్తున్న ఆసక్తిపై**

2. **దైవ విశ్వాసి అయిన యువకుడు ఎటువంటి స్త్రీని తన జీవిత భాగస్వామిని ఎన్నుకోవాలి?**

3. **భార్యా భర్తలిద్దరూ సమానమేనా?**

4. **గుడ్డి నమ్మకాలు**

5-6 **అహంకార భావం - ఆత్మ న్యూనతాభావం**

7. **చదువు - జీవనోపాధి**

8. మీరు గౌరవించబడాలని ... *A sincere request to our beloved sisters* ఎక్కడ స్త్రీ గౌరవించబడుతుందో, ఆ సమాజం బాగుంటుంది. అటువంటి ఉత్తమ సమాజం కొరకు, ఉత్తమ గౌరవాన్ని పొందడం కొరకు మీరు ఇస్లామీయ వస్త్ర ధారణతో తొలి అడుగు వేయాలని కోరుతున్నాము.

**ఇంటర్‌నెట్‌లో ఇస్లాం కబుర్లు :**

3 **ఖుర్'ఆన్‌లోని సూరహ్‌ల వరుసక్రమం (Serial Order of Chapters in Holy Qur'an)**


4. **గేరీ మిల్లర్ (GARY MILLER) గారి వ్యాసంలోని కొన్ని ముఖ్యాంశాలు: ఖుర్'ఆన్‌లోని కొన్ని పదాల సమీకరణాలు**

5-6 **ఒకే పదం ఒక నియమిత సంఖ్యలో రావడం**

**బాలబాలికలకు ప్రత్యేకం :**

స్కూల్స్‌లో సైన్స్ బుక్‌లో ఇచ్చే తప్పుడు విషయాలను తెలిపి, వాస్తవ విషయాలను అందించే శీర్షిక. సృష్టి గురించి మరియు సృష్టికర్త గురించి అర్థం కావడానికి సులభమైన వివరణలు.

(మిగతా భాగం 13వ పేజీలో ....)




**గత సంచికలలో మొదటి సంచిక తప్ప**
**మిగతా ఏ సంచిక కోసమైనా మమ్మల్ని సంప్రదించండి.**
**విడి సంచిక వెల: 15/- మాత్రమే**

ఏ ధర్మాన్ని కించపరిచే ఉద్దేశ్యం మాకు లేదు. అన్ని ధర్మాలను గౌరవిస్తున్నాం

# టెర్రరిజం

- క్రైస్తవ టెర్రరిజం ?
- సిక్కు టెర్రరిజం ?
- యూదు టెర్రరిజం ?
- కమ్యూనిస్ట్ టెర్రరిజం ?
- హిందూ టెర్రరిజం ?
- ఇస్లామిక్ టెర్రరిజం ?

తీవ్రవాదానికి, మత ధర్మానికి ఏ విధమైన సంబంధం లేదు. ✓

**టెర్రరిజం అనేది ముస్లిములకే స్వంతమన్నట్లు, మీడియా ఎందుకు ముస్లిములనే టార్గెట్‌గా పెట్టుకుంది?**

తీవ్రవాదాన్ని 'ముస్లిము'లుగా మేము ఖండిస్తున్నాం. మానవులకు అపకారాన్ని తలపెట్టే ఏ పనినైనా మేం వ్యతిరేకిస్తాం. మానవులందరూ ఒకే జంట యొక్క వారసులని, ఖుర్'ఆన్ ద్వారా తెలుసుకుని ప్రపంచ ప్రజలందరినీ వారు హిందువులైనా, క్రైస్తవులైన లేక మరే ధర్మానికి చెందిన వారైనా సరే, వారిని మా సోదరులుగానే భావిస్తున్నాం. మా సోదరులపై జరిగే ఎటువంటి హింసనైనా నిర్ద్వంద్వంగా ఖండిస్తున్నాం. కాని మీడియా వారి రెండు నాలుకల ధోరణిని వివరించాలనేది ఈ శీర్షిక యొక్క ప్రధానోద్దేశం కాబట్టి ఈ శీర్షికలో మీడియా భాషనే వాడుతున్నాం. మా భాష మాత్రం కాదు. వేరే ధర్మం వారి ఎవరికైనా బాధ కలిగితే, మీడియా వారి వలన ముస్లిములకు కూడా అంతే బాధ కలిగిందని అర్థం చేసుకుని, కొంత మంది ప్రోద్బలంతో మీ తోటి ముస్లిం సోదరులపై అనాగరికంగా వ్రాస్తున్న మీడియా వ్రాతలను ఖండించమని కోరుతున్నాం.

**9 & 10**

## సెప్టెంబర్ దాడి

**అబ్దుల్లా(రజి) ఉల్లేఖనం : "అల్లాహ్ యొక్క సందేశహరులు చెప్పారు: మీరు నిజాయితీగా ఉండాలని ఆదేశిస్తున్నాను, నిజాయితీ ధర్మపరాయణతకు దారి తీస్తుంది మరియు ధర్మ పరాయణత స్వర్గానికి దారి తీస్తుంది. ఒక మనిషి నిజాన్ని చెప్పడం కొనసాగించవచ్చు మరియు నిజం పలకాలనే కృషి చేస్తుండవచ్చు. అల్లాహ్ దగ్గర అతడు నిజాయితీపరుడని వ్రాయబడేవరకూ. మరియు అబద్ధాల విషయంలో జాగ్రత్తపడండి, అబద్ధాలు పలకడం దుర్మార్గానికి దారితీస్తుంది మరియు దుర్మార్గం నరకానికి దారి తీస్తుంది. ఒక మనిషి అబద్ధాలు చెప్పడం కొనసాగించవచ్చు మరియు అతని కృషి అబద్ధాలు చెప్పడానికే కావచ్చు అల్లాహ్ దగ్గర అతడు అబద్ధాలకోరు అని వ్రాయబడేవరకూ.**

**(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 6639, పుస్తకం 45, అధ్యా. 29, సంపుటి 6)**

అబద్ధాలు చెప్పడం వలన మనిషి ఎలా పతనమౌతాడో పై హదీస్ చాలా స్పష్టంగా తెలియజేస్తుంది. కాని నేటి నాగరికత పూర్తిగా అబద్ధాల పునాదులపైనే నిర్మించబడిందంటే, అది అతిశయోక్తి కాదు. మోడరన్ మేన్ అంటే అబద్ధాలను అలవోకగా చెప్పేవాడు.

ఒకో కాలంలో ఒకో దేశం పై స్థాయిలో (అంటే ఆర్థికంగా పై స్థాయిలో) ఉంటుంది. తన స్థాయిని చూచుకుని విర్రవీగడం, దాని పర్యవసానంగా ఆ దేశం నాశనమవ్వడమనేది చరిత్రలో కనిపిస్తూనే ఉంటుంది. ప్రస్తుతం కాలంలో ఆ స్థానంలో అమెరికా ఉంది. ఇది ప్రపంచంలోనే అతి పెద్ద (అ)నాగరిక దేశం.

ఇక 'అమెరికా' ఆడే అబద్ధాలకు హద్దే ఉండదు. వారి అబద్ధాలను యదావిధిగా ప్రజలకు అందించే మీడియా వారికి సిగ్గుండదు. ఒక చిన్న సంఘటన జరిగితే చాలు, దానిపైనే రోజంతా విశ్లేషణలు చేయిస్తూ, న్యూస్ ఛానెళ్ళ వారి స్టుడియోలు కిక్కిరిసి పోతాయి. అమెరికా వాని లీలలను మాత్రం విశ్లేషించే ధైర్యం మీడియా చేయబోదు. బహుశా మల్టీ నేషనల్ కంపెనీల యాడ్స్ మిస్ అవుతాయనో? లేక ఏ ఇతర ప్రయోజనాలను కోల్పోతారనో? నిజం అల్లాహ్‌కే తెలియాలి.

అమెరికా వాడు మిగతా దేశాల ప్రజలను 'ఏది చెబితే అది నమ్మివేసే వెర్రివాళ్ళు అనుకుంటున్నాడు".

### బిన్ లాడెన్‌ను తప్పించిన వారెవరు?

క్రిందటి సంచికలో చదివి ఉంటారు. తమ సైనిక అధికారులు బిన్ లాడెన్‌ను చుట్టుముట్టి , అతనిని ఏమీ చేయకుండా వచ్చేశారని నవంబర్ 29, 2009 తేదీన ప్రకటించారు. బిన్‌లాడెన్‌ను వదిలి వచ్చినందుకు ఎవరిని శిక్షించాలి?

తమ సైనిక అధికారులను కదా శిక్షించాలి.

కాని కొన్ని రోజుల క్రితం ప్రచురించబడిన న్యూస్ ఐటమ్ చదివాక

**ఖుర్'ఆన్ గ్రంథ అవతరణ మొదలైన తరువాత 1380 సం॥ల వరకూ 'ఇస్లామిక్' తీవ్రవాదం అనే పదం ఎక్కడా ఉపయోగించ బడలేదు. గత 20 సంవత్సరాలుగా ఈ పదాన్ని ఉపయోగిస్తున్నారు. 'ఇస్లాం'కి తీవ్రవాదానికి అసలు సంబంధమే లేదని వివేకం గలవారికి సులభంగా అర్థమౌతుంది.**

ఆశ్చర్యమేసింది. "బిన్‌లాడెన్ వంటవానికి 14 సంవత్సరాల జైలు శిక్ష". బిన్ లాడెన్‌ని పట్టుకుని శిక్షించగలిగే అవకాశాన్ని వదిలేశాక, అతడే స్వయంగా రాచమార్గంలో అందరూ చూస్తుండగానే ఆఫ్ఘనిస్తాన్‌ని వదిలి వెళ్ళిఉండవచ్చు కదా! (ఒకవేళ బిన్ లాడెన్ అప్పటికే గనుక చనిపోక పోయి ఉంటే)

అమెరికా సైనిక అధికారులే వదిలివేశాక, అతను రహస్యంగా తప్పించుకోవలసిన అవసరం ఎంతమాత్రం లేదు.

అతని వంటవానికి తప్పించవలసిన అవసరమేమొచ్చింది?

ప్రజలు గొర్రెలా? క్రిందటి నవంబర్ నెలలో ఇచ్చిన ప్రకటన మర్చిపోయి ఉంటారని భావించి, ఈ కొత్త ప్రకటన ఇచ్చారు. అమెరికా నాయకులు చేస్తున్న ఈ పిచ్చి చేష్టలు చూస్తుంటే, బిన్ లాడెన్ చనిపోయి ఉండాలనే విషయం బలపడుతుంది. అతను చనిపోలేదని నమ్మించ డానికే ఈ సర్కస్ చేస్తున్నట్లు ఎవరికైనా అనుమానమొస్తుంది.

అమెరికన్ల విధానం దుర్మార్గమైనదని ప్రపంచ ప్రజలకు తెలియనిదేమీ కాదు. అయినప్పటికీ ఇంత మూర్ఖంగా తెలివితక్కువగా స్టేట్‌మెంట్స్ ఇవ్వడం చూస్తుంటే, ప్రపంచానికి వీరి వలన పెనుముప్పు పొంచి ఉందని అర్థమౌతుంది. ఎందుకంటే మూర్ఖులు ఏ సమయంలో ఏమి చేస్తారో వారికే తెలియదు. అమెరికన్ల దగ్గర ఎన్నో భయంకరమైన ఆయుధాలున్నాయి. ప్రపంచ దేశాలు అప్రమత్తంగా లేకపోతే అమెరికా వంటి powerful దేశం ఏమైనా చేయవచ్చు.

'ఇరాన్' దగ్గర అణుబాంబు ఉంటే ప్రపంచానికి ప్రమాదమట. అంతేకాకుండా, పాకిస్తాన్ ఉగ్రవాదులను ఎగుమతి చేస్తుంది అంటూ బ్రిటన్ ప్రధాని కామెరాన్ చెబుతున్నారు. మరి పాకిస్తాన్ దగ్గర అణుబాంబు ఉంది కదా!

అటువంటప్పుడు పాకిస్తాన్ అణుబాంబు వలన ప్రమాదముండదా? కాని పాకిస్తాన్‌పై కాకుండా 'ఇరాన్'పైనే ఎందుకు ఆంక్షలు విధించాలి? అమెరికా వాడిచ్చిన క్లస్టర్ బాంబులతో మారణహోమం సృష్టించే ఇజ్రాయేల్‌పై ఐక్యరాజ్యసమితి ఆంక్షలు విధించగలదా?

ప్రపంచానికి ఉగ్రవాదులను ఎగుమతి చేసే దేశంగా పాకిస్తాన్ దేశాన్ని గుర్తించిన అమెరికా, బ్రిటన్‌లు ఆ దేశంతో స్నేహం చేస్తూ, తీవ్రవాదానికి వ్యతిరేకంగా పోరాడుతున్నామని చెప్పడంలో అర్థం లేదు.

**ప్రపంచ వినాశకారి - అమెరికా**

పై విషయాల గురించి మనస్సు పెట్టి ఆలోచించండి. అసలు విషయం బోధపడుతుంది. ఈ విషయం అర్థం కావడానికి కొన్ని వాస్తవ సంఘటనలను ఇక్కడ అందిస్తున్నాము. మనదేశంలో ఈ మధ్య ఎన్నో ఫార్మా ఫ్యాక్టరీలు (మందుల ఫ్యాక్టరీలు) స్థాపించబడ్డాయి. ఇది పారిశ్రామిక అభివృద్ధికి సూచన అని తెలియక చెప్పవచ్చేమోగాని, వాటి వలన మన వాతావరణం, నీరు ఎంత కాలుష్యమవుతున్నాయో, ఎన్ని పల్లెలు వాటివలన బాధలు అనుభవిస్తున్నాయో ఎంతమందికి తెలుసు?

వీటిలోని ఎక్కువ ఫ్యాక్టరీలలో 'ఇంటర్‌మీడియట్స్'ను తయారు చేస్తున్నారు. వాటిని అమెరికా వంటి దేశాలకు ఎగుమతి చేయడం జరుగుతుంది. ఆ ఇంటర్‌మీడియట్స్‌తో అక్కడ టేబ్‌లెట్స్ వంటివి తయారు చేస్తారు. వారు వ్యాపారం బాగానే చేసుకుంటున్నారు. కాని వాటి వల్ల వచ్చే కాలుష్యం మాత్రం మనం అనుభవించాలి.

తమ దేశంలోని చెట్లను నరకరు. వేరే దేశంలోని చెట్లను నరికింపజేసి, వాటిని దిగుమతి చేసుకుంటారు. వారి దేశం అన్ని విధాలా బావుండాలి.

ఇదే విధంగా ప్రపంచంలోని అభివృద్ధి చెందుతున్న దేశాలలో అశాంతిని పెంచే విధంగా ఉగ్రవాద దాడులు చేయించేది కూడా అమెరికాయేనని జరుగుతున్న పరిణామాల ద్వారా తెలుస్తుంది.

**ఒకవేళ 'పాకిస్తాన్' ఉగ్రవాదులను తయారుచేయడం నిజమే అయితే అక్కడ ఆ ఉగ్రవాద ఫ్యాక్టరీని స్థాపించి, నిర్వహించేది అమెరికాయే! దానివలన నష్టపోయేది 'పాకిస్తాన్' మరియు ఇతర అభివృద్ధి చెందుతున్న దేశాలే!**

ఎవరో కారు డ్రైవర్ చెప్పాడని, నిజం నిర్ధారించు కోకుండానే, ఇరాఖ్‌పై దాడిచేసి ఆ దేశాన్ని సర్వనాశనం చేసి, ఆ దేశాన్ని దోచుకుంటున్న ఇంటర్ నేషనల్ బందిపోటు దొంగ - 'అమెరికా'.

పాకిస్తాన్‌పై దాడిచేయడానికి కారు డ్రైవరో లేక లారీ డ్రైవరో చెప్పవలసిన అవసరం కూడా లేదు, అమెరికా దేశానికి తోడుదొంగ అయిన బ్రిటన్ దేశపు ప్రధానే స్వయంగా చెప్పాడు కాబట్టి, పాకిస్తాన్‌పై దాడి చేయాలి. పాకిస్తాన్‌పై దాడి చేసినా సరే, ఏ దేశం కూడా అభ్యంతరం చెప్పదు. ఎందుకంటే పాకిస్తాన్ ఏర్పడినప్పటినుండి దానికి మిత్ర దేశంగా ఉంటూనే, పాకిస్తాన్‌ను చెడ్డ దేశంగా ప్రపంచం ముందు చిత్రీకరించేది కూడా అమెరికాయే.

పులితో స్నేహం చేసే మేక బ్రతుకు పాకిస్తాన్‌ది.

పాకిస్తాన్‌పై మాత్రం దాడి చేయదు. ఇరాఖ్‌పై దాడిచేస్తే ఆయిల్ దొరుకుతుంది. పాకిస్తాన్‌లో ఏం దొరుకుతుంది? అయితే మీకొక సందేహం రావచ్చు, ఆఫ్ఘనిస్తాన్‌లో ఏం దొరుకుతుందని అక్కడ అమెరికా తిష్ట వేసిందని. కారణం లేకుండా అమెరికా వంటి తోడేలు తిష్ట వేస్తుందా? నిజం తెలియాలంటే ఇంకా వేచి చూడాలి.

అయితే ఒకటి మాత్రం చెప్పవచ్చు. తాము తయారుచేసే అధునాతన ఆయుధాలు ఎలా పనిచేస్తున్నాయో చూపించడానికి, కొన్ని దేశాలను ఎన్నుకుని, అక్కడ మారణహోమం సృష్టిస్తున్నారని అనిపిస్తుంది.

**సెప్టెంబర్ 11 దాడి :**

ఎప్పుడో అయిపోయిన దాడి గురించి మరలా ఎందుకండి అని పాఠకులు అంటారేమోనని సందేహం మాకు లేదు. ఎందుకంటే, మనదేశంలో ఇవి సామాన్యమే! 40 సంవత్సరాల క్రితం జరిగిపోయిన వాటి గురించి కూడా మరలా తిరగతోడి, ఇప్పుడు వాటికి సారీ చెప్పించడం చూస్తూనే ఉన్నారు.

కాని మా ఉద్దేశ్యం అది కాదు సుమా!

క్రిందటి సంవత్సరం ఆగష్టు 23వ తేదీన 'శాంతిబాట' ప్రారంభించాము. టెర్రరిజం శీర్షికలో తొలివ్యాసం పరిచయ వ్యాసం గనుక ఈ దాడి గురించి చెప్పడానికి వీలుపడలేదు. రెండవ సంచిక విడుదలయ్యే సమయానికి సెప్టెంబర్ 11 దాటిపోవడంతో అప్పుడు చెప్పలేకపోయాము.

ఈ సెప్టెంబర్ 11వ తేదీన రమదాన్ పండుగ (ఈదుల్ ఫిత్ర్) కావచ్చు. ఆ రోజున అన్ని టీవి చానళ్ళలో మరలా ఓసారి సెప్టెంబర్ 2001లో అమెరికాలోని ట్విన్ టవర్స్‌పై జరిగిన దాడిని పదే పదే చూపించి, మన మీడియా అమెరికాపైనున్న ఉడతా భక్తిని ప్రదర్శిస్తుందని ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**అసలు ఈ దాడి చేసిందెవరు?**

ఓ ఇస్లామీయ వెబ్‌సైట్‌నుండి , ఓ జోక్‌ను మా 'శాంతిబాట'కు ఓ సోదరుడు ఈమెయిల్ చేశారు. ఇది ఓ జోక్ మాత్రమే. కాని ఇది వాస్తవ పరిస్థితిని చాలా సులభంగా అర్థమయ్యేలా చేస్తుంది.

**"అమెరికాలోని న్యూయార్క్‌లో ఓ చిన్నారి (అమెరికన్ బాలిక)పై ఓ పెద్ద కుక్కదాడిచేయబోతుంటే, ఓ యువకుడు అది చూచి, ఆ కుక్కతో తలపడి ఆ బాలికకు ఏమీ కాకుండా ఆ పాపను రక్షించాడు. అయితే ఆ విధంగా తలపడడంలో కుక్క చనిపోయింది. దూరం నుండి ఇదంతా చూస్తున్న అమెరికన్ పోలిస్ వచ్చి ఆ అబ్బాయితో 'జరిగినదంతా నేను చూశాను. రేపు పేపర్లో ఓ న్యూయార్క్ యువకుడు వీరోచితంగా పోరాడి ఓ పాపను రక్షించాడని వస్తుంది" అని చెప్పి ఆ యువకున్ని అభినందించాడు. అయితే ఆ యువకుడు "నేను న్యూయార్క్ వాసిని కాదండి" అని సమాధానమిచ్చాడు. "పోనీలే! ఓ అమెరికన్ యువకుడు, ఓ పాపను కుక్కబారినుండి రక్షించాడు అని పేపర్లో వస్తుంది" అని సదరు పోలీస్‌వారు చెప్పారు. "నేను అమెరికన్‌ని కాదండి. నేను సౌదీ అరేబియా నుండి వచ్చాను" అని ఆ యువకుడు చెప్పాడు.**

**"అయితే రేపు పేపర్లో ఓ తీవ్రవాది ఓ అమాయక అమెరికన్ కుక్కను చంపేశాడు అని వస్తుంది" అన్నాడు.**

ముస్లిములను ప్రపంచ మీడియా ఏ విధంగా చిత్రీకరిస్తుందో చెప్పడానికి పై జోక్‌ను ఉపయోగించుకున్నాము. **ఏ తీవ్రవాద దాడి జరిగినా సరే, వెంటనే దానిని ముస్లిములపైకి తోసేయడం ఆనవాయితీ అయిపోయింది.**

ఈ మధ్య కాలంలో మస్జిద్‌లో బాంబు పేలుళ్ళకు కారణం ముస్లిములు కాదని, మరో మతానికి చెందిన వారని తెలిసింది. బాంబు పేలుళ్ళకు ముస్లిములే కారణమని అప్పట్లో కథనాలు వ్రాసిన పత్రికలు, ఈ నిజాలు తెలిశాక, ''తప్పుడు కథనాలు వ్రాసినందుకు క్షమించమని పత్రికాముఖంగా ప్రకటించాయా?''.

ఆ పనిచేయరు. నిజం తెలిసినా కూడా ఆ మచ్చ ముస్లిములపై అలాగే ఉండిపోవాలి.

మరోసారి దాడి జరిగినప్పుడు, కనీసం ఈ సారైనా తొందరపడ కూడదు అని అనుకుంటారా? లేదు. ఇందులో ముస్లిముల హస్తముందని విశ్వసనీయవర్గాల ద్వారా తెలిసింది అంటారు. నిజానికి వీరికి అటువంటి వర్గాలు ఏమీ ఉండవు. 'సాధ్వి' అరెస్ట్ గురించి మరియు ఓ మతం తరపున పనిచేసే తీవ్రవాద సంస్థలో ఆమె పనిచేస్తుందని పేపర్లో రాగానే, ఓ జాతీయ రాజకీయ పార్టీ వారు వీరంగం సృష్టించారు.

అయితే ఈ 'సాధ్వి' వంటివారు చేసినదానికి, ఆమె మతానికి ఏదైనా సంబంధం ఉందేమోనని ప్రకటించేటంత సంకుచిత స్వభావం మాకు లేదు. కొందరు వ్యక్తులు చేసినదానికి, ఆ మతాన్ని దూషించడం సంస్కారుల లక్షణం కాదు. ప్రపంచ శాంతిదూత ముహమ్మద్(స)వారు మాకు నేర్పిన సంస్కారం మా చేత ఆ మాట అనిపించదు.

ఇతరులు మాత్రం 'ఇస్లాం'గురించి అంటున్నారు. ఆ విషయం వారి విజ్ఞతకు, సంస్కారానికే వదిలేద్దాం.

తెలుగులో నిషేధించబడిన తస్లీమా నస్రీన్ నవలను హైదరాబాద్‌లో ఆవిష్కరించేటప్పుడు, ఆమెపై కొందరు ముస్లిములు దాడి చేసిన విషయం పాఠకులకు తెలిసినదే. ఈ దాడిని ఇస్లామ్ మతానికే ఆపాదించారు.

ఈ మధ్యనే ఒక ప్రవాస భారతీయుడు (ఆంధ్రుడు) 'తెలుగుతల్లి' పేరుమీద పుస్తక ఆవిష్కరణ చేసినప్పుడు దాడి జరిగింది. సీనియర్ పాత్రికేయులు వేదికపై నుండి పారిపోవలసి వచ్చింది. దాడిచేసినవారు ముస్లిములు కారు. ఈ దాడికి మతం రంగును పులిమే ధైర్యం మీడియాకు ఉందా?

అస్సామ్, నాగాలాండ్‌లలో ఎన్నో తీవ్రవాద దాడులు జరిగాయి, జరుగుతూనే ఉన్నాయి. వాటిలో ఎక్కువ సంఖ్యలో ఓ మతం పేరుతో కూడా జరుగుతాయి. కాని వాటి గురించిగాని, ఆ మతం గురించి గాని ఎవరూ మాట్లాడరు. ఒకవేళ మాట్లాడవలసి వస్తే, ఆ సంస్థల పేర్లను ఏవో 4 బీజాక్షరాలుగా చెబుతారు. అంతే!

ఒకవేళ అటువంటి దాడిచేసిన వాడికి పొరపాటున ముస్లిమ్ పేరు ఉంటే, 'ఇస్లామ్'పై విషం కక్కుతారు. ఇదొక రాక్షసనీతి.

**అదే విధంగా సెప్టెంబర్‌లో జరిగిన దాడి ముస్లిములే చేశారా? లేక అమెరికన్లే చేశారా?**

అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థ 'అల్ ఖైదా' చేసింది అని టి.విల్లో ప్రసారం చేశారు. అల్-ఖైదాను సృష్టించింది అమెరికాయేనని ఆధారాలతో

సహా 'శాంతిబాట' ముందరి సంచికలలో వివరించాము.

అమెరికా సృష్టించిన అల్-ఖైదా, అమెరికన్ ట్రేడ్ సెంటర్‌ని కూల్చివేస్తే, దానికి బాధ్యత వహించవలసింది అమెరికాయే!

ఒక బిల్డింగ్‌లో బాంబు పేలితే, ఆ బిల్డింగ్ యొక్క శకలాలు నలుమూలలా వెదజల్లబడతాయి. కాని ట్విన్ టవర్స్ నుండి శకలాలు అలా ఎందుకు వెదజల్లబడలేదు?

ఎన్నో భవనాల మధ్య ఒక పాత బిల్డింగ్‌ను కూల్చి, కొత్త బిల్డింగ్‌ను కట్టాలనుకునేవారు, మిగతా బిల్డింగ్‌లకు నష్టం కలుగకుండా, వరుస డైనమెట్లను పెట్టి, ఒక దాని తరువాత ఒకటిగా ఓ పద్ధతిలో పేలుస్తారు. అలా చేయడం వలన బిల్డింగ్ అది ఉన్నచోట కుప్పకూలి పోతుంది. అప్పుడు ఆ డెబ్రిస్‌ని తొలగించి, అక్కడ కొత్త బిల్డింగ్ కడతారు.

అటువంటి టెక్నిక్‌తోనే 'వరల్డ్ ట్రేడ్ సెంటర్'ని కూల్చి వేయడం జరిగిందని ఎందరో సాంకేతిక నిపుణులు తెలియజేశారు.

ఈ దాడి విషయంలో అమెరికా చెప్పేవన్నీ అబద్ధాలేనని, వరల్డ్ ట్రేడ్ సెంటర్స్‌ని అమెరికాయే కూల్చివేసిందని అమెరికన్ యూనివర్శిటీ ప్రొఫెసర్లుకూడా విశ్లేషించి, వారి విశ్లేషణలను వెబ్‌సైట్లలో ఉంచారు.

వెబ్‌సైట్లలో ఉండే సంచలన విషయాలను లాగి, పత్రికలలో సంచలన వార్తలుగా ప్రచురించే మీడియా వాళ్ళు ఈ వెబ్‌సైట్ల జోలికి ఎందుకు పోలేదు? ఈ మధ్యనే వికీలీక్స్ వెబ్‌సైట్ గురించి చెప్పడానికి తెగ ఆయాసపడిపోయిన మీడియా, అమెరికాయే దాడి చేయించిందని చెప్పే వెబ్‌సైట్లపై ఆసక్తి ఎందుకు చూపలేదు?

ఒకవైపు వాదననే విన్న ప్రజలకు, రెండవవైపు వాదనను ఇన్షాఅల్లాహ్ మేము వినిపిస్తాం. వాటిపై మీరు ఆలోచించి, మీ విశ్లేషణలను మాకు పంపండి. వాటిని మేము ప్రచురిస్తాం.

అమెరికాపై దాడిచేసిన ప్రతీ సంస్థ అంతర్జాతీయ ఉగ్రవాద సంస్థే అయితే, ఇటువంటి దాడులు అమెరికాలో వందల సంఖ్యలో జరిగాయి. ముస్లిమ్ దేశాలను నాశనం చేయడానికి, అభివృద్ధి చెందే దేశాలకు అవరోధాలు కల్పించడానికి, మత దురభిమానంతో 'ఇస్లామ్'పై విద్వేషాన్ని కక్కడానికి అమెరికాయే ఈ పనులన్నీ చేయిస్తుందని ప్రముఖులందరికీ తెలుసు.

కాని వారి నోళ్ళు మూగబోయాయి.

'సత్యం' బయటపడటం ఆలస్యం కావచ్చేమోగాని, దానిని భూస్థాపితం చేయడం ఎవరికీ సాధ్యం కాదు. ఏదో ఒకరోజు అది బయటపడుతుంది.

ఒకవేళ ఈ దాడి అల్-ఖైదా చేయించింది అనుకుందాం. అది నిజమైనా కూడా ఆ దాడికి, ముస్లిములకు సంబంధం లేదు. మన దేశంలోనే డబ్బులిస్తే ఏ పనిచేయడానికైనా సిద్ధంగా ఉన్నారని కర్ణాటక ఉదంతం తెలియజేసింది. కాబట్టి డబ్బు తీసుకుని అల్లర్లు సృష్టించేవారు, డబ్బు తీసుకుని బాంబుదాడులు చేసేవారు ఎందరో ఉన్నారు. కసబ్ కూడా డబ్బుకోసమే దాడి చేసినట్లు చెప్పుకున్నాడు. 'కసబ్' ఇస్లామ్ గురించి తెలుసుకుని ఉంటే, అటువంటి పనులు ఎంతమాత్రం చేయలేడు.

ఎవడో చేసిన దానికి, అతని పేరుని బట్టి, 'ఇస్లామ్'ని విమర్శించడం అనాగరికం అనిపించుకుంటుంది.

**ప్రపంచంలో ఏ మత ధర్మం గురించైనా ఎవరూ టార్గెట్ చేయరు. కేవలం ఇస్లామ్‌ని మాత్రమే టార్గెట్ చేస్తున్నారు.** ఎవరెంత బురద చల్లినా, 'ఇస్లామ్' వైభవాన్ని ఓ వెంట్రుకంత స్థాయిలో కూడా ఎవరూ తగ్గించలేరు. అరచేతిని అడ్డుపెట్టి సూర్యోదయాన్ని ఎలా ఆపలేరో, 'ఇస్లామ్'యొక్క ఘనతను, దాని మానవీయతను, దాని శాంతి సందేశాన్ని ఎవ్వరూ ప్రతిఘటించలేరు.

ఇస్లామ్‌పై తెలియక అపోహలు పెంచుకున్నవారు, మా గ్రంథాలయాలకి విచ్చేయండి. నిజాన్ని తెలుసుకోండి.

ఈ దాడిని అమెరికాయే చేయించిందని నమ్మించవలసిన అవసరం మాకు లేదు. అమెరికా రాక్షసనీతిని బయటపెట్టాలని మాత్రమే మా సంకల్పం.

**దీని ద్వారా 'ఇస్లామ్'ని డిఫెండ్ చేసుకోవలసిన అవసరం మాకు లేదు.**

1400 సం॥లుగా ఒక్క అక్షరం కూడా మార్పుకు లోనుకాని ఖుర్ఆన్ గ్రంథం ప్రపంచంలో అన్నిచోట్ల లభిస్తుంది. అదే విధంగా ముహమ్మద్(స) వారి బోధనలు కూడా లభిస్తాయి.

'ఇస్లామ్' గురించి నిజం తెలుసుకోవడానికి ఎవరికైనా ఇవి చాలు.

పూర్తి టెక్నికల్ విషయాలతో సహా సెప్టెంబర్ 11 దాడి గురించి అందిస్తాము, ఇన్షాఅల్లాహ్!

- **అమెరికాలోని ట్విన్ టవర్స్‌పై నిజంగా దాడి చేసిందెవరు?**
- **ఎవరో దాడిచేస్తే ముస్లిముల దాడిగా ఎందుకు వర్ణించారు?**
- **టవర్స్‌పై దాడి చేసిన విమానంలో ప్రయాణీకులున్నారా?**
- **నిజంగా అది ప్రయాణీకుల్ని తీసుకెళ్ళే విమానమేనా?**
- **పెంటగాన్‌పై నిజంగా దాడి జరిగిందా?**
- **ట్విన్ టవర్స్ కూలిపోగానే, అమెరికన్ టివి ఛానల్ CNN పాలస్తీనియన్లు స్వీట్లు పంచుతూ విందులు చేసుకుంటున్నట్లు చూపించడం జరిగింది. కాని ఆ వీడియో అప్పటిది కాదు. ఎప్పుడో జరిగిన ఓ పెళ్ళిలో తీసిన వీడియో. ఆ తప్పును ప్రపంచవ్యాప్తంగా అందరూ వేలెత్తి చూపారు.**
- **CNN ఇంత అబద్ధమాడవలసిన అవసరమేమిటి?**
- **వెబ్‌సైట్లలో సినిమా హీరోయిన్లపై ఉంచిన అశ్లీల దృశ్యాలను తమ టివి ఛానళ్ళలో చూపించగలిగే నేటి మీడియా, ట్విన్ టవర్స్‌పై దాడి విషయంలో, అదంతా అమెరికా కుట్రేనని విశ్లేషిస్తూ, ఆ వివరాలను పొందుపరచిన వెబ్‌సైట్ల విషయంలో ఎందుకు మౌనంగా ఉంది?**
- **దాడి ముస్లిములు చేస్తున్నారా? లేక ముస్లిములపై దాడి జరుగుతుందా?**

ఇన్షా అల్లాహ్, వచ్చే సంచిక నుండి సీరియల్‌గా అందించ బడుతుంది.

డా. నాగిరెడ్డి శ్రీనివాసరావు, *M.Sc., Ph.D.*

# కాషాయ ఉగ్రవాదం
## *(Saffron Terrorism)*

'కాషాయ ఉగ్రవాదం' అనే పద సముదాయాన్ని మొట్టమొదట ఉపయోగించినవారు కేంద్ర హోమ్ మినిస్టర్ చిదంబరం గారు. ఎవరెంత చెప్పినా, ఆయన తన మాటకు కట్టుబడి ఉన్నానని చెబుతున్నారు. ఆయన హోమ్ మినిస్టర్ కనుక ఆయనకి ఇంటెలిజెన్స్ రిపోర్ట్స్ అందుతూ ఉంటాయి. ఎంత ఫక్కాగా సాక్ష్యాలు ఆయన దగ్గర లేకపోతే, 'కాషాయ ఉగ్రవాదం' అని ఆయన అనగలుగుతారు?

అంతేకాకుండా హిందువులు మెజారిటీ సంఖ్యలో ఉన్న మనదేశంలో ఈ విధంగా చెప్పడం సాహసమే అవుతుంది. 'తీవ్రవాదానికి' రంగు ఉండదని, మరలా అది నలుపని కాంగ్రెస్ పార్టీ సీనియర్ నాయకుడొకరు వ్యాఖ్యానించారు. అదే విధంగా దిగ్విజయ్‌సింగ్‌గారు కూడా ఖండించారు. అయినా సరే చిదంబరం గారు ఆ మాట మీదే నిలబడ్డారు.

"కాషాయం" అంటే "శాంతి"కి చిహ్నమని, దానికి తీవ్రవాదానికి సంబంధం ఉందనడాన్ని బిజెపివారు తీవ్రంగా విమర్శించారు. 'కాషాయం' అంటే శాంతికి చిహ్నం కావచ్చేమోగాని, 'ఇస్లామ్' అంటేనే "శాంతి". మరి 'ఇస్లామ్'కి తీవ్రవాదాన్ని కలిపి మాట్లాడినప్పుడు, ఈ ఆలోచన ఏమైపోయింది?

ఒక మతానికో, ఒక కులానికో తీవ్రవాదాన్ని ఆపాదించకూడదని నేడు చెబుతున్న రాజకీయ నాయకులు 'ఇస్లామ్'కి తీవ్రవాదాన్ని ఏ విధంగా ఆపాదించారు?

ఈ రోజుకి కూడా ప్రజాస్వామ్య దేశమైన, లౌకిక దేశమైన మన భారతదేశంలో పబ్లిష్ అవుతున్న న్యూస్ పేపర్లలో 'ఇస్లామిస్ట్ తీవ్రవాది' అని న్యూస్ ఐటమ్స్ వ్రాస్తున్నారు!

మరి లోక్‌సభలోగాని, రాజ్యసభలోగాని ఉన్న ముస్లిమ్ ఎమ్.పి.లు ఏమి చేస్తున్నారు?

ఒక ప్రెస్‌మీట్ పెట్టి ఇదే విషయంపై ఎందుకు నిలదీయలేదు?

ప్రజల సొమ్మును స్వాహా చేస్తూ, కోట్ల ప్రజాధనాన్ని దావా ప్రోగ్రామ్స్ పేరుతో ఖర్చుపెట్టే వారు ఎందుకు మౌనంగా ఉన్నారు?

జాతీయ స్థాయి వరకూ ఎందుకూ, మన రాష్ట్రంలోని ముస్లిమ్ ఎమ్.ఎల్.ఏ.లు, ఎమ్.పి.లు అదేవిధంగా 'జమియత్'ల నాయకులకు ఈ విషయం పట్టదా?

బిర్యానీ విందులతో తలమునకలైన వారికి 'ఇస్లామ్'పై గాని, ముహమ్మద్(స)వారిపై గాని తప్పుడు ప్రచారం జరుగుతుంటే చీమకుట్టినట్లు లేదు.

**కాషాయానికి ఉగ్రవాదాన్ని తగిలించడాన్ని మేము స్వాగతించడం లేదు. తీవ్రవాదానికి మతానికి ఎటువంటి సంబంధం లేదని మేము మొదటి నుండి చెబుతూనే ఉన్నాము.**

కాబట్టి సామాన్య ముస్లిమ్ ప్రజలారా! మీరే మీడియా ముందుకు రండి. నిజం చెప్పి, అసత్య ప్రచారాలను ఖండించండి. ముస్లిమ్ నాయకులు గాఢనిద్రలో ఉన్నారు. వారిని మీరు లేపలేరు. మీరు లేపినా వారు లేవరు.



# 8 ఎవరిని ప్రేమించాలి?

ఈ ప్రశ్న మీకు చాలా ఆశ్చర్యాన్ని కలిగించవచ్చు.

ప్రేమ అనేది ఒకరు ఆదేశించడం వల్లనో లేక బ్రతిమాలడం వల్లనో పుట్టేది కాదు. ఈ వ్యాసంలో చర్చించే ప్రేమ నేటి సినిమాలలో చూపించే ప్రేమ కాదు. నవలల్లో వర్ణించే ప్రేమ అంతకంటే కాదు. పసిబిడ్డకు తన తల్లిపై ఉండేటటువంటి ప్రేమ. చేయిపట్టుకుని సున్నితంగా నడిపిస్తూ, కంటిపాపలా చూసుకునే తల్లిదండ్రులపై అనిర్వచనీయమైన భావంతో హృదయంలో పుట్టేటటువంటి ప్రేమ.

ఈ ప్రేమ స్వచ్ఛమైనది. ఈ ప్రేమ తల్లిదండ్రుల సౌందర్యం మీదగాని, వారు తమ బిడ్డలకు కల్పించిన బోగభాగ్యాల మీదగాని ఆధారపడినది కాదు.

మరి కంటిపాపలా చూసుకునే తల్లిదండ్రులకు మించి, మన ప్రేమకు మరొకరు పాత్రులు కాగలరా?

కాగలరు!

సకలలోకాలకు ప్రభువైన అల్లాహ్ "ఖుర్ఆన్"లో ఇలా చెబుతున్నారు:

**"విశ్వాసులకు దైవప్రవక్త స్వయంగా తమకంటే కూడా ముఖ్యుడు"**
(ఖుర్ఆన్ 33:6)

"వారితో ఇలా అను: మీ తండ్రితాతలు, మీ కుమారులు, మీ సోదరులు, మీ సహవాసులు, మీ బంధువులు, మీరు సంపాదించిన ఆస్తిపాస్తులు, మందగిస్తాయేమోనని భయపడే మీ వ్యాపారాలు, మీకు ప్రీతికరమైన మీ భవనాలు - **అల్లాహ్ కంటే, ఆయన ప్రవక్త కంటే** మరియు ఆయన మార్గంలో పోరాడటం కంటే - **మీకు ఎక్కువ ప్రియమైనవైతే,** అల్లాహ్ తన తీర్పును బహిర్గతం చేసేవరకు నిరీక్షించండి. మరియు **అల్లాహ్ అవిధేయులైన జాతివారికి సన్మార్గం చూపడు"**
(ఖుర్ఆన్ 9:24)

అబూహురైరా(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స)వారు చెప్పారు, ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షి! మీలో ఎవరూ విశ్వాసాన్ని కలిగి ఉండరు **అతడు నన్ను తన తండ్రికంటే మరియు అతని సంతానం కంటే ఎక్కువగా ప్రేమించనంత వరకూ.** (సహీహ్ బుఖారీ, 14, పుస్తకం 2, అధ్యా. 8, సంపుటి 1)

తరువాయి హదీస్ (నెం. 15) అనస్(రజి)వారిచే ఉల్లేఖించబడింది. దానిలో **"తన తండ్రి, తన సంతానం మరియు సర్వమానవళి కంటే ఎక్కువగా ప్రేమించనంతవరకూ"** అని ఉంది

ముహమ్మద్(స)వారిపై ప్రేమ కలిగినవారే విశ్వాసులు అవుతారా? లేక విశ్వాసం కలిగిఉన్నవారే ముహమ్మద్(స)వారిని ప్రేమిస్తారా? ఈ రెండింటిలో ఏది ముందు ఏది వెనుకో అని చెప్పలేము. ఎందుకంటే ఒకదానిపై మరొకటి పరస్పరం ఆధారపడి ఉన్నాయి. అల్లాహ్‌పై విశ్వాసం ఉన్నవానికి ముహమ్మద్(స)వారిపై అచంచలమైన ప్రేమ ఉంటుంది.

మనకు నరకాగ్ని సెగ తగలకుండా, స్వర్గబోగభాగ్యాలను కలుగజేయాలని, అల్లాహ్ యొక్క సందేశాన్ని మనకు అందించిన మహాప్రవక్త ఆయన. మనం ఏ మాత్రం కష్టపడకుండా, ఎటువంటి సందేహానికి లోనుకాకుండా, ఆ సందేశం ప్రకారం ఆచరించి చూపిన మహోన్నత గురువు ఆయన. బాత్‌రూమ్‌లో శుభ్రం చేసుకోవడం దగ్గరనుండి జీవితంలోని ప్రతీ రంగానికి సంబంధించి, ప్రతీ విషయంలోనూ ఉత్తమ నడవడిక ఎలా ఉండాలో ఆచరించి చూపిన మహోన్నతుడు ముహమ్మద్(స).

**హదీస్ గ్రంథాలలో ఉల్లేఖించబడిన ఆయన బోధనలను చదువుతూ ఉంటే, పసితనంలో మన చేయిపట్టుకుని సున్నితంగా నడిపిస్తూ, మన తల్లిదండ్రులు మనకోసం పడిన తాపత్రయం గుర్తుకొస్తుంది. కొన్ని హదీసులు చదువుతుంటే కళ్ళ వెంట నీరు ధారలుగా కారుతుంది. మనందరిని ఆయన ఎంతగా ప్రేమించారో!**

మనం ఎంత గొప్పగా ఆయనను ప్రేమించినాసరే, మన ప్రేమ ఆ మహనీయుని ప్రేమ ముందు వెలిసిపోతుంది అనడంలో అతిశయోక్తి లేదు.

తన ఉమ్మత్‌లోని ప్రతీ ఒక్కరి కడుపూ నిండాలని కోరుకున్న ఆ మహనీయుడు, ఆకలి వేసినప్పుడు తన కడుపుకు రాళ్ళు కట్టుకున్నారు. నరకాగ్ని నుండి ప్రజలను తప్పించాలని ప్రయత్నించి రాళ్ళ దెబ్బలు కూడా భరించి, వారిని శపించడానికి బదులు, వారి క్షేమాన్నే కోరుకున్న మహా శాంతమూర్తి ఆయన.

పేదవారికి దానం చేయమన్నారుగాని, తాను స్వయంగా ఓ ఖర్జూరపు ముక్కను సయితం దానంగా స్వీకరించలేదు.

తన ఉమ్మత్ క్షేమం కోసం, వారి పాపక్షమాపణ కోసం కన్నీటిధారలతో తన ప్రభువును వేడుకునేవారు. ఆ మహనీయుని జీవితాన్ని తెలుసుకుంటే, **'ఆయనను సర్వలోకాలకు కారుణ్యంగా'** అల్లాహుతాలా ఎందుకు వర్ణించారో అర్ధమౌతుంది.

ఆయన సతీమణి ఖదీజా(రజి) వారు ఆయనకు ఓదార్పునెలా ఇచ్చారో చూడండి: **"లేదు! మిమ్మల్ని అల్లాహ్ అగౌరవం పాలు చేయడు. మీరు బంధువుల ఎడల సత్ప్రవర్తన కలిగి ఉంటారు. కష్టాల్లో చిక్కుకున్న వారిని ఆదుకుంటారు. నిరుపేదలకు సహాయం చేస్తారు. అతిథిని సత్కరిస్తారు. సత్యమార్గంలో ఎదురయ్యే కష్టాలను తొలగిస్తారు."**

ఆ మహనీయుని ప్రేమకై ఆయన సతీమణులు ఎంతో ఆరాటపడ్డారు. ఆయన(స) వారందరినీ ప్రేమగానే కాకుండా, గౌరవంగా చూశారు.

**అబూబకర్ సిద్దీఖ్ (రజి) వృత్తాంతం**

మక్కాలో ఇస్లామ్ ప్రారంభ కాలంలో మక్కా కాఫిర్లు ఎలా హింసించే వారో మీకు తెలిసిన విషయమే!

పురుషులలో ముస్లిములు 39 మంది ఉన్నప్పుడు, అబూబకర్(రజి) ముహమ్మద్(స)వారిని తొందరపెట్టేవారు ఇస్లామ్ సందేశాన్ని బహిరంగంగా బోధించమని. కాని రసూలుల్లాహ్(స)వారు ఇలా చెబుతూ స్పందించేవారు, ''ఓ అబూబకర్, మనం (ఇప్పటికీ) తక్కువ సంఖ్యలో ఉన్నాము''. కాని అబూబకర్(రజి)వారు వదలలేదు. ఒకరోజు ముస్లిము లందరూ మస్జిద్‌లోని వేర్వేరు చోట్ల, విస్తరించి కూర్చుని ఉన్నారు, ప్రతీ వ్యక్తి తన తెగవారి మధ్యలో ఉండేటట్లుగా. అబూబకర్(రజి) ప్రసంగించడానికి నిలుచున్నారు, రసూలుల్లాహ్(స) కూర్చునే ఉండగా.

ఆ రోజు అబూబకర్(రజి)వారు ప్రసంగించిన తొలి వ్యక్తి. ఆ ప్రసంగంలో ఆయన ప్రజలను అల్లాహ్ మరియు ఆయన సందేశహరుని వైపు పిలిచారు. కాని బహుదైవారాధకులు ప్రసంగాన్ని విని రెచ్చిపోయి అబూబకర్(రజి)పై దాడిచేశారు మరియు ఇతర ముస్లిములపై కూడా. మస్జిద్ వేర్వేరు చోట్ల ఖురైషీయులు ముస్లిములను తీవ్రంగా కొట్టారు.

అబూబకర్(రజి)వారు తీవ్రంగా కొట్టబడ్డారు. దుర్మార్గుడైన 'ఉత్బా బిన్ రబీఅహ్' అతని చెప్పులతో తీవ్రంగా అబూబకర్(రజి)వారి ముఖంపై కొట్టడం ప్రారంభించాడు. అబూబకర్(రజి)వారిని వాడు ఎంత తీవ్రంగా కొట్టడం జరిగిందంటే, ఆయన ముఖం నుండి చాలా రక్తం కారింది. ఆయన తల ముందరి మరియు వెనుక భాగాలు గుర్తించడం కష్టం అయ్యేంతగా హింసించాడు.

అలా కొట్టడం మరి కొద్దిసేపు కొనసాగించి ఉంటే ఆయన మరణించేవారేమో. కాని అతని తెగ 'బనూ తైమ్' సభ్యులు ఆయనను రక్షించడానికి కొద్దిగా ఆలస్యంగా వచ్చారు. వారు దాడిచేసే గుంపును తోసివేసి, అబూబకర్(రజి)ను అతని ఇంటికి తీసుకువెళ్ళారు, ఆయన చనిపోయి ఉంటారనుకుంటూ. ఆ తరువాత బనూతైమ్ తెగవారు మస్జిద్‌కు వచ్చి ప్రకటించారు, ''అల్లాహ్ సాక్షి! అబూబకర్ చనిపోతే, మేము నిజంగా 'ఉత్బా బిన్ రబీఅహ్'ను చంపివేస్తాం''. వారు తిరిగి అబూబకర్(రజి)వారి దగ్గరికి వచ్చారు.

అబూబకర్(రజి)వారి తండ్రి మరియు బనూతైమ్ తెగవారు అతనితో మాట్లాడటానికి ప్రయత్నించారు. చివరకు వారితో అతను మాట్లాడారు. కాని వారి ప్రశ్నలకు సమాధానంగా కాదు, అతని స్థితి గురించి విచారం అంతకంటే కాదు, వారిని అబూబకర్(రజి) అడిగారు 'ప్రవక్త(స)వారు ఎలా ఉన్నారని'. వారు విస్తుపోయారు.

అతని తోటివారు ఆయన తల్లిగారితో అతనికి ఏదైనా ఆహారం మరియు పానీయం ఇవ్వమని తొందరపెట్టారు. కాని ఆయన ఏమీ తీసుకోకుండా ప్రవక్త(స)వారి గురించి అడుగుతూనే ఉన్నారు.

''అల్లాహ్ సాక్షి! నీ సహచరుని గురించి నాకేమీ తెలియదని'' ఆయన తల్లిగారు ఉమ్మె ఖైర్ అన్నారు. అబూబకర్(రజి) ఆమెతో చెప్పారు, ''ఉమ్మె జమీల్(రజి) దగ్గరికి వెళ్ళి ఆయన గురించి ఆమెను అడుగు''.

తన కుమారుడు తన స్థితి కంటే ప్రవక్త(స)వారి జీవితానికి ఎంత విలువిచ్చారో ఆమె అర్థం చేసుకున్నారు. కాబట్టి ఆమె ఉమ్మె జమీల్ (రజి)ను వెతుకుతూ బయలుదేరారు. ఆమెను చూడగానే, ఉమ్మె ఖైర్ చెప్పారు, ''నిశ్చయంగా, ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్(స) గురించి నిన్ను అడుగుతున్నాను''.

ఉమ్మె జమీల్(రజి) చెప్పారు, ''నాకు అబూబకర్‌గాని ముహమ్మద్ బిన్ అబ్దుల్లాహ్ గాని తెలియదు. కాని మీరు కోరితే, మీతోపాటు నేను మీ కుమారుని దగ్గరికి వస్తాను''. ఉమ్మె ఖైర్ అలాగేనని చెప్పారు.

వారిద్దరూ అబూబకర్(రజి)వారి దగ్గరకు వచ్చారు. వారు అతనిని చాలా తీవ్ర పరిస్థితిలో చూశారు. అతను చావుకు దగ్గరలో ఉన్నట్లు అనుమానించారు. ఉమ్మె జమీల్(రజి) ఆయనను సమీపించి గట్టిగా అరుస్తూ చెప్పారు, ''అల్లాహ్ సాక్షి, నీకిది ఎవరైతే చేశారో వాస్తవానికి వారు క్రూరులు మరియు అవిశ్వాస ప్రజలు. వాస్తవానికి నీ కొరకు వారిపై అల్లాహ్ ప్రతీకారం తీసుకుంటారు''.

అబూబకర్(రజి) తరువాత అడిగారు ప్రవక్త(స)వారు ఎలా ఉన్నారని. దానికి స్పందిస్తూ ఉమ్మె జమీల్(రజి), ''ఇక్కడ నీ తల్లిగారున్నారు, వింటున్నారు (మన మాటలను)''. అబూబకర్(రజి) ఆమెకు భరోసా ఇస్తూ తన తల్లి గురించి ఆమెను విచారించ వద్దన్నారు.

(అంటే అప్పటికి అబూబకర్(రజి) తల్లిగారు ఇస్లామ్ స్వీకరించలేదు)

ఉమ్మె జమీల్(రజి) చెప్పారు, ''ఆయన క్షేమంగా మరియు ఆరోగ్యంగా ఉన్నారు''

''ఆయన ఎక్కడున్నారు?'' అబూబకర్(రజి) అడిగారు.

''అల్-అర్ఖామ్ ఇంటిలో'' ఆమె సమాధానమిచ్చారు.

ఆయన స్వయంగా చాలా బలహీన స్థితిలో ఉన్నప్పటికీ మరియు విశ్రాంతి మరియు పోషకాహారం అవసరమైనప్పటికీ, అబూబకర్(రజి) ఒట్టు వేయించుకున్నారు, ముందుగా రసూలుల్లాహ్(స)వారి వద్దకు వెళ్ళి ఆయన బాగున్నారని ధృవీకరించుకునే వరకు ఏదీ త్రాగను మరియు తిననని.

కాని ఉమ్మెజమీల్ మరియు ఉమ్మె అల్-ఖైర్ ఇద్దరూ ఆలస్యం చేసారు. వారి ఆలోచన ఏమిటంటే, వీధుల్లో పరిస్థితి ప్రశాంతమయ్యే వరకు వేచి ఉండాలని. చివరకు పరిస్థితులు చక్కబడ్డాక, వారు అబూబకర్(రజి)ను అల్-అర్ఖామ్ ఇంటికి తీసుకువెళ్ళారు, ఆయన స్వయంగా నడవలేని స్థితిలో ఉండటం వలన వారిద్దరినీ ఆసరా చేసుకుని బయలుదేరారు.

ఆయన ప్రవేశించగానే, రసూలుల్లాహ్(స)వారు అబూబకర్(రజి)వైపు వేగంగా వచ్చి, ఆయనను చుంబించారు. ఇతర ముస్లిమ్ సోదరులు కూడా ఆయనను సమీపించారు. రసూలుల్లాహ్(స)వారు అబూ బకర్(రజి)ని చూసి తీవ్రంగా చలించి పోయారు. **ప్రవక్త(స)వారంటే అబూ బకర్(రజి)వారికి ఎంత ప్రేమ!**

అమీరుల్ మోమినీన్ ఉమర్(రజి)వారి గురించి పాఠకులకు ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. ఆయనంటే షైతాన్‌కు కూడా భయమే! ఈ విషయాన్ని స్వయంగా ప్రవక్త(స)వారే చెప్పారు.

ఉమర్(రజి)వారు ఒక మార్గం గుండా వస్తుంటే, షైతాన్ ఆ మార్గం నుండి పోతాడు. ఉమర్(రజి)వారి విశ్వాసం అంత బలమైనది. ముహమ్మద్(స)వారి ఆదేశాలను ఉమర్(రజి)వారు ఎంతో వినయంతో స్వీకరించేవారు. ఆయన(రజి) ఎంతో పరాక్రమశాలి అయినప్పటికీ ముహమ్మద్(స)వారు మరణించారనే విషయాన్ని తట్టుకోలేక స్పృహ తప్పి పడిపోయారు. ప్రవక్త(స)పై ఆయనకున్న ప్రేమ అటువంటిది.

**ముహమ్మద్(స)వారిని తమ ప్రాణం కంటే ఎక్కువగా భావించేవారు ...**

ఉహద్ యుద్ధం ముగిశాక ముహమ్మద్(స)వారు ఇతర ముస్లిమ్ యోధులతో మదీనాకు తిరిగి వస్తున్నారు. బనూ దీనార్ తెగకు చెందిన ఓ స్త్రీ యొక్క భర్త, సోదరుడు మరియు తండ్రి యుద్ధంలో షహీదు లయ్యారు. ఆమెకు ఈ వార్తను చెప్పినా కూడా పట్టించుకోకుండా, 'మహాప్రవక్త(స) ఏమయ్యారు' అని అందరినీ అడుగుతున్నారు. ప్రవక్త(స)వారిని ఆమెకు చూపారు.

ముహమ్మద్(స)వారిని చూడగానే ''చాలు! నాకింకేం కావాలి! మీరుంటే చాలు, నా కష్టాలన్నీ మీ ముందు ఏమీ కావు'' అన్నారు.

అదే విధంగా ఓ స్త్రీకి ముహమ్మద్(స)వారు ఆమె కుమారుని మరణవార్త చెప్పి ఓదార్చారు. అది విన్న ఆమె, ''ప్రవక్తా(స)! మిమ్మల్ని సజీవంగా చూసిన తరువాత నా దు:ఖాలు, కష్టాలు అన్నీ మాయమై పోయాయి చాలు''.

**ఉహద్ యుద్ధంలో ప్రవక్త(స)వారి కోసం ఎందరో ముస్లిములు చేసిన త్యాగాలని చదువుతుంటే, ఆ మహనీయునిపై వారికెంత ప్రేమ ఉందో అర్థమై మన కళ్ళు వర్షిస్తాయి.**

ముహమ్మద్(స)వారి కళ్ళ వెంట నీటిని చూస్తే, సహచరుల కళ్ళ నుండి అశ్రుధారలు వచ్చేవి. ఇక ఆయనను ధూషించిన వారిపై ఈ అనుచరులకు ఎటువంటి ఆగ్రహం కలుగుతుందో ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు.

**అబూజహల్‌ని చంపిన ఇద్దరు యువకులు**

అబ్దుర్రహ్మాన్ బిన్ ఔఫ్(రజి)గారి ఉల్లేఖనాన్ని ఇక్కడ అందిస్తున్నాము: నేను బద్ర్ యుద్ధం రోజున యుద్ధం చేస్తూ శత్రుసైన్యంలో ప్రవేశించాను. హఠాత్తుగా వెనక్కి తిరిగి చూశాను. నా ఇరుప్రక్కల ఇద్దరు యువకులున్నట్లు గమనించాను. అంటే నేను ఊహించని విషయమది. అంతలోనే ఓ యువకుడు నా దగ్గరికి వచ్చి రహస్యంగా, ''బాబాయి! నాకు అబూజహల్ ఎవరో చూపించరూ?'' అని అడిగాడు. ''బాబూ! అబూజహల్‌ని చూపిస్తే అతణ్ణి ఏం చేయదలచుకున్నావు?'' అని అడిగాను. ''అతనా! దైవప్రవక్త(స)ను తిడుతున్నాడు. ఎవరి చేతిలోనైతే నా ప్రాణాలున్నాయో ఆ అల్లాహ్ సాక్షి! నేనే గనక అతణ్ణి చూస్తే అతణ్ణి వెంటాడుతాను. చివరికి అతనో నేనో చనిపోవలిసిందే'' అన్నాడు. దానికి నాకు ఆశ్చర్యం వేసింది. ఇంతలోనే మరో యువకుడు వచ్చి నన్ను సైగలతో అబూజహల్ గురించి అడిగాడు. అంతలోనే నాకు అబూజహల్ సైన్యంలో తిరుగుతూ కనబడ్డాడు. అతణ్ణి చూసి, అడుగో! వాడే మీ ఇద్దరికీ కావలిసిన వ్యక్తి అన్నాను. నా మాటలు విన్నంతనే ఆ ఇద్దరూ కరవాలాలు దూసి అతనిపై పడ్డారు. అతణ్ణి కొట్టి చంపేశారు. ఆ తరువాత వారిద్దరు మహాప్రవక్త(స)గారి దగ్గరకు వచ్చి ఈ విషయం చెప్పగా, ''మీలో ఎవరు అతణ్ణి చంపారు?'' అని అడిగారు ప్రవక్త(స). ఆ ఇద్దరూ, నేనంటే నేను అని చెప్పారు. ''మీ కరవాలాలను శుభ్రం చేశారా?'' అని అడిగారు దైవప్రవక్త(స).

''లేదు. ఇంకా శుభ్రపరచలేదు'' ఆ ఇద్దరి సమాధానం.

మహాప్రవక్త(స) ఆ ఇద్దరి కరవాలాలను చూసి, ''మీరిద్దరూ కలిసి అతణ్ణి సంహరించారు'' అన్నారు.

(సహీహ్ బుఖారీ, 3988, పుస్తకం 64, అధ్యా. 10, సంపుటి 5)

అబూజహల్‌ని చంపమని ఈ యువకులను ప్రవక్త(స)వారు ఆదేశించలేదు. ఆ యువకులకు ముహమ్మద్(స)వారిపై నున్న ప్రేమే వారిని ఆ విధంగా ప్రేరేపించింది. **ఇది ఓ యుద్ధంలో జరిగిన విషయమని పాఠకులు గమనించాలి**.

ముహమ్మద్(స)వారిని దూషించడం అనేది ఆ కాలంతోనే ఆగిపోలేదు. అది కొనసాగుతూనే ఉంది. మా పాఠకులకు కొన్నిరోజుల క్రితం 'ముహమ్మద్(స)వారిపై జరుగుచున్న దుష్ప్రచారంపై' ఓ పుస్తకాన్ని అందించాము.

అప్పటి ఆ ఇద్దరు యువకులు చేసినట్లు, నేటి యువకులు యుద్ధం చేయవలసిన అవసరం లేదు. కాని విచారించదగిన విషయమేమిటంటే, నేటి ముస్లిమ్ యువకులలో కొందరు, ముహమ్మద్(స)వారిని అవమానించే వ్యక్తులను గౌరవిస్తున్నారు.

ముహమ్మద్(స)వారిని దూషించడానికి కారణమయ్యే కొందరు నకిలీ ముస్లిములను, నిలదీయడానికి బదులుగా ఈ యువకులు తాము నిర్వహించే కార్యక్రమాలకు వారిని ఆహ్వానించడమే కాకుండా, ముందు వరుసలో కూర్చోబెడుతున్నారు. తమ పెళ్ళిళ్లకు, వలీమాలకు ఆహ్వానిస్తున్నారు. ఎందుకు ఇలా జరుగుతుంది?

ఈ యువకులకు ముహమ్మద్(స)వారి గురించి తెలియదా? లేక వీరి విశ్వాసంలో లోపం ఉందా?

ముహమ్మద్(స)వారిని ధూషించినాసరే, ఆయనపై ఎంతో దుష్ప్రచారం జరుగుతున్నా సరే ఏమాత్రం పట్టించుకోని ఈ యువకులు, కొందరు స్వార్ధపరుల గుట్టును 'శాంతిబాట' రట్టు చేస్తే మాత్రం భరించ లేకపోతున్నారు.

ముహమ్మద్(స)వారిపై చూపవలసిన ప్రేమను ఈ యువకులు కొందరు స్వార్ధపరులపై ఎందుకు చూపిస్తున్నారు? సినిమా నటులకు ఫాన్స్ (అభిమానులు) ఉంటారు. రాజకీయ నాయకులకు ఫాన్స్ ఉంటారు. వారికోసం ఈ ఫాన్స్ ఎటువంటి త్యాగాలకయినా సిద్ధపడుతుంటారు.

క్రింది హదీస్ చూడండి :

అనస్ బిన్ మాలిక్ ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స)వారితో ఓ పల్లెటూరి వ్యక్తి(ఎడారివాసి) అన్నాడు, "ఆ (ప్రళయ) ఘడియ ఎప్పుడు?" రసూలుల్లాహ్(స) అతనితో అన్నారు : "దాని కొరకు నీవు ఏమి సిద్ధం చేసుకున్నావు?" అతను చెప్పాడు : **"అల్లాహ్ మరియు ఆయన సందేశహరునిపై ప్రేమ".** ఆయన(స) అన్నారు, **"నీవు ఎవరినైతే ప్రేమిస్తావో వారితోనే ఉంటావు".**

**(సహీహ్ ముస్లిమ్, హదీస్ నెం. 6710, పుస్తకం 45, అధ్యా. 50, సంపుటి 6)**

పెడతోవ బట్టిన నేటి ముస్లిమ్ యువత ఆలోచించి, ప్రవక్త(స)వారి జీవితాన్ని క్షుణ్ణంగా అధ్యయనం చేసి ముహమ్మద్(స)వారిని ప్రేమిస్తే, స్వర్గంలో ఆ మహనీయుని సాంగత్యభాగ్యం లభిస్తుంది.

క్రింది హదీస్ చూడండి :

మహాప్రవక్త(స) చెప్పారు : "ప్రళయ దినాన ఓ వ్యక్తి నరకాగ్నిలో పడవేయబడతాడు. అతని ప్రేవులు కడుపును చీల్చుకుని బయట అగ్నిలో పడతాయి. అప్పుడు అతను వాటిని పట్టుకుని గానుగ చుట్టూ గాడిద తిరిగినట్లు తిరుగుతుంటాడు. ఇతర నరకవాసులు అతని వద్ద గుమిగూడి, "నీకు ఈ గతి పట్టిందేమిటి? నీవు ప్రపంచంలో మాకు సత్కార్యాలను ఉపదేశించి దుష్కార్యాల నుండి వారించేవాడివి కదా?" అని అడుగుతారు. అతడు యదార్థాన్ని తెలుపుతాడు : 'నేను మీకు మంచిని బోధించేవాణ్ణే. కాని, నేను మాత్రం దాన్ని సమీపించే వాణ్ణి కాను, మిమ్మల్ని చెడు నుండి వారించే వాణ్ణే, కాని స్వయంగా **నేనే చెడును చేరదీసేవాణ్ణి**" **(సహీహ్ ముస్లిమ్, అబూ వా'ఇల్ ఉల్లేఖనం, హదీస్ నెం. 7483, పుస్తకం 53, అధ్యా.7, సంపుటి 7, సహీహ్ బుఖారీ, 3267, పుస్తకం 59, అధ్యా.10, సంపుటి 4)**

## పై హదీస్‌లో ఉపదేశించిన వ్యక్తి మరియు ఆ ఉపదేశాలను విన్నవారు కూడా నరకంలోనే ఉన్నారు.

కాబట్టి మన సాంగత్యం మరియు మన అభిమానం మంచి ఆచరణగల వారిపై ఉండాలి.

**ప్రేమించడం అంటే ఏమిటి?**

ముహమ్మద్(స)వారిని ప్రేమించేవారు ఆయన బోధనలను తిరస్కరించలేరు. ఆయన ఆదేశాలను పాటించడానికి ఉత్సాహాన్ని చూపుతారు. మా ప్రశ్న ముస్లిమ్ యువతకు అర్థమై ఉంటుందని ఆశిస్తున్నాము.

ముహమ్మద్(స)వారిని ప్రేమిస్తే, మనకు తెలియకుండానే క్రింది వారిపై స్వచ్ఛమైన ప్రేమ కలుగుతుంది.

1. **తల్లిదండ్రులపై**
2. **జీవిత భాగస్వామిపై**
3. **పొరుగువారిపై**
4. **పేదవారిపై**
5. **అనాథలపై, వితంతువులపై, అణిచివేతకు గురైన వారిపై**

వీరందరిపై మీకు ప్రేమ కలిగితే, వారికి కూడా సహజంగానే మీపై ప్రేమ కలుగుతుంది కదా!

కాబట్టి సకలలోకాలకు కారుణ్యమైన ముహమ్మద్(స)వారిని ప్రేమిస్తే, అంతా ప్రేమమయమే!

**కాబట్టి మీరు ఫాన్స్ కావలసింది - అనర్గళంగా మాట్లాడేవారికి, అబద్ధాలు మాట్లాడేవారికి, ఆకర్షణీయంగా మాట్లాడేవారికి, సెలబ్రిటీలకు కాదు. ఫాన్స్ కావలసింది కేవలం - ముహమ్మద్(స) వారికి మాత్రమే!**

**ఆలోచించండి!**

**- శాంతిబాట టీమ్**

## త్యాగశీలురు - పరాన్నజీవులు

కష్టపడి సంపాదించడాన్ని మానుకుని
ప్రజలను అడిగి తీసుకుని లేక ప్రజలు దానంగా ఇచ్చిన దానితో
బ్రతుకుతూ మైక్‌లలో ఉపన్యాసాలు ఇచ్చేవారిని
"గొప్ప త్యాగం చేసేవారిగా" కొందరు వర్ణిస్తున్నారు.
అది త్యాగం కాదు.
కష్టపడి బ్రతికేవాడు మామూలు వస్త్రాలుగాని,
చిరిగిన వస్త్రాలు గాని ధరిస్తాడు.
ప్రజల సొమ్ముపై ఆధారపడి బ్రతికేవారు 'సఫారీలు', 'సూట్లు' ధరిస్తున్నారు.
ముహమ్మద్(స)వారిపైగాని లేదా ఆ మహనీయుని సాంప్రదాయం (సున్నత్)పై ఈ పరాన్నజీవులు బురద చల్లుతుంటే ఎవరికీ చీమ కుట్టినట్లు కూడా లేదు. **ముహమ్మద్(స)వారిని వ్యంగ్యంగా వర్ణించి, ఆ మహనీయుని గురించి వారు ఎటువంటి మాటలు మాట్లాడినా ఏమీ పట్టించుకోని కొందరు మూర్ఖులు అటువంటి దుర్మార్గులను మేము జోకర్, పిట్టలదొర అంటే గిజగిజలాడిపోతున్నారు.**
శాంతిబాట చదవవద్దని చెబుతున్నారు.
'పిట్టలదొర' అనేది పేరుగాని, నిక్‌నేమ్‌గాని ఎంతమాత్రం కాదు.
ఓ మనిషి యొక్క లక్షణాన్ని తెలిపే పదం.
ముహమ్మద్(స)వారిపై బురద చల్లేవారిని విమర్శించినందుకు,
మమ్మల్నే బురద చల్లేవారిగా ప్రచారం చేసే పరాన్నజీవులకు
ముస్లిమ్ సమాజం గుణపాఠం చెప్పేరోజు ఇన్షా అల్లాహ్
చాలా దగ్గర్లోనే ఉంది.

# ద గ్రేట్ ఎవరు? అలెగ్జాండర్ ? ఉమర్(రజి) ?

## చరిత్రకారులను అడగవలసిన ప్రశ్న

మెసెడోనియా యొక్క అలెగ్జాండరా లేక ఇస్లామ్ యొక్క ఉమర్ ఫారూఖ్(రజి), ఎవరు ద గ్రేట్? ప్రపంచ చరిత్రకారులు ఈ ప్రశ్నకు సమాధానం ఏమని చెబుతారు?

ఇవి SMSల రోజులు, ఈ మొబైల్ మెస్సేజ్ వ్యవస్థ ఒకరినుండి ఆలోచనలను మరొకరికి ప్రపంచపు ఒక మూలనుండి మరో మూలకి సెకన్లలో చేరవేస్తుంది. పాఠకులు కానివ్వండి, ప్రేక్షకులు కానివ్వండి, ఈ అధునాతన సౌకర్యాన్ని ఇప్పుడు అందరూ ఉపయోగించుకుంటున్నారు - నిన్న ఎవరో నాకు మెస్సేజ్ పంపారు. ఉమర్(రజి)వారి గురించి ఓ కాలమ్ వ్రాయమని. ఇది నాకు ఉమర్(రజి)వారు షహీద్ అయిన రోజును గుర్తు చేసింది. అంతేకాకుండా నేనిప్పుడు ఆలోచిస్తున్నాను - ఎవరు గ్రేట్? అలెగ్జాండరా లేక ఉమర్(రజి)?

మనం చిన్నతనంలో చదువుకున్న దాని ప్రకారం మెసెడోనియా అలెగ్జాండర్ 20 సంవత్సరాల వయస్సులో 'రాజు' అయ్యాడు మరియు 23 సంవత్సరాల వయస్సులో సాహసకార్యానికై మెసిడోనియాను వదిలాడు. అతడు మొదట గ్రీస్ మొత్తాన్ని జయించాడు. తరువాత టర్కీలో ప్రవేశించాడు. పర్షియాను వశపరచుకోవడానికి సిరియా ప్రవేశించి, అక్కడి నుండి జెరూసలెంకి, ఆ తరువాత బాబిలోన్, ఈజిప్టు మరియు ఇండియాకు కదిలాడు.

ఇండియాలో ఓ రాజుతో యుద్ధం చేశాడు. అతను మక్రాన్ గుండా తిరుగు ప్రయాణమయ్యాడు. అతనికి తిరుగు ప్రయాణంలో టైఫాయిడ్ సోకి క్రీస్తుపూర్వం 323లో అంటే అతని 33 సం॥ల వయస్సులో భఖ్త్ నాసర్ కోటలో మరణించాడు.

ఆయన గొప్ప సేనాధిపతి అని, యోధుడని మరియు మానవ చరిత్రలో మహారాజు అని, ఆయనకు "అలెగ్జాండర్, ద గ్రేట్" అని బిరుదు ఇవ్వబడిందని నేర్చుకున్నాము. అతనిని మనం 'సికిందరె ఆజమ్', రాజులకు రాజును చేశాము. కాని ఈ రోజు, ప్రపంచంలోని చరిత్రకారులందరినీ ప్రశ్నిస్తున్నాను, మనకు ఉమర్(రజి) ఉండగా, ఈ బిరుదుకు అలెగ్జాండర్ అర్హులా? అని.

అలెగ్జాండర్ మరియు ఉమర్(రజి)వారు సాధించిన విజయాల విషయాలలోగాని, వారు సాధించిన ఇతర విషయాలలోగాని ఈ ఇద్దరినీ పోల్చడానికి ప్రపంచ చరిత్రకారులందరినీ నేను ఆహ్వానిస్తున్నాను.

దయచేసి పోల్చి చూడండి. అలెగ్జాండర్ ఓ మహారాజు యొక్క కుమారుడు. ఉత్తమంగా శిక్షణ నివ్వగలిగే వారు ఆయనకు గుఱ్ఱాన్ని ఎలా స్వారీ చేయాలో నేర్పారు, ఆయనకు అరిస్టాటిల్ వంటి బోధించే ఉపాధ్యాయు లున్నారు. 20 సం॥ల వయస్సులో కిరీటధారి అయ్యారు.

ఇక ఉమర్(రజి) విషయానికొస్తే, ఆయన ముందు తరాలలోని వారెవ్వరూ రాజరికాన్ని అనుభవించలేదు. మేకలు మరియు గొఱ్ఱెల మందను మేపుతూ పెరిగారు. మరియు ఆయన యుద్ధకళను ఎవరి దగ్గరి నుండి నేర్చుకోలేదు.

అలెగ్జాండర్ 10 సంవత్సరాల కాలంలో 17 లక్షల చదరపు మైళ్ళ భూమిని సుశిక్షితులైన సైన్యంతో జయిస్తే, ఉమర్(రజి)వారు 10 సంవత్సరాల కాలంలో 22 లక్షల చదరపు మైళ్ళ భూమిని, రోమన్ మరియు పర్షియన్ మహా సామ్రాజ్యాలతో కలుపుకుని, ఎటువంటి శిక్షణ లేని సైన్యంతోనే జయించగలిగారు.

ఉపగ్రహాలు, మిస్సైల్లు, సబ్‌మెరైన్‌లను కలిగి ఉన్న ఈ రోజుల్లో సయితం, ఏ పాలకుడికి కూడా ఉమర్(రజి)వారు జయించినంత భూమి లేదు. ఆయన కేవలం గుఱ్ఱంపైనే యుద్ధం చేశారు. వాటిని మేనేజ్ చేస్తూ పరిపాలించారు కూడా.

అలెగ్జాండర్ గారు పొందిన విజయాలలో ఎంతోమంది సైన్యాధిపతులు మరణించారు. చాలామంది సైన్యాధిపతులు మరియు సైన్యం ఆయనను వదిలేశారు. ఆయనపై కొందరు తిరుగుబాటు చేశారు. ఇండియావైపు వెళ్ళడానికి సయితం ఆయన సైన్యం తిరస్కరించింది.

కాని ఉమర్(రజి)వారి సహచరులలో ఏ ఒక్కరూ ఆయనకు అవిధేయత చూపే ధైర్యం చేయలేదు. ఆయనే కమాండర్. యుద్ధ భూమిలో ఉన్న సమయంలోనే పరాక్రమవంతుడైన తన సైన్యాధిపతి 'ఖాలిద్ బిన్ వలీద్ (రజి)'ను ఆయన సైన్యాధిపతి పదవినుండి తప్పించారు. ఎవరైనా తిరగబడ్డారా? ఎవ్వరూ ఉమర్(రజి)వారి విషయంలో అవిధేయతకు పాల్పడే ధైర్యం చేయలేదు.

సాద్ బిన్ అబీ వక్కాస్(రజి)వారిని కుఫా గవర్నర్ పదవి నుండి తొలగించారు, హారిస్ బిన్ కాబ్(రజి)వారిని గవర్నర్ పదవినుండి తీసివేశారు. అమ్ర్ బిన్ అల్ ఆస్(రజి) యొక్క ఐశ్వర్యాన్ని అధికారికంగా స్వాధీనపరచుకున్నారు. హమాస్ గవర్నర్‌ను వెనక్కి పిలిపించి ఒంటెలను మేపే పనిని అప్పగించారు.

అయినప్పటికీ ఆయనకు అవిధేయత చూపే ధైర్యం ఎవరూ చేయలేదు.

అలెగ్జాండర్ 17 లక్షల చదరపు మైళ్ళ భూమిని జయించారు గాని ప్రపంచానికి ఏదైనా ఓ వ్యవస్థ (system)ని అందించారా? లేదు. కాని ఉమర్(రజి) అందించిన వ్యవస్థ ఇప్పటికీ ప్రపంచంలో ఆచరణలో ఉంది.

ఫజర్ నమాజ్ అజాన్‌లో "అస్సలాతు ఖైరుమ్ మినన్ నౌమ్ - నిద్ర

కంటే సలాత్(నమాజ్) మేలైనది" అనే పదాలను కలిపింది ఆయనే. ఆల్కహాలు సేవించినవారికి శిక్షను విధించారు. తేదీల కొరకు హిజ్రి వ్యవస్థను ప్రారంభించారు. ముఅజ్జిన్‌లకు జీతాలను నిర్ణయించారు.

పోలీస్ విభాగాన్ని ఏర్పాటు చేశారు, న్యాయాన్ని అందించడానికి ఓ పరిపూర్ణ వ్యవస్థకు పునాది వేశారు. నీటి పారుదల వ్యవస్థను అమలు పరిచారు. మిలటరీ కంటోన్‌మెంట్లను మరియు ఫార్మల్ సైన్యాన్ని స్థాపించారు.

**ప్రపంచంలో తొలిసారిగా పసిపిల్లలకు, వికలాంగులకు, విధవరాళ్ళకు మరియు అసహాయులకు ఉమర్(రజి) స్టైపండ్స్ ఏర్పాటు చేశారు.**

**పాలకులు, ప్రభుత్వాధికారులు మరియు ధనవంతులు తమ ఆస్తుల వివరాలను ప్రకటించాలనే నియమాన్ని తొలుత ప్రారంభించింది ఈయనే!**

తీర్పును తప్పుగా ఇచ్చే జడ్జీలను శిక్షించే వ్యవస్థ ఏర్పాటు చేశారు. మొదటి సారిగా పాలకులను జవాబుదారీగా చేశారు. అంటే ఏదైనా జరిగితే, దానికి పాలకులదే బాధ్యత.

వర్తక బిడారాలను రాత్రివేళ రక్షించేవారు. **న్యాయంగా పాలించే పాలకులు, రాత్రివేళ నిర్భయంగా పడుకుంటారని చెప్పేవారు.**

**"జాతి యొక్క నాయకుడు నిజానికి జాతియొక్క సేవకుడు"**

అని చెప్పేవారు. ఆయన స్టాంప్‌పై "ఉమర్, హెచ్చరించడానికి మరణం చాలు" అని ఉండేది.

ఆయన తినడానికి రెండు రకాల కూరలు ఉండేవి కావు. ఓ ఇటుకను దిండుగా చేసుకుని ఆయన పడుకునేవారు. ప్రయాణంలో ఉన్నప్పుడు చెట్టు నీడన ఓ వస్త్రాన్ని పరచుకుని నిద్రవచ్చినప్పుడు పడుకునేవారు.

రాత్రుళ్ళు ఆయన కటికనేల మీదనే పడుకునేవారు. అతని చొక్కాకు 14 చిరుగులు. వాటికి మాసికలు కుట్టబడ్డాయి, వాటిలో ఒకటి ఎర్రటి చర్మంతో కుట్టబడింది.

ముతక వస్త్రాన్నే ఆయన ధరించేవారు. సన్నటి, మెత్తటి వస్త్రాలను ఇష్టపడేవారు కాదు.

**ఎప్పుడైనా, ఎవ్వరినైనా ప్రభుత్వ స్థానంలో నియమిస్తే, అతని యొక్క ఐశ్వర్యాన్ని అంచనా వేయించి, ఉమర్(రజి) వారు తన దగ్గర ఆ లెక్కను అట్టిపెట్టుకునేవారు. ఆ అధికారి పాలనా కాలంలో, అతని ఐశ్వర్యం పెరిగితే, దానికి అతడు బాధ్యత వహించాలి.**

ఎప్పుడైనా ఎవరినైనా గవర్నర్‌గా నియమించినప్పుడు, అతనితో టర్కీ గుఱ్ఱాన్ని ఎప్పుడూ స్వారీ చెయ్యవద్దని, సన్నని మంచి వస్త్రాలను ధరించ వద్దని, మెత్తటి జల్లించిన పిండితో చేసినవి తినవద్దని, ద్వారపాలకుడిని ఏర్పాటు చేసుకోవద్దని, అభాగ్యుల కొరకు తలుపులు మూసి ఉంచవద్దని సలహా ఇచ్చేవారు.

"ఉమర్ ఎలా మారిపోయాడు?" అని ఆయన తరచు ఆశ్చర్యపోతూ ఉండేవారు.

అమీరుల్-మోమినీన్ (విశ్వాసుల నాయకుని)గా పిలువబడ్డారు.

ప్రపంచంలో ప్రతీ మతానికి ఓ ప్రత్యేక లక్షణం ఉంటుంది. ఇస్లామ్ విషయంలో ఆ ప్రత్యేక లక్షణం : న్యాయం.

ఉమర్ (రజి) దానిని నిజం చేసి చూపారు. ఆయన చూపిన న్యాయాన్ని "అదలె ఫారూఖీ" (ఫారుఖీ న్యాయం) అని అంటారు. ఆయన షహీద్ అయినప్పుడు ఆయనకు అప్పు ఉంది. ఆయన వీలునామా ప్రకారం ఆయనకున్న ఆస్తిని అమ్మి ఆ అప్పుతీర్చడం జరిగింది.

**ఆయన పాలనలో ఆకలితో ఓ కుక్క టైగ్రస్ నది ఒడ్డున చనిపోయినా సరే, దాని బాధ్యత తనదేనని చెప్పుకున్న ఏకైక పాలకుడు ఉమర్(రజి).**

ఆయన పాలనలో న్యాయం ఏ స్థాయిలో ఉండేదంటే, ఓ పశువుల కాపరి తన ప్రాంతానికి పరుగెత్తుతూ వచ్చి అరిచాడు "ప్రజలారా! ఉమర్(రజి) మరణించారు". ప్రజలు ఆశ్చర్యంతో అతనిని అడిగారు, అడవిలో ఈ విషయాన్ని నీకెవరు తెలియపరిచారని. ఆ పశువుల కాపరి ఉండే ప్రాంతం మదీనాకు వేల కిలోమీటర్ల దూరంలో ఉంది. ఈ పశువుల కాపరికి ఎలా తెలిసింది?

పశువుల కాపరి చెప్పాడు, **"ఉమర్(రజి) బ్రతికున్నంత కాలం నా గొఱ్ఱెలు భయం లేకుండా అడవిలో సంచరిస్తుండేవి. ఏ జంతువూ వాటి వంక చూడటానికి ధైర్యం చేసేది కాదు. ఈ రోజు, మొదటిసారిగా, ఓ తోడేలు నా మేకను తీసికెళ్ళి పోయింది. తోడేలు భయం పోవడాన్ని బట్టి ఉమర్(రజి)వారు ఇకలేరు అని నాకు అనిపించింది."**

నేను ప్రపంచంలోని చరిత్రకారులందరినీ ఆహ్వానిస్తున్నాను - ఉమర్(రజి)వారి ముందు అలెగ్జాండర్ నుంచడానికి.

ఓ పర్వతం ముందు ఉండే చిన్న గులకరాయిలా అలెగ్జాండర్‌ని కనుగొంటారు. ఎందుకంటే అలెగ్జాండర్ స్థాపించిన సామ్రాజ్యం అతని మరణం తరువాత 5 సంవత్సరాలలోనే అంతమైంది.

ఉమర్(రజి)వారి విషయానికొస్తే, ఆయన ఇస్లామ్ జెండా పాతిన ప్రాంతాలు ఇప్పటికీ "అల్లాహు అక్బర్" అని ప్రతిధ్వనిస్తూనే ఉన్నాయి. ప్రజలు అల్లాహ్‌కు విధేయత చూపిస్తూనే ఉన్నారు.

అలెగ్జాండర్ పేరు ఇప్పుడు కేవలం పుస్తకాలలోనే ఉంది. కాని

ఉమర్(రజి)వారు ప్రపంచానికి అందించిన వ్యవస్థలు (systems) ఇప్పటికీ ప్రపంచంలోని కనీసం 245 దేశాలలో ఏదో ఒక రూపంలో వ్యాపించి ఉన్నాయి.

ఈ రోజుకి సయితం,

**పోస్ట్ ఆఫీస్‌లో ఓ లెటర్‌ను పోస్ట్ చేసినా,**

**ఓ పోలీసతను యూనిఫామ్ ధరించినా,**

**ఓ సైనికుడు ఆరు నెలలు డ్యూటీ చేసిన తరువాత సెలవులో ఇంటికి వెళ్లినా,**

**ప్రభుత్వం పిల్లలకు, అభాగ్యులకు, వితంతువులకు లేదా అసహాయులకు స్టయిపండ్ ఇచ్చినా,**

తెలుసుకోవలసిన దేమిటంటే, ఆ సమాజం ఆటోమెటిక్‌గా ఉమర్(రజి)వారిని 'ద గ్రేట్' అని అంగీకరిస్తున్నట్లే. అంతేకాకుండా ఉమర్(రజి)వారిని ఎప్పటికీ ద గ్రేట్ "సికందర్"గా ఒప్పుకుంటున్నట్లే.

కాని అలా ఒప్పుకోలేనిది ఎవరంటే ఆత్మన్యూనతతో, తమ విశ్వాసాన్ని చెప్పుకోవడానికి భయపడే కొంతమంది ముస్లిములు మాత్రమే.

లాహోర్‌లోని ముస్లిములు ఒకసారి ఇంగ్లీష్ వాళ్ళకి చేసిన హెచ్చరిక ఏమిటంటే, చర్య తీసుకోవడానికి వారు గనుక నిర్ణయించుకుంటే, ఇంగ్లీష్ వారికి చంఘిజ్‌ఖాన్‌ను గుర్తుకు తెస్తామని చెప్పారు.

ఈ విషయంపై జవహర్‌లాల్ నెహ్రూ చిరునవ్వు నవ్వి అన్నారు:

**"ముస్లిములు చంఘిజ్‌ఖాన్‌ను ఉదాహరిస్తున్నారు. వారి చరిత్రలో ఉమర్(రజి) కూడా ఉన్నారనే విషయాన్ని వారు మర్చిపోవడం విచారకరం".**

ముహమ్మద్(స)వారు చెప్పినదాని ప్రకారం, ఒకవేళ ఆయన(స) తరువాత మరో ప్రవక్త ఉన్నట్లయితే అది ఉమర్(రజి) వారే. కాని ముహమ్మద్(స)వారే చిట్టచివరి ప్రవక్త.

(ఈ వ్యాసం యొక్క ఇంగ్లీష్ మూలాన్ని ఓ సోదరుడు పంపారు. వ్యాసకర్త పేరు మరియు ఇతర వివారాలు ఇంకా అందవలసి ఉంది.)

ఉమర్(రజి) వంటి ఖలీఫా ఒక్కరు భారతదేశంలో ఉంటే, మన దేశానికి నిజమైన ప్రజాస్వామ్యం వస్తుందని మహాత్మగాంధీ చెప్పారంటే, ఉమర్(రజి)వారి పాలన ఎంత గొప్ప స్థాయిలో ఉందో అర్థం చేసుకోవాలి.

చరిత్రలో ప్రఖ్యాత విమర్శకులు సయితం, ఉమర్(రజి)వారిని పొగడ్తలతో ముంచెత్తారు.

ముస్లిమ్‌లకు ప్రాణం కంటే ఎక్కువైన ముహమ్మద్(స)వారి జీవితం గురించే 90శాతం కంటే ఎక్కువమంది ముస్లిములకు తెలియదు. అటువంటిది ఆ మహాప్రవక్త(స) యొక్క ముఖ్య అనుచరుడు ఉమర్(రజి)వారి గురించి ఇంకేమి తెలుసుంటుంది?

ప్రవక్త(స)వారి జీవితచరిత్ర క్రిందటి సంచికతో ప్రారంభమైంది. ఉమర్(రజి)వారి చరిత్రను త్వరలోనే ఇన్షా అల్లాహ్ అందిస్తాము.

**22 లక్షల చదరపు మైళ్ళ భూభాగానికి నాయకుడైన ఉమర్(రజి), మదీనా మస్జిద్ దగ్గర బిచ్చగాళ్ళ మధ్యలో పడుకుని ఉండడం చూసిన వారికి ఆ క్షణంలో ఎలా ఉండి ఉంటుంది? వారి కళ్ళవెంట నీళ్ళు ఆగుతాయా?**

చేతిలో కొరడాతో వీధులు, మార్కెట్ ప్రదేశాలలో తిరుగుతూ ఏదైనా అన్యాయం జరిగితే, ఆ స్పాట్‌లోనే ఆయన శిక్షించేవారు. అందుకే **వేరే వ్యక్తి చేతిలోని కత్తికంటే, ఉమర్(రజి)వారి చేతిలోని కొరడా అంటేనే ఎక్కువ భయపడేవారు**. కాని ఆయన హృదయం వెన్న వంటిది. అతి నిరాడంబరంగా బ్రతికిన మహామనిషి.

ఈయనంటే షైతాన్‌కీ హడలే! ఈయన ఒక వీధిలో నుండి వస్తూ ఉంటే, షైతాన్ ఆ వీధి లోకి రాడని ప్రవక్త(స)వారి నుండి తెలిసింది.

ఇటువంటి నాయకుడు మనకు చరిత్రలో ఒకరున్నారని చెప్పుకోవడం ప్రతీ ముస్లిమ్‌కి గర్వకారణం. నిజమైన ప్రజాస్వామ్యాన్ని స్థాపించిన నాయకుడు. ఈయన పాలించినంత భూమిని, ఈ భూమిపై మరెవ్వరూ పాలించలేదు. అయినప్పటికీ వేసుకున్న చొక్కాకు చిరుగులు. ఈయనకు ఉన్న ఇల్మ్ గొప్పది. ఆచరణ గొప్పది. అల్లాహ్ అంటే భయం. ప్రవక్త(స)వారంటే ప్రాణం కంటే ఎక్కువ ఈయనకి.

**ఇటువంటి నాయకున్ని నిజమైన ముస్లిములు ప్రేమిస్తారు. చరిత్ర చదివినవారు, వారెవరైనప్పటికీ ఈయనను అభిమానిస్తారు.**

అమీరుల్ మోమినీన్ (విశ్వాసుల నాయకుడు) అయిన ఈయన గురించి, నేటి జమియత్‌ల అమీర్లు కాస్తఅయినా తెలుసుకుని తదనుగుణంగా ప్రవర్తిస్తే నేటి ముస్లిమ్ సమాజానికి, ఇన్షా అల్లాహ్ మేలు జరుగుతుంది.

**ఉమర్(రజి), ద గ్రేట్.** ఈ మహానాయకుని గురించి మీ పిల్లలకు కూడా చెప్పండి. ఎందుకంటే వారి చరిత్ర పుస్తకాలలో ఈ వివరాలుండవు.

**సువిశాల భూభాగానికి, ఇంతవరకూ ఏ రాజు పాలించనంత భూభాగానికి మహానాయకుడైన**
**ఉమర్ (రజి)వారు**
**14 చిరుగులున్న చొక్కాను ధరించి అల్లాహ్ ముందు విధేయతతో ఒదిగి ఉండేవారు.**
**ఈయన తీసుకున్న జీతం ఓ పేదవాడు సంపాదించే దానికంటే తక్కువే.**
**ప్రపంచంలోని ఎన్నో దేశాల జీవనవ్యవస్థలపై ప్రభావం చూపించిన ఈ "సన్మార్గాన్ని పొందిన ఖలీఫా"కు ఆవగింజంత అహంకారం కూడా లేదు.**
**ఇల్మ్‌లోగాని, వివేకంలోగాని మేటి ఈయన.**
**నేడు గొప్పవారమని విర్రవీగేవారు ఈ మహానాయకునితో ఓసారి పోల్చి చూసుకోవాలి. ఆ పోలిక మహావిశ్వంతో ఓ బాక్టీరియాను పోల్చినట్లు ఉంటుంది. కాదంటారా?**

# స్వర్గానికి హామీ

తౌబాన్ - అల్లాహ్ యొక్క సందేశహరుల(స)వారి స్వేచ్ఛ నొసంగబడిన బానిస - నుండి అబూ అల్-ఆలియహ్ ఉల్లేఖించినది, అతను (తౌబాన్) చెప్పినదేమిటంటే అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : **"మానవాళి నుండి దేనికొరకైనా అడగనని ఎవరు నాకు హామీ ఇస్తారు? (దానికి బదులుగా) నేను అతనికి స్వర్గాన్ని హామీ ఇస్తాను".** కాబట్టి తౌబాన్ చెప్పారు, "నేను" మరియు అతను ఇంకా చెప్పారు: "మరియు నేను ఎవరినీ దేనికొరకు ఎప్పుడూ అడగలేదు"

**(అబూదావూద్, సహీహ్ హదీస్ నెం.1643, 9వ పుస్తకం, అధ్యా. 27, సంపుటి 2)**

حَدَّثَنَا عُبَيْدُ اللّٰهِ بْنُ مُعَاذٍ: حَدَّثَنا أَبِي: حَدَّثَنَا شُعْبَةُ عَنْ عَاصِمٍ ، عَنْ أَبِي العَالِيَةِ عَنْ ثَوْبَانَ ـ قَالَ وَكَانَ ثَوْبَانُ مَوْلَىٰ رَسُولِ اللّٰهِ ﷺ ـ قَالَ: قَالَ رَسُولِ اللّٰهِ ﷺ : ((مَنْ تكَفَّلَ لِي أَنْ لَا يَسْأَلَ النَّاسَ شَيْئًا فَأَتَكَفَّلَ لَهُ بالْجَنَّةِ؟)) فَقَالَ ثَوْبَانُ: أَنَا، فَكَانَ لَا يَسْأَلُ أَحَدًا شَيْئًا

అబూహురైరా(రజి) వారి ఉల్లేఖనం: అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు, "ఎవరి చేతిలో నా ప్రాణం ఉందో ఆయన సాక్షి! ఓ వ్యక్తి దేనికోసమైనా అడగడం మరియు ఆ వ్యక్తి ఇవ్వవచ్చు లేదా అతనికి ఇవ్వకపోవచ్చు **అతనికంటే మీలో ఎవరైనా ఒకరు ఓ తాడును తీసుకుని** (అడవిలోని) **కలపని కొట్టి, అతని వీపుపై దానిని మోసుకుని వస్తాడో** (అమ్ముతాడో అతని జీవనోపాధి కొరకు), (ఈ కష్టజీవి) **ఉత్తముడు.**

**(సహీహ్ బుఖారీ, 1470, పుస్తకం 24, అధ్యా. 50, సంపుటి 2)**

حَدَّثَنَا عَبْدُ اللّٰهِ بنُ يُوسُفَ: أَخْبَرَنا مالكٌ، عَنْ أبي الزِّنادِ، عَنِ الأعْرَجِ، عَنْ أبي هُرَيْرَةَ رَضِيَ اللّٰهُ عَنْهُ: أَنَّ رَسُولَ اللّٰهِ ﷺ قَالَ: ((وَالّذِي نَفْسِي بِيَدِهِ لأَنْ يأْخُذَ أَحَدُكُم حَبْلَهُ فَيَحْتَطِبَ عَلى ظَهْرِهِ خيرٌ لَهُ مِنْ أنْ يأتيَ رَجُلًا فَيَسألَهُ، أعْطاهُ أوْ مَنَعَهُ)).

ఆయిషా(రజి) వారి ఉల్లేఖనం: రసూలుల్లాహ్(స) వారు చెప్పారు, **నిస్సందేహంగా మనిషి తినే ఉత్తమ ఆహారం అది అతను స్వయంగా సంపాదించుకున్నది** మరియు అతని బిడ్డ (మరియు అతని బిడ్డ సంపద) అతని సంపాదనలోని ఓ భాగం.

**(ఇబ్నెమాజా, సహీహ్ హదీస్ నెం. 2137, పుస్తకం 12, అధ్యా. 1, సంపుటి 3)**

حَدَّثَنَا أَبُو بَكْرِ بْنُ أَبِي شَيْبَةَ، وَ عَلِيُّ بْنُ مُحَمَّدٍ، وَ اِسْحَاقُ بْنُ اِبْرَاهِيمَ بْنِ حَبِيبٍ قَالُوا : حَدَّثَنَا أَبُو مُعَاوِيَةَ : حَدَّثَنَا الْأَعْمَشُ عَنْ اِبْرَاهِيمَ، عَنِ الْأَسْوَدِ، عَنْ عَائِشَةَ قَالَتْ : قَالَ رَسُولُ اللهِ ﷺ : ((اِنَّ أَطْيَبَ مَا أَكَلَ الرَّجُلُ مِنْ كَسْبِهِ. وَاِنَّ وَلَدَهُ مِنْ كَسْبِهِ)).

ఉర్వా బిన్ అజ్-జుబైర్ మరియు సఈద్ బిన్ అల్- ముసయ్యబ్ ఉల్లేఖనం: హకీమ్ బిన్ హిజామ్(రజి) చెప్పారు, "(ఒకసారి) అల్లాహ్ యొక్క సందేశహరుల(స)ను నేను (ఫలానా కావాలని) అడిగాను మరియు ఆయన(స) నాకు ఇచ్చారు. నేను మరలా అడిగాను. మరియు ఆయన(స) నాకు ఇచ్చారు. తరువాత ఆయన(స) చెప్పారు, **"ఓ హకీమ్! ఈ సంపద మధురమైన తాజా పండు వంటిది. అత్యాశ లేకుండా ఎవరైనా దీనిని తీసుకుంటే, అందులో అతనికి శుభాలున్నాయి.** మరియు ఎవరైతే దీనిని అత్యాశతో తీసుకుంటారో, అందులో అతనికి శుభాలుండవు. మరియు అతను తిన్నా సరే ఎప్పటికీ సంతృప్తి చెందని వ్యక్తి వంటి వాడు, మరియు **పై చేయి** (ఇచ్చే చేయి) **క్రింది చేయి** (తీసుకునే చేయి) **కంటే ఉత్తమమైనది.** హకీమ్ ఇంకా చెప్పారు, "నేను రసూలుల్లాహ్(స) వారికి చెప్పాను, మిమ్మల్ని సత్యంతో పంపిన ఆయన (అల్లాహ్) సాక్షి! **మీ తరువాత నేనెప్పటికీ ఈ ప్రపంచాన్ని వదిలేవరకూ ఎవరినుండైనా ఏదైనా అడగడంగాని తీసుకోవడంగాని చేయను**". తరువాత అబూబకర్ సిద్దీఖ్(రజి) (ఖలీఫాగా ఉన్నకాలంలో) అతనికి ఇవ్వడానికి హకీమ్‌ను పిలిచారు (ప్రవక్త వారి ఇతర సహచరులను పిలిచినట్లే), కాని దేనినైనా స్వీకరించడానికి అతను (హకీమ్) తిరస్కరించారు. తరువాత ఉమర్(రజి) (ఖలీఫాగా ఉన్న కాలంలో) అతని భాగాన్ని ఇవ్వడానికి అతనిని (హాకిమ్‌ని) పిలిచారు, కాని ఆయన తిరస్కరించారు (తీసుకోవడానికి). ఆ విషయంపై ఉమర్(రజి) చెప్పారు, "ఓ ముస్లిములారా! మిమ్మల్ని హకీమ్‌పై సాక్షులుగా చేసుకోవాలనుకునేది ఏమిటంటే, నేను హకీమ్‌కు యుద్ధ ప్రాప్తి నుండి అతని భాగాన్ని ఇవ్వజూపితే, అతను తీసుకోవడానికి తిరస్కరించాడు". ఆ విధంగా హకీమ్ అతను మరణించేవరకూ ప్రవక్త(స)వారి తరువాత ఎవరి దగ్గర నుండి ఏది కూడా ఎప్పుడూ తీసుకోలేదు."

(సహీహ్ బుఖారీ, 1472, 24వ పుస్తకం-జకాత్, అధ్యా. 50, సంపుటి 2)

حدَّثنا عَبْدانُ: أخبرَنا يُونُس، عَنِ الزُّهرِيِّ، عَنْ عُرْوَةَ بنِ الزُّبير، وَسَعِيدِ بنِ المُسَيَّبِ: أَنَّ حَكِيمَ بنَ حِزامٍ رَضِيَ اللّهُ عَنهُ قالَ: سألْتُ رَسُولَ اللهِ ﷺ فأعْطاني، ثُمَّ سألْتُهُ فأعْطاني، ثُمَّ سألْتُهُ فأعْطاني، ثُمَّ قالَ: ((يا حَكِيمُ، انَّ هٰذا المالَ خضِرَةٌ حُلْوَةٌ، فَمَنْ أخَذَهُ بسَخاوَةِ نَفْسٍ بُورِكَ لَهُ فِيهِ، وَمَنْ أخَذَهُ باشْرافِ نَفْسٍ لَمْ يُبارَكْ لَهُ فِيهِ، وَكانَ كالَّذي يأكُلُ وَلا يَشْبَعُ. اليَدُ العُليا خيرٌ مِنَ اليَدِ السُّفلى)). فَقالَ حَكيمٌ: فَقُلْتُ: يارَسُولَ اللهِ، وَالَّذي بَعَثَكَ بالحَقِّ لا أرْزَأُ أحداً بَعْدَكَ شَيْئاً حَتَّى أُفارِقَ الدُّنيا. فَكانَ أبو بَكْرٍ رَضِيَ اللّهُ عَنهُ يَدْعُو حَكِيماً الى العَطاءِ فَيَأبى أن يَقْبَلَهُ مِنْهُ. ثُمَّ انَّ عُمَرَ رَضِيَ اللّهُ عَنْ دَعاهُ لِيُعْطِيَهُ فأبى أنْ يَقْبَلَ مِنْهُ شَيْئاً. فَقالَ: انّي أُشْهِدُكُم مَعْشَرَ المُسْلِمينَ عَلى حَكِيمٍ، أنّي أعْرِضُ عَلَيْهِ حَقَّهُ مِن هٰذا الفَيْءِ فَيَأبى أنْ يأ خُذَهُ. فَلَمْ يَرْزَأْ حَكِيمٌ أحداً مِنَ النَّاسِ بَعْدَ رَسُولِ اللّهِ حَتَّى تُوُفِّيَ.

**అల్లాహుతాలా ముస్లిమ్ సమాజాన్ని ఉత్తమ సమాజంగా చేశారు. ఆ సమాజంలో అల్లాహ్‌కు విధేయుడైన ప్రతీ ముస్లిమ్ అల్లాహ్‌నే అడగాలి. కష్టపడి బ్రతకాలి. అల్లాహ్ కొరకు పనిచేస్తున్నామని దానం ఇవ్వమని అడుక్కోవడం సరికాదు. కష్టపడి పనిచేస్తూ అల్లాహ్ మార్గంవైపు పిలవాలి గాని, ఆ 'దావత్' పేరుతో పని ఎగ్గొట్టి డబ్బు అడగడం ప్రవక్త(స)వారిని అభిమానించే ఏ వ్యక్తీ చేయలేదు.**

زكاة

# జకాత్

విధి దానం

ప్రత్యేక వ్యాసం

సాధారణంగా ఈ ప్రపంచంలో ప్రతీ ఒక్కరూ వ్యవసాయం ద్వారానో, వ్యాపారం ద్వారానో, ఉద్యోగం ద్వారానో తమ జీవనోపాధిని పొందుతున్నారు. ఆ ఉపాధిని ధర్మ సమ్మతమైన విధానంలో పొందవలసి ఉంది. వీటికి సంబంధించిన మార్గదర్శకాలను ఇస్లామ్ నిర్దేశించింది.

సంపాదనకు సంబంధించి 2 ముఖ్యమైన విషయాలున్నాయి.

అందులో ఒకటి మన సంపాదనను శుభ్రపరుస్తుంది. దానివలన సంపాదనలో పెరుగుదల ఉంటుంది.

అయితే మరొకదాని వలన ఒకరి సంపాదన నశిస్తుంది. ఈ వృద్ధి చేయడం లేదా నశింపజేసే విషయాలు కేవలం మన సంపాదనకే పరిమితం కాదు. మన పరలోక జీవితంపై కూడా అవి ప్రభావం చూపుతాయి.

క్రింది ఖుర్'ఆన్ వాక్యం గమనించండి :

**"అల్లాహ్ వడ్డీ (ఆదాయం)ని నశింపజేస్తాడు మరియు దాన ధర్మాలు (చేసేవారికి) వృద్ధి చేస్తాడు"** ..... (ఖుర్'ఆన్ 2:276)

వడ్డీ చాలా మందికి ముద్దుగా ఉంటుంది. ఆదాయం పెరుగుతున్నట్లే ఉంటుంది. కాని ఆ ఆదాయం నశించిపోతుంది. ఇహలోక పరలోక జీవితాల్లో మనిషిని సర్వనాశనం చేస్తుంది. వడ్డీ మరియు దాని దుష్ప్రభావాల గురించి సవివరంగా శాంతిబాట 2 మరియు 3వ సంచికలలో వివరించాము.

'జకాత్' (విధి దానం) చేయడం వలన ఒకరి సంపాదన తగ్గినట్లుగా అనిపిస్తుంది. కాని నిజానికి అది వృద్ధి చెందుతుంది (నిజాయితీగా జకాత్ ఇస్తే). పరలోక జీవితంలో 'జకాత్' మనకు మేలు చేస్తుంది.

వడ్డీ వలన పరలోకంలో స్వర్గాన్ని పోగొట్టుకోవలసి వస్తుంది. జకాత్ చెల్లించకపోతే తీర్పుదినాన ప్రజల మధ్య తీర్పు పూర్తయ్యేవరకూ ఘోరమైన శిక్షను అనుభవించాల్సి ఉంటుంది. ఈ విషయాలను కూడా ఈ సంచికలో ప్రామాణిక హదీసుల ద్వారా సవివరంగా అంద జేస్తున్నాము.

**జకాత్ :** భాషాపరంగా జకాత్ అంటే పెరుగుదల లేక శుద్ధి గావించడం (శుభ్రపరచడం) అని అర్థం. జకాత్ మన ఐశ్వర్యాన్ని శుద్ధి చేస్తుంది. ఒక నిర్ణీతమైన పరిమాణం (నిసాబ్) కంటే ఎవరి ఐశ్వర్యం ఎక్కువగా ఉంటుందో, వారు తప్పనిసరిగా జకాత్ చెల్లించాలి.

జకాత్ యొక్క విశిష్ఠతను తెలిపే ఆయత్‌లు ఖుర్'ఆన్‌లో చాలా ఉన్నాయి. వాటిలో కొన్ని : 2:43, 2:83, 2:110, 5:12, 7:156, 9:11, 9:60, 9:103, 22:78, 23:4, 24:56, 30:39, 73:20, 98:5. ఇక హదీస్ గ్రంథాలలో జకాత్ గురించి చాలా ఉల్లేఖనాలున్నాయి. అవి:

| | గ్రంథం పేరు | హదీస్‌లు | పుస్తకం | అధ్యాయాలు | సంపుటి |
|---|---|---|---|---|---|
| 1. | **సహీహ్ బుఖారీ** | 118 | 24 | 78 | 2 |
| 2. | **సహీహ్ ముస్లిమ్** | 232 | 12 | 55 | 3 |
| 3. | **అబూదావూద్** | స. 59<br>హ. 45 | 9 | 46 | 2 |
| 4. | **తిర్మిదీ** | స. 30<br>హ. 16 | 5 | 38 | 2 |
| 5. | **నసాయీ** | స. 130<br>హ. 33 | 23 | 100 | 3 |
| 6. | **ఇబ్నెమాజా** | స. 26<br>హ. 20 | 8 | 28 | 3 |

**స.** - సహీహ్ (strong) **హ.** - హసన్ (good)

పై పట్టికలో ఇచ్చిన ఉల్లేఖనాలన్నింటిని (దాదాపు 709 హదీస్‌లను) అధ్యయనం చేసి, వాటిని వ్యాస రూపంలో ఇక్కడ మీకందిస్తున్నాము.

'జకాత్' ఇస్లామ్ మూలస్తంభాలలో ఒకటి.

**జకాత్ ఏ ఏ వాటిపై చెల్లించాలి?**
**అవి ఎంత పరిమాణంలో ఉంటే చెల్లించాలి?**

పక్క పేజీలోని పట్టిక చూడండి.

వర్షాధార పంటలపై ఫలసాయంలో పదవ వంతు (ఉష్ర్) చెల్లించాలి. ఇతరత్రా పంటలపై ఫలసాయంలో 20వ వంతు (సగం ఉష్ర్) చెల్లించాలి. ఉదాహరణకు 100 బస్తాలు పంట చేతికందితే, అది వర్షాధార పంట అయితే 10 బస్తాలను చెల్లించాలి. వర్షాధార పంట కాకుండా, మరో విధంగా నీరు పెట్టబడినట్లయితే, 5 బస్తాలను చెల్లించాలి.

అబ్దుల్లాహ్ (బిన్ ఉమర్) (రజి) ఉల్లేఖనం : ప్రవక్త(స) చెప్పారు, "వర్షపు నీటి ద్వారా లేక సహజ నీటి కాలువల ద్వారా నీరుపెట్టబడిన భూమిపై లేక దగ్గరిలోని నీటి కాలువ వలన చిత్తడిగా ఉండే నేలపై ఉష్ర్ (ఫలసాయంలో 10వ వంతు) తప్పనిసరి మరియు నూతి నీరుచే (లేక ఇతర విధానాల ద్వారా) నీరుపెట్టబడిన భూమిపై సగం ఉష్ర్ (ఫలసాయంలో 20వ వంతు). **(సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 1483, పుస్తకం 24, అధ్యాయం 55, సంపుటి 2)**

ఒంటెలు 4 మాత్రమే ఉంటే, వాటిపై జకాత్ లేదు. 5 ఒంటెలు ఉంటేనే జకాత్ చెల్లించాలి. మేకలు, గొఱ్ఱెలు 40 ఉంటే వాటిపై జకాత్ చెల్లించాలి. అవి 39 మాత్రమే ఉంటే జకాత్ లేదు.

జకాత్ చెల్లించడానికి నిర్ణీత పరిమాణంలో అరబీ కొలమానంలో ఇలా ఉంది : పంట విషయంలో **ఔసఖ్**, బంగారం విషయంలో **మిత్ఖాల్**, వెండి విషయంలో **అవాఖ్**. 1 **వస్ఖ్** = 60 సా'అలు (దాదాపు 135 కేజీలు)   వస్ఖ్‌కు బహువచనం - ఔసఖ్. 5 **ఔసఖ్** = 5 x 135 = 675 కేజీలు దీనినే 653 కేజీలుగా కొందరు లెక్కగట్టారు. జకాత్ కాబట్టి ఈ కొలమానం విషయంలో తక్కువ పరిమాణాన్ని లెక్కలోకి తీసుకోవడం మంచిదని మా అభిప్రాయం. దిగువనిచ్చిన పరిమాణాలలో తక్కువ పరిమాణంలో ఉన్న 'నిసాబ్'నే తెలియజేశాం.

| | జకాత్ చెల్లించ వలసిన సంపద | జకాత్ చెల్లించడానికి ఉండవలసిన కనీస పరిమాణం (నిసాబ్) | చెల్లించవలసిన జకాత్ |
|---|---|---|---|
| 1. | వ్యవసాయ పంట | 5 ఔసఖ్ (ప్రతీ పంటపై)<br>(653 కేజీలు) | 1. నీటి పారుదల సౌకర్యమున్న భూమిపై **10వ వంతు**<br>2. నూతి ద్వారా నీరు పెట్టబడితే **20వ వంతు** |
| 2. | బంగారం | 20 మిత్ఖాల్<br>(85 గ్రాములు) | **2.5 శాతం** (40వ వంతు) |
| 3. | వెండి | 5 అవాఖ్‌లు<br>(595 గ్రాములు) | **2.5 శాతం** (40వ వంతు) |
| 4. | ధనం (కరెన్సీ) | 595 గ్రాముల వెండికి సమానమైనంత | **2.5 శాతం** (40వ వంతు) |
| 5. | ఆవులు / గేదెలు | 30 | 1. ప్రతీ 30 పశువులకి **1 సంవత్సర వయస్సున్న దూడ**<br>2. ప్రతీ 40 పశువులకి **2 సంవత్సరాల వయస్సున్న దూడ** |
| 6. | మేకలు / గొఱ్ఱెలు | 40 | 1. 40 నుండి 120 వరకూ, **1 గొఱ్ఱె**<br>2. 120 నుండి 200 వరకూ, **2 గొఱ్ఱెలు**<br>3. 200 నుండి 300 వరకూ, **3 గొఱ్ఱెలు**<br>4. ఆపై ప్రతీ 100 గొఱ్ఱెలకు **1 గొఱ్ఱె జకాత్‌గా ఇవ్వాలి.** |
| 7. | ఒంటెలు | 5 | 1. ఐదు ఒంటెలకు, **1 గొఱ్ఱె**<br>2. 25 నుండి 35 ఒంటెలకు,<br>**1 బిన్తె మఖాద్** (ఒక సంవత్సరం వయస్సు గల ఆడ ఒంటె)<br>3. 36 నుండి 45 ఒంటెలకు,<br>**1 బిన్తె లబూన్** (రెండు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె)<br>4. 46 నుండి 60 ఒంటెలకు,<br>**1 హిఖ్ఖా** (మూడు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె)<br>5. 61 నుండి 75 ఒంటెలకు,<br>**1 జద్'అ** (నాలుగు సంవత్సరాల వయస్సు గల ఆడ ఒంటె)<br>6. 76 నుండి 90 ఒంటెలకు, **2 బిన్తె లబూన్**<br>7. 91 నుండి 120 ఒంటెలకు, **2 హిఖ్ఖా**<br>8. 120 కంటే ఎక్కువ ఒంటెలుంటే,<br>ప్రతీ 40 ఒంటెలకు **1 బిన్తె లబూన్**<br>ప్రతీ 50 ఒంటెలకు **1 హిఖ్ఖా** |
| 8. | తేనె | | **10వ వంతు** |

అదే విధంగా వాటి ఖరీదులోనే కాకుండా, ప్రాంతాలను బట్టి తేడాలున్నాయి. ఉదా: చెన్నయ్‌లో 10 గ్రా బంగారం ధరకు మరియు హైదరాబాద్‌లోని ధరకు స్వల్పమైన తేడా ఉంటుంది.

**ఉదాహరణకు:** ఈ వ్యాసం వ్రాసే సమయానికి 22 కారెట్ల బంగారం 10 గ్రాముల ఖరీదు : రూ. 16,990/-. ఒక గ్రాము ఖరీదు: రూ.1699.

**85 గ్రాముల బంగారం ధర** : 85 x రూ. 1,699/- = రూ. **1,44,415/-**
**595 గ్రాముల వెండి ధర** : 595 x రూ. 29.10 = రూ. **17,314/-**

ఈ ధనంపై ప్రతీ 100 రూపాయలపై రెండు రూపాయల యాభై పైసలు (రూ. 2.50) జకాత్‌గా చెల్లించాలి. ఈ 595 గ్రాముల వెండి నిసాబ్ కంటే తక్కువ ఉంటే జకాత్ చెల్లించనవసరం లేదు.

**1. ఒక వ్యక్తి దగ్గర ఒక లక్షా యాభై వేలు ధనం ఉంటే :**

జకాత్ = (1,50,000 x 2.50)/100 = **రూ. 3,750/-**
(మూడు వేల ఏడు వందల యాభై రూపాయలను చెల్లించాలి)

**2. ఒక వ్యక్తి దగ్గర ఒక లక్షా యాభైవేల రూపాయలు మరియు 20 గ్రాముల బంగారం ఉంటే :**

| | | |
|---|---|---|
| 20 గ్రా. బంగారం విలువ (2 x 16,990/-) | = | రూ. 33,980 |
| నగదు (కేష్) | = | రూ. 1,50,000 |
| **మొత్తం** | **=** | **రూ. 1,93,980** |
| జకాత్ (2.5 శాతం) | = | రూ. 4,850 |

(నాలుగు వేల ఎనిమిది వందల యాభై రూపాయలను చెల్లించాలి)

## సంపాదనపై జకాత్ నిసాబ్ కొరకు వెండి నిసాబ్‌ను స్వీకరించాలా? లేక బంగారం నిసాబ్‌ను స్వీకరించాలా?

వెండి నిసాబ్ (200 దిర్హములు లేదా 595 గ్రాముల వెండి)ను జకాత్‌కు హద్దుగా తీసుకోవాలని క్రింది ఉల్లేఖనాల ద్వారా తెలుస్తుంది.

అబూ సయీద్ అల్-ఖుద్రీ (రజి) ఉల్లేఖనం : అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "5 కంటే తక్కువ ఒంటెలపై దానం (జకాత్) లేదు మరియు **5 అవాఖ్‌ల (వెండి) కంటే తక్కువున్న వాటిపై సదఖా లేదు.** 5 ఔసఖ్‌ల కంటే తక్కువ ఉన్న దానిపై సదఖా లేదు. **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1558, పుస్తకం 9, అధ్యాయం 2, సంపుటి 2)**

అలీ(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) చెప్పారు, "నేను నిన్ను గుఱ్ఱాలపై మరియు బానిసలపై (జకాత్ చెల్లించడం) నుండి మినహాయింపు నిస్తున్నాను మరియు రెండు వందల (దిర్హమ్‌ల) కంటే తక్కువున్న (వాటిపై) జకాత్ లేదు. **(నసాయీ, హసన్ హదీస్, 2480, 23వ పుస్తకం, అధ్యాయం 18, సంపుటి 3)**

అబూ సయీద్(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స)వారు చెప్పారు: "5 అవాఖ్‌ల (200 దిర్హమ్‌ల) కంటే తక్కువుంటే సదఖా (జకాత్) లేదు. **(నసాయీ, సహీహ్ హదీస్, 2488, పుస్తకం 23, అధ్యా. 24, సంపుటి 3)**

పైన చెప్పిన ఉల్లేఖనాలలో, **'బంగారం గాని లేదా వెండిగాని'** అని లేదు. వెండి గురించి మాత్రమే ఉంది.

కాని ఎవరైనా 'తమ దగ్గర 85 గ్రాముల బంగారంగాని, దానికి సమానమైనంత డబ్బు ఉంటేనే జకాత్ ఇస్తాము లేకపోతే ఇవ్వము' నిర్ణయించుకుంటే, ఆ విషయాన్ని వారి విజ్ఞతకే వదిలేశాము.

ఈ వ్యాసంలో 60వ పేజీలో ఇచ్చిన ఉల్లేఖనంలో 40 దిర్హమ్‌లు ఉన్నవ్యక్తి జకాత్‌ను అడగకూడదని ఉంది. 40 దిర్హములు అంటే వెండి నిసాబ్‌లో 5వ వంతు. కాబట్టి ఉల్లేఖనాలన్నింటిని చదివిన తరువాత మీరే ఆలోచించుకోండి. ఒక వేళ మీరనుకున్నది తప్పు అయితే, దానిని పునరుత్థాన దినమున సరిచేసుకోవడానికి అవకాశం ఉండదు.

ప్రస్తుతం సుమారు 17వేల రూపాయలు ఉంటే జకాత్‌ను ఇవ్వడానికి ప్రయత్నించండి. దాని వలన మేలే జరుగుతుంది. 17వేల రూపాయలపై కేవలం రూ. 425/-లు ఇచ్చినంత మాత్రాన పెద్దగా ఏదీ తరిగిపోదుగాని, మీ సంపద వృద్ధి అవుతుంది. ఇన్షా అల్లాహ్!

ఆలోచించండి! మన సంపాదనలోని జకాత్ పేదవారి హక్కు. వారి హక్కును వారికి ఇవ్వాలి.

### జకాత్ ఎవరికి ఇవ్వాలి ?

**"నిశ్చయంగా అస్సదఖాత్(జకాత్) కేవలం యాచించు నిరుపేదలకు మరియు యాచించని పేదవారికి, (జకాత్) వ్యవహారాలపై నియమించ బడిన వారికి మరియు ఎవరి హృదయాలనైతే (ఇస్లామ్ వైపుకు) ఆకర్షించ వలసి ఉందో వారికి, బానిసల విముక్తి కొరకు, ఋణగ్రస్తులైన వారి కొరకు, అల్లాహ్ మార్గంలో (పోయేవారికొరకు), మరియు బాటసారుల కొరకు ఇది అల్లాహ్ నిర్ణయించిన ఒక విధి మరియు అల్లాహ్ సర్వజ్ఞుడు, మహా వివేకవంతుడు."**

(ఖుర్'ఆన్ 9:60)

పై ఖుర్'ఆన్ వాక్యంలో చెప్పిన 8 రకాల వ్యక్తులకు జకాత్ ఇవ్వవచ్చు.

1. (యాచించు) **పేదవారు** : ఇటువంటి పేదవారి గురించి ప్రత్యేకంగా చెప్పనవసరం లేదు. వీరు తోటి సోదరుల దగ్గర యాచిస్తూ ఉంటారు. అయితే అడుక్కోవడాన్ని **వృత్తిగా** చేసుకున్నవారి గురించి తీవ్రంగా చెప్పబడిన విషయాలు ఈ వ్యాసం చివరిలో ఇవ్వడం జరిగింది.
2. **యాచించని పేదవారు (అల్-మసాకీన్)** : వీరు పేదవారైనా సరే, ఎవరినీ చేయి చాచి అడగరు. వీరు ఆత్మాభిమానం కలవారు. వీరి గురించి ముహమ్మద్(స)వారు ఇలా చెప్పారు : "మిస్‌కీన్‌లు వీరు కారు ఎవరైతే ప్రజల చుట్టూ ఒక ముద్దకోసమో లేక రెండు ముద్దల కోసమో లేక ఒక ఖర్జూరానికో లేక రెంటింటి కోసమో తిరుగరు. కాని నిజమైన మిస్‌కీన్ ఎవరంటే తన అవసరాలు తీర్చుకోవడానికి సరిపోయినంత ధనం ఉండదు, అతని స్థితి ఇతరులకు తెలియదు, తెలుసుంటే అతనికి కొంత దానం చేసేవారు మరియు అతను ప్రజలను అడగడు (అబూహురైరా ఉల్లేఖనం, **సహీహ్ బుఖారీ, 1479,** పుస్తకం 24, అధ్యాయం 53, సంపుటి 2, **సహీహ్ ముస్లిమ్ 2393)**

వీరు ఇతరులను అడగడానికి సిగ్గుపడతారు. కాని ఇటువంటి వారిని గుర్తించి జకాత్ ఇవ్వడం గురించి అల్లాహ్ పై ఖుర్'ఆన్ ఆయత్ (9:60)లో చెబుతున్నారు.

3. **'జకాత్'ను సేకరించడానికి** కొందరు వ్యక్తులను ముస్లిముల నాయకుడు (అమీర్) నియమిస్తారు. జకాత్‌ను సేకరించినందుకు గాను, ఆ వ్యక్తికి కొంత 'వేతనం' ఏర్పాటు చేయవచ్చు. ఆ వేతనాన్ని జకాత్ నుండి తీసి ఇస్తారు.

ఇబ్న్ అస్-సా'ఇదీ అల్-మాలికీ వారిని, అమీరుల్ మోమినీన్ ఉమర్ బిన్ ఖత్తాబ్(రజి)వారు 'జకాత్' సేకరణ కొరకు నియమించారు. సేకరణ పూర్తయ్యాక, ఆ మొత్తాన్ని ఆయన అందజేశారు. అప్పుడు ఉమర్(రజి)వారు ఇబ్న్ అస్-సా'ఇదీ గారికి కూడా వేతనమివ్వమని చెప్పారు. కాని ఆయన 'ఇది నేను అల్లాహ్ కొరకు చేశాను మరియు నా ప్రతిఫలం అల్లాహ్ దగ్గర ఉంటుంది' అని సమాధానమిచ్చారు. అప్పుడు ఉమర్(రజి)వారు "నీకేది ఇవ్వబడిందో అది తీసుకో. ప్రవక్త(స)వారి కాలంలో కొంత పని చేయడం కొరకు నియమించి, నాకు కొంత వేతనమిచ్చేవారు. నీవు చెప్పినట్లే నేను (కూడా) చెప్పాను, కాని రసూలుల్లాహ్(స)వారు నాకు చెప్పారు, "దేని గురించి అయితే నీవు అడగలేదో, అది నీకిచ్చినప్పుడు, అది తీసుకుని తిను మరియు దానంగా ఇచ్చివెయ్యి' " **(సహీహ్ ముస్లిమ్ 2408, పుస్తకం 12, అధ్యాయం 37, సంపుటి 3).** సహీహ్ ముస్లిమ్‌లోనే మరో ఉల్లేఖనం (నెం. 2405)లో ప్రవక్త(స)వారు ఉమర్(రజి)వారితో ఇలా చెప్పారు: **"తీసుకో, ఏ ఐశ్వర్యమైతే నీ దగ్గరికి వచ్చిందో దాని గురించి నీవు ఆశించనప్పుడు లేక దాని గురించి అడగనప్పుడు, దానిని తీసుకో. అలా కాకుండా దాని వెనుక పడకు".**

4. **హృదయాలను ఆకర్షించడానికి :** ప్రవక్త(స) (కొంత సంపద లేదా వస్తువులను) కొందరికి పంచారు. కాని ఒకరికి ఏమీ ఇవ్వకుండా వదిలేశారు. అప్పుడు సాద్(రజి)వారు ఆ వదిలేసిన వ్యక్తి విషయమై ప్రవక్త(స)వారిని అడిగారు. తన దృష్టిలో వారందరి కంటే అతను ఉత్తముడని, "అల్లాహ్ సాక్షి అతను విశ్వాసి (మోమిన్) అని నేను అనుకుంటున్నాను" అని సాద్(రజి) చెప్పినప్పుడు, (అతడు మోమిన్ కాదేమో) 'ముస్లిమేమో!' అని ప్రవక్త(స) అన్నారు. సాద్(రజి) కొద్ది సేపు ఆగి ఇవే మాటలను మరలా చెప్పారు. ప్రవక్త(స)వారు అతనికి మరలా అదే సమాధానమిచ్చారు. చివరిగా ప్రవక్త(స)వారు ఇలా అన్నారు : "వేరొకరు నాకు ప్రియమైనప్పటికీ అతనికి కాకుండా ఓ వ్యక్తికి నేనేదైనా ఇచ్చి ఉండవచ్చు, అతని ముఖం అగ్నిలో విసరబడకుండా ఉండేందుకు" **(సహీహ్ ముస్లిమ్, సాద్ ఉల్లేఖనం 2433, పుస్తకం 12, అధ్యాయం 45, సంపుటి 3)**

హునైన్ రోజు యుద్ధప్రాప్తిగా వచ్చిన దాని నుండి అల్లాహ్ సందేశహరులు(స) పంచడం ప్రారంభించారు. ఖురైష్‌కు చెందిన కొందరికి వంద ఒంటెలను ఇవ్వడం జరిగింది. అన్సారులలో కొందరు "రసూలుల్లాహ్(స)వారిని అల్లాహ్ క్షమించు గాక! ఆయన(స) మనల్ని పట్టించుకోకుండా ఖురైషీయులకి ఇచ్చారు, ఇంకా మన కరవాలాలు వారి రక్తపు బొట్లను కారుస్తుండగా". ఈ విషయం ప్రవక్త(స)వారికి తెలిసింది. ఆయన అన్సారులను గుడారంలో సమావేశపరిచారు. వారు సమావేశమయ్యాక ప్రవక్త(స)వారి దగ్గరకు వెళ్ళారు. ఆయన విన్న విషయం గురించి అడిగారు. వారిలోని జ్ఞానం కలవారు చెప్పారు 'ఓ రసూలుల్లాహ్(స)! మాలో జ్ఞానం కలవారు ఏమీ అనలేదు, కాని మాలోని కొంతమంది వయస్సులో చిన్నవారు, అలా చెప్పారు".

(వారు ఏమేమి అన్నారో ఆ విషయాలను యధావిధిగా మరలా చెప్పడం జరిగింది.)

అప్పుడు ప్రవక్త(స)వారు, 'నేను ఇచ్చినవారు ఈ మధ్యనే అవిశ్వాసాన్ని వదిలేశారు. వారి హృదయాలను (విశ్వాసం వైపు) ఆకర్షించడానికి (ఇచ్చాను)'. మీరు అల్లాహ్ యొక్క సందేశహరునితో వెళుతుండగా, వారు ఐశ్వర్యంతో వెళుతున్నారు. ఇది మీకు సంతోషం కాదా? అల్లాహ్ సాక్షి! మీరు దేనితో (మీ ఇళ్ళకు) వెళుతున్నారో అదే ఉత్తమం వారు (తీసుకు) వెళుతున్న దానికంటే". వారు చెప్పారు, "ఎందుకు కాదు ఓ రసూలుల్లాహ్! నిస్సందేహంగా మేము సంతోషించాము". ఆయన(స) చెప్పారు, "మీ కంటే ప్రాధాన్య మివ్వబడిన వారిని మీరు చూస్తారు, కాబట్టి సహనం వహించండి మీరు అల్లాహ్‌ను మరియు ఆయన సందేశహరుడిని కలిసేవరకూ, నేను సరస్సు (కౌసర్ సరస్సు) దగ్గర ఉంటాను". వారు చెప్పారు, "మేము సహనం వహిస్తాము". **(సహీహ్ ముస్లిమ్ 2436, పుస్తకం 12, అధ్యాయం 46, సంపుటి 3)**

మరో ఉల్లేఖనం (నెం. 2439) ద్వారా తెలిసేది ఏమిటంటే, వారు అవిశ్వాసాన్ని వదిలేశారు మరియు వారిపై ఉపద్రవం పడింది. వారికి సహాయం చేయడానికి మరియు వారి హృదయాలను (ధర్మం వైపు) మెత్తబరచడానికి అని చెప్పారు.

**వారు వారి ఇండ్లకు ఇహలోక సంపదతో వెళుతున్నారని మరియు అన్సారులు అల్లాహ్ యొక్క సందేశహరునితో(స) తమ ఇండ్లకు వెళుతున్నారని చెప్పడం జరిగింది.**

ఆరు హదీస్ గ్రంథాలలో 'జకాత్' గురించి వివరించిన హదీస్‌లను బట్టి, అవిశ్వాసానికి (షిర్క్‌కి) పాల్పడని వారిని ఇస్లామ్ వైపు ఆకర్షించడానికి ఖర్చుపెట్టవచ్చు అని తెలుస్తుంది. అయితే డబ్బు ఆశ చూపి ఇస్లామ్ వైపు పిలవవలసిన దుర్గతి ముస్లిములకు ఎంతమాత్రం లేదు. షిర్క్ చేయనివారు కష్టాలలో ఉన్నప్పుడు వారికి నిజాయితీగా సహాయపడుతూ, ఇస్లామ్ యొక్క గొప్ప జీవన విధానాన్ని వారు అర్థం చేసుకోవడానికి మనం చేసే ప్రయత్నంలో ఈ జకాత్ సొమ్మును ఉపయోగించవచ్చు.

ఇక్కడ ఒక విషయాన్ని స్పష్టం చెయ్యాలి. 'హునైన్ యుద్ధ ప్రాప్తి' గురించి పైన తెలిపిన హదీస్‌ను హదీస్ గ్రంథాలలో 'జకాత్' పుస్తకంలోనే పొందుపరిచారు. అయితే ఈ హదీస్‌పై తఫ్సీర్ గ్రంథాలలో కొంత చర్చ జరిగింది. అదేమిటంటే, "ముహమ్మద్(స) వారు ఇక్కడ పంచిన సొమ్ము 'జకాత్ సొమ్ము' కాదు. అది యుద్ధప్రాప్తి నుండి ఇచ్చినది". కాబట్టి జకాత్ ముస్లిమ్‌లకు మాత్రమే ఇవ్వవలసి ఉంది. ఈ విషయాలు వ్యాసం చివరి భాగంలో అందించాము.

5. **బానిసల విముక్తి కొరకు :** బానిస వ్యవస్థ ప్రస్తుతం మన సమాజంలో లేదు. మన రాష్ట్రంలో అటువంటి బానిస విధానం ఎక్కడైనా

అమలులో ఉన్నట్లు మా దగ్గర ఎటువంటి సమాచారం లేదు. అయితే, న్యూస్ పేపర్లో అప్పుడప్పుడు వచ్చే వార్తా కథనాలను బట్టి, తల్లిదండ్రులు చేసిన అప్పులకు బదులుగా, వారి పిల్లలచేత కొన్ని చోట్ల వెట్టి చాకిరీ చేయించడం జరుగుతుందని తెలుస్తుంది. శతాబ్దాల తరబడి అమలులో ఉన్న బానిస వ్యవస్థ పునాదులను అల్లాహ్ అనుగ్రహంతో మహనీయుడు ముహమ్మద్(స) కదిలించారు.

6. **ఋణగ్రస్తులైన వారి కొరకు** : అప్పులపాలై దుర్భరజీవితాన్ని గడిపే వారెందరో మన సమాజంలో ఉన్నారు. చేబదులుగా అప్పు ఇచ్చేవారు లేకుండుట వలన వ్యవసాయం కోసమో, వ్యాపారం కోసమో, మరేదైనా అతి ముఖ్యమైన వ్యక్తిగత అవసరాలకు అప్పుతీసుకుని, దానిని తీర్చలేక బాధపడేవారికి ఈ జకాత్ ద్వారా సాయం చెయ్యవచ్చు. అయితే విలాసాల కోసమో లేక 'హరామ్' పనులకోసం అప్పుల పాలైన వారి కోసం కాదు.

అబూ సయీద్ అల్-ఖుద్రీ ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స)వారి కాలంలో ఒక వ్యక్తి పండ్ల అమ్మకంలో నష్టపోయాడు, (దాని) ఫలితంగా అప్పు ఎక్కువైంది. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "అతనికి దానం చేయండి". ప్రజలు అతనికి దానం చేశారు కాని అది అతని అప్పుకు సరిపోలేదు. అప్పుడు రసూలుల్లాహ్(స)వారు అతనికి అప్పు ఇచ్చిన వారితో చెప్పారు: "మీకు కలిగింది తీసుకోండి మరియు మీ కొరకు ఇంకేమీ లేదు అది తప్ప" **(తిర్మిదీ, సహీహ్ హదీస్, 655, పుస్తకం 5, అధ్యాయం 24, సంపుటి 2)**

8. **బాట సారుల కొరకు** : బాటసారి విషయానికొస్తే, అతను తాను నివశించే ప్రదేశంలో ధనవంతుడు కావచ్చు. కాని ప్రయాణంలో అన్నీ పోగొట్టుకున్నాడు లేదా తన ఇంటికి చేరకోవడానికి సరిపడా ధనం లేదు. అలాంటి బాటసారికి జకాత్ సొమ్మును ఇవ్వవచ్చు.

ఇప్పటి వరకూ జకాత్ తీసుకోవడానికి అర్హులైన 7 రకాల ప్రజల గురించి చెప్పడం జరిగింది. ఇక మిగిలిన కేటగిరి - **'ఫీసబీలిల్లాహ్'** (అల్లాహ్ మార్గంలో)

7. **అల్లాహ్ మార్గంలో** : వాస్తవానికి ఇది ఖుర్'ఆన్ ఆయత్‌లో ఏడవది. 'బాటసారుల కొరకు' కంటే ముందుగా చెప్పవలసి ఉంది. కాని వ్యాసంలో ఈ విషయం చివరిగా చెప్పడానికి కారణం. ఈ విషయంపై చర్చించవలసింది చాలా ఉంది.

ప్రస్తుతం మన రాష్ట్రంలో అమలులో ఉన్న విషయాలకే పరిమితం అవుదాం. మీలో 'జకాత్' గురించి అవగాహన ఉన్నవారు ఓ సారి ఆలోచించండి, సేకరించబడిన జకాత్ ధనం పైన చెప్పబడిన 7 రకాల మనుష్యులకు నిజంగా అందుతుందా?

**కనీసం సగం జకాత్ ధనమైనా వారికి అందుతుందా?**

అందడం లేదు.

'జకాత్' ధనంలో 90శాతానికి పైగా ఖర్చుపెట్టేది ఈ 8వ రకం వ్యక్తులకు మాత్రమే! **ఎవరు వారు?**

అందులో కొద్దిమంది తెలియక తీసుకున్నవారు ఉన్నప్పటికీ, తెలిసి తీసుకున్నవారే ఎక్కువ.

**పేదల హక్కుగా అల్లాహ్ నిర్ణయించిన జకాత్‌ను పేదలకు కాకుండా, ఆ సొమ్మును స్వాహా చేస్తున్న ఆ స్వార్థపరులెవ్వరు?**

**'అల్లాహ్ మార్గంలో' అనగానే ప్రతీ విషయాన్ని ఈ కేటగిరిలో కలిపేశారు. అందులో మదరసాలు, దావా కార్యక్రమాలు, దావా సెంటర్లు, లైబ్రరీలు, వెబ్‌సైట్లు, TV ఛానళ్ళు ఇలా ఎన్నో!**

**ఇతర ధర్మాలలోని అమలులో ఉన్న పూజారి వ్యవస్థ వంటి వ్యవస్థను ఇస్లామ్‌లో కొత్తగా కల్పించారు, దానికి దావా అని పేరుపెట్టి ఆ వ్యవస్థకు కూడా జకాత్ నుండే డబ్బు పంపిణీ చేయడం జరుగుతుంది.**

**కేవలం మా మనస్సుకు తోచినట్లు పై విషయాలు చెప్పలేదు. వాటికి ప్రామాణిక ఆధారాలున్నాయి. ఆ వివరాలన్నీ ఈ వ్యాసంలో అందిస్తున్నాము.**

మస్‌జిద్ నిర్మాణానికి తప్ప, ప్రతీ అంశాన్ని ఈ కేటగిరిలో కలిపేయడం జరిగింది.

**అన్ని విషయాలకు జకాత్ వర్తించేటట్లే అయితే, ప్రత్యేకంగా కేవలం ఈ 8 రకాల వ్యక్తుల గురించి మాత్రమే అల్లాహ్ ఎందుకు చెప్పినట్లు?**

**సాంఘిక న్యాయం కోసం ఉద్దేశించబడింది జకాత్. పేదల హక్కు జకాత్. దానిని కొల్లగొట్టే హక్కు ఎవరికీ లేదు.**

ఇబ్నె కసీర్ వంటి తఫ్సీర్ గ్రంథాలను, మరియు అటువంటి వాటిపై అధ్యయనం చేసి ఉర్దూ, ఇంగ్లీష్ భాషలలో చేసిన తఫ్సీర్ అనువాదాలను (ఉదా: మారిపుల్ ఖుర్'ఆన్), ఇంకా ఇతర ప్రామాణిక గ్రంథాలను రిఫర్ చేసి, వాటిలోని ముఖ్యాంశాలను క్లుప్తంగా ఇక్కడ అందిస్తున్నాము.

**సహీహ్ బుఖారీ గ్రంథంలో,** సంపుటి 2లో నున్న 24వ పుస్తకం-జకాత్. ఈ పుస్తకంలో 49వ అధ్యాయం : 'అల్లాహ్ యొక్క ప్రకటన'. సూరహ్ తౌబాలోని 60వ ఆయత్ ఈ అధ్యాయంలో ప్రస్తావించడం జరిగింది. ఈ అధ్యాయంలోని మొదటి హదీస్ (నెం. 1468)కి ముందుగా ఇబ్నె అబ్బాస్(రజి), అల్-హసన్(రజి) మరియు అబుల్'ఆస్(రజి) చెప్పిన ఉల్లేఖనాలున్నాయి. అవి :

**ఇబ్నె అబ్బాస్**(రజి) చెప్పారు, **(బానిసల) విముక్తి కొరకు** మరియు **హజ్ చేయడానికి** (పేద ప్రజల కొరకు) ఎవరైనా (జకాత్‌ను) ఖర్చు చేయవచ్చు.

**అల్-హసన్**(రజి) చెప్పారు, "ఒకరు తన జకాత్‌తో **తన తండ్రిని బానిసత్వం నుండి విముక్తుడిని చేయడానికి** అనుమతి ఉంది మరియు దాని (జకాత్) నుండి (అల్లాహ్ మార్గంలో పోరాడే) **ముజాహిదీన్‌లకు** మరియు **హజ్ చేయని వారికి** ఇవ్వవచ్చు. ఆ తరువాత ఆయన 9:60 ఆయత్‌ను పఠించారు. అల్-హసన్ ఇంకా ఇలా కొనసాగించారు: **"మరియు వారిలో (ఎనిమిది రకాల మనుష్యులలో) ఎవరికైనా మీరు జకాత్ ఇస్తే, మీ ప్రతిఫలాన్ని పొందుతారు.**

**అబుల్ 'ఆస్**(రజి) చెప్పారు, **జకాత్‌గా ఇవ్వబడిన ఒంటెలపై, హజ్ చేయడానికై** మమ్మల్ని ప్రయాణింప జేశారు".

జకాత్ విధి దానం. అది తప్పనిసరి దానం. దానిని అల్లాహ్ నిర్దేశించిన వ్యక్తులకే ఇవ్వవలసి ఉంది. జకాత్ కాకుండా స్వచ్ఛందంగా చేసే దానాలు (నఫిల్ దానాలు) చాలా ఉంటాయి. వాటిని ధర్మ సమ్మతం చేయబడిన అన్ని పనులకు ఉపయోగించవచ్చు.

ఈ కేటగిరీకి కూడా చాలా ప్రాముఖ్యత ఉంది. దీనివలన రెండు ప్రయోజనాలున్నాయి. ఒకటి పేదవానికి సహాయం చేయడం, రెండవది ధార్మిక మార్గంలో సహకరించడం.

ఇక్కడ '**ఫీ సబీలిల్లాహ్** (అల్లాహ్ మార్గంలో)' అంటే (1) ముజాహిద్‌లు ధర్మ పోరాటంలో వారి కవసరమైన ఆయుధాలు మరియు ఇతర యుద్ధ సామాగ్రి కొనుక్కోవడానికి (2) ఓ వ్యక్తికి అతని హజ్జ్ యాత్ర పూర్తి చేసుకోవడానికి ఆర్థికంగా సహకరించడం. ఇవి రెండూ కూడా పూర్తిగా ధార్మిక పరమైనవే! రెండూ ఆరాధనా ప్రక్రియలే. కాబట్టి జకాత్ సొమ్మును వారిపై ఖర్చు చేయడం ద్వారా ఒక పేదవానికి సహాయం చేస్తూ అతని 'ఆరాధన' (ఇబాదహ్) కొరకు మద్దతునివ్వడం జరుగుతుంది.

**తన 'ఆరాధన' పూర్తి చేసుకోవడానికి పొందే ఈ సహాయాన్ని ఎవరైనా మరోలా అభివర్ణించవచ్చు.**

**ఒకవేళ ఎవరైనా 'దాయీ'గా పిలువబడే వ్యక్తి, తాను ప్రజలను అల్లాహ్ మార్గం వైపునకు పిలుస్తున్నాడు గనుక, అది కూడా ఆరాధనే అవుతుంది గనుక, జకాత్‌కు అర్హుడనని చెప్పవచ్చు. కాని ఇక్కడ ఈ ఆరాధన కొరకు డబ్బు అవసరం లేదు. 'దాయీ'లుగా పిలువబడేవారు ముందుగా తమ చుట్టూ ఉండే ప్రాంతాలలో వారిని అల్లాహ్ మార్గం వైపు పిలవాలి. వారు వినడం లేదు కాబట్టి వేరే ప్రాంతాలకు వెళుతున్నామని చెప్పవచ్చు.**

**నూహ్(అ) 950 సం॥ల పాటు తన ప్రజలకు 'దావత్' ఇచ్చారు. ఏ వ్యక్తి అయితే తన చుట్టుప్రక్కల వారికి ధర్మం గురించి బోధించడో, ఆ ఊరిపై పడే శిక్ష ముందుగా అతని ఇంటి నుండే ప్రారంభమౌతుందని చెప్పే ఓ ఉల్లేఖనం సహీహ్ బుఖారీ గ్రంథంలో ఉంది.**

**'నమాజ్' ఎలా తప్పనిసరి ఆరాధనో, అల్లాహ్ మార్గం వైపు పిలవడం కూడా తప్పనిసరి ఆరాధనే. అంతేకాకుండా 'దాయీ' తీసుకునే సొమ్ము అతని జీవనోపాధి కొరకు మాత్రమే.**

### జకాత్‌ను వ్యక్తులకు ఇవ్వాలా? లేక సంస్థలకా?

ఖుర్'ఆన్ గ్రంథంలో 9:60లో చెప్పబడిన 8 కేటగిరీలలోని, ఏ కేటగిరిని తీసుకున్నా సరే, ప్రతీ కేటగిరీలోనూ పేదవారికి విడి విడిగా ఇవ్వడం జరుగుతుంది గాని, ఆ సొమ్మును సంస్థలకు ఇవ్వడానికి లేదు. మొదటి రెండు కేటగిరీలలో పేదవ్యక్తికి జకాత్ ఇవ్వాలని ఆదేశమైనది. మూడవ కేటగిరీలో జకాత్‌ను సేకరించే వ్యక్తికి కొంత పైకం చెల్లించాలి. అదే విధంగా ఇస్లామ్‌వైపు హృదయాలను ఆకర్షించేందుకు కూడా ఓ వ్యక్తికి జకాత్ ఇవ్వవచ్చు. బానిస విముక్తి విషయంలో కూడా ఒక వ్యక్తికే ఇవ్వాలి. ఆ సొమ్మును బానిసకిస్తే, అది దాని యజమానికి చెందుతుంది. అప్పుడు అది జకాత్ అవ్వదు. బానిస విముక్తి కొరకు యజమానికి ఇవ్వడానికి యజమాని జకాత్‌కు అర్హుడు కాదు. అలా కాకుండా, బానిసను కొని, ఆ తరువాత అతనికి స్వేచ్ఛ నివ్వవచ్చు అనుకుంటే, జకాత్ దానం కాబట్టి, అది ఇవ్వడానికే గాని, దానితో కొనకూడదు. కొంతపైకం ఇస్తే స్వేచ్ఛ ఇచ్చేలా యజమానితో ఒప్పందం చేసుకుంటే, అప్పుడు ఆ సొమ్మును బానిసకిస్తే అతను దానిని యజమానికిచ్చి స్వేచ్ఛ పొందుతాడు. ఈ కేటగిరిలో కూడా ఒక వ్యక్తికే ఇవ్వడం జరిగింది. ఇక అప్పుల పాలైన వ్యక్తికి జకాత్ నిచ్చినప్పుడు, ఈ కేటగిరిలో కూడా ఒక వ్యక్తికే ఇవ్వడం జరిగింది. బాటసారికి ఇచ్చినప్పుడు కూడా ఒక వ్యక్తికే ఇచ్చినట్లవుతుంది.

### 'ఫీ సబీలిల్లాహ్' మదరసాలకు వర్తిస్తుందా?

ఈ కేటగిరీ కేవలం హుజ్జాజ్ (పేదవారైన హజ్జ్ యాత్రికులకు) మరియు ముజాహిద్‌లకు మాత్రమే అనడంలో ఎటువంటి సందేహం లేదు. మదరసా అనేది ఓ సంస్థ మాత్రమేగాని ఓ వ్యక్తి కాదు. పైన చెప్పిన విధంగా విడి విడిగా వ్యక్తులకేగాని, పై 7 కేటగిరీలలో సంస్థలకు జకాత్ లేదు. ఇదే విధంగా ఇక్కడ కూడా మదరసాలో చదివే ఓ పేద విద్యార్థికి ఇవ్వవచ్చు. కాని సంస్థ యజమానికి కాదు. ఆ పేద విద్యార్థి తండ్రికిగాని తల్లికి గాని ఆ విద్యార్థి చదువునిమిత్తం ఇవ్వవచ్చు.

ఆ విధంగా ఇచ్చినా కూడా అది పేదవారి కేటగిరిలోకి వెలుతుందిగాని 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరిలోకి రాదు.

**భాషాపరమైన అర్థం :**

చాలామంది 'ఫీ సబీలిల్లాహ్' యొక్క భాషాపరమైన అర్థాన్ని మాత్రమే తీసుకుని, అల్లాహ్ కొరకు చేసే ప్రతీ విషయాన్ని ఈ కేటగిరిలో కలిపేయడం జరిగింది. దురదృష్టవశాత్తూ ఈ రోజుల్లో ఖుర్'ఆన్ వాక్యాలకు కేవలం భాషాపరమైన అర్థాలను మాత్రమే తీసుకుంటున్నారు. వాటితోపాటు ముహమ్మద్(స)వారి బోధనలను తీసుకోకుండా, వాటిని వదిలేస్తున్నారు. ఆ విధంగా తప్పుదోవ పడుతుండటమే కాకుండా, ప్రజలను తప్పుదోవ పట్టిస్తున్నారు.

ప్రతీ మంచిపనిని జకాత్‌లోని 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరిలో కలిపేశారు. హదీస్‌ల ద్వారా, తఫ్సీర్ గ్రంథాల ద్వారా ఈ జకాత్‌లోని 'ఫీ సబీలిల్లాహ్' కేటగిరీ కేవలం హజ్జ్ యాత్రికులకు మరియు ముజాహిద్‌లకు మాత్రమే.

**జకాత్ ఎప్పుడు చెల్లించాలి?**

ఒక చాంద్రమాన సంవత్సరానికి (354 రోజులకు) ఒకసారి. పంటల విషయంలో మాత్రం దిగుబడికాగానే చెల్లించవలసి ఉంటుంది.

> **" ..... వాటికి ఫలాలు వచ్చినప్పుడు వాటి ఫలాలను తినండి. కాని వాటి కోత దినమున (ఫలకాలంలో) వాటి హక్కు (జకాత్) చెల్లించండి. మరియు వృథాగా ఖర్చు చేయకండి. నిశ్చయంగా, ఆయన వృథా ఖర్చు చేసేవారంటే ఇష్టపడడు"** (ఖుర్ఆన్ 6:141)

ఈ జకాత్ ప్రత్యేకంగా రమదాన్ నెలలోనే చెల్లించాలని లేదు.

**జాబిర్ బిన్ అబ్దుల్లాహ్(రజి) ఉల్లేఖనం : తెంపబడిన ఎండు ఖర్జూరాలు ప్రతీ పది వసఖ్‌లకి, ఒక గుత్తిని పేదవారి కొరకు మస్జిద్‌లో వ్రేలాడదీయాలని ప్రవక్త(స) ఆదేశించారు.**
**(అబూదావూద్, హసన్ హదీస్, 1662, పుస్తకం 9, అధ్యా. 32, సంపుటి 2)**

**జకాత్‌ను ఏఏ ప్రాంతాల్లో ఇవ్వవచ్చు :**

ఇబ్రాహీమ్ బిన్ అతా' (ఇమ్రాన్ బిన్ హుసైన్ నుండి స్వేచ్ఛ నివ్వబడిన బానిస) తన తండ్రి జియాద్ నుండి లేక వేరొక గవర్నర్ నుండి ఉల్లేఖనం: ఇమ్రాన్ బిన్ హుసైన్ జకాత్ సేకరణకు పంపబడ్డారు. ఆయన తిరిగి వచ్చినప్పుడు, ఆయన అతనిని అడిగారు : "ఐశ్వర్యమెక్కడ?" అతను సమాధాన మిచ్చారు : "మీరు నన్ను సంపద (వెనక్కి తీసుకురావడం) కొరకు పంపారా? మేము దానిని రసూలుల్లాహ్(స)వారి కాలంలో తీసుకునే (ప్రజల) దగ్గరనుండి తీసుకుని, ప్రవక్త(స)వారి కాలంలో పంచబడే చోట పంచివేశాము."
**(అబూదావూద్, హసన్ హదీస్, 1625, పుస్తకం 9, అధ్యాయం 23, సంపుటి 2)**

ఎక్కడ సేకరించిన జకాత్‌ను అదే ప్రాంతంలో దాని హక్కుదారులకి పంచాలి. అక్కడ నెలకొని ఉన్న పేదరికం పోకుండానే వేరే ప్రాంతానికి జకాత్ తరలించకూడదు. కాని ఈ రోజుల్లో సర్వసాధారణమైన విషయం ఏమిటంటే, ఎక్కడో అస్సాం నుండి ఓ వ్యక్తి బయలు దేరతాడు, ఆయన మొత్తం దేశమంతా తిరిగి జకాత్‌ను తన ఏరియాలోని మదరసా కొరకు సేకరిస్తాడు. అదేవిధంగా హైదారబాద్‌లోని ఓ దాయీగారు హైదరాబద్ మొదలుకొని శ్రీకాకుళం వరకూ, వైజాగ్ దాయీ గారు వైజాగ్ నుండి హైదరాబాద్ వరకూ, తమకు పరిచయమున్న ధనవంతులందరి దగ్గరా జకాత్ తీసుకుంటారు. కొన్ని టి.వి. ఛానళ్ళ వారు, వెబ్‌సైట్లవారు జకాత్ తమకు పంపమని ప్రకటనలు ఇస్తున్నారు. నిజానికి వీరు జకాత్ తీసుకోవడానికి అర్హులు కాదు. వారికి ప్రపంచం మొత్తం నుండి జకాత్ కావాలి. కాబట్టి జకాత్ ధనాన్ని ముందుగా ఆ ప్రాంతంలోని పేదలకు అందించిన తరువాత మిగిలితే అప్పుడు వేరే ప్రాంతంలో పంచవలసి ఉంది.

**బంధువులకు ఇవ్వవచ్చా?**

జకాత్‌ను బంధువులలోని పేదవారికి ఇవ్వడం వలన రెండు పుణ్యాలు లభిస్తాయి. ఒకటి బంధుత్వాన్ని నిలబెట్టినందుకు. రెండు దానం ఇచ్చినందుకు. కాబట్టి బంధువులలోని పేదవారికి ప్రాధాన్యత నివ్వాలి.

**దయ చూపినట్లు కాదు :** జకాత్‌ను ఓ పేదవాడికి ఇచ్చారంటే, దానర్థం ఆ పేదవాని హక్కును అల్లాహ్ మీ వద్ద ఉంచారని, ఆ హక్కును అల్లాహ్ ఆదేశంతో హక్కుదారుడికి చేర్చడం జరిగిందని తెలుసుకోవాలి. అతనిపై మీరు దయచూపినట్లు కాదు. అతనికి డబ్బు ఇచ్చాము కదా అని అతనిని చులకనగా చూడకూడదు. నమాజ్ చేయడం మనకు ఎంత విధిగా చేయబడిందో, 'జకాత్' కూడా ధనవంతులపై అంతే విధిగా చేయబడింది.

> **"మాకు ఇహలోకంలో మరియు పరలోకంలో కూడా మంచి స్థితినే వ్రాయి. నిశ్చయంగా, మేము నీ వైపునకే మరలాము" (అల్లాహ్) సమాధానం ఇచ్చాడు : "నేను కోరిన వారికి నా శిక్షను విధిస్తాను. నా కారుణ్యం ప్రతిదానిని ఆవరించి ఉన్నది. కనుక నేను దానిని దైవభీతి గలవారికీ, జకాత్ ఇచ్చేవారికీ మరియు నా సూచనలను విశ్వసించేవారికీ వ్రాస్తాను!** (ఖుర్ఆన్ 7:156)

> **"..... కావున నమాజ్ స్థాపించండి, జకాత్ ఇవ్వండి. మరియు అల్లాహ్‌తో గట్టి సంబంధం కలిగి ఉండండి, ఆయనే మీ సంరక్షకుడు. ఎంత శ్రేష్ఠమైన సంరక్షకుడు మరియు ఎంత ఉత్తమ సహాయకుడు!"** (ఖుర్ఆన్ 22:78)

> **"మరియు మీరు కరుణించ బడాలంటే నమాజ్ స్థాపించండి. జకాత్ ఇవ్వండి మరియు సందేశహరునికి విధేయులై ఉండండి!"** (ఖుర్ఆన్ 24:56)

## జకాత్ చెల్లించకపోతే ఏమవుతుంది?

**ఐశ్వర్యంపై జకాత్ ఇవ్వని వారి గురించి:**

అబూహురైరా(రజి) ఉల్లేఖనం, రసూలుల్లాహ్(స) చెప్పారు, "ఎవరైతే అల్లాహ్ వలన ఐశ్వర్యవంతులు కాబడ్డారో మరియు అతని ఐశ్వర్యంపై జకాత్ చెల్లించడో, పునరుత్థాన దినమున అతని ఐశ్వర్యం కళ్ళపై రెండు చుక్కలున్న బట్టతల గల విషపూరిత మగ పాముపలె తయారవుతుంది. (బట్టతల పాము అంటే మిక్కిలి విషాన్ని కలిగి ఉండటం వలన ఆ విధంగా కనిపిస్తుంది). ఆ పాము అతని మెడచుట్టూ చుట్టుకుని, అతని బుగ్గలపై కాటేస్తూ ఉంటుంది. మరియు చెబుతుంది, "నేను నీ ఐశ్వర్యాన్ని, నేను నీ ఖజానాని". తరువాత ప్రవక్త(స)వారు పవిత్ర ఆయత్‌ను పఠించారు : **"అల్లాహ్ తన అనుగ్రహంతో ప్రసాదించిన దానిలో లోభం వహించేవారు, తమకది (లోభమే) మేలైనదని భావించరాదు. వాస్తవానికి అది వారి కొరకు ఎంతో హానికరమైనది. వారు తమ లోభత్వంతో (పిసినారి తనంతో) కూడబెట్టినదంతా, తీర్పుదినమున వారి మెడల చుట్టూ**

**కట్టబడుతుంది. మరియు భూమ్యాకాశాల వారసత్వం అల్లాహ్‌కే చెందుతుంది. మరియు మీరు చేస్తున్నదంతా అల్లాహ్‌కు తెలుసు"** (ఖుర్ఆన్ 3:180)

**బంగారం, వెండి కలిగి ఉండి జకాత్ ఇవ్వకపోతే :**

**"..... మరియు ఎవరైతే వెండి బంగారాన్ని కూడబెట్టి, దానిని అల్లాహ్ మార్గంలో ఖర్చుపెట్టరో వారికి బాధాకరమైన శిక్షగలదనే వార్తను వినిపించు."** (ఖుర్ఆన్ 9:34)

**"ఆ దినమున దానిని (ఆ వెండి, బంగారాన్ని) నరకాగ్నిలో కాల్చి దానితో వారి నుదురుల మీద, ప్రక్కల మీద మరియు వీపుల మీద వాతలు వేయబడతాయి. (అప్పుడు వారితో ఇలా అనబడుతుంది), "ఇదంతా మీరు మీ కొరకు కూడబెట్టుకున్నదే. కావున మీరు కూడబెట్టుకున్న దానిని చవిచూడండి".** (ఖుర్ఆన్ 9:35)

సహీహ్ ముస్లిమ్‌లో **(హదీస్ నెం. 2290, పుస్తకం 12, అధ్యాయం 6, సంపుటి 3, అబూహురైరా(రజి) ఉల్లేఖనం)** బంగారం, వెండిపై చెల్లించవలసింది చెల్లించకుండా ఉంటే, పై ఆయత్‌లో చెప్పిన శిక్ష గురించి చెప్పిన తరువాత, ఇలా ఉంది :

**'అవి చల్లారిన ప్రతీసారి, అతని కొరకు అవి మరలా వేడి చేయబడతాయి. ఆ రోజున దాని నిడివి 50వేల సంవత్సరాలుగా ఉంటుంది.** (అంటే ఆ రోజు ఎంత పెద్దది అంటే, ఈ లోకంలోని 50 వేల సంవత్సరాలు పునరుత్థాన దినమున ఒక రోజుకి సమానం.) (ఈ శిక్ష) ప్రజల మధ్య తీర్పు పూర్తయ్యేవరకూ (ఉంటుంది). ఆ తరువాత అతని మార్గం చూపబడుతుంది - స్వర్గానికో లేక నరకానికో" ఇంకా పశువులపై జకాత్ గురించి మొదలైన చాలా విషయాల గురించి ఈ హదీస్‌లో చెప్పడం జరిగింది. ఇది చాలా పెద్ద హదీస్.

**పశువులపై జకాత్ ఇవ్వకపోతే :**

సహీహ్ ముస్లిమ్‌లోని పై ఉల్లేఖనం (2290)లోని ఓ భాగం : "ఓ రసూలుల్లాహ్!(స) "ఒంటెల గురించి ఏమిటి?" ఆయన(స) చెప్పారు: వాటిపై చెల్లించవలసినది చెల్లించకుండా ఒంటెల యజమాని ఉండడు - ............. - కాని పునరుత్థాన దినము వచ్చినప్పుడు, ఓ విశాలమైన మైదానం వారి కొరకు పరచబడుతుంది మరియు మొత్తం పశువుల గుంపు సమీకరించబడుతుంది. మరియు ఒక్క చిన్న ఒంటె కూడా కనిపించకుండా పోదు. అవి అతనిని తమ గిట్టలతో తొక్కుతాయి మరియు తమ నోళ్ళతో కరుస్తాయి. ప్రతీసారి వాటిలోని మొదటిది వెళుతుంది. చివరిది వెనక్కి వస్తుంది. ఆ రోజు దాని నిడివి 50వేల సంవత్సరాలు, ప్రజల మధ్య తీర్పు పూర్తయ్యేవరకూ (ఈ శిక్ష ఉంటుంది). తరువాత అతని మార్గం చూపబడుతుంది, స్వర్గానికో లేక నరకానికో.

ఇదే విధంగా ఇతర పశువుల విషయంలో చెప్పడం జరిగింది. స్థలాభావం వలన పూర్తి హదీస్‌ను ఇక్కడ అందించడం లేదు.

హదీస్‌లో చివరిగా పఠించిన ఖుర్ఆన్ ఆయత్‌లు : **"అప్పుడు, ప్రతివాడు తాను రవ్వంత (పరమాణువంత) మంచిని చేసి ఉన్నా దానిని చూసుకుంటాడు. మరియు అలాగే, ప్రతివాడు తాను రవ్వంత (పరమాణువంత) చెడును చేసి ఉన్నా దానిని చూసుకుంటాడు."** (ఖుర్ఆన్ 99:7,8)

**జకాత్‌ను ఎవరు అడుగకూడదు ?**

అతా' బిన్ యసార్ ఉల్లేఖనం : బనూ అసద్ తెగకు చెందిన వ్యక్తి ఇలా చెప్పాడు : "ఒకసారి నేను నా కుటుంబంతో బఖీ అల్-ఘర్ఖద్ దగ్గర మకాం వేశాను. నా కుటుంబ సభ్యులు నాతో చెప్పారు : "రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి వెళ్ళి మనం తినడానికి ఏదైనా అడగండి" మరియు వారి అవసరాలను చెప్పడం మొదలుపెట్టారు. కాబట్టి నేను రసూలుల్లాహ్(స) వారి దగ్గరకు వెళ్ళాను. కాని అప్పటికే అక్కడ ఓ మనిషి ప్రవక్త(స)వారిని అడుగుతూ ఉండగా గమనించాను. రసూలుల్లాహ్(స) అతనితో ఇలా చెప్పారు: 'నీకివ్వడానికి నా దగ్గర ఏమీ లేదు'. అప్పుడు ఆ వ్యక్తి కోపంతో మరలిపోయి అన్నాడు : 'నేను ప్రమాణం చేస్తున్నాను. మీరు కోరినవారికి మాత్రమే మీరిస్తున్నారు!' రసూలుల్లాహ్(స)వారు సమాధాన మిచ్చారు: 'అతనికి నాపై కోపం వచ్చింది ఎందుకంటే అతనికి ఇవ్వడానికి నా దగ్గర ఏమీ లేదు కనుక! మీలో ఒక ఊఖియ్యాహ్ (40 దిర్హములు) లేదా దానికి సమానమైనది కలిగి ఉన్నవారెవరైనా (దానాన్ని) అడిగితే వాస్తవానికి (వారు) అన్యాయంగా అడిగినట్లు!

బనూ అసద్ తెగ వ్యక్తి తనకు స్వయంగా చెప్పుకున్నాడు : "వాస్తవానికి మా ఆడ ఒంటె ఒక ఊఖియ్యాహ్ కంటే చాలా విలువైనది. మరియు ఒక ఊఖియ్యాహ్ అంటే 40 దిర్హములు (లేదా వెండి నిసాబ్‌లో 5వ వంతు ప్రస్తుతం దాదాపు **రూ. 3,400/-**). కాబట్టి అతను ఏదీ అడగకుండా తిరిగి వెళ్ళిపోయాడు. అతను చెప్పాడు: "దాని తరువాత కొంత బార్లీ మరియు ఎండు ద్రాక్ష అల్లాహ్ యొక్క సందేశహరులు(స) దగ్గరికి పంపబడ్డాయి. అందులోని కొంత భాగాన్ని (ఆయన-స) మాకు పంపారు, సర్వశక్తిమంతుడైన అల్లాహ్ మమ్మల్ని నిరాపేక్షాపరులుగా (అడగకుండా) చేసేవరకూ. **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1627, పుస్తకం 9, అధ్యాయం 24, సంపుటి 2)**

**అంటే సంపద నిసాబ్ కంటే తక్కువే ఉన్నప్పటికీ, 40 దిర్హములు (వెండి) ఉంటే అడగకూడదు. కాని వీరికి దానం ఇవ్వవచ్చు. 40 దిర్హముల కంటే తక్కువ ఉంటే అడగవచ్చు. అంతేకాకుండా, ప్రవక్త(స)వారు తన దగ్గరకు ఏది కానుకగా వచ్చినా సరే, దానిని అవసరమున్న వారికి పంచేవారు.**

**ఆరోగ్యంగా ఉన్నవారి విషయంలో ...**

ఉబైదుల్లాహ్ బిన్ అదీ బిన్ అల్-ఖియార్, తనకు ఇద్దరు వ్యక్తులు చెప్పినది ఉల్లేఖించారు. హజ్జతుల్ విదా (ప్రవక్త(స) వారి చివరి హజ్) సమయంలో ఆయన దానాన్ని పంచుతుండగా వారు ప్రవక్త(స) వారి వద్దకు వచ్చి దానిలో కొంచెం ఆయనను అడిగారు. "అప్పుడు మావైపు

శ్రద్ధగా చూసి మమ్మల్ని ధృడంగా (మరియు ఆరోగ్యంగా) ఉన్నట్లుగా చూశారు. ఆయన(స) అన్నారు : 'మీరు కోరినట్లయితే, మీకు నేను ఇస్తాను, కాని ధనవంతుని కొరకు లేక ధృడంగా మరియు (స్వయంగా) సంపాదించు కోవడానికి సామర్ధ్యమున్న వానికొరకు దీనిలో భాగం లేదు. **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1633, పుస్తకం 9, అధ్యాయం 24, సంపుటి 2)**

తరువాయి ఉల్లేఖనం, 1634 (హసన్ హదీస్)లో **"బలమైనవారికి లేక ఎవరైతే ఆరోగ్యంగా ఉంటారో వారికి దానం న్యాయ సమ్మతం కాదు"** అని ఉంది.

ప్రస్తుతం ముస్లిమ్ సమాజంలో, కష్టపడి పనిచేయగలిగిన వారు కూడా ధర్మం పేరుతోనో, మరో పేరుతోనో జకాత్‌లపై ఆధారపడి పోవడం చాలా విచారించదగిన విషయం. ప్రవక్త(స)వారిపై ప్రేమ ఉన్నవారు, వారి బోధనలను గౌరవించి కష్టపడి బ్రతుకుతారని ఆశిస్తున్నాము.

**అభరణాల విషయంలో ...**

అమ్ర్ బిన్ షుహైబ్ ఉల్లేఖనం : యమన్ నుండి ఓ స్త్రీ రసూలుల్లాహ్(స)వారి దగ్గరికి తన కుమార్తెతో వచ్చారు. మరియు కుమార్తె చేతులకు రెండు మందంగా ఉన్న బంగారు గాజులున్నాయి. ఆయన(స) చెప్పారు, నీవు వీటిపై జకాత్ చెల్లించావా?" ఆమె చెప్పింది, "లేదు". ఆయన(స) చెప్పారు: పునరుత్థాన దినమున అల్లాహ్ రెండు అగ్ని గాజులను నీపై నుంచినట్లయితే నీకు సంతోషం కలుగుతుందా?". అప్పుడు ఆమె వాటిని తీసివేసి, రసూలుల్లాహ్(స)వారికి చెప్పింది: "అవి అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరులకు"
(**నసాయీ,** హసన్ హదీస్, 2481, పుస్తకం 23, అధ్యాయం 19, సంపుటి 3 మరియు **అబూదావూద్,** హసన్ హదీస్, 1563, పుస్తకం 9, అధ్యాయం 4, సంపుటి 2)

---

**గమనిక :** ప్రవక్త(స)వారికిగాని, ఆయన కుటుంబానికిగాని జకాత్ మరియు సదఖా నిషేధం. పై ఉల్లేఖనంలో **'అల్లాహ్‌కు మరియు ఆయన సందేశహరులకు'** అని చెప్పడం జరిగింది కాబట్టి, ఆ గాజులను ప్రవక్త(స)వారి కోసమని ఎవరైనా అనుకోవచ్చు. దానంగా వచ్చినది ఒక చిన్న ఖర్జూరమైనా సరే, ప్రవక్త(స)వారుగాని, ఆయన కుటుంబ సభ్యులుగాని స్వీకరించలేదు.

---

అబ్దుల్లాహ్ బిన్ షద్దాద్ బిన్ అల్-హాద్ ఉల్లేఖనం : ప్రవక్త(స)వారి సతీమణి ఆయిషా(రజి)వారిని మేము సందర్శించాము మరియు ఆమె చెప్పారు: రసూలుల్లాహ్(స)వారు ఒకసారి నా దగ్గరికి వచ్చి నేను పెద్ద వెండి ఉంగరాలను ధరించడం చూశారు. ఆయన(స) అన్నారు : 'ఇది ఏమిటి? ఓ ఆయిషా?'. నేను సమాధాన మిచ్చాను: 'ఓ రసూలుల్లాహ్! మీ కొరకు నేను సింగారించుకోవడానికై వాటిని చేశాను'. ఆయన(స) చెప్పారు : వీటి జకాత్ ఇచ్చావా? నేను చెప్పాను 'లేదు' లేక "ఏదైతే అల్లాహ్ ఇష్టపడతారో". ఆయన సమాధానమిచ్చారు: "ఇది నీ వంతు అగ్ని" (అబూదావూద్, సహీహ్ హదీస్, 1565, పుస్తకం 9, అధ్యాయం 4, సంపుటి 2)

**సహనానికి మించిన గొప్పకానుక**

అబూ సయీద్ అల్-ఖుద్రీ(రజి) ఉల్లేఖనం : అన్సారుల నుండి ఓ వర్గ ప్రజలు అల్లాహ్ యొక్క సందేశహరుల(స)ను (దానం)అడిగారు, ఆయన వారికి ఇచ్చారు. వారు తరువాత మరలా అడిగారు, ఆయన(స)వారికి ఇచ్చారు, ఆయన దగ్గర ఉన్నదంతా (ఇవ్వడం) పూర్తి అయ్యేవరకూ, అప్పుడు ఆయన(స) చెప్పారు : "నేను ఏ వస్తువునైతే కలిగి ఉంటానో, దానిని మీ కొరకు లేకుండా చేసి దానిని నా కొరకు ఉంచుకోను. మరియు ఎవరైతే స్వయం సమృద్ధిని (ఎవరి నుండి ఏదీ కోరకుండా స్వయంగా సంపాదించాలని కోరుకుంటారో) అర్థిస్తారో అల్లాహ్ దానిని అనుగ్రహిస్తాడు. మరియు ఎవరైతే స్వేచ్ఛగా (ఎవరిపై ఆధారపడకుండా) ఉండాలని అర్థిస్తాడో, అతడు అల్లాహ్ వలన స్వేచ్ఛగావించబడతాడు, మరియు ఎవరైతే సహనాన్ని అర్థిస్తారో, వారికి అల్లాహ్ సహనాన్ని అనుగ్రహిస్తాడు. మరియు అల్లాహ్ ఎవరికీ చాలా పెద్దదైన ఏ బహుమతినీ అనుగ్రహించ లేదు **సహనానికి మించి**" **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1644, పుస్తకం 9, అధ్యాయం 28, సంపుటి 2)**

**అల్లాహ్‌నే అడగాలి**

(అబ్దుల్లా) ఇబ్న్ మస్‌ఊద్ (రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స) వారు చెప్పారు, "ఎవరైతే దారిద్ర్యంతో బాధపడ్డారో మరియు ప్రజలవైపు తిరిగారో (పరిష్కారం కొరకు), **అతని దారిద్ర్యం పరిష్కరించబడదు.** మరియు ఎవరైతే అల్లాహ్ వైపు తిరిగారో, అల్లాహ్ అతనికి స్వేచ్ఛా మార్గాలను (ఎవరిపై ఆధారపడకుండా పరిష్కారాన్ని) త్వరితం చేస్తాడు, శీఘ్ర మృత్యువు ద్వారాగాని లేక వేగంగా సంపదను చేకూర్చడం ద్వారా గాని". **(అబూదావూద్, హసన్ హదీస్, 1645, పుస్తకం 9, అధ్యా. 28, సంపుటి 2)**

**పై చేయి ఉత్తమం**

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం : రసూలుల్లాహ్(స)వారు ఒకసారి మింబర్‌పై దానం గురించి చర్చించారు. దానాన్ని స్వీకరించడాన్ని తప్పించుకోవడం లేదా దానిని అడగకపోవడం ఉత్తమం (అవునా? కాదా? అని వివరిస్తూ) ఆయన అన్నారు : "పై చేయి క్రింది చేయి కన్నా ఉత్తమం మరియు పైచేయి ఖర్చుపెట్టేది, క్రింది చేయి అడిగేది" **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1648, పుస్తకం 9, అధ్యాయం 28, సంపుటి 2)**

---

మాలిక్ బిన్ నద్‌లహ్ ఉల్లేఖనం: అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "మూడు రకాల చేతులున్నాయి : అల్లాహ్ యొక్క చేయి అత్యున్నతమైనది. మరియు ఇచ్చేవాని (దానం) చేయి దాని క్రింద ఉంటుంది మరియు యాచించేవాని చేయి అత్యంత దిగువన ఉంటుంది. కాబట్టి ఆశీర్వాదాలను (దానాలను) ఇవ్వండి మరియు మిమ్మల్ని మీరు అధిగమించడంలో బాగా బలహీనం కావద్దు. **(అబూదావూద్, సహీహ్ హదీస్, 1649, పుస్తకం 9, అధ్యాయం 28, సంపుటి 2)**

---

**హమ్‌జహ్ బిన్ అబ్దుల్లాహ్(రజి), తన తండ్రి నుండి ఉల్లేఖించారు : ప్రవక్త(స) చెప్పారు, "మీలో ఒకరు అడుక్కుంటూనే ఉంటారు అతడు తన ముఖంపై కొంచెం కూడా మాంసం లేకుండా అల్లాహ్‌ను కలిసే వరకూ".**

**(సహీహ్ ముస్లిమ్, 2396, పుస్తకం 12 అధ్యాయం 35, సంపుటి 3)**

## ‘జకాత్’ సొమ్మును ముఖ్యంగా

- పేదవారికి
- ఏమీ లేకపోయినా సరే ఆత్మాభిమానంతో ఎవరి ముందూ చేయి చాచని పేదవారికి
- అప్పులపాలైన వారికి
- ప్రయాణంలో అంతా పోగొట్టుకుని తన ఊరు చేరుకోలేని బాటసారికి

అందజేయండి

(మిగిలిన వ్యక్తుల గురించి 55వ పేజీ చూడండి)

- **17వేల రూపాయల కంటే ఎక్కువ సొమ్ము ఉన్నవారు జకాత్ ఇవ్వండి.**
- **చాంద్రమాన సంవత్సరానికి ఒకసారి** (రమదాన్ నెలలోనే ఇవ్వాలని లేదు)
- **పంట విషయంలో, పంట ఎప్పుడు చేతికందుతుందో అప్పుడే ఇవ్వాలి.**

### పంట నష్టం

చాలామంది రైతులు ఎక్కువగా కురిసిన వర్షాల కారణంగానో లేదా వర్షాలు అస్సలు కురవక పోవడం వల్లనో పంట నష్టపోయామని బాధపడుతుంటారుగాని, తమ చేతికొచ్చిన పంటపై అల్లాహ్ ఆదేశించినట్లు ఎప్పుడైనా ‘జకాత్’ ఇచ్చారా?

**మన రాష్ట్రంలో పంటపై జకాత్ ఇచ్చేవారు ఎంతమంది ఉన్నారు? పంటపై జకాత్ ఇవ్వండి. మీకు అల్లాహ్ మేలు చేస్తాడు.**

జకాత్ పేదవారి హక్కు. అది వారి సొమ్ము. వారి సొమ్మును వారికే ఇచ్చివేయండి. ఫలితంగా మీ సంపదలో వృద్ధి పొందండి. చాలా చాలా కొత్త బ్యాంకులు పుట్టుకొస్తున్నాయి. మీ ఆదాయాన్ని 2,3 సంవత్సరాలలో రెట్టింపు చేసేస్తామని చెబుతాయి. డబ్బు మీది ప్రేమతో ఆ బ్యాంకులలో తమ సంపద మొత్తాన్ని దాస్తారు. ఆ తరువాత ఆ బ్యాంకువారు అందరి నెత్తిన టోపీ పెట్టి, ఆ డబ్బుతో పారిపోతారు. అంతా పోయాక ఏం చేస్తారు? ‘కృషి బ్యాంకు విషయం మర్చిపోకముందే, మరో బ్యాంకు చేసిన మోసం గురించి ఈ మధ్యనే తెలిసింది. ఇలాంటి వారి వాగ్దానాలను నమ్మి ప్రజలు మోసపోతున్నారు.

**జకాత్ ఇవ్వండి మీ సంపదను వృద్ధిచేస్తాను అని ఖుర్'ఆన్ ద్వారా అల్లాహ్ వాగ్దానం చేస్తే,**
**ఆ సృష్టికర్త వాగ్దానాన్ని మీరెందుకు నమ్మడం లేదు?**

జకాత్ ఇచ్చిన తరువాత, ఆ జకాత్ సొమ్మును పుచ్చుకున్నవారిని చులకనగా చూడకండి.

**ఎవరి దగ్గరైనా రు. 3,400/-లు (మూడు వేల నాలుగు వందల రూపాయలు) నగదుగాని, లేక అంత విలువ చేసే వస్తువులుంటే, వారు జకాత్ కొరకు ఎవరినీ అడుగ కూడదు. ఈ రోజు కార్లు, స్కూటర్లు, మూడు నాలుగు ఇళ్ళు, ఖరీదైన కెమెరాలు, ఫోన్‌లు ఉన్న దాయీలు కూడా జకాత్ గురించి రాష్ట్రంలోని ధనవంతులైన ముస్లిములను ఎవ్వరినీ వదలడం లేదు.**

- దాయీలుగా పిలువబడేవారికి / టి.వి. ఛానళ్ళ వారికి / సంస్థలకి **జకాత్ లేదు.**
- ఆరోగ్యంగా ఉన్నవారికి, కష్టపడి సంపాదించుకోగలిగే వారికి జకాత్‌లో భాగం లేదు.
- ‘అల్లాహ్ మార్గంలో’ అంటే కేవలం పేద హజ్‌యాత్రికుల కొరకు, ముజాహిదీన్‌లకు మాత్రమే.
- అల్లాహ్ మార్గంలో పనిచేస్తున్నామని అందరినీ అడిగేవారు, చివరికి అల్లాహ్‌ని ఎలా కలుస్తారో వ్యాసంలో వివరించబడింది.
- అల్లాహ్ చెప్పినవారికి కాకుండా, మీరు జకాత్‌ను ఇతరులకు ఇస్తే, మీరు జకాత్ ఇవ్వనట్లే.

అందరూ సరియైన విధంగా జకాత్ ఇస్తే, ముస్లిమ్ సమాజంలో పేదరికం ఉండదు. ఫీజ్ రియంబర్స్‌మెంట్స్ కొరకు ఎవరినో ప్రాధేయపడనవసరం లేదు.

ఎక్కడ సేకరించిన జకాత్‌ను ముందుగా అక్కడే ఉపయోగించాలి.

# పాఠకుల సందేహాలు

(గత 30 రోజులుగా కొందరు పాఠక సోదరులు ఫోన్‌ల ద్వారా మరియు వైజాగ్‌లోని మా లైబ్రరీకి వచ్చి కొన్ని సందేహాలను మా ముందుంచారు. ఖుర్‌ఆన్ మరియు హదీస్‌ల ద్వారా వారి సందేహాలను తీర్చడం జరిగింది. ఆ వివరాలు మిగలిన పాఠకులకు కూడా ఉపయోగకరంగా ఉండవచ్చని ఇక్కడ అందిస్తున్నాము.)

**అల్లాహ్ మొదటి ఆకాశానికి దిగుతారా?**

సంవత్సరంలో ఒక ప్రత్యేకమైన రోజు అల్లాహుతాలా మొదటి ఆకాశానికి దిగుతారని చెబుతూ, దానికి ఆధారంగా **ఇబ్నెమాజా** హదీస్ గ్రంథంలో ఓ హదీస్‌ను రిఫరెన్స్‌గా చెప్పడం జరిగింది. అయితే ఆ హదీస్ 'మౌదూ' (కల్పితం) హదీస్‌గా ఆ గ్రంథంలోనే వివరణ నిచ్చారు.

అల్లాహుతాలా భౌతికంగా దిగరు అని చెబితే, అదే హదీస్ గ్రంథంలోని మరో హదీస్‌ను ఆధారంగా చూపారు. అది సహీహ్ హదీస్. ఈ సంచికలో ఆ హదీస్‌ను 28వ పేజీలో అందించాము. ఆ హదీస్ యొక్క అరబీ మూలంలో 'సమావాతి' (ఆకాశం) అనే పదం లేదు. అల్లాహ్ దిగుతారు అని మాత్రమే ఉంది.

కాబట్టి అల్లాహ్ దిగుతారు అనగానే భాషాపరమైన అర్థాన్ని మాత్రమే తీసుకుని, మొదటి ఆకాశానికి అని ఎవరో ఉర్దూలో అనువాదం చేసినట్లున్నారు. ఆ ఉర్దూ అనువాదాన్ని ఆధారంగా చేసుకుని ఓ సోదరుడు సందేహం వ్యక్తం చేయడం జరిగింది. అయితే సహీహ్ బుఖారీ గ్రంథంలో ఓ హదీస్‌లో 'దగ్గరగా ఉండే ఆకాశం' అని ఉంది. కాని ఇక్కడ భాషాపరమైన అర్థం తీసుకోకూడదు.

**ఉదాహరణకు "ఇస్లామ్ వైపు మరలండి" అని చెబుతాము. అది విని ఎవరైనా "ఎటువైపు మరలాలి? కుడివైపుకా? ఎడమవైపుకా? ముందుకా? వెనుకకా? ఎటువైపు ఉంది ఇస్లామ్?" అని అంటే హాస్యాస్పదంగా ఉండదా?**

ముహమ్మద్(స)వారిపై జరుగుచున్న దుష్ప్రచారం పుస్తకంలో ఓ సహాబా మరణించే ముందు కొత్తబట్టలు తెప్పించుకున్నారని, ఎందుకని అడిగిన వారితో 'ఏ దుస్తులతో మరణిస్తే ఆ దుస్తులతో లేపబడతారని'' ప్రవక్త(స)వారు చెప్పినట్లు ఆయన సమాధానమిచ్చిన విషయాన్ని ఇచ్చాము. ఆ విషయంపై ఆయిషా(రజి)వారు దుస్తులు అంటే ఈ దుస్తులు కాదని, అవి ఆచరణలు అని వివరించారు.

కాబట్టి ఏ హదీస్‌నైనా అరబీ నుండి అనువదించేటప్పుడు ఆయా అనువాదకులు కేవలం భాషాపరమైన అర్థాలను మాత్రమే తీసుకుని ఏదో ఒక పదాన్ని దానితో కలిపేసి అనువదించేయకుండా, ఇస్లామ్ యొక్క బేసిక్ కాన్సెప్ట్‌ని దృష్టిలో ఉంచుకుని అనువాదం చేయవలసి ఉంది. ఖుర్‌ఆన్ గురించి మంచి అవగాహన కలిగి, అల్లాహ్ అంటే ఏమిటో స్పష్టంగా అర్థం చేసుకునుండాలి.

అల్లాహ్ గురించి స్పష్టంగా తెలిసుంటే, ఇటువంటి భావనలు కలుగవు. కాబట్టి పై విషయాన్ని స్పష్టంగా తెలియజెయ్యడానికి కొన్ని ఖుర్‌ఆన్ ఆయత్‌లను ఇక్కడ ఇస్తున్నాము.

> ''మరియు నా దాసులు, నన్ను గురించి నిన్ను అడిగితే : ''**నేను** (వారికి) **అతి సమీపంలోనే ఉన్నాను.** పిలిచేవాడు నన్ను పిలిచినప్పుడు నేను అతని పిలుపును విని, జవాబిస్తాను. కాబట్టి వారు సరైనమార్గం పొందటానికి. నా ఆజ్ఞలను అనుసరించాలి మరియు నాయందు విశ్వాసం కలిగిఉండాలి'' అని చెప్పు. (ఖుర్‌ఆన్ 2:186)

> ''మరియు వాస్తవంగా, మేమే మానవుణ్ణి సృష్టించాము మరియు అతని మనస్సులో మెదిలే ఊహలను కూడా మేము ఎరుగుదుము. మరియు **మేము అతని కంఠరక్తనాళం కంటే కూడా అతి దగ్గరగా ఉన్నాము.** (ఖుర్‌ఆన్ 50:16)

పై ఆయత్‌లను బట్టి, అల్లాహుతాలా ప్రతిమానవునికి అతి సమీపంలో ఉంటారు. ఒక్కడైన అల్లాహ్ ప్రతీ మానవుని దగ్గరలో ఉంటారా? అని సందేహ పడవలసిన అవసరం లేకుండా, ఖుర్‌ఆన్‌లోనే మరో చోట అల్లాహుతాలా చాలా స్పష్టంగా ఇలా చెప్పారు:

> నిశ్చయంగా, మీ ఆరాధ్య దైవం అల్లాహ్ మాత్రమే. ఆయన తప్ప మరొక ఆరాధ్య దైవం లేడు. **ఆయన జ్ఞానం ప్రతిదానిని ఆవరించి ఉంది.** (ఖుర్‌ఆన్ 20:98)

ఈ పై వాక్యం ద్వారా తెలిసేదేమిటంటే, ఆయన అత్యంత సమీపంగా ఉన్నాను అని చెప్పిన దానికి అర్థం, ఆయన జ్ఞానం మనకు అత్యంత సమీపంగా ఉందని.

**అల్లాహ్ సర్వజ్ఞాని.** అందుకే ఆయన లక్షణాలను తెలిపే పేర్లలో ఒకటి **అల్-అలీమ్** (సర్వజ్ఞాని).

ఇదే విధంగా అల్లాహ్ దిగుతారని అని చెప్పినచోట, దాని యొక్క అర్థం ఆయన భౌతికంగా దిగుతారని కాదు. ఆయన జ్ఞానం దిగుతుందని కూడా చెప్పలేము. ఎందుకంటే ఆయన జ్ఞానం అన్నింటిని ఎల్లప్పుడూ ఆవరించే ఉంటుంది కనుక. అంటే దిగేది మరొకటి ఏదో అయివుండాలి.

ఆయన లక్షణాలను తెలిపే ఇతర పేర్లను ఒకసారి జ్ఞాపకం చేసుకుందాము. **అర్రహీమ్, అర్రహ్మాన్** పదాలు ఆయన **కరుణ**ను తెలియజేస్తున్నాయి. అంటే ఆయన కరుణ దిగుతుందని అనుకోవచ్చు. **అల్-గఫ్ఫార్, అల్-గఫూర్** పదాలు ఆయన యొక్క **క్షమాశీలత**ను తెలియజేస్తున్నాయి. అంటే ఆయన యొక్క క్షమాభిక్ష దిగుతుందని చెప్పవచ్చు. ఇప్పుడు మీకు స్పష్టంగా అర్థమైందని అనుకుంటున్నాము. మరింత స్పష్టం కావడానికి మరొక ఖుర్‌ఆన్ ఆయత్‌ను దిగువ నిస్తున్నాము.

> ''వారు అల్లాహ్ సామర్థ్యాన్ని గుర్తించవలసిన విధంగా గుర్తించలేదు, పునరుత్థాన దినమున **భూమి అంతా ఆయన పిడికిలిలో** ఉంటుంది మరియు **ఆకాశాలన్నీ చుట్టబడి ఆయన కుడిచేతిలో ఉంటాయి.** ఆయన సర్వలోపాలకు అతీతుడు మరియు వారు కల్పించే

బాగస్వాముల కంటే అత్యున్నతుడు (ఖుర్'ఆన్ 39:67)

"ఆ రోజు **మేము ఆకాశాన్ని, చిట్టా కాగితాలను చుట్టినట్లు చుట్టివేస్తాము**. మేము ఏ విధంగా సృష్టిని మొదట ఆరంభించామో! అదే విధంగా దానిని మరల ఉనికిలోకి తెస్తాము. ఇది (మాపై బాధ్యతగా) నున్న మా వాగ్దానం. మేము దానిని తప్పక పూర్తి చేస్తాము." (ఖుర్'ఆన్ 21:104)

కాబట్టి చేతిలో చుట్టబడగలిగే ఓ విశ్వంలోకి ఆయన దిగుతారా?

పాఠకుడు రిఫర్ చేసిన హదీస్ యొక్క అరబీ మూలాన్ని మరియు దాని తెలుగు అనువాదం కొరకు 28వ పేజీ చూడండి.

ఈ హదీస్‌లో అర్థంకాని విషయాలేమీ లేవు. ఎందుకంటే ఖుర్'ఆన్‌లోని 73వ సూరహ్‌లో 20వ ఆయత్‌లో పై హదీస్‌లో చెప్పిన విషయమే చాలా స్పష్టంగా చెప్పబడింది.

"(ఓ ముహమ్మద్!) నీవు, వాస్తవానికి దాదాపు మూడింట రెండు వంతుల రాత్రి లేక సగం లేక మూడింట ఒక భాగం (నమాజ్‌లో) నిలుస్తావనేది నీ ప్రభువుకు బాగా తెలుసు. మరియు నీతోపాటు ఉన్న వారిలో కొందరు కూడా! మరియు అల్లాహ్ రేయింబవళ్ళ పరిమాణాలను నిర్ణయిస్తాడు. మీరు ఖచ్చితంగా పూర్తి రాత్రి (ప్రార్థించ) లేరని ఆయనకు తెలుసు. కావున **ఆయన మీ వైపునకు కనికరంతో మరలాడు**. కావున ఖుర్'ఆన్‌ను, మీరు పఠించగలిగినంతే పఠించండి. మీలో కొందరు వ్యధి గ్రస్తులు కావచ్చు, మరికొందరు అల్లాహ్ అనుగ్రహాన్ని అన్వేషిస్తూ భూమిలో ప్రయాణంలో ఉండవచ్చు, అని ఆయనకు బాగా తెలుసు. కావున మీకు దానిలో సులభమైనంత దానినే పఠించండి......" (ఖుర్'ఆన్ 73:20)

కాబట్టి దిగేది ఆయన కనికరం అని తెలుస్తుంది.

కాబట్టి మరలడం, దిగడం ఇటువంటి పదాలకు భాషాపరమైన అర్థాన్ని తీసుకుంటే, అసలు విషయమే మారిపోతుంది. కాబట్టి ధార్మిక జ్ఞానంతో పాటు, ప్రాపంచిక జ్ఞానం కూడా కనీస స్థాయిలో ఉండాలి.

అల్లాహ్ యొక్క కరుణ ఎల్లప్పుడూ ఉంటుంది. ఓ క్షణంపాటు ఆ కరుణ లేకపోయినా అంతా నాశనమైపోతుంది. కరుణ దిగడం అంటే, ఎక్కువ కరుణ ఆ సమయంలో దిగుతుందని లేదా ఆ సమయంలో క్షమాభిక్ష దొరికే అవకాశం ఎక్కువని అర్థం చేసుకోవాలి.

ఖుర్'ఆన్‌లో మీకు ఒకచోట సందేహంగా అనిపించిన ఆయత్, మరో చోట మీకు చాలా స్పష్టంగా అర్థమౌతుంది. అందువల్లనే ఖుర్'ఆన్ గ్రంథాన్ని అర్థంచేసుకుంటూ, మాటిమాటికి చదివితే, ఒకే విషయానికి సంబంధించిన ఆయత్‌లు మీకు వెంటనే స్ఫురించి, మీకు సందేహం లేకుండా చేస్తాయి.

కాబట్టి అర్థం చేసుకుంటూ ఖుర్'ఆన్ గ్రంథాన్ని మీకు వీలయినంత భాగాన్ని రోజూ చదువుతూ ఉండండి.

## మంచి 'బిద్'అత్' చేయవచ్చా?

ధర్మంలో లేనివి కల్పించడమే బిద్'అత్. ఇక మంచి బిద్'అత్ అనే ప్రశ్నే లేదు.

అతి ముఖ్యంగా ముస్లిములంతా గుర్తుంచుకోవలసిన విషయం ఏమిటంటే, ఖుర్'ఆన్ గ్రంథంగాని, సున్నత్‌లుగాని ప్రళయం వరకూ ఆచరించదగినవి. ఇవి సన్మార్గంవైపు తీసుకెళతాయి.

సన్మార్గం అంటేనే మంచిమార్గం. ఇందులో సమస్త మంచిపనులు ఉంటాయి. ఇస్లామ్‌లో ఉన్నది ఏదీ చెడ్డపని కాదు. ఒకవేళ మీరు మంచిపని అనుకున్నది నిజంగా మంచిదయితే, అది మీకు ఇస్లామ్‌లో కనిపిస్తుంది. మీరు ఒక సమయంలో మంచి అని అనుకున్నది, కొంతకాలం తరువాత మీకు అది చెడుగా అన్పించవచ్చు.

మీరు ధృఢంగా ఉన్నారని, 4 రకాత్‌లు చదవవలసిన ఫరజ్ నమాజ్‌ను 6 రకాత్‌లు చదివితే, అది బిద్'అత్ అవుతుంది. కాని 4 రకాత్‌ల ఫరజ్ పూర్తయ్యాక 2 రకాతులు నఫిల్ చేసుకోవచ్చు (అసర్ మరియు మగరిబ్ మధ్యలో తప్ప). అప్పుడు అది ధర్మసమ్మతం అవుతుంది.

ఓ యజమాని ఓ స్థలాన్ని చూపించి అందులో తనకు 4 గదులతో ఇళ్ళు నిర్మించమని చెబితే, ఆ స్థలంలో 4 గదులకు బదులు 8 గదులతో ఇంటిని నిర్మించి, తాపీమేస్త్రి తాను మంచి పని చేశానని అనుకుంటే, అది ఇంటి యజమానికి మంచి అవుతుందా?

అల్లాహ్ మనకు చూపిన ధర్మంలో ఏమి ఉన్నాయో ముందుగా తెలుసుకోవాలి. ముందుగా అవి తెలుసుకోకుండా 'మంచి బిద్'అత్' గురించి మాట్లాడటం, తను చేసే తప్పును కప్పిపుచ్చుకోవడానికి చేస్తున్న ప్రయత్నమే అవుతుంది.

అంతేకాకుండా, ఆ బిద్'అత్‌ను సమర్థించుకోవడానికి ప్రవక్త(స)వారి కాలంలోగాని, సహాబాల కాలంలోగాని జరిగిన ఓ సంఘటనను ఉదాహరిస్తారు. అటువంటి వాటిని నేటి యువత విశ్లేషించకుండానే నమ్మడం జరుగుతుంది.

1. **ప్రవక్త(స)వారు బ్రతికుండగా ఖుర్'ఆన్ గ్రంథాన్ని పుస్తకంగా చేయలేదు. ఆయన తరువాత వచ్చిన ఖలీఫాల కాలంలో జరిగింది కదా! మరి అది బిద్'అత్ అవుతుంది కదా!**

ఇదే సంచికలో 11వ పేజీలో ఓ హదీస్‌ను ఇచ్చాము. ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లతో పాటు **సన్మార్గం పొందిన ఖలీఫాల మార్గాన్ని** అనుసరించమన్నారు. పై సందేహానికి ఇదొక్కటే జవాబు కాదు.

ఖుర్'ఆన్ గ్రంథంలోని 2వ సూరహ్ 'అల్-బఖరా'లోని 2వ వాక్యాన్ని చూడండి.

"జాలికల్ **కితాబు** లారైబ ఫీహి హుదల్లిల్ ముత్తఖీన్"

మరి పై వాక్యంలో 'కితాబు' అంటే అర్థమేమిటి. '**ఇది ఒక దివ్యగ్రంథం** ...'అని స్పష్టంగానే ఉంది కదా! కాబట్టి ఖుర్'ఆన్ పుస్తకమే!

ఖుర్'ఆన్ గ్రంథం ఒకేసారి ముహమ్మద్(స)వారిపై అవతరించ లేదు. దాదాపు 23 సంవత్సరాల పాటు అవతరించింది. అంతేకాకుండా, ఆ సందేశం కూడా ఒకే వరుసలో కాకుండా, అంటే ఒక సూరహ్ పూర్తయ్యాకనే రెండవ సూరహ్ రావడం జరగలేదు.

ప్రవక్త(స)వారు జీవించిన కాలంలో చివరగా వచ్చిన ఆయత్‌లలో

ఒకదానిని 'సూరహ్ బఖరా' అంటే ఖుర్'ఆన్ గ్రంథంలోని 2 వ సూరహ్ చివరిలో ఉంచమన్నారు.

ఇటువంటి సందేశాలను ఎప్పుడు పుస్తకంగా కుట్టడం జరుగుతుంది? ఆ సందేశాలు పూర్తి అయిపోయాక మరియు అవి అన్నీ సరియైన విధంగా ఒక వరుసలో పెట్టాకనే పుస్తకంగా కుట్టడానికి వీలవుతుంది.

అబూబకర్ (రజి)వారు ఖలీఫాగా ఉన్న కాలంలో, ఎంతోమంది హాఫిజ్‌లు (ఖుర్'ఆన్ గ్రంథాన్ని కంఠస్థం చేసినవాళ్ళు) ఉన్నారు. అంటే వారి మనస్సులలో ఖుర్'ఆన్ గ్రంథాన్ని ముద్రించుకున్నారు. అంతేకాకుండా, వారి దగ్గర వ్రాసుకున్నవి కూడా ఉండేవి.

ఆ విధంగా వ్రాసుకున్న వ్రాత ప్రతులను అందరూ తీసుకు వచ్చినప్పుడు, ప్రతీ ఆయత్ కూడా ఒకరి కంటే ఎక్కువ మంది దగ్గరే వ్రాతపూర్వకంగా ఉంది. కాని 9వ సూరహ్‌లోని 128 మరియు 129 ఆయత్‌లు వ్రాత పూర్వకంగా ఒకరి దగ్గరే ఉన్నాయి. ఆ వ్యక్తి దగ్గర ఉన్న ఆ రెండు ఆయత్‌లకు సంబంధించిన ఏకైక వ్రాత ప్రతి పోయినా సరే, హాఫిజ్‌లు చెప్పగలరు. కాని ఆ విషయమే వ్రాతప్రతులను కూడా రక్షించవలసిన బాధ్యతను తెలియజేసింది.

ఖుర్'ఆన్ అంటేనే మాటిమాటికి చదివే గ్రంథం. ఇది పుస్తకమే. దీనిని పుస్తకంగా కుట్టి లేదా బైండ్ చేయడం బిద్అత్ ఎంతమాత్రం కాదు.

2. **ప్రవక్త(స)వారు బ్రతికుండగా ఉన్న ఖుర్'ఆన్ వ్రాత ప్రతులలో జబర్, జేర్, పేష్ మొదలైన గుర్తులు లేవు. ఆ తరువాత కలిపారు. అలా కలపడం వల్లనే తజ్‌వీద్‌తో ఖుర్'ఆన్‌ను చదువగలుగు తున్నారు. కాబట్టి అది మంచి పనే. అటువంటి మంచిపని ప్రవక్త(స)వారి తరువాత చేసారు కాబట్టి, అది బిద్అత్ అవుతుంది. ఆ విధంగా అది మంచి బిద్అత్ అవుతుంది కదా! అని సందేహాన్ని వెలిబుచ్చారు.**

చాలా దురదృష్ట కరమైన విషయం ఏమిటంటే, అరబీ భాషపై కనీస అవగాహన ముస్లిములలో చాలామందికి లేకపోవడం. అదే విధంగా వహీ ఎలా వచ్చేది మరియు అది ఏ విధంగా వ్రాయబడేది అనే విషయంపై కూడా సరియైన అవగాహన మనవారిలో లేదని, ఈ సందేహాలు తెలియజేస్తున్నాయి.

అరబీ భాష అనేది సెమిటిక్ భాష. హెబ్రూ మరియు అరమాయిక్ భాషలు కూడా సెమిటిక్ భాషలే. ఈ భాషలలో అచ్చులు ఉండవు. అన్ని హల్లులే. ఇంగ్లీష్ భాషలో A,E,I,O,U అనే 5 అచ్చులు (vowels) ఉన్నాయి. తెలుగు భాషలో 'అ, ఆ, ఇ, ఈ .... అః' వరకూ అచ్చులున్నాయి. ఉదాహరణకు 'క' అనే హల్లును తీసుకుందాం. 'కా, కి, కు, కూ' అనేవి ఎలా ఉత్పన్నమయ్యాయి? క+ఆ = కా, క+ఇ=కి, క+ఈ=కీ, క+ఉ=కు.

అంటే హల్లు అక్షరానికి అచ్చు కలిసినప్పుడే దానికి దీర్ఘాలు మొదలైనవి వస్తాయి.

కాని అరబీ భాషలో అచ్చులు లేవు. కాని అవి లేకుండానే వారు కేవలం హల్లులతోనే దీర్ఘాలను చెప్పగలరు. అయితే అరబ్బులు కానివారు, లేదా అరబీ భాషపై అవగాహన లేనివారు, వీటిని చదివే విషయంలో పొరపాటు చేయవచ్చు.

అందుకని జబర్, జేర్, పేష్ వంటి కొన్ని డయాక్రిటికల్ సింబల్స్‌ని డిజైన్ చేసారు. వీటి సహాయంతో సరియైన రాగంతో వాటిని చదవవచ్చు. ఉర్దూ పుస్తకాలలో జబర్, జేర్, పేష్ లేకపోయినా చదివేస్తారు.

అదేవిధంగా జబర్, జేర్, పేష్‌లు లేకుండానే అరబీ ఖుర్'ఆన్‌ను అరబ్బులు చదువగలరు.

కాబట్టి ఇది బిద్అత్ కాదు. మరో ముఖ్యవిషయం :

**ప్రవక్త(స)వారు తన స్వీయహస్తాలతో వ్రాసి ఖుర్'ఆన్ గ్రంథాన్ని ఇచ్చి ఉంటే, దానిలో ఇటువంటి గుర్తులు పెట్టిఉంటే, అప్పుడు అది బిద్అత్ అని మీరు చెప్పినా, దానికొక అర్థముంది. కాని ముహమ్మద్(స)వారికి చదవడం, వ్రాయడం తెలియదు.**

ఆయన నోటివెంట విన్న మాటలను, విన్నవారు యధాతథంగా వ్రాశారు. అందరూ అదే విధంగా పలకాలంటే, ఈ సింబల్స్ యొక్క అవసరముంది.

అంతేకాకుండా, పూర్వం అరబ్బులలో వ్రాతపూర్వకంగా ఏ చరిత్రనూ భద్రపరచలేదు. చారిత్రక సంఘటనలు కూడా పద్యరూపంలో కంఠస్థం చేసి వారి మనస్సులలో భద్రపరచుకునేవారు.

ఖుర్'ఆన్ గ్రంథమే అరబ్బుల యొక్క తొలి పుస్తకం. అరబీ భాష గురించి, అరబ్బుల చరిత్ర గురించి తెలిసి ఉంటే ఇటువంటి సందేహాలు రావు.

**''ఖుర్ఆన్ గ్రంథం అరబీ భాషలోనే ఎందుకు అవతరించింది?'** అనే పరిశోధనాత్మక పుస్తకం కొరకు, సెమిటిక్ భాషల గురించి పరిశోధన చేయబట్టి, ఈ విషయాలను సులభంగా మీకు చెప్పడం జరిగింది. కాబట్టి ఇది బిద్అత్ కాదని అల్లాహ్ దయవలన స్పష్టంగా చెప్పడం మాకు సాధ్యమైంది. ఒకవేళ ఆ విధంగా చెప్పలేకపోతే మీరు దానిని బిద్అత్‌గానే పరిగణించే అవకాశం ఉంది, కాబట్టి మీ సందేహాలకు సమాధానం దొరకకపోయినా సరే ఖుర్'ఆన్ మరియు సున్నత్ ప్రకారమే ఆచరించండి. అల్లాహ్ మార్గంపై అనుమానాలు పెట్టుకోకండి. ప్రస్తుతం సమాధానం లేని ఎన్నో సందేహాలకు కాలమే సమాధానం చెబుతుంది, ఇన్షాఅల్లాహ్.

పైన చెప్పిన ''ఖుర్ఆన్ గ్రంథం అరబీ భాషలోనే ఎందుకు అవతరించింది?'' పుస్తకాన్ని 2007లో ప్రారంభించి, చాలా పరిశోధన చేసినప్పటికీ, 'శాంతిబాట' పత్రిక మరియు ఇతర పుస్తకాలను అందించడానికి తొలి ప్రాధాన్యత ఇవ్వడం వలన ఈ పుస్తకాన్ని తెలుగులో అందించడంలో జాప్యం జరుగుతుంది.

**"ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం"** పుస్తకాన్ని క్రిందటి సంవత్సరమే అందిస్తామని చెప్పాము. కాని ఈ రమదాన్‌లో మాత్రమే అది సాధ్యమైంది. రాజీపడటం మాకు అలవాటు లేదు. ఉన్నత ప్రమాణాలతో అందించాలనేది మా కోరిక. ఆలస్యమైనా, జరుగుతున్న ఆలస్యం విషయంలో ఎవరు ఎంతగా నిందించినా సరే, మంచి ప్రమాణాలతోనే మీకు ఇస్లామీయ సమాచారాన్ని ఇన్షాఅల్లాహ్ అందిస్తాము.

**3. సౌదీ అరేబియాలో ఉపవాసం ప్రారంభించిన రోజునే మనదేశంలో ఎందుకు ఉపవాసం ప్రారంభించడం లేదు.**

ఈ విషయంపై చాలా ఫోన్‌కాల్స్ వచ్చాయి. అందరికీ అర్థమయ్యే విధంలో శాస్త్రీయంగానూ, ఇతర ఆధారాల ద్వారా చెప్పడానికి అన్ని రకాల వివరాలను సేకరించాముగాని, ప్రస్తుతం సమయం లేక ఈ సంచికలో అందించలేక పోతున్నాము. వచ్చే సంచికలోగాని లేదా వచ్చే రమదాన్ మాసానికి ముందుగా గాని అందిస్తాము, ఇన్షాఅల్లాహ్.


**4. 27 రకాల ఖుర్'ఆన్ గ్రంథాలున్నాయని, అవగాహన లేని ఓ మత ధర్మానికి చెందిన వ్యక్తి, హదీస్ రిఫరెన్స్‌లు ఇచ్చారని చెప్పారు. ఈనాడు ఖుర్'ఆన్ మరియు సున్నత్‌ల ద్వారా అల్లాహ్ మార్గం వైపు పిలవడం చేతగాని కొందరు, కొన్ని శ్లోకాలను మరియు కొన్ని ఇతర మతధర్మాల వారి పుస్తకాలలోని వాక్యాలను బట్టీపట్టి, ఆయా ధర్మాల వారితో చర్చిస్తున్నారు. వారు తెలివితక్కువవారేమీ కాదు. ఇలా ఖుర్'ఆన్ మరియు సున్నత్‌లను వదిలేసిన ముస్లిముల దగ్గర ఇల్మ్ (జ్ఞానం)లేదని వారు గ్రహించారు. అందుకే ఏదో ఒక హదీస్ రిఫరెన్స్ నెంబర్ చెప్పగానే ఈ దాయీలు నోళ్ళు వెళ్లబెడుతున్నారు.**

లక్షల రపాయలు ఖర్చుపెట్టి ప్రోగ్రామ్స్ ఏర్పాటు చేసుకో గలిగిన వారు హదీస్ గ్రంథాలను కొనుక్కోలేకపోవడం విచారకరం. వాటిని కొనుక్కొని చదివి, జ్ఞానాన్ని సంపాదించుకుని, ఎవరైనా ఏదైనా చెప్పగానే వారి కళ్ళ ముందే వాటిని ఓపెన్ చేసి వివరణ ఇవ్వవచ్చు. ప్రవక్త(స)వారి మార్గాన్ని వదిలేసిన వారి కర్మలు వృథాయే!

కాబట్టి మిడిమిడి జ్ఞానం గల దాయీల సందేహాన్ని తీర్చినా ఒక్కటే, లేకపోయినా ఒక్కటే. కాని ఇటువంటి విషయాలలో మా పాఠకులకు అనుమానం రాకుండా ఉండేందుకు, సమగ్ర సమాధానాన్ని వచ్చే సంచికలో ఇన్షాఅల్లాహ్‌అందిస్తాము.



**తాష్కెంట్ (రష్యా)లో హస్త్ ఇమామ్ మ్యూజియంలో భద్రపరచబడిన "3వ ఖలీఫా ఉస్మాన్(రజి)"వారి ఖుర్'ఆన్**



**జబర్, జేర్, పేష్ వంటి గుర్తులు లేని ప్రాచీన ఖుర్'ఆన్ వ్రాతప్రతి**

## పాఠకులకు మనవి

**"ముహమ్మద్(స)వారిపై ప్రపంచ వ్యాప్తంగా జరుగుచున్న దుష్ప్రచారం"** పుస్తకం ద్వారా తెలియని ఎన్నో విషయాలను తెలియజేశామని మమ్మల్ని ప్రశంసించిన సోదరసోదరీమణులకు విజ్ఞప్తి.

మీకు తెలియని విషయాలు 'శాంతిబాట'ద్వారా తెలుసుకున్నట్లే మిగిలిన ముస్లిమ్ సోదరులు తెలుసుకునేలా చేసి మీరు కూడా ధార్మిక సేవ చేసే అవకాశం ఉంది.

మీరు కొందరిని చందాదారులుగా చేర్పించండి. లేదా మీ స్థోమతను బట్టి మీరే రెండుగాని, మూడుగాని లేదా అంతకంటే ఎక్కువ పుస్తకాలకు చందా కట్టి, ఇతరులకు పంచండి.

మా దగ్గర ఏ ఆర్థిక వనరులు లేవు. ఎవరి ముందైనా చేయి చాచి అడుక్కునే పని మేమెన్నటికీ ఇన్షాఅల్లాహ్ చేయలేము.

ప్రవక్త(స)వారిపై ఉన్న అచంచలమైన ప్రేమతో, వారిపై జరగుచున్న దుష్ప్రచారాన్ని ఖండించడానికి ఓ సంవత్సరంపాటు పూర్తి సమయాన్ని కేవలం ఆ పుస్తకానికే కేటాయించడం జరిగిందంటే, ధార్మిక సేవ విషయంలో మా నిజాయితీ మీకు అర్థమయ్యే ఉంటుంది.

కాబట్టి అటువంటి పరిశోధనను, అంత సమయంపాటు వ్యాపార దృష్టితో పనిచేసే నేటి కమర్షియల్ దాయీలుగాని, డబ్బును సంపాదించాలనుకునే ఆలిమ్‌లుగాని చేయరు.

ఇంకను ఎన్నో పరిశోధనాత్మక విషయాలున్నాయి.

ఆర్థిక భారంతో వాటిని మీకు అందించలేని పరిస్థితి రాకుండా, చందాదారులను చేర్పించి, ధార్మిక విషయాలను నిర్విరామంగా అందరికీ అందించే అవకాశాన్ని మాకు అందించండి.

**ఈ విషయంలో మీరు కూడా**
**అల్లాహ్ యొక్క శుభాలను పొందండి.**

మాకు ప్రత్యేకంగా ఆర్థిక సహాయం అవసరం లేదు. చందాదారులు పెరిగితే చాలు. 'శాంతిబాట' పత్రిక ఈ 'టీమ్'లోని ఎవ్వరికీ జీవనోపాధి కాదు.

గత సంవత్సరం చేరిన మా చందాదారులు మరోసారి మేము గుర్తు చేయవలసిన అవసరం రాకుండా, ఈ సంచిక అందిన వెంటనే చందా పంపించమని విజ్ఞప్తి చేస్తున్నాము.

**సంవత్సర చందా : రు. 200/-.**

ఒకే ఎడ్రస్‌కి రెండు కంటే ఎక్కువ ఉన్న పుస్తకాలను కొరియర్ ద్వారా పంపిస్తున్నాము. పల్లెటూర్లకు కొరియర్ సర్వీస్ లేనందున వారికి గవర్నమెంట్ పోస్టల్ సర్వీస్ ద్వారానే పంపిస్తున్నాము.

కొరియర్‌లోనే పుస్తకాలు పంపమని కోరేవారు, అదనంగా మరో 100 రు॥లు చెల్లించవలసి ఉంది.

# పాఠకుల అభిప్రాయాలు

(ముహమ్మద్(స)వారిపై జరుగుచున్న దుష్ప్రచారం పుస్తకంపై)

**అపోహలు తుడుచుపెట్టుకు పోతాయి ...**

ఇతరులకే కాదు, ముస్లిములలో ఉన్న అపోహలు కూడా ఈ పుస్తకం చదివితే తుడుచుపెట్టుకు పోతాయని తెలియజేస్తూ తొలి స్పందన కర్నూలు నుండి అందింది. అల్‌హమ్‌దులిల్లాహ్! మా సంకల్పం కూడా అదే. గత 20 సంవత్సరాలుగా కొందరు ముస్లిమ్ సోదరుల భావాలను జాగ్రత్తగా గమనించడం జరిగింది.

**కంగ్రాట్స్ ...**

పత్రికలకు వ్యాసాలను వ్రాసే సీనియర్ రైటర్స్ నుండి అభినందనలు అందాయి. ఆయిషా(రజి)వారి విషయాన్ని సరిగ్గా ప్రెజెంట్ చేయడం జరిగిందని, అధ్యాయాల ఆర్గనైజేషన్ బావుందని చెప్పారు.

ఇంతకు పూర్వం ''అల్లామా హాఫిజ్ ఖారీ హబీబుర్రహ్మాన్ సిద్దీఖీ కాంధల్వీ'' ఉర్దూలో వ్రాసిన పుస్తకాన్ని మన రాష్ట్రంలో ఓ సంస్థ తెలుగులో పబ్లిష్ చేసింది. ఆ పుస్తకంలో ఆయిషా(రజి)వారు కాపురానికి వచ్చిన వయస్సు 9 సం॥లు కాదని నిరూపించడానికి 24 ఆధారాలున్నాయని చెబుతూ, సహీహ్ బుఖారీ గ్రంథంలోని ఓ హదీస్‌ను కూడా తప్పు అని ఆ హాఫిజ్‌గారు చెప్పారు. ఆ 24 ఆధారాలలో ఎటువంటి నిజం లేదు. కేవలం అవి అతని అనుమానాలు మాత్రమే. వ్రాసిన వ్యక్తి అవివేకంతో, ఆవేశంతో వ్రాశారని అర్థమౌతుంది. 'శాంతిబాట'లో 'హదీస్‌లపై అపోహలు' శీర్షికలో అతను చూపిన కొన్ని ఆధారాలను ఖండించాము. మిగిలిన ఆధారాల ఖండనను కూడా త్వరలో అందిస్తాము, ఇన్షా అల్లాహ్.

విశ్వాసుల మాతృమూర్తి యొక్క వివాహాన్ని సరియైన విధంగా వివరించలేక, ఏకంగా ఓ సహీహ్ హదీస్‌ను తప్పు అని చెప్పే స్థాయికి ఆ హాఫిజ్‌గారు దిగజారిపోయారు. ఇలా కాకుండా సామాన్య ముస్లిములకు కూడా అర్థం అయ్యే విధంగా వివరించాలని అల్లాహ్ పేరుతో మేము చేసిన ప్రయత్నం సఫలీకృతం అయింది. ఇటువంటి విషయాలలో ప్రాపంచిక జ్ఞానం యొక్క ఆవశ్యకత చాలా ఉంది. దీనికోసం సహనం, సమయం కూడా కావాలి.

**ఫస్ట్‌క్లాస్ ...**

బుక్ ఫస్ట్‌క్లాస్‌గా ఉంది, మంచి స్పందన ఉందని, ఇప్పటికే రెండుసార్లు చదివేశామని పాఠక సోదరుల నుండి ప్రశంసలు అందుతూనే ఉన్నాయి. అల్లాహ్ దయవల్ల ఓ డాక్టరేట్ డిగ్రీకి చేసేటటువంటి వర్క్ ఈ పుస్తకం కోసం చేయడం జరిగింది. ఈ పుస్తకాన్ని ఆలస్యమైనా సరే రమదాన్ నెలలో అందివ్వ గలిగినందుకు మాకు చాలా సంతోషంగా ఉంది.

**ప్రకటన నచ్చలేదు ...**

అవును. పుస్తక ప్రారంభంలో ఇచ్చిన ప్రకటన కొద్దిమందికి నచ్చదు. ఎవరైతే దావాను వ్యాపారంగా చేసుకున్నారో వారికి. ఇటువంటి కమర్షియల్ దాయీల దుర్మార్గం వల్లనే మహనీయుడైన ముహమ్మద్(స) వారిపై అన్యమత ధర్మాల వారు బురద చల్లగలుగుతున్నారు. పచ్చి మిరపకాయలు, ఎండు మిరపకాయలు తినడానికి ఇష్టపడనివారు, తనకు వడ్డించిన కూరలో అవి ఉంటే, ఆ కూర తినకుండా లేచి వెళ్ళిపోతారా? లేక వాటి తీసివేసి కూరను తింటారా?

**ప్రకటన కేవలం అరపేజీ మాత్రమే ఉంది.** కాని ముఖ్యవిషయాలు 190 పేజీలకు మించి ఉన్నాయి కదా! అవి చదివితే ప్రకటన ఎంత సమంజసమో అర్థం అవుతుంది. **దొంగ** ... అంటే భుజాలు తడుము కునేవారు, అలా తడుముకుంటూనే ఉంటారు.

**ఒక్క పుస్తకం ఏమి సరిపోతుంది ...**

ఇటువంటి పుస్తకం ఒక్క కాపీ ఏమి సరిపోతుంది, ఇంకా కాపీలు పంపించమని కొందరు కోరారు. మా తలకు మించిన ఆర్థిక భారమే అయినప్పటికీ, ప్రజలకు మహోన్నతుడి ఉత్తమ కారెక్టర్ గురించి తెలపాలని కొన్ని కాపీలను ప్రింట్ చేయించాము.

అడిగిన వారందరికీ కాపీలు పంపగలిగే ఆర్థిక స్థోమత మాకు లేదు. మేము పుస్తకాన్ని ప్రారంభించిన కొద్ది రోజులకు మస్జిద్‌లలో ప్రకటించి నప్పుడు ఏ ఒక్కరు కూడా ముందుకు రాలేదు. కాని మా గురించి తెలిసిన మా శ్రేయోభిలాషులు మేమున్నామంటూ ముందుకొచ్చారు. శాంతిబాటలో ప్రకటించి నప్పుడు కూడా ఎవ్వరూ ముందుకు రాలేదు.

పుస్తకానికి 35 రు॥ల నుండి 40 రు॥ల వరకూ ఖర్చవుతుంది కాబట్టి, ఎవరికి ఎన్ని పుస్తకాలు కావాలో చెబుతూ డబ్బు పంపితే, రమదాన్ ఈద్ తరువాత ప్రింట్ చేయించి పంపగలం, ఇన్షా అల్లాహ్!

**కోపం ...**

విగ్రహారాధన చేయకూడదు అంటే, విగ్రహారాధకులకు కోపం వస్తుంది. షిర్క్ చేయవద్దని చెబితే, షిర్క్‌ని ఇష్టపడేవారికి కోపం వస్తుంది. అదేవిధంగా ధర్మంలో బిద్అత్‌ని ప్రవేశపెట్టి, ధర్మాన్ని భ్రష్టు పట్టించడానికి ప్రయత్నించే వాళ్ళను విమర్శిస్తే, వారి ఫాన్స్‌కు కోపం వస్తుంది.

వీరందరి కోపాలను దృష్టిలో పెట్టుకుని, మేము చెడును నిరోధించ డానికి ప్రయత్నించకుండా, మౌనంగా ఉంటే, అల్లాహుతాలాకు కోపం వస్తుంది. అల్లాహ్ అనుగ్రహాన్నే కోరుకుంటున్నాముగాని, ఆయన కోపాన్ని కాదు.

**దావాపై ...**

ప్రవక్త(స)వారు ముందుగానే చెప్పారు, **ప్రళయం సమీపించినప్పుడు జ్ఞానంలేని వారే అందలమెక్కుతారని.** ఇప్పుడు మనం దానిని ప్రత్యక్షంగా చూస్తున్నాం. ఇల్మ్‌లేని వారు ప్రసంగాలిస్తున్నారు. వారికి ఫాన్ ఫాలోయింగ్ కూడా ఉంది. 'అల్లాహ్' అనేది పేరు (Proper Noun) అని, అంతేగాని Common Noun కాదని, దానిని ఏ భాషలోకీ అనువదించరని, సాక్ష్యాలతో సహా చూపిస్తే, సాధారణ ముస్లిములు

**మీ అభిప్రాయాలను, విమర్శలను కార్డుపై వ్రాసి 'వెలుగుబాట ఎడ్యుకేషనల్ సొసైటీ' ఎడ్రస్‌కు గాని లేదా velugubaata@gmail.com కు పంపండి.**

సైతం అల్లాహ్ అంటే ఏమిటో అర్థం చేసుకోగలిగారు గాని, 'దాయీ'లుగా ప్రముఖ 'దాయీ'లుగా పిలువబడేవారికి మాత్రం అది అర్థం కావడం లేదు.

అరిగిపోయిన గ్రామఫోన్ రికార్డులా పాడిన పాతపాటే పాడుతున్నారు. అల్లాహ్ అంటే ఏమిటో తెలియని వారే ప్రముఖ దాయీలైపోయారు. ఈ రోజు వీరికి చప్పట్లు కొట్టవచ్చుగాని, ఆఖిరత్‌లో వీరిని వేటితో కొడతారో, వారే ఓసారి ఆలోచించుకోవాలి. Proper Nounకి మరియు Common Nounకి మధ్య నున్న తేడా ఏమిటో వీరికి తెలియదు. ఇతర ధర్మాల వారికి అల్లాహ్ గురించి చాలా స్పష్టంగా చెప్పవచ్చు. వారెవరూ అభ్యంతరం చెప్పరు. అయితే అలా చెప్పడానికి ఖుర్‌ఆన్ గ్రంథంపై అవగాహన ఉండాలి. హదీస్‌లపై కనీస జ్ఞానం ఉండాలి. అవి వారికి లేవు.

**కన్నీరు ...**

చదువుతుంటే కళ్ళవెంట నీళ్ళు వచ్చాయి. మానసిక ఒత్తిడి గురించి వివరంగా చెప్పారని, చంద్రుని గురించి తెలియని విషయాలు అందించారని ఓ సోదరి అభినందించారు. పొగడ్తలన్నీ మా చేత వ్రాయించిన అల్లాహ్‌కే చెందుతాయి.

ఇస్లామ్‌లో సహరీ, ఇఫ్తార్ విందులు లేవని,
అంతేకాకుండా రమదాన్ నెలలో వదిలివేసే
ఎన్నో సున్నత్‌ల గురించి ప్రత్యేక వ్యాసాలు
అందించాలనుకున్నాము.
కాని మాకు ఆ అవకాశం కలుగలేదు. ప్రతికను
రమదాన్ ప్రారంభంలో అందించలేక పోవడం వలన
ఆ వ్యాసాలను ఆపివేశాం.

# సంవత్సర చందా కొరకు మనవి

(ఆగష్టు 2010 నుండి జూలై 2011 వరకు)

**కేవలం 6 నెలలు మాత్రమే చందా కట్టినవారికి కూడా పత్రికలు పంపిస్తూనే ఉన్నాము.**
**మాకు ఎడ్రస్‌లను పంపి డబ్బు పంపని వారికి కూడా పత్రికలను పంపడం ఆపలేదు.**
**కాని మా ఆర్థిక పరిస్థితి దృష్ట్యా 13 సంచిక నుండి చందా కట్టిన వారికి మాత్రమే పత్రికను పంపించగలము**

**ఈ సంచిక అందగానే, దయచేసి 2010-2011 సంవత్సరానికి గానూ, అంటే వచ్చే రమదాన్ వరకూ పత్రికలు పంపడానికి రు. 200 లు M.O. (మనియార్డర్) ద్వారా పంపమని కోరుతున్నాము.**
**మీ ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వ్రాయండి. ఎడ్రస్ మరింత వివరంగా తెలియజేయండి.**


**ఆర్థిక స్థోమత బాగున్న సోదరులు ఒకటి కంటే ఎక్కువ వాటికి చందా కట్టి, ఇతరులకు అందించమని లేదా మీ స్నేహితులను, బంధువులను చందాదారులుగా చేర్పించమని కోరుతున్నాము.**

**3గాని అంత కంటే ఎక్కువ వాటికి చందా కట్టేవారు, కట్టవలసిన మొత్తానికి 25రు॥లు అదనంగా కలిపి క్రింది బ్యాంక్ ఎకౌంట్‌లో డిపాజిట్ చేయవచ్చు.**

**(బ్యాంక్‌లో డిపాజిట్ చేస్తే మీ మనియార్డర్‌ఛార్జెస్ తగ్గుతాయి)**

**SBI, Andhra University Campus Branch, Waltair, Visakhapatnam, A/c No. 10428633092, Nagireddi Srinivasa Rao**
**డిపాజిట్ చేసిన వెంటనే 9491103017కు ఫోన్ చేసి ఎమౌంట్ వివరాలు తెలియజేయవలసిందిగా కోరుతున్నాము.**

**Printed by** Md. Athaharullah, **Published by** Md. Athaharullah **Owned by** Velugubaata Educational Society (Regd.No. 569/2008), Samalkot and **Printed at** '*Akash Industries*', G-14, Industrial Estate, Samalkot - 533440 and **Published at** 2-8-31, Kota Bazar, Samalkot - 533440,
**Editor:** Md. Athaharullah , Phone : 9347046090, Email: velugubaata@gmail.com, RNI Regd. No. APTEL/2009/29650




ఈ సంచిక అందే సమయానికి ప్రక్క పుస్తకాన్ని మీరు చదివే ఉంటారు. పుస్తకం పోస్టల్‌లో మిస్ కాకూడదని, తొందరగా రమదాన్ మొదటి రోజుకే పాఠకులందరికీ అందించాలనే సంకల్పంతో, కొన్ని పట్టణాలలోని మా శ్రేయోభిలాషులని రిక్వెస్ట్ చేసి చందాదారులకి అందించమని చెప్పాము. ఈ పవిత్ర రమదాన్ మాసంలో వారంతా అభ్యంతరం తెలుపకుండా మా మనవిని మన్నించి పుస్తకాలను పంపిణీ చేశారు. వారందరికీ మా కృతజ్ఞతలు.

ముహమ్మద్(స)వారి కంటే మహోన్నతుడు మరెవ్వరూ లేరని ప్రసిద్ధ చరిత్రకారులు కితాబు నిచ్చారు. అల్లాహ్‌పై విశ్వాసమున్నవారికి ఈ మహనీయుడు 'సకలలోకాలకు కారుణ్యంగా పంపబడ్డారని' తెలుసు. ఈ మహనీయునిపై జరిగినంత దుష్ప్రచారం కూడా మానవ చరిత్రలో మరెవ్వరికీ జరిగి ఉండదు. ఇతర దేశాలలో ఓ మత ధర్మానికి చెందినవారు, వారి వెబ్‌సైట్లలో ఈయన(స)ని నీచంగా చిత్రీకరించి అపనిందలు వేసినా ఎవ్వరూ మాట్లాడక పోవచ్చు, ఎందుకంటే ఆ మతస్థులు అక్కడ మెజారిటీ సంఖ్యలో ఉన్నారు కాబట్టి.

కాని భారతదేశం వంటి ప్రజాస్వామ్య దేశంలో సాధారణ పరిస్థితులలో ఆ మత ధర్మం వారికి ఈ మహనీయునిపై దుష్ప్రచారం చేయగలిగేటంతటి ధైర్యం ఉండదు.

అయితే వారికి అనుకోకుండా ఓ అవకాశం దొరికింది. పొట్టకూటికోసం, సులభ సంపాదనతో రాత్రికి రాత్రే ధనవంతులైపోవాలని కొందరు దుర్మార్గులు 'ధర్మ సందేశ ప్రచారాన్ని' సాకుగా చూపించడాన్ని గమనించారు. ఇటువంటి కొందరు స్వార్థ ముస్లిములను ఉపయోగించుకుని ఆ మత ధర్మం వారు ప్రపంచ శాంతి దూత ముహమ్మద్(స)వారిపై విషం కక్కుతున్నారు.

మహా ప్రవక్త ముహమ్మద్(స)వారి జీవిత చరిత్ర చదువుతుంటే కళ్ళ వెంట నీళ్ళు చిమ్ముతాయి. అటువంటి మహనీయునిపై అపనిందలా? ఈ పుస్తకాన్ని వ్రాసేముందు చేసుకున్న సంకల్పం ఏమిటంటే, ముస్లిమేతరులలోనే కాకుండా, అమాయక ముస్లిమ్‌లలో ఉండే అపోహలను కూడా తొలగించాలని. అంతేకాకుండా పెద్దగా చదువుకోని వ్యక్తికి కూడా అర్థం కావాలి. అందుకోసం చాలా సులభమైన తెలుగు వాడాలి. వీటన్నింటిని దృష్టిలో పెట్టుకుని రోజుకి కనీసం 12 గంటల కంటే ఎక్కువ సమయం దాదాపు ఓ సంవత్సరం పాటు పూర్తి సమయాన్ని ఈ పుస్తకానికే కేటాయించి , అల్లాహ్ దయవలన మీకు సవివరంగా అందించ గలిగాము. మా ప్రాణం కంటే ఎక్కువగా ముహమ్మద్(స)వారిని ప్రేమించడం వలన, ఆయనపై జరుగుచున్న దుష్ప్రచారాన్ని చూసి ఆవేదన చెందడం వలన, అల్లాహ్ పేరుతో ఈ పుస్తకాన్ని ప్రారంభించాము.

మా చేత అల్లాహ్ ఈ పనిచేయించి చాలామందికి తెలియజేయగలిగే అవకాశాన్ని మాకు అనుగ్రహించారు. ఎటువంటి అపనిందలకైనా కేవలం ఖుర్'ఆన్ మరియు సున్నత్ ద్వారా సమాధానం చెప్పగలమని తెలియజేయడమే మా ప్రధాన సంకల్పం. అపనిందలు వేసే వారికి స్వయంగా మీరే సమాధానం చెప్పండి. ఎవరో వచ్చి సమాధానం చెప్పవలసిన అవసరం మనకు లేదు. అమూల్యమైన విజ్ఞాన ఖజానా 'ఖుర్ఆన్ మరియు సున్నత్' మన దగ్గర ఉండగా మనకు ఇక వేరే వాటి అవసరం ఏముంది?


తోటి ముస్లిమ్ సోదరులకు గాని, ముస్లిమేతరులకు గాని ఉచితంగా పుస్తకాలను పంచాలనుకునేవారు, పుస్తకాలు కావాలంటే ఎమౌంట్ పంపిస్తూ ఆర్డర్ చేయండి. ప్రింటింగ్ కాస్ట్‌కి సరిపడా పుస్తకాలను పంపిస్తాము.

SAANTHIBAATA MONTHLY March 2010
Registered with Registrar of News Papers for India
Samalkot-533440 (East Godavari Dist.)
RNI Reg. No. APTEL/2009/29650

# మేలైన ఉపాధి

అనస్ బిన్ మాలిక్(రజి) ఉల్లేఖనం : ఓ అన్సార్ వ్యక్తి ప్రవక్త(స) వద్దకు వచ్చి ఆయనను (దానం) అడిగారు. ప్రవక్త(స) చెప్పారు: "నీ ఇంటిలో ఏమైనా ఉందా?" అతను చెప్పాడు : "ఔను! ఒక ముతక చాప (నా దగ్గరుంది). దాని ఒక భాగాన్ని మేము కప్పుకోవడానికి మరియు ఒక భాగాన్ని మేను వాల్చడానికి ఉపయోగిస్తాము. మరియు మాకు ఒక పాత్ర ఉంది దాని నుండి మేము నీళ్ళు త్రాగుతాము". ఆయన(స) చెప్పారు: "వాటిని నా దగ్గరకు తీసుకురా", అతడు వాటిని తీసుకు వచ్చాడు. అల్లాహ్ యొక్క సందేశహరులు(స) వాటిని తన చేతిలో పట్టుకుని అన్నారు : **"నా నుండి ఈ రెండింటిని ఎవరు కొంటారు?"** ఒక వ్యక్తి అన్నాడు: "నేను వాటిని ఒక దిర్హమ్‌కొరకు తీసుకుంటాను". అప్పుడు ఆయన(స) అన్నారు: **"ఒక్క దిర్హమ్ కంటే ఎక్కువ ఎవరు ఇస్తారు?"** రెండు లేదా మూడసార్లు (అన్నారు). ఒక వ్యక్తి అన్నాడు: "నేను వాటిని రెండు దిర్హమ్‌ల కొరకు తీసుకుంటాను". కనుక ఆయన(స)వాటిని అతనికి ఇచ్చేశారు, రెండు దిర్హమ్‌లు తీసుకుని వాటిని అన్సారీ కిచ్చేశారు అతనితో (ఇలా) చెబుతూ : **"ఒక (దిర్హమ్)తో ఆహారం కొని నీ కుటుంబానికి తీసుకెళ్ళు మరియు మరొక (దిర్హమ్)తో గొడ్డలి కొని దానిని నా దగ్గరకు తీసుకురా"**. అతను దానిని ఆయన(స)వారి దగ్గరకు తీసుకువచ్చాడు, మరియు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) తన స్వీయ హస్తాలతో దానికి కర్రను తగిలించి, తరువాత అతనికి చెప్పారు: "వెళ్ళి వంటచెరకు (కట్టెలు) సేకరించి వాటిని అమ్ము, మరియు నేను పదిహేను రోజులపాటు నిన్ను చూడనివ్వకూడదు (అంటే పదిహేను రోజుల పాటు కనిపించవద్దని)". ఆ వ్యక్తి వంటచెరకును సేకరించడానికి మరియు అమ్మడానికి వెళ్ళాడు. మరియు తరువాత 10 దిర్హమ్‌లతో తిరిగి వచ్చాడు. దానిలోని కొంత భాగంతో అతడు ఓ వస్త్రాన్ని కొన్నాడు మరియు కొంత భాగంతో ఆహారాన్ని. అప్పుడు అల్లాహ్ యొక్క సందేశహరులు(స) చెప్పారు : "తీర్పుదినాన నీ మొహంపై వికృతంగా నీ భిక్షాటన రావడం కంటే ఇది ఉత్తమం కాదా?" (మరో ఉల్లేఖనం ప్రకారం భిక్షాటన చేసేవాడు మొహం మీద మాంసం లేకుండానే అల్లాహ్‌ను కలుస్తాడు).

భిక్షమెత్తుకోవడానికి అనుమతి లేదు ముగ్గురికి తప్ప : (1) బాగా పేదవాడైన వ్యక్తి లేక (2) తీవ్రనష్టాలలో ఉన్న వ్యక్తి లేక (3) బాధాకరమైన రక్తం కొరకు (రక్త పరిహారం కొరకు)" **(అబూదావూద్, హసన్ హదీస్ నెం. 1641, పుస్తకం 9, అధ్యా. 26, సంపుటి 2)**

అబ్దుల్లాహ్ బిన్ ఉమర్(రజి) ఉల్లేఖనం : ప్రవక్త(స) చెప్పారు, **"దేనికోసమైనా ఓ వ్యక్తి ఇతరులను ఎప్పుడూ అడుగుతూ ఉంటాడు పునరుత్థాన దినమున అతని ముఖంపై మాంసం లేకుండా అతను వచ్చేవరకూ"** (సహీహ్ బుఖారీ, హదీస్ నెం. 1474, పుస్తకం 24, అధ్యా. 52, సంపుటి 2)